

మంత్రముగ్ధ
లల్లాదేవి

# మంత్ర ముగ్ధ

*___లల్లా దేవి*

శృంగార భంగిమలో వెన్నెల తీగలా నిలిచి ఉందామె!

చివురాకుల్లా రక్త వర్ణాన్ని చిమ్ముతున్న పెదవులు రావంతగా విచ్చుకున్నాయి. ముత్యాల పేరులాంటి పలువరుస తృటి కాలం తరలించి చిరుదరహాసాన్ని తలపించింది.

నిండారిన వెన్నెల విశ్వమంతా పరచుకుంది.

"ఇంకా ఎంతసేపని అలా మౌనంగా ఉండి పోతావు?" చెక్కిలి మీద చేతులానించి చెలిమిగా ప్రశ్నించాడు శివరాజ్! సంకోచంగా రెండడుగులు వెనక్కు వేసింది!

"మీ రెందుకింతగా తొందరపడుతున్నారో తెలుసునాకు!" అంది.

"తొలిరేయి తొందరపాటుసహజం కదా తులసీ!"

పెళ్ళికి కూడా మీరిలాగే తొందరపడ్డారు. పెళ్ళికి మీ తొందర!

తొలిరేయి ముహూర్తం తొందర!"

"ఇప్పుడు నీ వయసెంతో నీకు గుర్తుందా? పుస్తకాలు ముందు పెట్టుకుని కూర్చుంటే ప్రపంచాన్నే మర్చిపోతావు. ఇప్పుడు నీ ముందు నేనున్నాను. గుర్తించావా డార్లింగ్? భర్తను కదా? బ్రతిమాలుకుంటున్నాను."

ఆమె కరిగిపోయింది. కన్నులు చెమరించాయి.

"ఇటువంటి పరిస్థితి రాకూడదనే ముందుగా పెళ్ళి వద్దన్నాను. ఎంత తొందర మీకు చెప్పినమాట వింటారా? అంతా పోలీసు బుద్ధి!"

"నిన్ను అరెస్టు చేయటం నా వల్ల కాలేదు"

"అరెస్టు చేయకపోయినా అదుపులోకి తీసుకున్నారు కదా మిస్టర్ శివరాజ్ ఎ.ఎస్.పి. గారు. మీరు ఐ.పి.ఎస్. పూర్తిచేసి ట్రయినింగ్ పాసవటానికి కనీసం అయిదారు దండయాత్రలు జరుగుతాయనుకున్నాను. కాని నేను థీసిస్ సమర్పించకుండానే మీరు హడావిడిగా అన్నీ పూర్తి చేసుకుని వచ్చేశారు."

"అవునోయ్ మరి? పెళ్ళి ఆలస్యమయిపోతోందని గుర్తుకు రాగానే క్లాసులు కూడ దంచుకొచ్చేశాయి. బాగా ఆకలిమీదున్నాను. అలమటించేలా చేస్తున్నావు. కరుణించావా?"

"పెళ్ళికి ముందు నేను చెప్పిన షరతులు మీకు గుర్తున్నాయా? మర్చిపోయారా?"

"ఎలా మర్చిపోతాను ప్రేయసీ! చెప్పింది నువ్వు కదా!?"

"ఆడిన మాట తప్పకూడదు. భార్యకిచ్చిన వాగ్దానం ఒదులుకుంటారా?"

"వాగ్దానం వదిలి పెట్టుకుంటామని ఎవరన్నారు?" అన్నాడు గోముగా!

"అయితే మరి ఈ తొందరెందుకు?"

"నేను నీకిచ్చిన వాగ్దానం ఏమిటి?"

"థీసిస్ పూర్తి అయేంతవరకూ పిల్లలు పుట్టకూడదని!"

"అలాకాకుండా చాలా దారులున్నాయి. డాక్టర్స్ ని అడిగితే యిస్తారు"

"అలాంటి ప్రక్కదారులు నాకిష్టం లేదని కూడ చెప్పాను"

"ముద్దు పెట్టుకుంటే కూడ పిల్లలు పుడతారేంటి?" బుంగమూతి పెట్టాడు.

"అదా శ్రీవారి కోరిక! అయితే ఓకే! నాకేమి అభ్యంతరం లేదు"

ఇండియన్ పోలీస్ సర్వీస్ లో ఎ.ఎస్.పి. గా రిక్రూట్ అయి వచ్చి నెల కూడ తిరగని శివరాజ్ చెంగున దూకాడు!

ఈసారి అడుగయినా కదపలేదు తులసి!

మనీప్లాంట్ చివుళ్ళు త్రుంచుతూ నిలబడింది! తెల్లని చీరలో వెన్నెల బొమ్మలా, మన్మధ రేఖలా ఉన్నా ఆమెను ఆక్రమించుకున్నాడు.

ఉక్కిరిబిక్కిరి అయింది. అవకాశం దొరికిందే చాలునని అతడామెను కౌగిలినించి విడిచి పెట్టలేదు. చేతులు బిగించేశాడు.

"మీ పోలీసుదాడికి ఊపిరాడదు. విడిచి పెట్టండి బాబూ!" బ్రతిమాలుకుంది. ఆమె నలాగే పొదివి పట్టుకుని నడిపించి తీసుకువచ్చి ఊయల మీద ప్రక్కనే కూర్చో పెట్టుకున్నాడు.

"గాలికి నీ ముంగురులు నుదురుమీద అల్లరిచేస్తున్నాయి డార్లింగ్!"

"రోడ్ మీద మీ చేతివేళ్ళు కూడ అల్లరి చేస్తున్నాయి. ఆడపిల్ల అంటే వరుడికయినా, వాయుదేవుడి కయినా అల్లరి చేయాలని పిస్తుంది కాబోలు! అందాన్ని చూస్తే ఆశ! ఆడపిల్లని చూస్తే అలుసు!"

"లెక్చరర్ వి కావాలనుకుంటున్నావు కదా!" పోలీసు ఆఫీసర్ కి పాఠాలు మొదలెట్టావన్నమాట?"
"ఇది జీవితం కదా! ఎప్పుడే అవసరం వస్తుందో ఎవరికీ తెలుసు!" రాగరంజితమై అరుణాంచితమైన పగడపు దవ్వల్లాంటి మునివేళ్ళతో పెదవులమీద తట్టి మరీ చెప్పింది తులసి!

"నువ్వు చాలా లోతులకు వెళ్ళి మాట్లాడుతున్నావు?" ఇంకా తన ఆటలు సాగవని గుర్తించిన శివరాజ్ ఆమె ఒడిలో తల ఉంచి ఊయల మీదనే కాళ్ళు బారజాపేశాడు. చేతిని వెనుకగా త్రిప్పి ఆమె భుజం మీద వేశాడు.

జీవితంలో వేగంగా ముందుకు పోగల భర్తకు జీవితపు లోతులు కూడ చూపించగల భార్య కావాలి! మనం సరైన జోడీ! మేడ్ ఫర్ ఈచ్ అదర్!"

"అంతా బాగానే ఉంది. నీ అభిప్రాయంతో నేను ఏకీభవిస్తాను. కాని డార్లింగ్ తొలిరాత్రి యిలా గడిచిపోవటం తలుచుకుంటేనే బాధగా ఉంది!"

"మీరు నా ఒడిలో పడుకున్నారు. ఇంకేం కావాలి?

గుడి చుట్టూ ప్రదక్షణాలు చేస్తేనే మ్రొక్కు తీరి పోతుందంటావా? ఆలయమ్లోకి వెళ్ళి అమ్మవారిని చూస్తే కదా పుణ్యమూ పురుషార్ధమూ దక్కుతాయి?"

"ఛీ చిలిపి! మీరు మొరటుగా మాట్లాడుతున్నారు!"

"ఉద్యోగ ధర్మం కొంత నేర్పింది! నువ్విప్పుడు మిగిలింది నేర్పావు? అవునూ! నేనిలా ఉండి పోవటం ఎంతకాలం జరగాలంటావు"

"త్వరగా థీసిస్ పూర్తి చేస్తాను. లెక్చరర్ అవుతాను. ఆ తరువాత చెప్పేది మీరు, వినేది నేను! అందాకా లాలిజో పాపాయీ! నిద్దరోవాలా! లాలీ!" అంటూ అతని చెంపలమీద పెదవులానించి కళ్ళలోకి చూచింది.

రెప్పలు వాలిపోయి ఉన్నాయి, ఊర్పులు దీర్ఘంతరాలయినాయి.

చల్లని తెల్లని వెన్నెల! చెలిబడి! అతడు ఆదమరచి నిద్రపోయాడు వక్షస్సు మీద చేయి ఆనించి నెమ్మదిగా తట్టి అతన్ని మేల్కొలిపింది.

"మీరు వెళ్ళి మంచంమీద పడుకోండి!" అంది. చిన్నపిల్లాడులా లేచి వెళ్ళి పడుకున్నాడు. క్షణంలో నిదురపోయాడు.

తెరదింపేసి ఆమెకూడా అతని ప్రక్కనే పడుకుంది.

తొలిరాత్రి పురి విప్పిన కోర్కెలతో, ఎన్నో ఆశలతో వస్తాడు. మగవాడుని ఒడ్డు లొరిసి పొంగులు వారుతూ పరుగెత్తే తరంగాలకు అడ్డుకట్ట వేయటాన్ని భరించాడంటే అతనికి తనమీద ఉన్న ఆప్యాయత ఎంత అపారమయినది? అశ్రువులు చెంపలమీదికి జారాయి.

జల సింధువులాంటి మగాడు! అతనిలో కన్పించిన చిలిపితనం కేవలం తీరాన కన్పించే తరంగాలవంటిది! ఎంత గంభీరమయిన మగవాడు తనకి భర్తగా లభించాడు?

అంతలో ఆదమరచి నిదురించాడంటే ఎంతటి ధీరముద్ర అది!

ఒకరికోసం ఒకరు సర్దుకుపోవాలనేది దాంపత్యపు తొలిపాఠం! ఎంతో ప్రశాంతమయిన పద్ధతిలో ప్రబోధించాడు! తన జీవితాశయాన్ని తీర్చుకునేందుకు చక్కని దారి కల్పించాడు.

చివాలున లేచి నెమ్మదిగా అతని పాదాలు ఒత్తడం ప్రారంభించింది! ఆమె మనసులో కొద్ది రోజులుగా జరుగుతూ వచ్చిన సంఘటనలు కదలాడటం ప్రారంభించినాయి. శివరాజ్ కపటంలేని మనిషి!

ఇంటర్ చదువుతూ ఉండగా పరిచయం అయింది.

ఒకరింటికి ఒకరు రాకపోకలు ప్రారంభించినా పెద్దలు అభ్యంతరం పెట్టలేదు. పెళ్ళి ప్రస్థావన ఎలావచ్చిందోకాని ఎవరూ కాదనలేదు.

కాని డిగ్రీ తరువాత దారులు వేరు అయినాయి!

పెళ్ళి గురించి అందరూ మర్చిపోయినట్లుగానే అనిపించింది.

హఠాత్తుగా రెండు నెలల క్రితం కలిశాడు శివరాజ్? పోలీసు దుస్తుల్లో అతనిలో వచ్చిన మార్పు.
ప్రస్ఫుటమవుతున్న హుందా తనం చూచి నివ్వెరపోయింది. ఎంతో చనువుగా పలకరించాడు.

కేవలం కొద్ది గంటల క్రితం విడిపోయిన మనిషిని పలకరించినట్లు! అతని ఆలోచనల్లో తన రూపం రవంతయినా మాసిపోలేదనిపించింది.

"ఇలాంటి సమయం కోసమే ఎంత త్వరగా వస్తుందా అని ఎదురుచూచాను. వచ్చింది. థాంక్ గాడ్!" అన్నాడు టైమ్ గ్యాప్ ని పూడ్చేస్తూ!

"ఇంతకాలం నువ్వేం చేశావో నీ డ్రెస్ చెపుతోంది. కంగ్రాచ్యులేషన్స్" అంది.

"ఇంక పెళ్ళి గురించి మాట్లాడు కోవటమే తరువాయి!"

"త్వరగా చేసుకో! సెటిల్ అయిపోయావు కదా?"

"నన్ను వేరుగాచేసి మాట్లాడకు. నిన్ను చేసుకోవాలని నా నిర్ణయం!"

"నేనింకా చదువు పూర్తిచేయలేదు"

"పోలీసు ఆఫీసర్స్ ఎక్కువసమయాన్ని ఉద్యోగానికే ఖర్చు పెట్టాలి! బోర్ కొట్టకుండా నువ్వు చదువుని పూర్తి చేయవచ్చు! నాకేమి అభ్యంతరం లేదు"

"రెండు వైపులా ఆలోచించుకుని నిర్ణయించుకోవాలి!"

"నేను ఆలోచించుకుని నిర్ణయించాను. నువ్వు కాదంటావనే అనుమానం రాలేదు నాకు. ఒకప్పుడు మన మధ్య వున్న ఆర్థిక వ్యత్యాసాన్ని ప్రస్తావనకు తీసుకురావచ్చని? అనుమానించాను.

ఇప్పుడు నా ఉద్యోగం ఆ గ్యాప్ ని తగ్గించింది కదా!?"

"ఆర్థిక విషయాలు నేను ఆలోచించను. చదువు గురించే!"

"మన వివాహమనేది నీ ఆలోచనకు ఆటంకంకాదు. ఎంకరేజ్ మెంట్ అవుతుంది. ఇది నా ప్రామిస్" అన్నాడు.

శివరాజ్ మనస్తత్వం రావ్వంతయినా మారలేదు. కపటంలేకుండా కావాలనుకున్నది అడిగే వారిని కాదనగల వారు ఎవరుంటారు??

మొదటి సంభాషణలోనే తాను పూర్తిగా లొంగిపోయింది.

అయినా సాధించాలను కున్న జీవితాశయానికి తిలోదకాలిచ్చుకునేందుకు మనసు అంగీకరించలేదు.

తొలి స్నేహితురాలు అయినా తల్లి దగ్గిర ఈ ప్రస్థావన తీసుకువచ్చింది.

"బేబీ! మీ తండ్రి మనకు విడిచిపెట్టి వెళ్ళిపోయినా సంపదలు చాలఉండొచ్చు! కాని మనసువిప్పి మాట్లాడగలిగిన మగవాడు దొరకటం అరుదైన విషయం! నువ్వు కావాలి అని ఆపేక్షపడిన మగవాడిని కాదని మరోవైపు పరుగుతీయటం ఆడపిల్లకు క్షేమం కాదమ్మా! ప్రధమ నించి నీకు కావసినంత స్వేచ్ఛ యిచ్చాను.

దాన్ని నువ్వు ఎప్పుడు దుర్వినియోగపర్చుకోలేదు!

పిల్లలకు తల్లిదండ్రులు స్వేచ్ఛ యివ్వడం వారి మనోవికాసానికి దోహదం చేస్తుంది అని నువ్వు నిరూపించావు.

ఆ నమ్మకంతోనే ఈ విషయంలో నీ నిర్ణయానికి విలువ ఇస్తాను నేను యిచ్చేది సలహా మాత్రమే! అంత నిర్మలమయిన మనసున్న యువకుడి ఆపేక్షని నువ్వు త్రుంచి వేయకు బేబి!" అని సలహాయిచ్చిందామె. అయినా మనసు ఊగిసలాడటం మానలేదు.

ప్రొఫెసర్ సమతాబెనర్జీ తనకు దైవంతో సమానం. ఆమె సలహా కోసం పరుగులు తీసింది. అందరూ ఒకే మాట! ఒకే దారి!.

"నీ జీవితాశయం సైన్సు పరిశోధనలు చేయటం! దానికి ఆటంకం లేదనుకున్నప్పుడు అతని మాటని తిరస్కరించటంలో అర్థమేలేదు. మగవాళ్ళలో మంచివాళ్ళు అరుదుగా ఉంటారు బేబి? ఇది నా అనుభవం!! ఈ అవకాశాన్ని పోనివ్వకు" అంది ప్రేమ వైఫల్యాన్ని ఫలితంగా జీవితమంతా బ్రహ్మచారిణిగా మిగిలిపోయిన సమతాబెనర్జీ.

"ప్రొఫెసర్! మీరు నాకు గురువులు! మార్గదర్శి! మమ్మీ నన్ను జీవితంలోకి నడిపించారు. మీరు వెలుగుదారులు చూపించారు. అమ్మ వివరించలేని విజ్ఞాన ప్రపంచాన్ని నా కళ్ళముందు పరిచారు.

నేను జీవితానికి ఒక ఆశయమంటూ ఏర్పరచుకోవటానికి ప్రధమ కారణం మీరు! బ్రహ్మచారిణిగా మిగిలిపోయి జీవితమంతా విద్యార్థులె ప్రపంచంగా బ్రతికారు. అలాంటి మీరుకూడా అమ్మ యిచ్చిన సలహాని సమర్ధిస్తున్నారా?"

"బేబీ! చెడు ఆలోచనలకి చాలా కోణాలుంటాయి. కాని మంచి మనసుకి, మంచి మాటకు దారి ఒక్కటే! ధ్వని కూడా ఒక్కటే!
నా సంగతి వేరు! దారుణంగా మోసపోయాను! ఆడదాని జీవితానికి ప్రధమ లక్ష్యం పెళ్లికాదు. మరొక్కటి ఉండాలని అప్పుడే తెలుసు కున్నాను. మనసు విప్పే మగవాడు ఎందరికో లభించడు.

అతని జీవితాన్ని నీ ముందు పరచి పూలరేకులుచల్లి నడిచిరమ్మని స్వాగతం పలుకుతున్నాడు. అతని నీడలో నీ జీవితాశయంనించి వంచితురాలవుతానని ఎందుకు ఆలోచించాలి?

ఒక విద్యార్థిని నా దగ్గరకు వచ్చినపుడు ఒక సంవత్సరం విద్య బోధించి అంతటితో నా పని తీరిపోయిందని నేను భావించను. ఆమె భవిష్యత్తుని నిర్మించుకోవటంలో నా బాధ్యత ఉందనుకుంటాను.

నీ విషయంలో మరికొంత అధికంగానే కమిట్ అయ్యాను. అవుతున్నాను కూడ! అతడే నీకు సరి అయినా జీవిత భాగస్వామి అనిపిస్తోంది! ఆ తరువాత నిర్ణయించుకోవటం నీ యిష్టం!" అని ముగించిందామె.

ఒకటి రెండు రోజులు తీవ్రమయిన అంతర్మధనం తరువాత మళ్ళీ కన్పించాడు శివరాజ్! తనే కావాలని వచ్చి కలిశాడు.

"మనసు మార్చుకుని నాకోసం ఎదురుచూస్తూ ఉంటావనే నమ్మకంతో వచ్చాను. మమ్మీతో మాట్లాడి ముహూర్తం పెట్టిస్తాను" అన్నాడు.

"ఎదుటివారు కాదంటారేమోననే సందేహం మీకు రవంతయినా కలగదేమిటి? ఇంత సుకుమారమయిన మనసుతో పోలీసు ఉద్యోగం ఎలా చేస్తారు మీరు?"

"మనలో మంచితనం అనేది కొంతయినా నటన కాకుండా వుంటే సాలిడ్ అయితే సక్సెస్ మనతోనే వుంటుంది!"
"అయితే నేను ఒప్పుకుంటున్నానని మీరు అనుకుంటున్నారా?"

"కాదనటానికి నువ్వు ఒక్క కారణం కూడా చూపించలేవనుకుంటున్నాను." ఆ మాటలు విన్న తరువాత ఎంతో చెప్పాలనుకుంది. ఏమీ చెప్పలేక ఒక స్లిప్ రాసి అతనికి అందించి వేగంగా అక్కడ్నించి వెళ్ళిపోయింది.

"పెళ్ళి అయినా మన యిద్దరమే! ప్లస్ అనడానికి నో! ఇష్టమయితే రేపు ఉదయం మమ్మీతో మాట్లాడేందుకు రండి!"

ఉదయం అనుకున్న సమయానికి అరగంట ముందుగానే ప్రత్యక్షమయ్యాడు. మమ్మీ చాలా యాక్టివ్ అయిపోయింది. శివరాజ్ పలికిన ప్రతి అక్షరాన్ని ఎంతో సెన్సిటివ్ గా తీసుకుంది.

అప్పుడు ప్రారంభించిన పెళ్ళి ప్రయత్నాలు ఈ చోటుకి తెచ్చి నిలిపాయి! బరువుగా రెప్పలు విప్పి చూచాడు శివరాజ్!

"బిలీవ్ మీ తులసి! ఎందుకు మేలుకుంతావు. వచ్చి పడుకో?" అంటూనే చేయి పట్టుకున్నాడు. ఆమె మనసు వెన్నలా కరిగిపోయింది.

అతన్ని కావలించుకుని పడుకుంది తిరిగి క్షణాలమీద నిద్రపట్టించేశాడు. రెప్పలు మూసుకున్నా ఆమె మనసు మేలుకునే వుంది.

తెల్లవారుఝామున లేచి స్నానంచేసి పూజ ముగించింది.

నిద్రలేమివల్ల ఆమె కళ్ళు ఎర్రగా మండుతూ ఉండటం చూచి తల్లి మురిపెంగా అనుకుంది. "ఆడపిల్లలు ఆశయాలు కట్టుకున్న మగవాడి ఆశలముందు క్షణంలో కరిగిపోతాయి!" అని.

పూజ ముగించి వచ్చేసరికి కాఫీ అందించింది!

అది తీసుకుని పైకి వెళ్ళింది తులసి!

టెర్రస్ మీద కార్డిల్ పైన కూర్చుని ఊగుతున్నాడు. ఎంతో హాయిహాయి అనిపించే ఉషోదయపు తుషార వీచికలు వీస్తున్నాయి!"

కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు!

"గుడ్ మార్నింగ్! కళ్ళు విప్పండిసర్! కాఫీ తీసుకోండి!"

"ఇది కాఫీ కాదు. పవిత్ర తీర్థం!" అందుకున్నాడు.

బాధపడే అర్థం వచ్చేలా మాట్లాడకండి ప్లీజ్!"

"అర్థం చేసుకోలేకపోయావు. నేన్నది అదికాదు. పవిత్రంగా మిగిలిపోయిన తులసి అందించిన తీర్థం! ఇది తులసి తీర్థం!"

చివ్వున ముందుకు వెళ్ళి అతని నోరు మూసింది!

"తమాషాకయినా అలాంటి మాటలు మాట్లాడకండి!"

"హనీమూన్ కి అంతా రెడీనా?"

"మమ్మీ కన్నా మీకే ఎక్కువ తొందరగా వుంది!"

"మా డిపార్ట్ మెంట్ లో శలవు దొరకడం దుర్లభం! హనీ లేని హనీమూన్ పేరుతో అయినా సరదాగా తిరిగి రావచ్చుకదా!"

"నేను మేడమ్ కి చెప్పి రావాలి! ఆవిడ యూనివర్సిటీకి పెందరాడే వెడతారు. నేను ముందుగా వెళ్ళొస్తాను."

"నేను అయిదురోజులు శలవు పెట్టాను. ఈ అయిదురోజులు అయినా నాకు దూరంగా ఉండాలని ప్రయత్నించకు!"

"మీరిలా మాటాడితే నేను థీసిస్ రాయటం మానేయాలి తప్పదు".

నీ భర్తకు చెడ్డపేరు రావడం నీకిష్టమేనా డార్లింగ్!" వారి సంభాషణ కొనసాగకుండా పని మనిషి ప్రత్యక్షమయింది.

"ప్రొఫెసర్ సమతా బెనర్జీగారొచ్చారు. మీ కోసం హాలులో కూర్చున్నారు" అంటూ ఒక వార్తా వడ్డించి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

"రండి పరిచయం చేస్తాను" అంది తులసి!

"విత్ ప్లెజర్!" అంటూ లేచి ఆమె వెంట నడిచాడు శివరాజ్!

మెరిసే కళ్ళతో మెట్లు దిగి వస్తున్న నవ దంపతుల వంక చూచి తృప్తిగా తల ఊగించింది బెనర్జీ!

"ప్రయాణానికి కారు సిద్దం చేసి మీ మమ్మీ హడావుడి పడుతోంది!" అంది.

పరిచయాలు పూర్తయ్యాక! తులసి సిగ్గుపడి తల దించుకుంది.

"నేను సిద్ధంగా ఉన్నాను." అన్నాడు శివరాజ్ నవ్వుతూ!

"ఆడపిల్లలు సిద్దపడేందుకు కొంత సమయం పడుతుందిలె త్వరపడకు! ఏ వూరు వెళ్ళాలనుకుంటున్నారు?" అని ప్రశ్నించింది.

"ఒక వూరనేముంది? పోలీస్ కంట్రోల్ రూంకి తప్ప ఎక్కడికయినా వెళ్ళాలనేవుంది!" అన్నాడు. బెనర్జీ పెదవులు చిరుదరహాసంతో వొంపు తిరిగాయి. కారులో సామాను సర్ధించి లోపలకు వచ్చింది తల్లి!

"రాహుకాలం వస్తోంది! మరింక బయలుదేరాలి!" అంది.

"మేడమ్! మీరు ఒక చోటు చెప్పండి!"

"ఇది జూలాజికల్ స్టడీ టూర్ కాదుకదా! నేను చెప్పేందుకు?"

"అందుకు కూడా ఉపయోగపడేలాగానే చెప్పండి మేడమ్!"

ప్రొఫెసర్ రెండు క్షణాలు మౌనంగా వుండి చెప్పటం ప్రారంభించింది.

రిస్క్ అవుతుందేమో అని ఆలోచిస్తున్నాను."

"థ్రిల్ కావాలంటే కొంతయినా రిస్క్ చేయాలి ప్రొఫెసర్" అంటూ కొండంత ఉత్సాహాన్ని చూపించాడు శివరాజ్!

"అయితే ఒక చోటు చెప్తాను. నల్లమల కొండలలో అంత తేలికాగా గుర్తించటానికి వీలుకాని చోటు అది! నాగార్జున

కొండలో మీరు ఎన్ని రోజులు ఉండాలనుకుంటున్నారు?"

"హైదరాబాద్ నుంచి తిరిగివస్తూ రెండు రోజులు!"

"అయితే అక్కడ ఆర్కెయాలజీ డిపార్ట్ మెంట్ అసిస్టెంట్ క్యూరేటర్ గా పని చేస్తున్న భాను ప్రసాద్ ని కలవండి!

అతడే నాకు ఆ చోటు చూపించాడు. చాల వినయ విధేయతలు కలవాళ్ళు. నా శిష్యుడు! యువకుడు మీకు చక్కని ఆతిధ్యమిస్తాడు. మీరు వెళ్ళే ముందుగానే టెలిఫోన్ లో అతనికి మీ వివరాలు అందిస్తాను. నందికొండ నుంచి శ్రీశైలం వరకూ ఉన్న పర్వత సాణువుల్లో ఉన్న చోటు అది! అతని సాయం లేకుండా వెళ్ళకండి!" అన్నదామె!

తల్లి గోడగడియారం వంక చూచి మరింత తొందరించింది.

"రాహుకాలం రావటానికి మరో అయిదు నిమిషాలు మిగిలున్నాయి" అంది.

ప్రొఫెసర్ పాదాలకు నమస్కరించి ముందుగా వచ్చి కారులో కూర్చుంది తులసి! తల్లి ఆమెకు ఓ పర్స్ అందించింది.

"అవుసరం వస్తుందిలే వాడుకో!" అంటూ!

దాన్ని ప్రక్క నుంచి శివరాజ్ కోసం ఎదురు చూస్తోంది.

ప్రొఫెసర్ కి వీడ్కోలు యిచ్చి అతను డ్రయివింగ్ వైపు వచ్చాడు! డోరు తెరిచి పట్టుకుని సీతులోకి రాబోతూ ముందుకు చూచి నిలచిపోయాడు! ప్రొఫెసర్ వెనుకగా నిలబడి వుంది!

"ఎవరు నువ్? కారుముందు సెటిల్ అయిపోయావ్" శివ ప్రశ్నించాడు.

"ద్రవిడ మహేశ్వరులం! దండాలు చెల్లించుకో! దండిగా వరాలు కురిపిస్తాము. మ్రొక్కులుంటే చెప్పుకోరా! మోజు తీరుస్తాము" అంటూ హఠం వేసి కారు బానెట్ ముందు కూర్చున్న వ్యక్తి లేచి నిలబడి ఢమరుకం మ్రోగించటం ప్రారంభించాడు.

ఉలికిపడి అతనివైపు చూచింది తులసి!

"వరాలిస్తావా? ఇంకా ఏ యుగంలో బ్రతుకుతున్నావు? అవతలకు దయచెయ్యి! కావాలంటే చిల్లర డబ్బులిస్తాను" అన్నాడు శివ.

"ద్రవిడ మహేశ్వరులం! కించపరిచి మాటాడకరా! కొండదొరలకు కోపమొస్తాది! కొరనోములు నోచినావే తల్లి! కోతి మర్కటం నీ మొగుడైనాది!" అన్నాడు తులసి వంక చూస్తూ!

తల్లి లెంపలు వాయించుకుని అతన్ని పిలిచింది.

"క్రొత్తగా పెళ్ళయినవాళ్ళు బాబూ! వాళ్ళని శపించకు. నీకు కావలసింది ఏమిటో నేనిస్తాను. ఇలారా!" అంది బ్రతిమాలే స్వరంతో.

"భిక్ష అర్థించానని బింకం చూపకురా! ద్రవిడ మహేశ్వర మూర్తులం! కన్నెర్రచేసినామంటే భస్మమైపోతావు" అన్నాడు ద్రవిడ మహేశ్వరుడు! అతని కంఠస్వరం మేఘాల ఉరుముని పోలి ఉంది.

ముందుకు మోకాళ్ళవరకు అంచు వ్రేలాడేవిధంగా ఒక గోచిపాత మాత్రమే ధరించాడు. ఆజానుబాహువు, గడ్డం పెరిగి గుండెల్ని దాటి క్రిందకు దిగింది.

మర్రిపాలతో దట్టంగా అట్టలు కట్టించిన సుదీర్ఘ కేశాలను తలమీదికి శిగలా మలిచాడు. అది ఈశ్వరుని జుటాజూటాన్ని తలపిస్తోంది. శరీరమంతా విభూది రేకలున్నాయి.

ఒక చేతిలో త్రిశూలం అతనికన్నా పొడవుగా వుంది. మరొక చేతిలోవున్న ఢమరుకాన్ని నిర్విరామంగా మ్రోగించటం ప్రారంభించాడు. ముఖంలో దివ్యమైన తేజస్సు ఉన్నది.

కాని డొక్కలు పల్చగా అంటుకుపోయి ఉన్నాయి. కొన్ని వారాల క్రితమో నెలల క్రితమో ఎంగిలిపడిన మనిషిలా కన్పించాడు.

అతని భీకర వాగ్ధాటి విని తల్లి మనసు అతలాకుతలమయింది. అతని ముందు సాగిలపడింది. మ్రొక్కటం ప్రారంభించింది.

"దేవరా! నువ్వు జంగమయ్యలా ఉన్నావు. చిన్నవాళ్ళని శపించకు.నీకు కావలసిందేమిటో నేను యిస్తాను" అని బ్రతిమాలుకుంది.

"అత్తగారూ! ఇలాంటి పగటి వేషగాళ్ళని చూచి మీరు భయపడకూడదు. వాళ్ళకిది మరీ అలుసు సుమండి! మీరు వెనక్కు రండి. వీడి తంతు ఏమిటో నేను తెలుసుకుంటాను.

"ఏరా! ఒళ్ళు తిమ్మిరిగా ఉందా? ఇళ్ళ ముందుకు వచ్చి వెధవ వేషాలేసి ఆడవాళ్ళని బెదిరిస్తావా? రాస్కెల్! అడ్డులే" అంటూ అతన్ని మెడపట్టి త్రోశాడు శివరాజ్.

అతని శక్తినంతా సమీకరించి వెనక్కు నెడితే ఎత్తుగా అతి బక్కపలుచగా ఉన్న ద్రవిడమహేశ్వరుడు సెంటిమీటరు అయిన కదలలేదు. కాని కృద్ధుడు అయిపోయినాడు. ఢమరుకం తీవ్రంగా మ్రోగించాడు.

నేత్రగోళాలు చిదిమిన తంగేడుపూవుల్లా అయినాయి. శ్వేత వర్ణాంచితంగా ఉన్న ముఖం కోపాగ్నితప్తమై పద్మరాగ వర్ణాలను శ్రేతస్సుకు స్రవించింది. కనురెప్పలు విశాలంగా లేచినాయి.

దట్టమయిన కనుబొమలు తెల్లగా శ్వేతఫణిఫణాగ్రాల్లా పూత్కరించినట్టు లేచినాయి. అతడు దెబ్బతిన్న రాజసర్పంలా బుసలు కొట్టడం ప్రారంభించాడు.

ద్రవిడ మహేశ్వరుని తాకి అవమానిస్తావురా! ఓం నమో నాగ రాజాయ! ఓం హర హర హర! ఫణిఫణాగ్రా! పూత్కరించి లేచి రారా! మహేశ్వరుని మలినపరిచాడీ నరుడు!

"కీలా లోలిత జ్వాలా జిహ్వాగ్రా! ఉత్తిష్ఠ! ఉత్ఫుల్ల రాజీవపత్ర ఫణీ! లే! లేచి రారా!!" అని గోడలు చిల్లులుపడేలా కర్కశస్వరంతో అరిచాడు.

"కిలాలోలిత జ్వాలా జిహ్వాగ్రా! ఉత్తిష్ఠ!!" అన్నప్పుడే ఉన్నతంగా మలిచిన అతని జటాజూటంలో కదలికలు ప్రారంభమయినాయి! ఆ తరువాతి ఆ మాటకి సమాధానంగా భయంకరమయిన పూత్కారం వినిపించింది.

అతని జటాజూటంలోంచి భయంకరమయిన నాగరాజులేచి పడగవిప్పి ఆడటం ప్రారంభించింది. అతని ముఖం ఎంతగా కోపవివశమయి ఉందో నాగరాజుకూడ అంతకోప వివశంగా పడగ ఊపుతూ వెర్రెత్తిన దానిలా భయంకరంగా ఆడుతోంది.

ఆ దృశ్యాన్ని చూచి తల్లి వెర్రి కేకపెట్టి విరుచుకుపడిపోయింది

ప్రొఫెసర్ సమతా బెనర్జీ అవాక్కుపడి నిలిచిపోయింది.

తులసికి వొళ్ళంతా చెమటలు పట్టేశాయి.

శివరాజ్ క్షణంసేపు షాక్ అయి అలా నిలిచిపోయాడు.

"నాగరాజా! ఈ ద్రవిడ మహేశ్వరుని దిక్కరించాడీ నరుడు! నర్తించరా నాగా! రుద్రతాండవం చెయ్యి!" అంటూ భీకరమయిన శబ్దాలు వచ్చేలా ఢమరుకాన్ని మ్రోగించడం ప్రారంభించాడు.

నాగు ఊగిపోతూ తన పొడవయిన అమృతకాయాన్ని మాహేశ్వరుని జటాజూటంలోంచి వెలికితీయటం ప్రారంభించింది. అది అతని మెడని కావలించుకుని ఆడింది రవంతసేపు.

ఆ తరువాత గుండెలమీదుగా కౌపీనందాటి కాళ్ళమీదుగా నేలమీదికి వచ్చింది. అతని కాళ్ళముందు నిలబడిన దేగఎత్తితే దానిపడగ అతని గుండెల ఎత్తున లేచింది.

క్షణంలో సగం ఆలోచించి పోలీసు అధికారి వేగంతో తన కర్తవ్యాన్ని నిర్ణయించుకున్నాడు! కాల్చి వేసేందుకయితే రివాల్వర్ సూట్ కేసులో ఉండిపోయింది. మరొకదారి అన్వేషించాలి.

ముందు సీటువైపు చూచాడు. తులసి విపరీతంగా విచ్చుకున్న కళ్ళతో బిగుసుకుపోయి కన్పించింది. ఆమెకు శరీరంమీద తెలివి ఉన్నదో లేదో తెలియటల్లేదు. తనకు సాయం అందించగలిగిన స్థితిలో లేదామె. వెంటనే శరీరంమీది షర్ట్ లాగి దానిమీద వేశాడు.

దాని లోలోపల మెలికలు తిరుగుతూ దారి అన్వేషించుకుని బయటకు రావటానికి దానికి కొంత సమయం పట్టవచ్చు.

బహుశా నిముషంకాని అంతకుపైనగాని సమయంఉంది. ఈలోగా ఈ ద్రవిడ మహేశ్వరుని పనిపట్టాలి.

నాలుగురోజులు కటకటాల వెనుక తోయిస్తే గాండ్రింపులు తగ్గుతాయి. విషజంతువుల్ని జనంమీదికి విడిచిపెట్టి భయపెట్టాలని ప్రయత్నించటం క్షమించరాని క్రైం.

అతడు ఒక్క దుముకులో వెళ్ళి మెడపట్టుకున్నాడు. ద్రవిడ మహేశ్వరుడు త్రిశూలంతో తిరగబడ్డాడు.

కాని పోలీసు దాటి క్షణక్షణానికి విజ్రుంభించింది. షర్ట్ లో పెనుగులాడుతున్న నాగరాజు మీదికి ఓ రాయి దొర్లించాడు శివ!

గాయపడిన ఆ రెండు ప్రాణుల్నీ కంట్రోల్ రూం చేర్పించాడు!!

## 2

పోలీసు కంట్రోల్ రూం అంత హడావుడిగా ఉంది!

ఎన్నడూరాని ఇంతకు మునుపు ఎవ్వరూ వినని విచిత్ర మయిన కేసు ఇది! ద్రవిడ మహేశ్వరుడు కటకటాల వెనుక కూర్చున్నాడు.

రెప్పలు సగం వాల్చి ఏవో మంత్రాలు వల్లించుకుంటున్నాడు ఏ మహారాజుకో, చక్రవర్తికో జరగకూడని అమానం జరిగినట్లు, ప్రపంచమంతా మునిగిపోయినట్లు ముఖం పెట్టాడు.

ముఖం మీద వికృతంగా పెరిగిపోయి ఉండడం నించి జూలు విదిల్చి గాండ్రించుతున్న సింహంలా కన్పించుతున్నాడు. ఏనాడూ పాదరక్షలు ధరించని కాళ్ళు మొరటుగా మట్టికొట్టుకుపోయి జంతువుల కాళ్ళలా గోళ్ళు పెరిగిపోయి వున్నాయి. శరీరం మీద పుట్టిన వెంట్రుకల్ని ఏనాడు కత్తిరించని విచిత్ర ప్రాణి అతడు!

గదిలో కూర్చున్నా వెలుపలకు వంగి మసలుతున్న మదపువాసన ఘాటుగా వస్తోంది. కంటి చూపులు సూది మొనల్లా గ్రుచ్చుకుంటున్నాయి. దయగలిగిన ఓ పోలీసు తండ్రి యిచ్చిన బ్రెడ్ కాని పాలుకాని అతడు ముట్టుకోలేదు. బుట్టలో పెట్టిన నాగులా బుసలు కొడుతున్నాడు.

ఉదయం అతనిని అప్పగించి వెళ్ళిపోయినా శివరాజ్ ఎ ఎస్.పి. సాబ్ ఇంకా తిరిగిరాలేదు అందరు ఎదురు చూస్తున్నారు.

పాములు పట్టి ఆడించే బసవయ్య పాముని బుట్టలో ఉంచి దాని ముందు అతి జాగ్రత్తగా కాపలా కూర్చున్నాడు.

కాస్తంత భక్తి భావము, సెంటిమెంట్స్, సూపర్ నాచురల్ పవర్స్ మీద విశ్వాసాలు కలిగిన పి.సిలు లోలోపల భయపడుతున్నారు. ఇలాంటివి జరగ కూడదని వారి మనసులు కోరుకుంటున్నా ఉద్యోగ రీత్యా విధులు నిర్వర్తించక తప్పదు.

రహస్యంగా చెంపలు వాయించుకుంటూ యధావిధిగా కార్యక్రమాలు చేసుకుంటూ పోతున్నారు. ఎ.ఎస్.పి. సాబ్ కోసం ఎదురు చూస్తున్నారు. సరిగ్గా ఆ సమయంలో ఇంటిదగ్గర బిజీ కార్యక్రమాలలో లీనమయిపోయి ఉన్నాడు ఎ.ఎస్.పి శివరాజ్!

భయంకరమయిన ద్రవిడ మహేశ్వరుడు సృష్టించిన సంఘటనతో హనీలేని హనీమూన్ ప్రయాణం ఆగిపోయింది. వధూవరులు ఇరు పక్షాలనించి అది కేవలం పెద్దల్ని సంతృప్తి పరిచేందుకు ఏర్పాటు చేసుకున్నదే! అందువల్ల ప్రయాణం ఆగిపోవటం వారిని అంతగా బాధించలేదు. అపశృతి ఎదురయినందుకే బాధపడింది తులసి!

కొంతసేపు ఉపచారాలు చేశాక తల్లికి తెలివి వచ్చింది. ద్రవిడ మహేశ్వరుడిని, గాయపడిన పాముని స్టేషన్ లో అప్పగించి హడావుడిగా తనవారికోసం పరిగెత్తాడు శివరాజ్!

అప్పటికి కళ్ళు విప్పింది తులసి!

కాని కారులోంచి క్రిందికి దిగేందుకు భయపడుతోంది!

పాపం ప్రొఫెసర్ ఒక్కరే ఇంకా తెలివిరాని తల్లికి ఉపచారాలు చేస్తున్నారు. డోరు తెరిచి చేయి అందించాడు శివరాజ్!

"నాకెందుకో భయంగా ఉందండి!' అంది తులసి!

"భయమెందుకు? వాళ్ళని స్టేషన్ లో అప్పగించి వచ్చాను. వెధవకు మా డిపార్టు మెంట్ వాళ్ళు తగిన బుద్ది చెప్తారు. క్రిందికి దిగు! సారీ డియర్! మన ప్రయాణం ఆగిపోయినట్లే!" అన్నాడు తన విచారాన్ని వ్యక్తంచేస్తూ!

"అమ్మ ఇలా ఉంటే ఎలా వెళ్ళగలం?" క్రిందికి దిగుతూ అంది తులసి.

అందరూ కలిసి తల్లిని హాలులోకి సోఫా మీదికి చేర్పించారు.

డాక్టర్ వచ్చి కొద్ది శుశ్రూష జరిగాక ఆమెకు తెలివి వచ్చింది. కూతురి తల ఒడిలోకి తీసుకుని గోలుగోలుగా ఏడ్చింది.

హైపర్ టెన్షన్ కొంత శాంతించి- బి.పి నూటయాభై లోపలకు దిగిపోయింది. డాక్టర్ ప్రమాదం దాటి పోయిందని ప్రకటించి వెళ్ళి పోయాడు.

"ఈ అపశకునం ఎందుకొచ్చిందో?" అన్నదామె తల్లడిల్లిపోతూ!

శకునాలనుకోవటం ఏమిటి చాదస్తంకాని వాళ్ళ సంతోషానికి ఆటంకం కలగటం బాధగానే ఉంది" అంది ప్రొఫెసర్ బెనర్జీ!

"జటాజూటంలోంచి పాము రావటం ఏమిటి?" అంది తులసి!

"అమ్మా! ఇలాంటివి జరుగుతుంటాయి! మన భారతదేశంలో అపూర్వమయిన కల్చెర్, కష్టమ్స్ ఉన్నాయి. సంస్కృతి సాంప్రదాయాలను మనం తేలికగా కొట్టి వేయటానికి వీలుకాదు.

నిస్సందేహంగా ద్రవిడ మహేశ్వరుడు మంత్రశక్తులు కలవాడు అనిపిస్తోంది నాకు. అతని జటాజూటంలోని నాగరాజు సమ్మోహిత మయిన దైవసర్పం! సందేహం లేదు.

ఇలాంటి విషయాలలో జాగ్రత్తగా ఉండటమే మంచిది!

ఈ రోజు సాయంత్రం నాగపూర్ యూనివర్సిటీలో లెక్చర్ ఇచ్చేందుకు చాల ముందుగా ఒప్పుకున్నాను. తప్పకుండా బయలుదేరివెళ్ళాలి బేబి! ప్రస్తుతానికి కొద్దిరోజులు హనీమూన్ వాయిదావేసుకోండి మరి! అదే నా సలహా!" అని చెప్పేసి శలవు తీసుకుంది ప్రొఫెసర్!

తల్లికి స్పృహ వచ్చినా కళ్ళు విప్పేందుకు భయపడుతోంది!

"ద్రవిడ మహేశ్వరుడు మంత్ర శక్తి కలవాడని ప్రొఫెసర్ మేడమ్ అంటున్నారు కదా! అతని దారిన అతన్ని పోనివ్వటం మంచిది అనుకుంటాను. మీరేమనుకుంటున్నారు?" అని అడిగింది తులసి!

"నువ్వు సాధారణ గృహిణిగా ఆలోచిస్తున్నావు. ప్రొఫెసర్ తార్కిక జ్ఞానం కలిగిన ఒక మేధావిగా ఆలోచించారు.
కాని నేను ఒక పోలీసు అధికారిని! నా బాధ్యతలు వేరుగా ఉంటాయి. సెంటిమెంట్స్ కి లొంగిపోవటం అధికారిగా నేను చేయకూడదు.

మాకు కొన్ని నిర్దిష్టమయిన మార్గదర్శక సూత్రాలుంటాయి. ఆ ప్రకారమే నేను చేయగలను. ఇక్కడ నా స్వంత ఆలోచనకి ఎలాంటి ప్రాధాన్యత ఉండదు. మమ్మీని జాగ్రత్తగా చూచుకో!

అవుసరమయితే డాక్టర్ అంకుల్ కి ఫోన్ చేసి చెప్పు! వీలయినంత త్వరగా కేసు డీల్ చేసి నేను మళ్ళా తిరిగి వస్తాను" అంటూ హడావుడిగా డ్రసస్ అయి బయల్దేరాడు శివరాజ్!

జీప్ వచ్చి స్టేషన్ ముందు ఆగగానే క్రిందికి జంప్ చేశాడు! అతన్ని చూచిన తరువాత పి.సి.లు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

కటకటాల వెనుకనించి చింతనిప్పులాంటి కళ్ళుతో రెప్పవేయకుండా చూస్తున్నాడు ద్రవిడ మహేశ్వరుడు!

పళ్ళు పటపట నూరుతున్నాడు. వెర్రి కోపంతో నాలుకలోకిపళ్ళు దింపుకుని రక్తం తెప్పించాడు. నోరంతా తాంబూలం సేవించినట్టు ఎర్రగా అయింది. ధోవతి కట్టుకునేందుకు కూడ తిరస్కరించాడు. సీట్లో కూర్చోగానే పి.సిలు ఈ వివరాలన్నీ అందించారు.

"ఈ వెర్రి మొర్రి వేషాలు భయపడే వాళ్ళదగ్గర సాగుతాయి. కాని పోలీసుల దగ్గర ఎలా సాగుతాయను కుంటున్నాడు. ఏమైనా కానివ్వండి! ఈ రోజు కోర్టు ముందు హాజరు పరిచి అతను బయటకు వెళ్ళకుండా చేయాలి! మరొకరికి కూడ ఇతనివల్ల ఇబ్బంది కలుగకూడదు. అన్నాడు శివరాజ్!

అతని మాటలు ఆజ్ఞలుగా తీసుకున్నారు అధికారులు!

సబ్ ఇన్ స్పెక్టర్స్ ఇద్దరు ద్రవిడ మహేశ్వరుడి జాగ్రత్తలు చూచేందుకు పరుగు తీశారు. ఒక సర్కిల్ వెంటనే తన రూంలోకి వచ్చి అతని మీద ఎఫ్.ఐ.ఆర్ తయారుచేయించాడు!

భయంకర మయిన విష సర్పాలను తగిన రక్షణ బందోబస్తు లేకుండా జనం మధ్యకు తీసుకురావటం!

చాలినన్ని బట్టలు ధరించకుండా అర్ధ నగ్నంగా తిరగటం!

పాముల్ని చూపి భయపెట్టి ఆడవాళ్ళనించి భిక్ష తీసుకోవాలని ప్రయత్నించటం మూడవ నేరం!

వారించాలని ప్రయత్నించిన ఎ.ఎస్.పి. మీదికి విషసర్పాన్ని ప్రయోగించడం, అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించగా తిరుగబడి, కలియబడి గాయపరచాలని లేదా పోలీసు అధికారిని హత్య చేయాలని చూడటం!

అనుమానితుడుగా అదుపులో ఉండగా పోలీసులకు సహకరించకుండా ఎదురు తిరగటం__మొత్తం అయిదు నేరాలను అతని మీద ఆరోపించారు. అందుకు సాక్షులు పోలీసు అధికారులుకాక విడిమనుషులు ముగ్గురు.

'శ్రీమతి తులసి, ఆమె తల్లి, ప్రొఫెసర్ సమతా బెనర్జీ!

అందుకు సంబంధించిన సెక్షన్స్ తో ఎఫ్.ఐ.ఆర్. తిరుగులేకుండా బలంగా రూపొందించాడు. తమ అధికారం మీద నేరుగా జరిగిన దాడి కాబట్టి జాగ్రత్తగా రిఫరెన్సులు తీసుకొని సీరియస్ సెక్షన్స్ ని ఉటంకించి మరీ తయారు చేశాడు.

ముందు క్రింది అధికారులకు చదివి వినిపించి సరిగానే ఉన్నదని భావించాక శివరాజ్ దగ్గరకు తీసుకుపోయి చదివాడు.

అంతా శ్రద్ధగా విన్నాడు ఎ.ఎస్.పి.!

"ఇదంతా ఎందుకు చేశాడో తెలుసుకోవడానికి ప్రయత్నించారా?" అని ప్రశ్నించాడు. లేదని తల ఊగించాడు సర్కిల్.

"మరి ఇంతసేపూ మీరంతా ఏం చేస్తున్నట్టు!?"

"అతడు మంత్రగాడట సార్! దగ్గరకు వెళ్ళేందుకు అందరూ భయపడుతున్నారు! ఒక పి.సి. పాలు, రొట్టె ఇచ్చేందుకు వెడితే నోరుతెరిచి చూపించాడట అతని నోటినిండా పాలున్నాయట!

మరొక పి.సి. ధోవతులు ఇచ్చేందుకు వెళ్ళాడు!

అతని శరీరంమీది విభూతి తీసి చల్లగానే బట్టలలోంచి పొగ రావటం ప్రారంభించిందట! అంతా భయపడిపోతున్నారు.

దగ్గరకు వెళ్లి విచారించమంటే ఉద్యోగాలకు రాజీనామాలు చేస్తా మంటున్నారు" అని వివరించాడు సర్కిల్.

"పోనీ మీరయినా వెళ్లి తెలుసుకోవచ్చు గదా?"

"మూడు తరాల నించి మా యింట్లో నాగ పూజ ఉంది సార్! నాగేంద్రుడు మాకు కులదైవం! ఆడపిల్ల పుట్టినా, మగపిల్లవాడు పుట్టినా ఆ పేరే పెట్టుకుంటాం! ఇలాంటి విషయాలలో  కొద్దిపాటి అపచారం జరిగినా మా కుటుంబానికి అనిష్టం వాటిల్లుతుంది.

ద్రవిడ మహేస్వరుడి మీద బలమయిన రిపోర్టు రాశాను. మిగిలిన కార్యక్రమాలు ఎవరికయినా అప్పగించండి. ప్లీజ్!" అన్నాడు సి.ఐ.

శివరాజ్ కి క్షణంసేపు దిగ్భ్రాంతి కలిగింది.

ఇంటి దగ్గర పరిస్థితే ఇక్కడా ఎదురు అయిందన్నమాట! ఎవరెలా ఆలోచించినా తనకి మాత్రం తప్పదు.

"అతన్ని నా దగ్గరకు తీసుకురండి" అని ఆదేశించాడు! ఆ పనిచేసేందుకు సర్కిల్ మరొకరిని పురమాయించాడు! అతడున్న సెల్ తలుపులు తెరిచారు. తలెత్తి అయినా చూడలేదు.

"నిన్ను ఎ.ఎస్.పి. దొరగారు పిలుస్తున్నారు" పి.సి. భయపడుతూ చెప్పాడు.

"ఎవడురా దొర! ఎవరికి దొర! మీకా? మాకా??" గది గోడలు ఊగిసలాడే నవ్వి వృద్ధకంపిత స్వరంతో ప్రశ్నించాడు మహేశ్వరుడు.

"మా దొరగారే! పిలుస్తున్నారు!" అడుగు ముందుకు వేయ సాహసించలేదు.

"కావాలనుకున్నవాడు కంటిముందు నిలిస్తే కనికరిస్తాం" అన్నాడు యోగి.

"బాబుగారూ! మీరు జైలు గోడలమధ్య ఉన్నారండి! వారు చెప్పినట్టే వినాలి! చేసేది పోలీసు ఉద్యోగమయినా పిల్లలుకల తండ్రిని! నా మీద మాత్రం కోపగించకండి! అధికారుల ఆజ్ఞలు పాటిస్తున్నాను. అంతే!"

"నిన్ను నేను అర్థం చేసికొంటాను. వాడినే నా దగ్గరకు రమ్మన్నానని చెప్పు"

"అలాచెపితే నాకు తంటావస్తుందండి! ఈడ్చుకురాలేకపోయావా అంటారు. మీరుచూస్తే దేవుడి మనిషిలా వున్నారు. అలా చేసేందుకు చేతులు రావటల్లేదు. వారు చెప్పినట్లు వింటే గొడవ వుండదు కదా!?"

యుద్ధం మొదలయ్యాక గొడవ వుండదా మరి?"

"అవన్నీ నాకు తెలియదు, మీరు రండి సార్!"

"సరేపద! బడుగు జీవులమీద బడబాగ్ని చిమ్మటం మహేశ్వరుల సాంప్రదాయం కాదు. పద!" అంటూ లేచి ఇంతెత్తున నిలిచాడు. కూర్చున్నప్పుడు గువ్వలా అయిపోయి డొక్కలు అంటుకుపోయిన అతడు అంత ఎత్తు ఉంటాడని పి.సి. ఊహించలేదు.

ఆరు అడుగుల పైగా ఎత్తు! ఆ పైన ఒక అడుగు జటాజూటం! ఆకృతి భయంకరంగా అనిపించింది. పి.సి. ముందుకు దారి తీశాడు. మిగిలినవారు అతని దృష్టిలో పడకుండా చాటునుంచి చూడాలని ప్రయత్నించారు. సి.ఐ. దగ్గర నిలిచిపోయాడు.

"తరతరాలుగా నాగాపూజలు చేస్తున్నారు. నాగ దేవతల అనుగ్రహం నీ యింటిలో నిలిచింది!" అన్నాడు. నుదుట ధరించిన విభూతి బొటనవేలుకురాసి అతనికి అందించాడు.

అతడు వినయంగా చేతులు జోడించి ముందుకి వంగాడు.

"సర్పోపసర్ప! మహాసర్ప!! అనునయ!! అనునయ!!" అనుకుంటూ అక్కడనుంచి కదిలాడు. సి.ఐ. అతడు వెళ్ళిపోయాక బెంచి చుట్టూ తిరిగివచ్చి అతడు నిలిచిన చోటు కళ్ళకి అద్దుకున్నాడు.

విభూతిని భక్తిగా పవిత్రంగా శిరసున ధరించాడు.

ద్రవిడు మహేశ్వరుడు ఎ.ఎస్.పి. గదిలోకి వచ్చి గది మధ్యలో నేలమీద చతికిలబడి కూర్చున్నాడు. పద్మాసనం వేసుకున్నాడు.

"మహేశ్వరులంకదరా మిమ్మల్ని రమ్మన్నవాడెవ్వడు?" అని ప్రశ్నించాడు.

"ఎందుకలా చించుకుంటావు? నువ్వు ఎక్కడున్నావో గుర్తుందా? అధికారులతో మర్యాదగా మాట్లాడటం నేర్చుకో! లేకపోతే నేర్పాల్సి వస్తుంది. ఈ వేషమంతా ఎందుకు వేశావు?"

"మూర్ఖుడా! ఈ పృథ్వి అంతా మహాస్మశానం! ఇక్కడ ఎవరేమి చేసినా అదంతా నటరాజు నటన! రోషం కలిగిన నాగాదేవతల ఆరాధకులం! వేషాలతో మాకు పనిలేదు! విషాన్ని చిమ్మే స్వభావం కాదురా!

మేము ధరించిన వేషం ద్రవిడమాహేశ్వరం!

ఇది ప్రారంభమయింది పుట్టుకతో! ముగిసేది మరణంతో! నేను ధరించిన వేషం ఈ శరీరమేరా కుర్రకుంకా!!" అన్నాడు గర్జిస్తున్నట్లు.

అతని మాటతీరు మార్చేందుకు సమయం చాలదు.

అందుకోసం పూనుకుంటే ప్రశ్నించటం సాగదు! అని భావించాడు శివ.

"నువ్వు ఆ యింటికి ఎందుకొచ్చావ్? కారుముందు ఎందుకు కూర్చున్నావ్?"

"మేము ఎక్కడకయినా రాగలం! ఈ మహాస్మశానంలో రుద్రుడురాకుండనిచోటు ఒకటుందా? నీవు పోలీసు అధికారివేకాని భూమి మీద పాలకుడవుకాదు. నేని నీ బంటునికూడా కాదు!

ప్రశ్నించే అధికారం నీకులేదు. చెప్పవలసిన అవుసరం నాకులేదు.మాటలో కోపాన్ని మనసులో కరుకుతనాన్ని అదుపుచేసుకో ఇప్పుడయినా! మా అనుగ్రహానికి పాత్రుడవుతావు. లేదా భస్మమవుతావు!"

"చేసిన నేరాలు కోర్టువారి ముందయినా అంగీకరిస్తావా?"

"నేను చేసిన నేరమేమిటిరా? భిక్ష అర్థించడమా?"

"నువ్వు అర్థించలేదు బెదిరించావు పాముల్ని చూపి!

"మాహేస్వరుడి మహాశక్తిని చూపించాను. అది బెదిరింపు అవుతుందా? పిరికివాడికి అందరూ శత్రువులే! భీరువా!" ఉరిమాడు.

శివరాజ్ కోపం తారస్థాయిని అందుకుంది.

పెచ్చు మీరిన అతని వాగ్ధోరణి అరికట్టాలని చూచాడు. అతని ప్రయత్నానికి అంతరాయం కలిగిస్తూ టెలిఫోన్ రింగ్ అయింది. రిసీవర్ అందుకున్నాడు. అవతలనించి మాట్లాడుతోంది ఓ ఇనస్పెక్టర్!

"సర్! జడ్జిగారిని కలిసి పరిస్థితిని వివరించాను. ఈకేసు తక్షణ నిర్ణయానికి ఆయన అంగీకరించారు. మీరు వెంటనే అతన్ని కోర్టుకు తీసుకు రావచ్చు!" అని విన్పించింది! క్రెడిల్ చేసేసి సంతోషంగా చూచాడు.

"కోర్టులో నిన్ను ఇంటరాగేషన్ చేయటానికి అనుమతి పొందుతాను. ఆ తరువాత చూద్దువు కాని నా తడాఖా ఏమిటో!? కోర్టుకి వెడదాం పద!" అన్నాడు ముందుకు సాగుతూ!

"మూర్ఖుడా! దిక్కులే వస్త్రాలుగా బ్రతుకుతున్న వాడిని! నన్ను మీ కోర్టు గోడలు బంధించలేవు. ఎక్కడికయినా వస్తాను పద!" అంటూ లేచి అతని వెంట నడవటం ప్రారంభించాడు!

రెండు మూడు అంగల్లోనే అతన్నిదాటి వెళ్ళిపోయాడు!

"జీపులో కూర్చో!"

"కృత్రిమయిన వాహనాల అవుసరం నాకులేదు. నేను నడుస్తాను"

జీపులోంచి దిగి అతనితో నడవటం ప్రారంభించాడు ఎ.ఎస్.పి. డ్యూటీలో ఉన్న ఎస్.ఐ.లు ఎస్కార్టుగా వారిని అనుసరించారు.

అప్పటికే ఈ విషయం నగరంలో నలుమూలలా ప్రాకింది. కోర్టు దగ్గర జనం గుంపులు కట్టి నిలబడి ఉన్నారు. కొందరు ద్రవిడ మాహేశ్వరుడి పాదాలు తాకిన చోటున ధూళితీసి శిరసున చల్లుకుంటున్నారు.

మరికొందరు ఇలాంటి మాయమంత్రాల పేరు చెప్పి పొట్ట పోసుకునే సోమరుల్ని తగిన విధంగా శిక్షించాలని, బుద్ధిచెప్పాలని ముచ్చట్లాడుకుంటున్నారు. లోలోభిన్నరుచిః!

ఎవరి అభిప్రాయాలు వారికే ఉంటాయి!

అదేమీ గణించకుండా కోర్టుహాలులోకి వెళ్ళి బోను చూపించగా దానిలో పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు మాహేశ్వరుడు.

"జడ్జిగారు న్యాయశాస్త్రానికి ప్రతినిధి! వారి ముందు కూర్చుని మాట్లాడరాదు. నిలబడి మాటాడాలి!" లాయర్ సూచించాడు!

"మేము మాహేశ్వరులం! నాగదేవతలకు ప్రతినిధులం!" అన్నాడు. ఆ ప్రధమ సంభాషణలోనే కోర్టుహాలులో క్రిక్కిరిసిన జనంలో కలకలం బయలుదేరింది. జరుగనున్నది ఒక విచిత్ర పోరాటం అని ప్రేక్షకులంతా గుర్తించారు. అరుదైన సంఘర్షణ అది!

"న్యాయ స్థానాన్ని దిక్కరించకూడదు. అందువల్ల నువ్వు శిక్షకు పాత్రుడవుతాడు. న్యాయమూర్తిని గౌరవవించాలి."

"మానవులంతా ఒక్కటే! ప్రతి ఒక్కరూ మరొకరిని గౌరవించాలి."

"ఇక్కడ మనిషి ప్రవర్తించటానికి కొన్ని నియమనిబంధనలున్నాయి."

"మాకు మీ నియమాలు వర్తించవు. మీ నిబంధనలతో పనిలేదు" అతడు బదులు చెప్పే తీరు జనంలో గొప్ప సంచలనం కలిగించింది.

కొందరయితే మరింత ఉత్సాహ పడిపోయి అలజడి ప్రారంభించారు.

"సైలెన్స్, సైలెన్స్" న్యాయమూర్తి మాటలు విన్పించాయి.

కోర్టు హాలు సద్దుమణిగింది.

జడ్జిగారే అతన్ని స్వయంగా కొన్ని ప్రశ్నలు అడిగారు.

"నీ పేరు వివరాలు కోర్టువారికి తెలియజేస్తావా?"

"ద్రవిడు మాహేశ్వరులం. నాగదేవతలను ఉపాసిస్తాం!"

"నీవు చెప్పింది మనిషి పేరు కాదు. నీవు చేసేది వృత్తి కూడకాదు"

"మానవులంతా మహేశ్వరులె అయినప్పుడు వేరువేరు పేరులెందుకు?"

"మూర్ఖుడా! పేరుతో ప్రారంభమయిన వేరు తనం కులాలుగా మతాలుగా వర్గాలుగా చీలి వికృతంగా కన్పిస్తోంది."
"మాదృష్టిలో నరులంతా నందివాహనులే!"

"నువ్వెక్కడ ఉంటావు. మాకు నీ అడ్రస్ కావాలి!" అని అడిగారు జడ్జి.

"జంబూ ద్వీపే భారతవర్షే భరతఖండే ద్రవిడ మాహేశ్వరః!"

ఇంకా లాభంలేదనిపించి న్యాయమూర్తి ఆ ప్రయత్నం మానుకున్నారు.

"అర్ధ నగ్నంగా తిరగటం తప్పని తెలియదా?"

"బట్టలతో పుట్టడురా మనిషి! బట్టలతో మట్టికాడు! ఈ పొట్ట పీడించినంతకాలమే మట్టిలోంచి వచ్చానని మర్చిపోతాడు!"

"క్రూర జంతువులను వెంట పెట్టుకురావటం బెదిరించటం తప్పుకదా?"

"స్వార్థాన్ని మించిన క్రూరజంతువులేదు. అది మనిషిలోనే ఎక్కువగా ఉంది! పుట్టుకతో శిక్షార్హమయిన ప్రాణి ఎవరయినా ఉంటే అది మనిషేనని మీరంతా గుర్తించాలి!"

"అధికారులతో కలియపడటం హత్య చేయాలను కోవటం తప్పు కాదా?"

"అధికారులమనే అహంకారమే మీకు పనికిరాదంటున్నాను! కలయబడింది నేను కాదు. నాగదేవతను గాయపరిచి బంధించింది కూడ నేను కాదు. నేను కాని నాగదేవతకాని భస్మం చేయాలనుకుంటే క్షణకాలం పట్టేది కాదు."

తప్పు తెలుసుకుంటానని మనసు మార్చుకుంటాడని ఎదురు చూడటం పొరపాటు అయింది.

"నువ్వు చేసిన పనులు చట్టం దృష్టిలో నేరాలు! శిక్ష అనుభవించేందుకు సిద్ధంగా ఉన్నావా?" అని ప్రశ్నించారు న్యాయమూర్తి.

"శక్తికి మించిన మాటలు మాటాడుతున్నావురా మూర్ఖుడా! మాహేశ్వరులను, నాగదేవతలను శిక్షించగల శక్తి నీకు ఉందా?" అని ఎదురు ప్రశ్న వేశాడు ద్రవిడ మాహేశ్వరుడు.

అతని మాటలు విని కోర్టు హాలంత ఉలికిపడింది.

జడ్జిగారు కన్నులు చికిలించి చూచారు. మరి ప్రశ్నించలేదు.

"ఉన్మాదిలా కన్పించే ఈ విచిత్ర వ్యక్తిని పదిహేను రోజుల తరువాత విచారణ కోసం కోర్టు ముందు తిరిగి హాజరుపర్చండి! అంతవరకు ప్రజలకు ఎలాంటి హానిచేయకుండా పోలీసు వారిని నిర్బంధంలో ఉంచండి!" అని తీర్పు చెప్పి ఆయన లేచి వెళ్ళిపోయారు.

బోను చుట్టూ పోలీసులు నిలబడ్డారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆసక్తిగా అతని దగ్గిరకు వచ్చాడు.

"జటా జూటంలో పాముని ఉంచుకోవటం ఒక విచిత్ర విద్య! జనాన్ని భయపెట్టటానికి అలా చేస్తున్నావు. అవునా?" అని ప్రశ్నించాడు.

"మూర్ఖుడా! జటా జూటమంటే అది వాల్మీకము. ఈ ద్రవిడ మాహేశ్వరుని శిరసు మీద నర్తించేవి రెండు దేవతా సర్పాలు! నేను ఆ వాహన చేయగానే మగ సర్పం వెలుపలకు వచ్చింది. అని పెనబాములు దానిలో ఒకదానిని మీరు బంధించారు.

శిఖలో నర్తించే జంట నించి ఒకదాన్ని మీరు వేరుచేశారు. వియోగంతో రెండవనాగు బుసలు కొడుతోంది.

తననించి జంటను వేరుచేసిన వాడిపై పగతీర్చుకునేంతవరకూ నిద్రపోనంటోంది! దాన్ని అప్పగించండి! లేదా మీరంతా భస్మీపటలమై పోతారు" అని చివరిసారిగా హెచ్చరించాడు.

"అయితే శిగలో మరొక పాము ఉందన్నమాట? ఎంతమాయల మారివి?" అంటూ పాములను పట్టేవాడి వంక చూచాడు పి.పి.

అతడు దగ్గరగా వచ్చాడు. గాయపడిన పాముని ఒకచేతిలో పట్టుకుని మరొక చేత్తో నాదస్వరం ఊదటం ప్రారంభించాడు.

అతడు చాలాసేపు అలా కవ్వించాడు. కాని ప్రయత్నం వృధా అయింది.

"ఈ బైరాగి చెప్పే మాటలు అబద్ధం సార్! పాము ఉంటే పైకి రావలసింది. వీడిదంతా బూటకంలా కన్పిస్తోంది" అన్నాడు.

ద్రవిడ మాహేశ్వరుడి ముఖం మళ్ళీ కంది పోయింది.

"ఓం సర్పోపసర్ప! మహాసర్ప!! ఆవాహ! విజంభ మహానాగా!! అంటూ పోలిరంకెవేసి పిలిచాడు!

అంతవరకూ జటా జూటంలో జంటనాగు కోసం దురపిల్లుతున్న పింగళి వర్ణం కృష్ణనాగు ఖస్సుమని పైకి లేచింది. పడగవిప్పి జటాజూటం మీద ఆడటం ప్రారంభించింది!

నా ప్రియున్ని బంధించిన వారిమీద పగతీర్చుకుంటాను అని వెర్రెత్తినట్టు ఊగిసలాడింది. పాములను పట్టేందుకు వచ్చిన వ్యక్తి భయవిహ్వాలుడై ఉలికిపడి వెనకడుగు వేశాడు.

ఆ కంగారుతో అతని చేతచిక్కిన పురుషనాగు క్రిందికి జారి ఊ ఫ్ ఫ్ ఫ్....మన పూత్కారం చేస్తూ అతని స్కంద మీద దెచ్చికొట్టింది. అతడు భయంకరంగా వెర్రికేక పెట్టి విరుచుకుని పడిపోయాడు. జనం చెల్లాచెదరు అయింది.

ద్రవిడ మాహేశ్వరుడు పైకి లేచాడు.

పురుషనాగు అతని జటా జూటంలోంచి ఎలా క్రిందికి దిగి వచ్చిందో అలాగే పైకి వెళ్ళి జటా జూటంలో దూరిపోయింది.

సర్పాలు రెండు పడగలు ఎత్తి ప్రజలను హెచ్చరిస్తున్నాయి.

అతనికి అతి దగ్గరలో ఉన్న పి.పి. ఈ దృశ్యాన్ని చూచి భరించలేక గంగ వెర్రులెత్తిపోయి ప్యాంటు తడిపేసుకున్నాడు.

దూరంగా ఉన్న శివరాజ్ జనాన్ని త్రోసుకొని ముందుకు రావాలని ప్రయత్నించాడు. మాహేశ్వరుడి తలమీద రెండు పాములు పడగవిప్పి ఆడుతూ ఉంటంతో ఆ దృశ్యాన్ని చూచి జనం సంక్షుభితమయింది. ఎవరికి వారే తొలగి దారి యిచ్చారు.

పెద్ద పెద్ద అంగలతో ముందుకు నడిచి వెళ్ళిపోతున్నాడు.

"చార్జ్" అని అరిచాడు శివరాజ్!

సర్పాలు రెండూ వెనుకకు తిరిగాయి. జనం వెనుకకు తిరిగి భయంతో పరుగులు తీస్తున్నారు. అతని శ్రేయోభిలాషులు కావచ్చు. ద్రవిడ మాహేశ్వరుడి అభిమానులు కావచ్చు. వెనుకనించి కాలర్ పట్టుకుని లాగుతున్నారు. అడుగు ముందుకు వేయటం అసాధ్యమయింది.

జనం అంతా ఒక వంక! వారి మధ్య శివరాజ్ చిక్కుబడిపోయాడు.

యోగి మరొక వంక! అతని మార్గం నిరాఘాటవమయింది.

రెండు సర్పాలతో అతడు పూర్తిగా కనుమరుగు అయ్యాడు.

జనాన్ని త్రోసుకొని దారి చూసుకుంటూ ఎ.యస్.పి వారి నుంచి బయటపడగలిగాడు. కాని ఆ సమయానికి ముద్దాయి అక్కడలేదు.

"యింక అతని విషయంలో కల్పించుకోవటం మంచిదికాదు"

"ఎవరో దారి తప్పి వచ్చిన మహాయోగి వాళ్ళ జోలికి వెళ్ళకూడదు."

ఇలా ఎవరి యిష్టం వచ్చినట్టు వారు మాటాడుతున్నారు.

ఆ మాటలేవీ పట్టించుకోకుండా కోర్టు ఆవరణలోకి పరుగుతీసి జీపులో కూర్చుని స్టార్టు చేశాడు. వీలయిన చోటున సమాచారం సేకరిస్తూ నగరమంతా గాలించాడు. అతని ఆచూకీ తెలియలేదు.

రాత్రి తొమ్మిది గంటలు అయ్యేసరికి నీరసంతో కృంగిపోయాడు కార్యాలయంలోకి వచ్చి కూర్చున్నాడేకాని మనసు మనసులోలేదు.

పగపట్టి వెళ్ళిపోయిన ద్రవిడ మాహేశ్వరులం మళ్ళీ తిరిగొస్తాడా? ఒకే ప్రశ్న అతని మనసంతా ఆవరించి తొలుస్తోంది. వృత్తిరీత్యా తనకి ఎదురయిన మొదటి పరాజయం అది. అవమానం భరించరానిది అయింది.

మరో అయిదు నిమిషాలకు ఆఫీసర్స్ క్లబ్ నించి టెలిఫోన్ పిలుపు! హడావుడిగా బయలుదేరాడు! హాలు వెనక ఎ.సి.

రూంలో ఎదురుచూస్తున్నారు.

జిల్లా కలెక్టర్! జిల్లా మేజిస్ట్రేట్! పోలీసు సూపరింటెండెంట్!

"అతన్ని పట్టుకోవాలని నీవు చేసిన ప్రయత్నం విఫలమయింది. ఈ వార్త నీ కన్నా ముందుగానే మా దగ్గరకు చేరింది" అంటూ ప్రారంభించాడు ఎస్.పి.

"విఫల మవుతుందని నాకు ముందుగానే తెలుసు" జస్టిస్!

"ఎలా ఊహించ గలిగారు ముందుగానే!" డిస్ట్రిక్టు కలెక్టర్!

"అతడు మంత్రశక్తులు కలిగినవాడిని అతనితో మాట్లాడినప్పుడే వూహించాను! చట్టరీత్యా అతనికి విధించాల్సిన శిక్ష విధించాను. కాని ఈ చట్టాలు ఈ యంత్రాంగం ఇవేమీ అతన్ని బంధించలేవని నాకుతెలుసు! నా చిన్న తనంతో ఒకసారి మా తండ్రివెంట కొండ ప్రాంత గ్రామాలు చూచేందుకు వెళ్ళాను. నల్లమల అడవుల ప్రాంతమది.

అప్పుడు ఇలాంటి ఒక వ్యక్తిని చూచాను. ఎన్నో కథలు విన్నాను.

నాగులు నరులు పరస్పరం సమ్మోహపరచుకొంటూ సహజీవనం సాగించే విచిత్రమయిన వ్యవస్థ అది!

"అదంతా అబద్దం అని నేను అనుకోలేను!" అన్నారు జడ్జిగారు.

జిల్లా కలెక్టర్ గారు అవును అనలేదు. కాదు అనలేదు.

"సర్! ఎప్పటికయినా అతన్ని పట్టుకుని న్యాయస్థానం ముందు నిలబెడతాను. ప్రస్తుతానికి అతను తప్పించుకున్నా నేను విడిచి పెట్టాను. వెతికి పట్టుకుంటాను" అన్నాడు శివరాజ్ ఏ.యస్.పి. పట్టుదలగా.

జడ్జిగారు ఎస్.పి. వంక చూచారు.

"హనీమూన్ కి వెళ్ళాలని పెట్టిన శలవు కాన్సిల్ చేసుకోనవసరం లేదు. వెళ్ళి కొద్ది రోజులు విశ్రాంతి తీసుకో!" అని సలహా యిచ్చారు ఎస్.పి.!!

"అజహర్ భాయిజాన్" అనే పేరు జనం నోళ్ళల్లో పడి శతాబ్దాలు మారాక 'అజర్ బైజాన్' గా రూపాంతరం అయింది.

వాస్తవానికి ఆ ప్రాంతం సోవియట్ యూనియన్ వ్యవసాయానికి చాల కీలకమయిన చోటుగా వుండేది. యూనియన్ విడిపోయాక పరిస్థితి వేరు. కాని అంతకు మునుపు సామూహిక వ్యవసాయ క్షేత్రాలు నెలకొల్పటానికి యూనియన్ కి చాల అనుకూలమయిన ప్రాంతంగా దాన్ని గుర్తించారు.

సహజంగా బీడుగా పడివుండి శతాబ్దాలపాటు ఆలనా పాలనాలేని ప్రాంతాన్ని సాగులోకి తీసుకువస్తున్న క్రొత్తలో కొన్ని ప్రత్యేకమయిన సమస్యలు తలెత్తుతాయి.

వ్యవసాయ విప్లవం పేరుతో అజర్ బైజాన్ లోని బంజరు ప్రాంతాలలో సాగుబడి ప్రారంభించారు.

అక్కడ తలయెత్తిన సమస్యలతో పాముల బాధ ఒకటి!

అంతకు పూర్వం వారిలో సర్పాలు కాటు వేస్తే మరణించే వారి సంఖ్య అధికంగా వుండేది. క్రొత్త వ్యవసాయ విప్లవం రైతులకి ఈ సమస్యని మరింత చేసింది.

సెంటిమెంట్స్ యందు విశ్వాసాలు ఎక్కువ!

విప్లవం విజయవంతమయ్యాక ప్రజలలో సర్పాల గురించి సమస్యలు అధికమయ్యాక వారి విశ్వాసాలను తొలగించటం అత్యవసరమని ప్రభుత్వాలు భావించాయి.

సర్పాల గురించి శాస్త్రీయ విచారణ సైంటిఫిక్ స్టడీ చేయవలసిందిగా రచయితల్ని కోరటం ప్రోత్సహించటం జరిగింది.

ఆ విధంగా పాపులర్ అయినా ఓ రచయిత గులసుల్విస్కీ నోవ్! ఆయన ప్రపంచంలోని పాముల మీద జరిగినా సైంటిఫిక్ స్టడీని అపోసన పట్టి నూతన సిద్దాంతాలు ఏర్పరచాడు.

వాటిలో మొదటి పాయింట్ పాములు హిందువులు భావించిన విధంగా పగబట్టవు. వాటి జోలికి వెళ్ళినా ప్రతీకారేచ్ఛతో పని చేయగల శక్తి వాటికి లేదు అని ప్రకటించాడు గులసుల్విస్కినోవ్! రెండో పాయింట్ పాములకు అతీత శక్తులుండవు. అవి శతాబ్దాలు జీవిస్తాయనే మాట అబద్దం! వాటి అత్యధిక వయసు యిరవై ఆరు సంవత్సరాలు మాత్రమే! అన్నాడు.

ఈ విషయాలను ప్రజలకు చెప్పడం అత్యవసరంగా భావించి ఒక లక్ష్యంతో పరిశోధన సాగించాడు గులసుల్విస్కీ నోవ్!

హిందూ ప్రాంత దేశాలలోని విశ్వాసాలను సరి అయిన ఆధారం సాక్ష్యం చూపకుండానే కొట్టి పారేశాడు!

ఆ వ్యాసాలు ఆంగ్లంలోకి తర్జుమా అయి ప్రపంచమంతటా ప్రచారం పొందాయి. విదేశాలకు వెళ్ళి జూ ఆలజి పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, దేశంలోనివారు వాటిని చదివి ప్రభావితులై ప్రచారంలోకి తీసుకువచ్చారు.

భారతీయ ప్రాంత దేశాలలో అతని ప్రతిపాదనను బాగా ప్రచారం పొందాయి. ఇదంతా జరిగి ఇంకా అయిదు దశాబ్దాలు పూర్తికాలేదు, అర్ధశతాబ్దానికి లోపలి సంగతి!

కాని యాభైవందల సంవత్సరాలకి పూర్వం భారతభూమిలో సర్పాలమీద విస్తృత పరిశోధనలు జరిగినా దాఖలాలు చాల విస్పష్టంగా ఉన్నాయి.

వాస్తవానికి సర్పజాతుల మీద విశ్లేషణాత్మక పఠనం మనకు ఋగ్వేదంలోనే కన్పిస్తుంది. "ఆస్తికం వచనం స్మర" అనేది భారత ఇతిహాసానికి కీలకమయిన వాక్యం! అప్పటికే సర్ప విజ్ఞానంలో మనవాళ్ళ పండి పోయారు. ప్రపంచానికి దారి చూపగల సర్పవిజ్ఞానం మనది!"

"ఐస్ పార్లర్ కి దారితీయ మంటే ప్రపంచానికి దారిచూపు తున్నావు కాలుజారిపడగలవు. అదో ఐస్ పార్లర్! ఇంకా నీ సుత్తి ఆపేసి లోపలికి నడువ్! పైనాపిల్ ఫ్రూట్ సాలాడ్ తిని రెండు రోజులు అయింది" అంటూ తులసి వాగ్ధాటికి ఆనకట్ట వేసింది ముప్పయ్యెనిమిది యాభై ఆరు కొలతలతో బొదబొదలాడుతున్న కళ్యాణి!

"ఐస్ క్రీమ్ లు తినితిని అంతలావెక్కి పోయావు? ఇంకాతిని లావెక్కితే నిన్నెవడే చేసుకుంటాడు?" అని ప్రశ్నించింది తులసి!

'భర్త అంటే భరించేవాడు?' అని కదా అర్ధం. ఐస్ పార్లర్ యజమాని తప్ప ఇంకెవరూ దీన్ని భరించలేరు. అని బదులిచ్చింది ఉమ!

"నువ్వేం తక్కువ తిన్నావా? గంట క్రితమే కదా అరకిలో జీడిపప్పు, అరకిలో బాదంపప్పు లాగించావ్!"

"ష్ ష్! అరవకండి! అవతల వింటున్నారు" అంది తులసి! తలలు దించినా చూపులు మాత్రం పరుగులెత్తించి యువకుల్ని గమనించారు.

పార్లర్ లోపల చల్లగా ఉంది. అందంగా అమర్చిన ఉడెన్ సీలింగ్ నించి వెన్నెలలాంటి వెలుతురు పడుతోంది!

కావలసిన అయిటమ్స్ చెప్పి మంచినీటి గ్లాసులు పెదవులకు ఆనించు కుంది తులసి! ఎదురుగా కన్పించిన దృశ్యం చూచి నివ్వెరపోయిందామె! చుట్టూ గోడలకు ఖాళీ లేకుండా అద్దాలు బిగించి ఉన్నాయి. ఎవరు ఏవైపు ఉన్నారో నిర్ణయించుకునేందుకు వీలుకాకుండా అన్నివంకలా ఉన్న ఆకృతులే కన్పిస్తున్నాయి.

కన్పించే దృశ్యం యదార్ధం కాదని అద్దంలో నీడ మాత్రమే అని నిర్ణయించుకోవటానికి అరనిముషం పట్టిందామెకు.

చల్లనిగాలి తగులుతున్నా నుదురుమీద ముత్యాల్లా చెమట బిందువులు ఉదయించి తరళించినాయి. శరీరం జలదరించింది. చూపులు నీరసంగా మారి ముఖం నర్వెస్ గా అయిపోయింది.

"ఏమిటే అలా నీరుకారిపోతున్నావ్?" ఆశ్చర్యంగా అడిగింది కళ్యాణి.

"మన వెనుక ఎవరున్నారో గమనించారా?" గుస గుసలాడుతున్న విధంగా చెప్పింది తులసి! రహస్యం చెప్పటానికే కంఠం వణికింది. ఉమ తల త్రిప్పి వెనుకకు చూచింది.

తల మీద అడుగు ఎత్తున జటాజూటం ఉన్న ఒక యోగి ఆమెకు కన్పించాడు! ముఖం వికారంగా ముడ్చుకుంది. అతడు కౌపీనం తప్ప మరేమీ ధరించలేదు. శరీరం మీద ఏనాడు కత్తిపెట్టిన వాడు కానట్లు వెంట్రుకలు అసహ్యంగా కన్పించాయి.
అతని చూపులు మాత్రం డేగ చూపుల్లా వాడిగా గ్రుచ్చుకుంటున్నాయి.

"అడ్మిషన్ రిజర్వ్ డ్ అని బోర్డుపెడతారు. కాని వీళ్ళ కసలు బుద్ది ఉండదు. ఎవర్నిపడితే వాళ్ళని రానిస్తారు. ఎంత అసహ్యంగా ఉన్నాడో! డోకులు పుట్టేలాగ! మరో పార్లర్ కి వెళ్ళిపోదాం పదండి!" అంది ఉమా కూర్చోకుండా.

కళ్యాణి కూడ వెనుదిరిగి అతని వాలకాన్ని పరిశీలించింది. శరీరమంతా గొంగళిపురుగులు పారాడినట్లు జలదరించింది. తులసి మాత్రం ముచ్చమటల మధ్య తడిసిపోయి ఉంది. తలత్రిప్పి అయినా చూచేందుకు సాహసించలేదు.

కళ్యాణి వెజిటర్ ని పిలిచి అతని మీద గయ్యిమనిలేచింది!" హారర్ సినిమాలో విలన్ వేషంలాంటి మనుషుల్ని రానిస్తారేమిటి?" మర్యాదస్తులు ఎలా వచ్చి కూర్చోవాలనుకుంటున్నారు?" అంది.

"మాకు తెలియదండి అమ్మాయిగారూ! ప్రొప్రయిటర్ గారున్నారు కదా! వారిని అడగండి!" అన్నాడు వెయిటర్.

పరిస్థితిని గమనించి ప్రొప్రయిటర్ వారిదగ్గరకు వచ్చాడు.

"ఆ వెలిబూడిద రాయుళ్ళని కూడ రానివ్వాలా లోపలికి?"

"ఎవరి గురించి మీరు మాట్లాడుతున్నారు?" ప్రొప్రయిటర్ అడిగాడు.

"మా వెనుక కూర్చున్న సన్యాసి గురించి. అర్థం కాలేదా?"

"ఆయన సన్యాసి కాదమ్మా దేవుడు! కీకారణ్యాలలో మాత్రమే తిరిగే మహాపురుషుడు! కోట్లు క్రుమ్మరించినా అలాంటివారి దర్శన భాగ్యం దొరకదు. ఆయన ఎక్కడ కాలుపెడితే అక్కడ కనక వర్షాలు కురుస్తాయట! ఎవరు పిలిచినా ఏమిచ్చినా రారు! ఈ రోజు నాకా భాగ్యం కలిగింది. పిలవకుండా వచ్చి కూర్చున్నారు, మీకేమయినా ఇబ్బందిగా ఉంటే లేచి వెళ్ళిపొండి."

"బజారులో షాపు తెరిచి వచ్చిన వాళ్ళని వెళ్ళిపొమ్మంటావా? నీ కెన్ని గుండెలు? వ్యాపారం చేయాలని లేదా? మేము ఎవరో తెలుసుకునే మాట్లాడుతున్నావా?" అని ప్రశ్నించింది. ఉమ.

"నాకు తెలియదమ్మా! మీరు చెప్పలేదు."

"ఈ తులసి ఎ.ఎస్.పి.గారి వైఫ్! నేను డి.ఎస్.పి. గారి డాక్టర్ని ఈ కళ్యాణి జాయింట్ కలెక్టర్ గారి కూతురు." పరిచయం చేసింది.

"అంతా బాగా చదువుకున్నవారే! గొప్పవారే! పెద్దపెద్ద అధికారుల తాలూకు మనుషులు! కాని అక్కడ బోర్డు ఉంది చూచారా? అడ్మిషన్ రిజర్వ్ డ్! దయచేసి మీరే బయటకు వెళ్ళిపోండి!" ఆయనకు దయ ఉన్నంత సేపు అక్కడే కూర్చుంటారు. లేకపోతే ఎన్ని రోజులయినా రాత్రింబవళ్ళు షాపు తెరిచే ఉంచుతాము. అదే వారి మీద మాకున్న భక్తి!" అని చెప్పేసి ఆ వ్యక్తి వంక చూచి చేతులు జోడించి వెళ్ళిపోయాడు ప్రొప్రయిటర్.

అతడు ఖండితంగా చెప్పిన సమాధానం విని వారు నివ్వెర పడిపోయారు.

"ఇలాంటి షాపులోకి రావటం మనదే తెలివితక్కువ. వెళ్ళిపోదాం పద!" అంటూ మిగిలిన ఇద్దరిని తొందరించింది ఉమ.

ఎలాగయినా అక్కడనించి బయటపడేందుకే ఆలోచిస్తోంది తులసి! "త్వరగా రండి" అంటూ ముందుగా వెలుపలకు వచ్చింది. వారిమాటలు వింటున్నాడో లేదో యోగి మాత్రం ఒక సోఫాలో పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు.

ఉలకలేదు. పలకలేదు. డేగ చూపులు ఎక్కడో గ్రుచ్చుకుంటున్నాయి.

"ఏమిటలా గాలిపటంలా కొట్టుకుపోతున్నావు- ఆగాగు. మరోషాపులోకి వెడదాం. ఎవడో వాగాడని ఐస్ క్రీం తినకుండానే వెళ్ళి పోతావా?" కళ్యాణి వారిద్దరిని నిలువరించింది.

మరో షాపులోకి వెళ్ళి తిండి ముచ్చట తీర్చుకున్నారు.

వారు వెలుపలకు వచ్చే సమయానికి మొదటి షాపుముందు జనం గుంపులు కూడి ఉన్నారు. కిటకిటలాడుతున్నారు.

"అక్కడ ఎవరైనా పోయారేమిటి? అంతమంది చూస్తున్నారు?" అంది ఉమ.

"ఆ బవిరి గడ్డంవాడే పోయుంటాడు" అంది కళ్యాణి.

"అపచారం! అపచారం!" అంటూ అప్రయత్నంగా చెంపలు వేసుకుంది తులసి.

"దీనికి కూడ ఆ పిచ్చే ఎక్కినట్టుంది. బవిరి గడ్డంవాడు కాదు షాపు యజమానే పోయుంటాడు. మనల్ని వెలుపలకు పొమ్మన్నాడు కదా?" అంది అక్కసుగా ఉమ! అడుగులు ముందుకు పడలేదు.

"మరీ అంత జనం ఉన్నారంటే ఏదో జరిగే ఉంటుంది. మనం కూడకెళ్ళి చూద్దామా?" ఉత్సాహంగా అడిగింది కళ్యాణి.

"నీకు పిచ్చెక్కిందా? షాపు వాడు చేసిన పరాభవం మర్చిపోయావా?"

"అది పరాభవం ఎలా అవుతుంది? మనతో అతనికి విరోధమే ముంది? యోగి మీద తనకున్న భక్తిని ప్రకటించుకున్నాడంతే కదా?"

"ఇంకా ఏ శతాబ్దంలో బతుకుతున్నారీ మనుషులు! గడ్డంగీచుకోవడం ఒంటినిండా బట్టలు కట్టుకోవటం చేతకాని ఒక బైరాగి షాపులో కాలుపెడితే కనకవర్షం కురుస్తుందా?"

కావాలంటే నేను కూడ మీతోపాటు ఆ చిత్రం చూచేందుకు వస్తాను కాని చింతకాయ లాజిక్కులు మాత్రం చెప్పకు" అంది ఉమ.

"అదేమిటి! నేనెప్పుడూ వినలేదు. చింతకాయలాజిక్కేమిటి?"

"వినకపోతే పోయావు. చింతకాయ ఎప్పుడయినా చూచావా?"

"మొన్న మార్కెట్ కి వెళ్ళినపుడు షాపు వాడిముందు రాసిపోసుంటే చూచాను."

"బాగా ఊరిపోయి వొంకీలు తిరిగిపోయి ఉంటాయి కదూ!"

"అవును తొడిమ కూడ ఉంది!"

"దాన్ని బాగా జ్ఞాపకం ఉంచుకో! ముందు ముందు చాల పనుంటుంది."

"పులుపు నాకు సయించదు. దాంతో నాకు పనిలేదు."

"పని ఇప్పుడుండదు కాని ముందు ముందుంటుంది. పెళ్ళయి బాలింతరాలివి కూడ అయాక పాతచింతకాయ పచ్చడి నాలుక్కి రాచుకోవడంలో ఆనందమూ ఆరోగ్యమూ ఉంటాయి!"

"కడుపుతో ఉన్నప్పుడు మూడో నెల దాటాక చింతకాయలు తినటం చూపిస్తారు కదే సినిమాల్లో!"

"ఎగ్జాక్ట్ లీ కరెక్ట్! జీవితాల్లోంచి సెలెక్ట్ చేసిన కొన్ని ప్రత్యేక దృశ్యాలే సినిమాల్లోకి వస్తుంటాయి. జబ్బుచేసి తగ్గిన తరువాత కూడ చింతకాయ పచ్చడి తినాలి!"

"బాలింతరాలు కావటం కూడ ఒక జబ్బేనంటావా?"

"యాంటిబయాటిక్స్ కనిపెట్టని రోజుల్లో అయితే అంతే మరి!"

"చింతకాయలాజిక్ అంటే ఏమిటో చెప్పలేదింకా! సాగలాగుతున్నావు!"

"అవును మరి! చింతకాయ కాచేది చింతచెట్టు కోసమా? చింతపండు కోసమా? కనుక్కో చూద్దాం!"

"చెట్టు ముందా విత్తు ముందా అన్నట్టుంది నీ ప్రశ్న!"

"బెంగుళూరు బొటానికల్ గార్డెన్స్ కి ఎప్పుడయినా వెళ్ళావా?"

"నీతోపాటే నేను కూడ వచ్చాకదా?" అంది కళ్యాణి!

"అక్కడొక బోర్డుంది చూశావా?"

"ఒకటేమిటి? చాలా చోట్ల బోర్డులున్నాయి!"

"వృక్షాలు పుష్పించినా ఫలించినా సంతానాభివృద్ధికే! అని ఉంది"

"అవును ఉంది! ఇప్పుడెందుకు చెప్తున్నావు?"

"చెట్లు ఎందుకు పూలు పూస్తాయో, కాయలు కాస్తాయో, తెలియనప్పుడు అక్కడ ప్రశ్నలుదయిస్తాయి. ఇది చెప్పే యక్ష ప్రశ్నలన్నీ అలాంటివే! జనం విరగబడి తోసుకుంటున్నారు. మనం వెళ్ళడం ఎలా? అంది ఉమ.

"ఎదురుగా మేడమీద టైలరింగ్ షాపు ఒకటుంది. అక్కడ నిలబడి చూస్తే యిక్కడి దృశ్యాలు బాగా కనిపిస్తాయి. అప్పుడప్పుడూ అక్కడ నిలబడే ఈ షాపులో ఎవరెవరు ఏమేం తింటున్నారో చూస్తుంటాను."

"అఘోరించావులే పద! ఎవరో తింటే చూచినంత మాత్రాన మన నోటి తీట వదులుతుందంటావా? అక్కడికే వెడదాం పదండి" అంది.

ముగ్గురూ మేడమీది టైలరింగ్ షాపుకి వెళ్ళారు.

అక్కడ నిలబడి చూస్తుంటే ఐస్ పార్లర్ లో జరుగుతున్న తతంగం చుట్టూ నిలబడి ఉన్న జనం తలలమీదుగా కన్పిస్తోంది.

యోగి తాము వెళ్ళినప్పుడు ఎలా పద్మాసనం వేసుకుని కూర్చుని ఉన్నాడో ఇప్పుడు కూడా అలాగే కూర్చుని ఉన్నాడు.

షాపు యజమాని వ్యాపారం సంగతి మర్చిపోయాడు. అతని కుటుంబ సభ్యులు అందరూ అతని చుట్టూ చేరిపోయారు. షాపు యజమాని అర్థాంగి కాబోలు ముందుగా పిల్లల్ని యోగి పాదాల దగ్గర మోకరింపచేసింది.

తాను కూడా బోర్లా పడుకుని అతని పవిత్ర పాదాలు తాకి కళ్ళకు అద్దుకుంది. జనం కూడా ఆయనకు మ్రొక్కులు చెల్లించేందుకు త్రోసుకొస్తున్నారు. కాని షాపుసిబ్బంది అతి శ్రమమీద వారిని అదుపు చేస్తున్నారు.

షాపు యజమాని అర్థాంగి రిక్షాలో తెచ్చిన ఆవుపాలు రమ్ములోంచి అందంగా లతలు తీర్చిన ఓ వెండి బిందెలోకి

దిమ్మరించింది.

"పాద పూజ చేస్తున్నారు కాబోలు! ఇవాల్టితో వీడి పంట పండింది. కోటీశ్వరుడయిపోతాడు కాబోలు!" అన్న మాటలు వినిపించాయి.

తలత్రిప్పి చూచింది ఉమ. వారికి వెనుక ముగ్గురు యువకులు నిలబడి ఉన్నారు. గెడ కొంగలా ముందు నిలిచి ఉన్న ఆడపిల్లల తలలమీద నుంచి షాపులోని దృశ్యాల్ని తిలకిస్తున్నారు.

వారిలో ఒక యువకుడు మరింతగా పులకించుతున్నాడు.

కారుల్లో, విమానాల్లో త్రిప్పుతామన్నా రానన్నాడట! ఊరి వెలుపల ఒక తోట, బంగ్లా యిస్తానని అర్థించినా ఒప్పుకోలేదట! వీడి అదృష్టం ఎందుకిలా పుచ్చిందో పిలవకుండా వచ్చేశాడు అన్నాడు!"

"ఆయన వచ్చినంత మాత్రాన ఏమవుతుందట?" వెటకారంగా అంది ఉమ.

"యోగి ఎక్కడ కాలుపెడితే అక్కడ కనకవర్షాలు కురుస్తాయట ఏ ప్రాంతాల నుంచి వచ్చాడో, ఎందుకొచ్చాడో నగరంలో ప్రత్యక్షమయి నెల రోజులు కూడా కాలేదు.

జనంలో గగ్గోలు సృష్టించాడు!" అని బదులిచ్చాడాయువకుడు రెప్పలు అరమొడిచి మరీ చెప్పాడు భక్తి భావంతో!

"త్రాష్టుడా! ఈ వయసులో ఇంత చాదస్తంగా ఆలోచిస్తున్నావు అని గొణుక్కుంటూ తల త్రిప్పి ముందు దృశ్యాలు చూడడంలో మనసు లగ్నం చేసింది ఉమ.

షాపు యజమాని అర్ధాంగి వెండి బిందెలోకి ఒంపిన పాలతో అరవిచ్చిన మల్లెపూలు, గంధం కలిపి పన్నీరు చిలికించింది.

పెద్ద వెండి పళ్ళెంలో యోగి పాదాలను ఉంచారు.

పూలు గంధం పన్నీరు కలిపిన పాలను పోసి కాళ్ళు కడిగారు. యోగి రెప్పలు విప్పి అయినా చూడలేదు. పాలు అతికిన పాదాలను షాపు యజమాని షర్టు అంచులతో అద్దటం ప్రారంభించాడు. అతనితో పాటు అతని అర్ధాంగి పైట కొంగుతో అద్ది శుభ్రంగా తుడిచారు.

ఆ తరువాత వారు పాలతో యోగికి అభిషేకం ప్రారంభించాడు. అంతసేపు గొణుగుతున్నట్టు మంత్రాలు

చదువుతున్న బ్రాహ్మడు అరకిలో మీటరు దూరం వినిపించే రాగ స్ఫూర్తితో అమృతాభిషేకం మంత్రాలు చదవటం ప్రారంభించారు.

వేరు వేరు వెండిపాత్రలలో పాలు పెరుగు నెయ్యి తేనె గంధజలం తీసుకువచ్చి అతనికి అందించారు. అవన్నీ కలిపి అతడు పెద్ద వెండి బిందెలో కలియబోసి పంచామ్రుతాలను తయారు చేశాడు.

"ఆప్యాయ స్వసమేతుతే..." అంటూ మరింత పెంచిన కంఠ స్వరంతో మంత్రాన్ని అందుకున్నాడు. "మధువాతారుతాయతే మధుక్షురన్తి సింధవః" అంటూ మంత్రాన్ని శృతి మధురంగా చదువుతున్నాడు.

నిర్లిప్తంగా వృత్తిపరంగా కాక ఏదో స్ఫూర్తి అతని కంఠస్వరాన్ని ఆవరించింది.

మంత్రం పూర్తి అయ్యేసరికి షాపుయజమాని దంపతులు అత్యంత భక్తి భావంతో అభిషేకం పూర్తి చేశారు. కాని ఒక్క చుక్క అయినా జటలు దాటి వెలుపలకు రాలేదు. జనం నివ్వెరపోయి చూస్తున్నారు.

తలచుకుంటేనే ఒళ్ళు జలదరించే అద్భుతమది!

కనుల ఎదురుగా జరుగుతోంది. కారణాలను ఊహించేందుకు వీలుకాని సంఘటన! మిరాక్యులస్ గా అనిపించింది అందరికీ!

ఎవరికీ వారే షాక్ అయి చూపులు నిలిపేశారు.

పుట్ట కలుగులో పోసిన పాలలా ఒక్క చుక్క బయటికి రాకపోవటం ఏమిటి? ఇంచుమించుగా పదిలీటర్ల పాలుంటాయి. పూలు మాత్రం శిగలో తురుముకున్నట్లు చెండులా నిలబడి వున్నాయి. అవిశ్వాసాన్ని చూచి ఫక్కున నవ్వుతున్నాయి. ఒకవేళ అతని జటాజూటంలో ఉన్న జంట సర్పాలు వాటిని స్వాహాచేసినా అన్నిపాలు త్రాగటం పాములకు సాధ్యమేనా?

ఇటువంటి అద్భుతాలను ఎన్నింటినో చూచామంటున్న వాళ్ళు ప్రక్క వాళ్ళకి చెబుతున్నారు. అప్రయత్నంగా చేతులు జోడిస్తున్నారు. విశ్వాసం లేని వాళ్ళు కూడా విస్మయంగా చూస్తున్నారు.

"ఇప్పుడేమంటావు?" అంది తులసి సీరియస్ గా!

"ఇదంతా గారడీ అంటానే! జటల లోపల అన్ని పాలు ఇమిడిపోవటానికి అదేమన్నా చెరువా? సముద్రమా?

ఇదంతా ఇంద్రజాలం. లేకపోతే కనికట్టు! పి.సి. సర్కార్ ఇంత కన్నా అద్భుతాలను చేసి చూపించగలడు. మీలాంటివాళ్ళున్నంత కాలం ఈ ప్రపంచం ఇలాగే తగలడుతుంది!" అంటూ భక్తిభావంతో వాలిపోతున్నవారి కనురెప్పల వంక చూడకుండా ముఖం త్రిప్పుకుంది ఉమ.

నీ ఖర్మకు ఎవరు బాధ్యులు! నిన్ను బాగు చేయటం మన బెనర్జీ మేడమ్ గారి వల్లనే కాలేదు. ఇంకా మావల్ల ఏమవుతుందికాని దయచేసి నోరు మూసుకో!

"మన వెనక నిలబడిన ఆయన భక్తులు విన్నారంటే తన్నగలరు!" అని హెచ్చరించింది కళ్యాణి!

అప్పటికే యువకులు వారివంక గుర్రుమని చూడటాన్ని గమనించిన తులసి రహస్యంగా భుజంమీద గిచ్చి మరీ హెచ్చరించింది.

"స్వామీ చాలామంది భక్తులు తీర్ధ ప్రసాదాలకోసం వచ్చారు! కొంచెమయినా క్షీరధారల్ని విడిచిపెట్టండి. మమ్మల్ని అనుగ్రహించండి" అంటూ షాపు యజమాని అర్ధాంగి ఆ కాస్తంతగా ఉన్న స్థలంలోనే పొర్లు దండాలు పెట్టటం ప్రారంభించింది.

ఆవేశం అణచుకోలేని ఓ యువకుడు పెద్దగా అరిచాడు!

"ద్రవిడ మాహేశ్వర యోగి మహారాజ్ కీ!"

"జై! జైజై!!" అంటూ భక్తులు ప్రతిధ్వనించారు. ఆ వీధి వీధి అంతా మార్మోగిపోయింది. బయట కూడ జనం గుంపు కట్టి రోడ్డు మీద వాహనాలకు అడ్డు వచ్చారు.

ట్రాఫిక్ వారి విన్నపాలను పట్టించుకున్న నాధుడేలేడు. వారు ధారగా వస్తున్న వాహనాలను ఎలాగో శ్రమపడి తాత్కాలికంగా మార్జిన్ మీదికి మళ్ళించారు.

క్షణక్షణానికీ జనం పెరుగుతున్నారు!

ఈ వార్త క్షణాల మీద పాక్కింది. ప్రక్కనున్న షాపుల వాళ్ళు కూడ వచ్చి చేరాడు. ప్రముఖులంతా వస్తున్నారు. జనసాంద్రత క్రమంగా మరింత ఎక్కువకుతోంది. భక్తి, ఆవేశం జనతరంగమై లేచింది. షాపు యజమాని అభ్యర్ధనని మిగిలిన వారంతా అందుకున్నారు. యెంత అలజడి జరుగుతున్నా, జనం ఎంతగా గగ్గోలు పడుతున్నా యోగి మాత్రం అఖండమయిన ఏకాంతాన్ని అనుభవిస్తున్న వాడిలాగా నిశ్చల సమాధిలో ఉన్నట్టు కన్పిస్తున్నాడు.

క్రమంగా ప్రజల అభ్యర్ధనలు వేడికోళ్ళ తీవ్రతరం అయినాయి. ఒకప్పుడు రుద్రుడు తన జటా జూటంలో గంగను

బంధించగా విడుదల చేయమని ఘోరాతి ఘోర తపస్సుచేశాడు భగీరథుడు!

ఐస్ పార్లర్ ముందు చేరిన అఖండ జనవాహినిలో ఒక్కొక్కరూ ఒక్కొక్క భగీరథులైపోయి ప్రార్థించటం మొదలెట్టారు.

కాని యోగి మాత్రం ఎంతకూ కరగని ముడియినుములా బిగిసిపోయి వున్నాడు. కనురెప్పలు అయినా కదిలించినవాడు కాదు.

ఫానుగాలికి జటల మీదినుంచి లేచిన పీచు వెంట్రుకలు మాత్రం ఊగిసలాడుతున్నాయి. అతని శరీరంమీద చెమటపట్టదు.

అనవరతం భస్మధారణవల్ల మాత్రమే కాదు అతని శరీరంలో చాల విచిత్రమయిన, విశిష్టమయిన లక్షణాలెన్నో ఉన్నాయి.

ఉన్నట్లుండి జనసముద్రంలో పిడుగుపడినట్లు అయింది.

"భైరవా!! రుద్రభైరవా!!" అంటూ పెడబొబ్బ పెట్టివిరగ దీసుకుని లేచింది ఒకామె! చాలాకాలం ప్రాక్టీస్ చేసినాదానిలా రుద్ర తాండవం ప్రారంభించింది. అడుగులు లయబద్ధకంగా ఊగుతున్నాయి. చేతులు గాలిలో పక్షుల్లా ఊగుతున్నాయి.

యోగి ఎడమచేయి చిటికిన వ్రేలుమడిచాడు.

దాంతో ఆమె పూర్తి వివశంగా అయిపోయింది.

"సర్పభైరవా ఆవాహ! రుద్రభైరవా నమోనమ!!" అని పోలిరంకెలు వేయటం ప్రారంభించింది. ఒకకాలు పైకెత్తి మడిచింది. ప్రక్కనున్నవారు గాలికి లేచిపోతున్న చీరకొంగును నడుం చుట్టూ త్రిప్పి బొడ్డు దగ్గర దోపారు.

ఇంకా ఆమె శివమెత్తిన మాతంగ కన్యలా విలయతాండవం ప్రారంభించింది. ఆ ఒక్కషాపు ముందున్న జనంలోనే కాదు వీధిలో ఉన్న ప్రతి ఒక్కరికి రోమాలు చిక్క బొడిచినాయి.

"అపచారం జరిగిపోయిందిరా! ద్రవిడ మాహేశ్వరుడి శరీరం అపవిత్రం చేయాలని ప్రయత్నించారుగా!!

నరజాతి నాగదేవతల్ని అవమానించింది.

పడగ మీద కాలెట్టి ఆడుకుంటారా? శ్వేతనాగుల ధవళ కరాళ దంష్ట్రల కాంతుల్ని మలినపరచాలని ప్రయత్నించారుగా! అగ్గిపుల్ల గీస్తే కాలి బూడిద అయేరంగు కాగితాలను చూచుకుని విర్రవీగారు!

భిక్ష అడిగితే తప్పా!! నాగ దేవతల్ని నాలుగుగోడల మధ్య బంధిస్తారా? మూర్ఖులారా! పిడుగుల్ని పిడికిట పట్టాలనుకుంటున్నారా? భస్మమైపోతారు.

"హుం!! హుహుహూం!! అంటూ వెర్రిగా ఆడటం మొదలెట్టింది. అప్పటికే జుట్టుముడి వీడిపోయింది. ఎవరో వేపమండలు అందించారు!!"

వారు ఏదో ప్రయాణం మీద బయలుదేరి వెడుతున్న వారు. ట్రాఫిక్ జాం అయిపోవడంతో రిక్షాదిగి చిత్రం చూచేందుకు వచ్చారు. ఆమెతో వచ్చిన భర్త ఈవిపరీతానికి భయపడిపోయి భార్యని బ్రతిమాలటం ప్రారంభించాడు.

"నాగవర్ధనీ! నా మాట వినవే! వెళ్ళిపోదాం పదా!!" అన్నాడు.

"ఎవడురా నువ్వు? నాగదేవతనించి నన్ను వేరుచేస్తావా?" అంటూ భర్తవంక కనుగ్రుడ్లు విపరీతంగా పెద్దవిచేసి చూచింది భార్య.

"త్వరగా  అడుగేస్తే చీమలు చచ్చిపోతాయనే దానివి! తలెత్తి చూస్తే భయంతో క్రుంగిపోయేదానివి. ఇలా అయిపోయా వేమిటి?" అని వాపోయాడు భర్త!

ఆమెను ఆ క్షణానికి పబ్లిక్ మనిషిగా భావించి ఆమె మీద అధికారం కలిగిన భర్తను ప్రక్కకు తీసుకుపోయారు బలవంతంగా! ఎవరో సమయస్ఫూర్తి కలిగినవారు సాంబ్రాణి తీసుకువచ్చారు.

దగ్గరలో ఉన్న నిప్పులు తెచ్చారు.

ధూపం వేపాకు మండలంతో వాతావరణం ఉన్మత్తం అయింది. ఆ వాతావరణంలో ప్రతి ఒక్కరికి ఒళ్ళు జలదరించటం, వెన్నపూసలా కరిగిపోతున్న అనుభవం కలుగుతున్నాయి.

"మాహేశ్వరా తీర్థాన్ని ప్రసాదించు! ఇకముందు నీకు ఎలాం అపకారం జరగకుండ కాపాడుకుంటాం!" అని జనం ఎలుగెత్తి వేడుకోలు ప్రారంభించినారు.

యోగిలో రవంత కదలిక కన్పించింది.

అతడు బొటనవ్రేలు మీదికి ఎడమచేతి అనామికను మడిచినాడు! ఫెటిల్లున ఏదో విరిగి పడినట్టు మరొకామె లేచింది.

"అదే వరుస! అపచారం జరిగిపోయింది! అపరాధం చెల్లించకుంటే దండన తప్పదు! నగరంలో విలయం అనివార్యం!"

యోగి మధ్య వేలు మడిచాడు!

దాంతో మరో యువకుడు విరుచుకు పడినాడు!

ద్రవిడ మాహేశ్వరుడు వ్రేలు ముడిచినప్పుడల్లా ఒకరు చొప్పున ఉగ్ర రూపానికి వస్తున్నారు. అరగంటలో మొత్తం పదిమంది అయ్యారు. ఆ వీధిలో దొరికిన సాంబ్రాణి అంతా ఊడ్చి తెచ్చారు. చివరకు ట్రాఫిక్ సంగతి అందరూ మర్చిపోయారు.

కానిస్టేబుల్ కూడ ఆ విడ్డూరాన్ని గమనించటంలో నిమగ్నుడయ్యాడు.

ఉమా పరుగున వెళ్ళి పోలీసు కంట్రోలు రూంకి ఒన్ డబల్ జీరో డయల్ చేసింది!

## 4

"హలో! దిసీజ్ పోలీస్ కంట్రోల్ రూం!"

"డి.ఎస్.పి. రమేష్ చంద్రగారి డాక్టర్ని మాట్లాడుతున్నాను! రిపోర్టు ఉంది నోట్ చేసుకోండి! చాల అర్జెంట్ గా ఎవరో ఒకరు రావాలి! ప్లీజ్!"

"వ్రాసుకుంటాం చెప్పండి మేడమ్!"

"శివరాణి థియేటర్ సెంటర్ లో చాల గొడవ జరుగుతోంది. అరగంటనించి ట్రాఫిక్ జాం అయిపోయింది!"

"అక్కడ మా మనుషులున్నారు డ్యూటీలో! రిపోర్టు చేయండి!"

"వారు కూడ భక్తి తన్మయత్వంలో మునిగిపోయారండి బాబు!"

"భక్తి తన్మయత్వంలోనా?? వివరంగా చెప్పండి!"

కళ్ళముందు జరిగినదంతా వర్ణించి చెప్పింది ఉమ!

"మేము చూచుకుంటాం!" అంటూ రిసీవర్ దింపేశాడు! వెంటనే ఎ.ఎస్.పి. గారికి ఇంటర్ కంలో జరిగినదంతా నివేదించాడు.

"రెండు వ్యాన్ లు సిద్ధంచేయండి! రౌండ్స్ కూడ తీయించి పన్నెండుమందిని తయారు కమ్మని చెప్పండి. రెండు నిముషాలలో వస్తున్నాను"

"సర్! ఇది ట్రాఫిక్ కి కాని పబ్లిక్ న్యూసెన్స్ కి కాని సంబంధించిన వ్యవహారం! క్రిమినల్స్ కి సంబంధించిన వ్యవహారం కాదు."

"షటప్! అదంతా నాకు తెలుసు చెప్పినట్టు చెయ్యండి వెంటనే!" అంటూ చదువుతున్న రెడ్ ఫైల్ బీరువాలో స్వయంగా భద్రపరిచాడు.

వెంటనే క్యాప్ తగిలించుకుని స్టిక్ తీసుకున్నాడు!

పోలీసు బూట్లు కరకరలాడించుకుంటూ ఎ.ఎస్.పి. శివరాజ్ వరండాలోకి వచ్చే సమయానికి రెండు జీపులు అరడజను వ్యాన్ తో కదిలేందుకు స్థిరంగా వున్నాయి.

పోలీసు జీపులు నియమితమయిన వ్యూహంలో రెండు దిక్కులనించి ఒకేసారి దాడిచేసేందుకు రెండు వైపులకు బయల్దేరాయి. చేరవలసిన చోటుకి చేరుకున్నారు.

ముందుగా ట్రాఫిక్ పోలీస్ లను అలర్ట్ చేసి వారిస్థానంలోకి పంపేశాడు. ముందు ప్రక్క ఆగిపోయి ట్రాఫిక్ జాం అయిపోవతనికి కారణమయిన వాహనాల మీదికి మైక్ ని దాడిచేయించాడు. ఎవరికి ఏ క్షణంలో ఏ ముప్పు వస్తుందో తెలియక డ్రయివర్స్ వాహనాల్లోకి పరుగుతీసి స్థిరంగా కూర్చున్నారు.

ఎప్పుడయితే ముందు ప్రక్క వాహనాల కదిలాయో ట్రాఫిక్ ఫ్లో అవటం ప్రారంభించింది. షాపు ముందు మనిషి ప్రవేశించటానికి వీలుకాకుండా బిర్రుగా బిగిసిపోయిన జనసాంద్రత కాస్తంత రిలాక్స్ అవటం మొదలు అయింది.

ముందుగా తానేలోపలకు దారితీశాడు శివరాజ్!

ఒళ్ళు పెరిగిన వాళ్ళ వీరావేశంలో వచ్చి అతన్ని చుట్టుముట్టారు! పైశాచిక బలంతో క్రిందికి పడద్రోయాలని ప్రయత్నిస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తున్న తులసి తననితాను సంభాళించుకోలేక పోయింది. భర్త అపాయంలో ఉండగా చూచి ఆమె భక్తి తాదాత్మ్యం మంచులాగ విడిపోయింది.

ఉమ, కల్యాణి ఎంత వద్దంటున్నా వినిపించుకోకుండా జనం మధ్యకు వెర్రెత్తిన దానిలా పరుగుతీసింది! జనాన్ని చీల్చుకుని భర్తను చేరుకోవాలని ఆమె తాపత్రయం!

కాని అప్పటికే పోలీసులకి, ప్రజలకి మధ్య సంఘర్షణ తీవ్రతరం అయింది. రెండు మూడు రౌండ్లు గాలిలోకి కాల్చటం వినిపించింది.

హా హా కారాలు చెలరేగినాయి.

కొందరు పూర్వపు కక్షలు మనసులో ఉంచుకున్న వాళ్ళు సమయం చిక్కినందుకు సంతోషిస్తూ పోలీసుల్ని క్రిందికి పడలాగి యీడ్చుతున్నారు.

"చార్జి చార్జి" అని అరుస్తున్నాడు శివరాజ్!

అప్పటికప్పుడే తయారయిన ఒక వాలెంటరీ టీము వారికి పూర్తిగా ఎదురు తిరిగింది. ఎట్టి పరిస్థితిలోనూ పోలీసుల్ని యోగి వైపుకి పురోగమించకుండా చేయాలని తీవ్రంగా పోరాడుతున్నారు.

లాఠీ దెబ్బలకు నలుగురు యువకులు ఇద్దరు స్త్రీలు కూడా స్పృహ తప్పి పడిపోయారు. పోలీసులకు గాయాలు అయినాయి. శివరాజ్ కి కూడ దెబ్బలు తగిలినాయి. పాదపూజలకు వచ్చిన ఒక వి ఐ పి కల్పించుకున్నాడు.

అప్పటికప్పుడు ఎస్ పి గారు కల్పించుకోవటం అని వారిం అయింది. ఆయన స్వయంగా వచ్చి పరిస్థితిని చక్కదిద్దటానికి పూనుకున్నారు.

ఎస్.పి రాగానే చార్జింగ్ ఆపించేశారు. మాస్ ఎటాక్ కూడ ఆగిపోయింది.

ఎవరికి వారు విడిపోయినారు.

"ఇక్కడ ఏం జరుగుతోందని వారు వచ్చి దాడి చేశారు" అని అడిగారు వి.ఐ.పి!

"ఈ యోగిని కోర్టు ముద్దాయిగా గుర్తించింది. పదిహేను రోజులు రిమైండ్ లో ఉంచేందుకు పోలీసు వారికి ఆర్డర్స్ యిచ్చింది" అన్నాడు శివరాజ్.

"మూర్ఖుడా! ఈ మహానుభావుడ్ని ముద్దాయి అంటున్నావా? ఇంతమంది పాద పూజలు అందుకుంటున్న దేవుడు. పాపం పుణ్యం తెలియని మౌని!

కనులు విప్పడు. మాట్లాడడు! అనుగ్రహిస్తే వరాలిస్తాడు!

వారం రోజులకు ఒకసారి కూడ అన్నం తినడు. పాము ఆరు నెలలకొకసారి భోం చేసినట్టు నియమిత ఆహారి! గాలి కూడా పీల్చుకునేందుకు నియమనిష్టలున్న మహారుషి!

మానవ ప్రపంచంతో సంబంధంలేని వాడు!

ఎప్పుడో దశాబ్దాల కొకసారి మనుషులకు కన్పించే మాహనీయుడు!

అతనికి సద్భావనలు లోక కళ్యాణవాంచలు తప్ప స్వార్ధాలేమున్నాయని అతడు ముద్దాయి అయినాడు! ఎవరిజోలికి వచ్చాడని నేరాలు మోపారు?"

అంటూ ఎదురు ప్రశ్నలు గుప్పించాడు వి.ఐ.పి.

"అవన్నీ మాకు తెలియదు కోర్టు ఆర్డర్స్ ఫాలో చేయటం మా విధి!"

"పిచ్చిగా మాట్లాడకు! ప్రజల ఆరాధనలు అందుకుంటున్న దేవ పురుషున్ని ఆర్డర్స్ పేరుతో అదుపు చేయాలని చూస్తావా? ఆ పని చేయగలవా నువ్వు! అంతదమ్ములున్నాయా మీ డిపార్టుమెంటుకి!"

"మీరు ప్రజల కోసమా? ఎందుకోసం పనిచేస్తున్నారు? ప్రజల ఆరాధనకీ ఆర్డర్స్, సంఘర్షణ జరిగితే ప్రజలే గెలుస్తారు. గుర్తించి మసులుకో!

ప్రజల కోపానికి గురి అయినప్పుడు చక్రవర్తులే, సర్వం సహాధి కారాలున్నాయనుకున్నవారే మట్టికరచి పోయారు.

విచక్షణ పాటించకుండా డ్యూటీ చేయమని ఏ రాజ్యాంగం నీకు చెప్పింది.

జరిగినా దానికి క్షమాపణ చెప్పి ఇక్కడ నించి కదులు!" అన్నాడు కోపంగా!

"ముద్దాయిని కాపాడాలని ప్రయత్నించటం కూడ నేరమే!" ఉరిమాడు ఎస్.పి.

"ఏమన్నావ్!? మిస్టర్ ఎస్.పి. మీ జూనియర్ ని నోరు అదుపు చేసుకోమని చెప్పండి! ఈ దేవుణ్ణి తరలించుకు పోవాలంటే మా శవాల మీదుగానే! అంత దమ్ములు ఎవరికున్నాయో ఉంటే వారు ముందుకు రండి!" అంటూ స్వామి పాదాలమీద ప్రాణాచారం పడిపోయాడు వి.ఐ.పి. ఆయన్ని అనుకరించి వందలాదిమంది యోగిచుట్టూ బోర్లా పడిపోయారు. ఏడ్పులు ప్రారంభించారు.

వారి తెగింపు చూచి ఎస్.పి కరిగిపోయారు. శివరాజ్ పరిస్థితిని అంచనా వేయకుండా దాడిచేయటం పొరపాటే అనిపించింది.

"సర్! జరిగింది తొందరపాటే! నేను క్షమాపణలు చెప్పుకుంటున్నాను. నేరం చేశాడని విరూపణ కాని ముద్దాయిని అదుపు చేసేందుకు ఇన్ని ప్రాణాలు తీయమని ఏ రాజ్యాంగమూ చెప్పదు. అతనికి బదులుగా నేను క్షమాపణలు చెప్పుకుంటున్నాను. ప్రజల పవిత్ర ఆరాధనా భావాన్ని కాదనే శక్తి మీకు ఎలాలేదో కోర్టు ఆజ్ఞల్ని ధిక్కరించే అధికారం కూడ మాకులేదు."

"అందుకేదయినా రాజీ ప్రయత్నం చెప్పండి!" అని అడిగాడు!

వి.ఐ.పి విజయ గర్వంతో లేచి నిలబడ్డాడు!

"మీ లోంచి ఒకరు మావెంట రండి! మీ ఏ.ఎస్.పి తప్ప ఎవరయినా సరే! ప్రతి అయిదు నిమిషాలకు మీరు ముద్దాయి అని మూర్ఖంగా నిర్వచించిన ఆ మహా పురుషుడి గురించి సమాచారం అందించే ఏర్పాటు చేస్తాము! ఇదే మన రాజీ."

ఎస్.పి గారికి తలదించుకు పోయినట్లుగా అయింది.

"డి.ఐ.జి. గారిని స్వయంగా కలిసి పరిస్థితి అంతా వివరిస్తాను. తప్పని సరి అయితే ఆయనని కోర్టులో హాజరుపరిచే బాధ్యత ప్రజలదే! మీరింక వెళ్ళిరండి!" ప్రజలు అందరూ తొలగి దారియిచ్చారు.

తన ఉద్యోగులతో కలిసి హడావుడిగా వెళ్ళిపోయారు ఎస్ పి!!

* * *

"నన్ను కాస్సేపు ఒంటరిగా ఉండనివ్వు. దయచేసి వెళ్ళిపో!" అన్నాడు శివరాజ్!

"కొద్ది గంటలలోనే మీలో చాలా మార్పు వచ్చింది. ఉద్యోగరీత్యా మీరు చేయవలసింది చేసేశారు. వ్యక్తి గతంగా జయాపజయాలు మీవి కావు. మీ రెందుకు ఇంతగా దిగులుపడి క్రుంగిపోవాలి!" అని అడిగింది తులసి!

అతనికి ఏకాంతాన్నివ్వటం మంచిది కాదని తీర్మానించుకుందామె!

తీసివేసిన లైట్స్ ఆన్ చేసి తిరిగి వచ్చి అతని ప్రక్కనే కూర్చుంది. కరాటే ప్రాక్టిసుతో మొరటు తేలిన అతని చేతుల్ని ఒడిలోకి తీసుకుంది.

"ఉద్యోగంలో చేరాక నేను మొదటిసారిగా ఓడిపోయాను" అన్నాడు.

"ఇది వ్యక్తిగత విషయం కాదు. అతని మీద మీకెలాంటి వైరభావము లేదు. మీ రెందుకింత పట్టుదలగా తీసుకున్నారు. మీరు కొంచెం ఎక్కువగా ప్రవర్తించగానే అనిపిస్తోంది!" భర్త కళ్ళలోకి చూచింది.

అతని కన్నులు ఆర్ద్రంగా ఉన్నాయి.

"ప్రతి ఒక్కరూ అన్నమాటలే నువ్వూ అంటున్నావా తులసీ!"

"వాస్తవంగా అనిపిస్తోంది కాబట్టే ఇంతమంది చెప్తున్నారని ఆలోచించ రాదా?"

"కోర్టు మాకు అప్పగించిన ముద్దాయిని మా అదుపులోకి తీసుకోవాలను కోవటం తప్పెలా అవుతుంది. అది నా డ్యూటీ! లేదంటే అసమర్ధత!"

"కాని ఈ సమస్య ప్రజల విశ్వాసాలతో ముడిపడి ఉంది. విధి నిర్వహణ కోసమే మీరు ఇదంతా చేశారని అందరూ నమ్ముతున్నారు.

అలాకాక కేసు మరో మలుపు తిరిగే అవకాశముంది.

కొంతమంది విశ్వాసాలను దెబ్బ కొట్టేందుకు మరి కొందరు చేయించిన కుట్రగా ప్రచారం జరిగితే మీరేం చేయగలరు.

"ప్రజలతో ముడిపడిన సమస్యగా మారిన తరువాత ఏ సమస్య అయినా వారి నాయకులకే వదిలివేయటం మంచిదనుకుంటాను".

"మీరింక ఈ విషయాన్ని మర్చిపోవటం మంచిది."

"పై అధికారుల వడ్డింపులు పూర్తి అయాక ఎలా మర్చిపోగలను"

"కేసు గురించే ఆలోచిస్తూ కూర్చుంటారా? నన్ను పట్టించుకోరా? మనకి క్రొత్తగా పెళ్ళయింది కదండీ! అవునూ నాకిప్పుడు సరైన ఆలోచన వచ్చింది. మన హనీమూన్ లో ఈగలా అడ్డుపడ్డాడనే మీకు అతని మీద ఇంతకోపం వచ్చింది! అవునా??" చిరునవ్వులు చిందిస్తూ భర్త ముఖంలోకి చూచింది.

ఆమె కవ్వింపులు అతని మూడ్ మార్చలేక పోయాయి.

"ద్రవిడ మహేశ్వరున్ని పట్టుకునే తీరాలంటారా?" బుంగమూతి పెట్టి అలిగినట్లు నటిస్తూ దూరంగా జరిగి కూర్చుంది.

"అధికారిగా కాకపోతే వ్యక్తిగత హోదాలో అతని అంతు తేల్చుకుంటాను. మొదటి ఓటమి నాదయినా తుది గెలుపు నాదే!"

"అతని దగ్గర ఆలౌకికమయిన శక్తి ఉన్నదని నేను నమ్ముతున్నాను"

"మీరంతా కట్టకట్టుకుని గంగలో కలవండి! నాకెందుకు?"

"ఆయనను సాధించాలని మీరు అంతగట్టిగా ఎందుకు అనుకుంటున్నారు?"

"ఇలాంటివాళ్ళు సమాజాన్ని మోసగించే ఛీటర్స్ అని నా దృఢ విశ్వాసం!"

"నమ్మకాలన్ని నిజాలు కావాలని లేదుకదా!"

"లేదు, కాని నా నమ్మకమో, అతని శక్తులో ఏదో ఒకటి అబద్ధం అని తేలేంతవరకూ నా పట్టుదలమాత్రం విడిచిపెట్టను.

"దాంపత్యం అంటే సర్దుబాటు అని మీరు చెప్పారుకదా! మొదటి పాఠం! మీరు ఇంతపట్టుదలగా ఉన్నారు కనుకే నా అభిప్రాయం మార్చుకుంటున్నాను. నేను మీతో సహకరిస్తాను సరేనా?"

"ఈ విషయంలో పిరికివాళ్ళు చేయగలిగింది ఏమీ ఉండదనుకుంటాను"

"మగవాళ్ళు మాత్రమే చేయగలరనుకుంటున్నారా? మీరు పోలీసు అధికారి కనుక మీ ఇన్ ఫార్మర్ గా పనిచేస్తాను. వెళ్ళి ఆ ద్రవిడ మాహేశ్వరుడు ఎక్కడున్నాడో తెలుసుకుంటాను. ధర్మపత్ని-అర్ధాంగి లాంటి గౌరవమయిన పదవులు అక్షరాలా దక్కించుకుంటాను"

"ఒకరు తెలుసుకోవటం, అందుకోసం శ్రమపడటం ఎందుకు? ప్రతి అయిదు నిముషాలకు కంట్రోల్ రూంకి వార్త వస్తుంది"

"ఆ కథలు వింటూ తృప్తి పడుతుంటారా? వారిచ్చే వార్తలు అసత్యాలయితే!" అని ధాటిగా ప్రశ్నించింది తులసి. అతని కనుబొమలు ముడిపడ్డాయి.

"మా ఉద్యోగి ఒకరు వారి వెంటే ఉంటారు!"

"అతనుకూడా భక్తుడైపోయి వారికి సహకరిస్తే?" అంటూ మరో మెలిక వేసింది తులసి! ఈ సారి శివరాజ్ నిలిచిపోయాడు.

"పోనీ వెళ్ళి ఆ విషయం తేల్చుకురా! నీ ప్రయత్నానికి ఫలితం శూన్యమే అయినా నేను కావాలనుకున్న ఏకాంతం దొరుకుతుంది కదా!" అన్నాడు.

"ఒక స్వీట్ ఇవ్వండి! తేలిపోయి వెళ్ళొస్తాను."

"స్వీట్ అంటే ముద్దా! నువ్వు పెట్టిన షరతుల ప్రకారం ప్రస్తుతం అలాంటివి గుర్తు చేసుకోకుండా ఉండటమే క్షేమం"

"అయితే నేనిస్తాను" అంటూనే స్వీట్ చాక్లెట్ అతని చెంపమీద అంటించి పైటకొంగుతో తుడిచి మరీ వెళ్ళిపోయింది తులసి.

ముందుగా ఈ విషయమై చర్చించటానికి మేడమ్ దగ్గరకు వెళ్ళింది.

"రా బేబి! చాలచాల వార్తలు వింటున్నాను"

"నమ్ముతున్నారా, కొట్టిపారేస్తున్నారా?"

"వాస్తవాలను నేను ధ్రువీకరించలేక పోవచ్చు! కాని భారతీయుల విశ్వాసాలు అర్థవంతమయినవే అని నమ్ముతాను. అంధవిశ్వాసాలు కొన్ని ఉంటాయికాని అవి తరుచు మారుతుంటాయి. మారకుండా అంచెలంచెలుగా వేల సంవత్సరాలు నిలిచిన నమ్మకాలు కదా మనవి?"

"ద్రవిడ మాహేశ్వరుడు పోలీసుల వలయంనించి అలా రెండుసార్లు వెళ్ళిపోయారు. ఇప్పుడాయన ఎక్కడున్నాడో తెలుసుకోవడం నావంతు అయింది. మీరేదైనా సలహా యివ్వండి మేడమ్!" అర్థించింది తులసి.

"సహజంగా అలాంటివాళ్ళు ఆశ్రమాలలోకాని, స్మశానాల మధ్య కాని తిరుగుతుంటారు. ఈ సమస్యలో నీవు తలదూర్చటం అంత మంచి పనికాదు. భార్యభర్తలు పరస్పరం సహకరించుకోవటం సహజమేకాని ఇలా మాత్రంకాదు" అని సలహా ఇచ్చిందామె.

ఎన్నడూ గురువుగారిమాట కాదనని తులసి ఈ విషయంలో మాత్రం వెనుకడుగు వేయలేదు. వెళ్ళితీరాలని పట్టుబట్టింది.

హనీమూన్ వాయిదా పడినందువల్ల కొంత అశాంతికి గురి అయినట్లు భావించిందామె! మనుషులు తామేచేస్తున్నామ్మనుకుంటారు. జరుగుతున్న సంఘటనలె జీవితాలను మలుపు తిప్పుతాయి. లేదా విధి!!

తులసి జీవితం తుఫాను రేగిన కడలిలా అల్లకల్లోలం అవుతుందని అనిపించిందామెకు. అయినా భీరువులా పారిపొమ్మని చెప్పటం తనకి తగనిపని! ఆమె శిష్యులను తల్లిలా ప్రేమిస్తుంది.

"మేడమ్! ఆయన ప్రవర్తన అంతా విచిత్రంగా కృతనంగా ఉండటానికి కారణం ఏమిటి?" అని ప్రశ్నించింది తులసి.

"కృతకంగా ఉన్నట్లు మనకు అన్పించినా అతనికి సహజమే!"

"రెండు సర్పాలను అలా జటాజూటంలో బంధించడం సాధ్యమే నంటారా? పాములు పెంపుడు జంతువులు కాదుగదా! చిలుకల్ని భుజం మీద కూర్చోపెట్టుకోవచ్చు! ఉడుతల్ని జేములో వేసుకు తిరగొచ్చు. కుక్కల్ని వెంటతిప్పుకోవచ్చు. కాని పాముల విషయం వేరు"

"అవునమ్మా! అవి పెంపుడు జంతువులు మాత్రంకాదు. అందుకే అతడు వాటిని పిలిచి రప్పించలేదు. నువ్వు సరిగా గుర్తుపెట్టుకున్నావా తల్లీ! మంత్రాలు చదివితే వాటంతట అవే పైకివచ్చినాయి.

సర్పసమ్మోహనవిద్య అతనికి వశమై ఉండవచ్చు!" అంటూ బదులిచ్చింది ప్రొఫెసర్! తులసి అమితాశ్చర్యంగా

చూసింది.

"సర్మసమ్మోహన విద్య అంటే ఏమిటి?"

"ఇప్పటికి లభించిన జువాలజీ శాస్త్రీయ విజ్ఞానంలో ఆ పదాన్ని నిర్వచించటానికి వీలుకాదమ్మా! పైగా అంతా అబద్ధమని కొట్టి పారవేయాల్సి వస్తుంది! కాని ప్రజల జీవితంలో మన దేశంలో ఎదురు అవుతున్న అనుభవాలు, వాస్తవాలు వేరుగా ఉన్నాయి.

ఆ పరిధిలోనే వాటిని నిర్వచించాలి!

శాస్త్రవిజ్ఞానం ఆధారంగా పాములు పగబడతాయని చెప్పటానికి వీలులేదు. కాని వాస్తవమయిన అనుభవాలు వేరుగా ఉంటాయి.

పాములు ఇరవై ఆరునుంచి ముప్పై సంవత్సరాల నించి మించి జీవించవు కాని తరతరాలు కులదేవతలుగా ఉన్న సర్పాల కథలు ముందుగా రాయలసీమ, ఆ తరువాత తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలలో కూడా ఎన్నో ఉదాహరణలున్నాయి వాటిని కాదనలేం!

ఇలా శాస్త్రీయవిజ్ఞానం, వాస్తవానుభవాలు చెరొకదారి అయినప్పుడు ప్రజలు అనుభవ మార్గాన్ని ఎన్నుకోవటం సహజం.

నేను క్లాసు తీసుకున్నప్పుడు నీకు యిచ్చే నోట్సువేరు.

కాని ఆత్మీయురాలుగా సలహా యిచ్చేపుడు మాత్రం సర్పసమ్మోహన విద్యలేదని నిన్ను నమ్మించేందుకు ప్రయత్నించలేను. ఇంక మీ దంపతులు ఇరువురూ ఆ విషయాన్ని మర్చిపోవటం మంచిది.

అసలు ఈ గొడవ అంతటికి కారణం ఏమిటంటావు?

అతడు భిక్షయాచించేందుకు వచ్చాడు! అది సహజం కదా! ఆ సందర్భంలో మీరు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారనేది వాళ్ళుచూడరు.

అడుక్కునేందుకు వచ్చినవాళ్ళు లేదనగానే వెళ్లిపోరు. హఠం వేసుకు కూర్చుంటారు. ఇది ప్రతీ భారతీయ గృహిణుల అనుభవం! అడుక్కోవటమనేది ఈ దేశంలో శతాబ్దాలుగా కాదు సహస్రాబ్దాలుపాటు ఒక వృత్తిగా చెలామణి అయింది అదే కారణం!

తాను ఒక సాధారణ భిక్షకుడు కాదని నిరూపించుకునేందుకు మంత్రాలు చదివి జటాజూటంలోంచి సర్పాలను రప్పించాడు. అప్పుడే అతన్ని గమనించి తృప్తి పరచి పంపేస్తే ఈ గొడవ అంతా ఉండదు.

కాని అలా జరగలేదు. మీ మమ్మీ స్పృహతప్పి పడిపోవటంతో కథ అంతా తారుమారు అయింది. అతడు జనంమధ్య శక్తి నిరూపించుకుని ఆరాధన పొందగలిగాడు. కనుక ఇంకా ఆ విషయాన్ని వదలి వేయటం మంచిది అని నేను అనుకుంటున్నాను"

"మేడమ్! మీరుచెప్పిన విషయాలన్నీ యదార్ధమయితే రెండు కారణాలవల్ల అతన్ని నేను కలుసుకోవాలి! ఒకటి ముందుగా క్షమాపణలు అర్ధించటం. రెండవది సర్పసమ్మోహన విద్యగురించి తెలుసుకోవటం. ఏమంటారు?" అని ప్రశ్నించింది తులసి!

"మొదటిది మానవత్వం. రెండోది వెంచర్!

విష్ యూ ఆల్ సక్సెస్! అంటూ తన ఆశీస్సులు అందించింది ప్రొఫెసర్ సమతాబెనర్జీ.

"మేడమ్! మీ ఆశీస్సులతో ముందుకే వెడుతున్నాను. విద్యా విషయాలలో నేను అన్వేషించాలనుకున్న సమస్య ఒక గృహిణిగా ఎదుర్కొవలసిన సమస్య రెండూ ఒకటే అయినాయి. ఫలితాంశం ఎలాంటిది అయినా నాకిప్పుడు వెనకడుగు వేయటానికి అవకాశంలేదు. వస్తాను మేడమ్!" అంటూ అడుగు ముందుకేసింది తులసి!

ఒక దృఢమయిన నిర్ణయంతో వెలుపలకు వచ్చిన తులసి పబ్లిక్ టెలిఫోన్ నించి తన ఫ్రండ్స్ కి వార్తలు అందించింది! మరో యిరవై నిముషాలకు కళ్యాణి, ఉమ అక్కడకు వచ్చి వాలిపోయారు.

"మనమిప్పుడు ఓ అడ్వంచర్ చేయాలోయ్?" అంది తులసి!

"క్రొత్తగా రిలీజ్ అయినా పిక్చర్ కి టికెట్స్ సంపాదించాలా?" అని ప్రశ్నించింది ఉమ. కళ్యాణి ఆసక్తిగా చూస్తోంది.

"అదేమీ కాదు. ద్రవిడ మాహేశ్వరయోగి ఎక్కడున్నాడో తెలుసుకోవాలి!"

"ఒకసారి చూచినప్పుడు ఒళ్ళంతా క్వెట్టింగ్ తో తడిపేసుకున్నావు కదా! గడగడ వణికిపోయావ్! ధైర్యం లేనిదానికి నీకెందుకీ రభస!"

"రభస కాదే అవుసరం! జరిగినా సంఘటనలో ఎవరి తప్పులేదు. అనవసరమయిన రభస జరిగింది. టెన్షన్ ఇంకా

సాగుతోంది! వెంటనే దీనికొక ముగింపు ఆలోచించాలి!"

"అవునులే! తప్పుచేసిన ఆఫీసర్ నీ భర్త కదా!?" అంది కళ్యాణి!

"తప్పేమిటే చింతకాయ్? అసలు గారడీ వాళ్ళని నిషేదించాలి" అంది ఉమ!

"మీరిలా మాట్లాడితే నేను ఒకర్తెనే వెళ్ళిపోతాను" తులసి బెదిరించింది!

"వొద్దులే! అంతపని చేయకు. ఆయన ఎక్కడుంటాడంటావు?"

"ఎవరి వెంట వెళ్ళాలో వారి దగ్గరే ఉండాలి. లేదంటే జనం తిరగని ఏకాంత ప్రదేశాలలో ఉండాలి!" తులసి వివరించింది.

"అలాంటి చోటు ఈ కాంక్రెట్ జంగిల్ లాంటి మహా నగరంలో ఎక్కడుంటాయి?

"స్మశానం ఒక్కటే కదా! తప్పని సారీ అయినప్పుడు తప్ప మిగిలిన సమయాలలో ఆ చోటుకి ఎవరు మాత్రం వెడతారు? పైగా చీకటి పడుతోంది!"

"ఇప్పుడు మనం వెడుతున్నాం కదా! నీతో స్నేహం చేయటమంటే కొరివితో తల గోక్కోవటమే! చేతులు కాల్చుకున్నవాళ్ళు ఆకులు పట్టుకోక తప్పదులే పద! పోదాం!" అంటూ ముందు తనే దారితీసింది ఉమ.

ముందుగా కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్ళి నగరంలోని స్మశానాల గురించిన వివరాలు సేకరించారు. ఒక ప్రాంతాన్ని ఎంపిక చేశారు.

అక్కడ జన సంచారం చాల తక్కువగా ఉంది. మారుమూల ప్రాంతం!

స్మశానం లోపల పొదలు, పుట్టలు, చెట్లు బాగా పెరిగిపోయి అరణ్యంలాగ కన్పిస్తున్నాయి. కాలుమోపాలంటేనే భయంగా ఉంది.

ఒక మూలగా చితి వెలుగుతోంది. పొదల మధ్యనించి సమాధి రాళ్ళు తొంగి చూస్తున్నాయి. అర్ధంకాని విచిత్ర కీటకాల రొద విన్పిస్తోంది.

"ఇంతవరకూ వచ్చాం బాగానే ఉంది. ఇప్పుడేం చెయ్యాలి?"

"యోగి ఈ ప్రాంతాలలో ఉన్నాడేమో వెతికి చూడాలి!"

"నాకు భయంగా ఉందే! నేను లోపలికి రాను" అంది కళ్యాణి! అప్పటికే ఆమె గుండె దడ తాజ్ ఎక్స్ ప్రెస్ వేగాన్ని దాటిపోయింది.

"అయితే మేమిద్దరమే లోపలకు వెడతాం. నువ్వు ఇక్కడే ఉండు!"

"ఇందుకన్న మాట నువ్వొచ్చింది" విసుక్కుంది ఉమ.

"అందరమూ కలసి వెడితే రహస్యం బయట పడొచ్చు. మీరు ఇక్కడే ఉండండి! నేను ఒక్కర్తిని వెళ్ళి చూసొస్తాను."

"నీ కసలు భయం లేదన్న మాట?"

"భయంగానే ఉంటుంది కాని వెనకడుగు మాత్రం వెయ్యను."

"బ్యాటరీ లైటు తీసుకు రావలసింది."

"రహస్యంగా వెళ్ళి రావాలని కదా అనుకున్నాం?" అంటూ మరింక వారి సమాధానం కోసం ఎదురు చూడకుండా లోపలకు నడచింది. మాటలు పెంచినకొద్దీ అనుమానాలు పెరుగుతుంటాయి.

కొయ్య పలకలతో నిర్మించిన గేటు మీద చేయి వెయ్యగానే అది కిర్రుమంటూ తెరుచుకుంది. అడుగు పెడుతూనే దారికి రెండు వంకలా గచ్చ పొదలున్నాయి. ప్రథమంలో దారి సరిగా కన్పించలేదు.

కళ్ళు చీకటికి అలవాటు పడ్డాక పరిసరాలు గుర్తించేందుకు వీలు అవుతున్నాయి. కాలి క్రింద నలుగుతున్న ఎండుటాకులు కరకరమని శబ్దం చేస్తున్నాయి. సమాధుల మీద ఆలనా పాలనా లేక పొదలు పెరిగాయి. గాలి గుబుర్ల మధ్యకు వెడుతూ బయట పడుతూ విచిత్రమయిన శబ్దం చేస్తోంది. పెద్ద వృక్షాలు తలలు ఊగిస్తున్నాయి.

సాయం సమయానికి మంటలారిపోయి నివురుకప్పిన చితిమీది బూడిద గాలికి లేచిపోయి చంద్ర నిప్పు కన్పిస్తోంది భయంకరంగా! తులసి దడదడలాడే గుండెలతో అడుగు ముందుకేస్తోంది.

ఆమె కదలికల్ని పసిగట్టి కొమ్మల మీద తల క్రిందులుగా వ్రేలాడుతున్న బెగ్గురు పక్షులు రెక్కలు టపటప లాడిందుకుంటూ లేచి మరో చెట్టు మీదికి వెడుతున్నాయి.

మరి కొన్ని బెగ్గురు పక్షులు తల క్రిందులుగా తపస్సుచేసే మౌనుల్లాగా వ్రేలాడుతూ అలానే ఉన్నాయి.

గుబుర్లలోంచి గుడ్లగూబల కళ్ళు మెర్క్యురి దీపాలా వెలుగుతున్నాయి. మరికొంత ముందుకు పోయాక చితిమీది గాలి పొగ నేరుగా ముక్కు పుటాలకు సోకి ఘాటు వాసన కలిగించింది.

చల్లనిగాలి వీస్తున్నా చెమటలు క్రమ్మి ఒళ్ళంతా తడిసింది.

భయపడుతూ అడుగులు ముందుకే వేస్తోంది!

ఒక చోటున నిలిచిపోయి పరిసరాలను పరిశీలించింది. దగ్గరలో చిన్న పాక కన్పించింది. అక్కడ స్మశానం తాలూకు వ్యక్తులు ఎవరో ఒకరు ఉండేందుకు అవకాశముంది!

అదే నిజమయితే కష్టం తీరిపోయినట్లే! ద్రవిడ మాహేశ్వరుడి వివరాలు తెలుస్తాయి. దగ్గరగా వెళ్ళి నిశ్శబ్దంగా నిలబడి చూచింది.

చాల చిన్న పాక! తాటియాకులు కప్పి ఉన్నాయి.

చిన్న తలుపు దగ్గరగా వేసి ఉంది. లోపల కాస్తంత వెలుతురు కూడా ఉన్న జాడలు కన్పిస్తున్నాయి. బహుశా ఎవరో ఉండి ఉండాలి. చిన్న దీపం వెలిగించి ఉంటారు అనుకుంది తులసి!

వారిని పిలవటం కన్నా వెళ్ళి చూడటమే మంచిది అని నిర్ణయించుకుంది. చేయివేయగానే వెదురు చీలికల తలుపు కిర్రుమంటు తెరుచుకుంది.

ఉద్విగ్నమయిన భయంకర క్షణాలు!

భయం గుండెల్ని పిండుతున్నా అడుగు ముందుకే వేసింది తులసి!

ఎదురుగా కనిపించిన దృశ్యం చూచి ఒళ్ళు ఝల్లుమంది.

ద్రవిడమాహేశ్వర యోగి ఎప్పటిలాగే పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు. మేడమ్ ఊహించినదంతా నిజం!

కనురెప్పలు మూసి ఉన్నాయి. చిన్న దీపంలోంచి ఎర్రని వెలుతురు ఆయన ముఖం నీడలుగా తారాడుతోంది.

అంత సేపూ జటా జూటంలోంచి తన కోసమే తొంగి చూస్తున్నదా అన్నట్లున్న కృష్ణ సర్పం బుస్సుమని లేచింది. అది పడగవిప్పి ఆడుతోంది. ఒంటరి ఆడపిల్లకు గుండెలు పిండుతున్నట్లుగా అయింది.

నల్లని త్రాచు జటాజూటాన్ని వదలి యోగి మెడమీదుగా వెనుక నించి వక్షస్సు మీదికి తిరిగి వచ్చింది. నడుముని చుట్టి నేలమీదికి పాకుతూ వచ్చి పడగ విప్పి ఇంతెత్తున లేచి తులసి ఎదుట నిలిచింది. అడుగు కదిపేందుకు దమ్ము చాలలేదు. ఊపిరి పీల్చేందుకు శక్తిలేదు.

శరీరం వెన్నపూస ముద్దలా కరిగి పోతున్నట్లు అనిపించింది!

పాతిన మేకులా, రాతిబొమ్మలా అయిపోయింది తులసి!

ద్రవిడ మాహేశ్వరుడి ముందునిలిచిన కృష్ణ సర్పం మెడను వొంకలుత్రిప్పి తొలిచూలాలు యాతన పడుతున్నట్లు కదిలింది! కొద్ది సేపటికి దాని శరీర భాగాలు నెమలిపింఛాన్ని విప్పినట్లు పురివిప్పటం ప్రారంభించినాయి! ఆకృతులు రూపుదిద్దుకున్నాయి.

ఒక అపూర్వ లావణ్యరాసిగా మారిపోయింది!

శ్వేతదంత కాంతులు చిమ్మేలా అందమయిన చిరునవ్వు నవ్విందామె!

"నీ కోసమే ఎదురు చూస్తున్నాను!" కోటి వీణల మీద శత కోటి రాగాలు స్పృతులు సవరించు కుంటున్న అనుభవం కలిగింది ఆ స్వరంలో!

"ఎవరు నువ్వు? నన్నేంచేస్తావు?" అని ప్రశ్నించింది తులసి భయంగా!

"ఏమీ చేయను. యాచిస్తాను. పతిభిక్ష అర్ధిస్తాను" అందామె కొంగు చాచి!

"నేను పతిభిక్ష పెట్టటం ఏమిటి?" అంది విస్మయంగా.

"ఈ నాటి నీ పతిదేవుడే ఒకనాటి నాపతిదేవుడు! నా గజాతి మగువలకు మనసుపడ్డ మగవాడే ఎన్ని జన్మలకయినా! నాపతి దేవుడి కౌగిలింతలలో పులకింతలవుతున్న ఓనారీ! ధన్యురాలవు. నా సోదరివి! అంటూ అడుగు ముందుకేసి గాఢంగా కౌగిలించుకుంది సర్పసుందరి!

ఊపిరాడలేదు. ఉలికిపడి లేచి కూర్చుంది "నో నో" అని అరుస్తోంది తులసి!

"పీడకల వచ్చిందా తులసీ. మంచి నీరు త్రాగి పడుకో!" అంటున్నాడు శివరాజ్!!

## 5

"అర్ధరాత్రి ఎందుకలా కేకలు పెట్టావు? మేడ మీదికి వచ్చి చూద్దామనుకున్నాను! అబ్బాయి అపార్థం చేసుకుంటాడనిపించి ఆగిపోయాను" అంది తల్లి కాఫీ కప్పులలో సర్ది తులసి చేతికి అందిస్తూ!

కాఫీ కప్పులు అందుకుని పైకి వచ్చింది తులసి!

అప్పటికే శివరాజ్ డ్రసప్ అవుతూ కన్పించాడు. బ్రతిమాలి బుజ్జగించి నిద్రలేపాలి కాబోలు అనుకుంటూ గదిలో కాలుపెట్టిన తులసి ఆ దృశ్యం చూచి నిర్ఘాంత పడిపోయింది.

"ఆగిపోయావేం? తులసిజలం అందించుకో!"

"ఈరోజు పెందలాడే తయారై పోయారేమిటి?"

"ఒక్క క్షణం ఆలస్యమయినా క్రిమినల్స్ దొరకరు! మన కోసం వాళ్ళుండరు. వాళ్ళ కోసమే మనం పరుగులు తీయాలి?" కాఫీ త్రాగటం ముగించాడు.

"రాత్రి మీరు మేలుకునే ఉన్నారా? సంశయంగా సిగ్గుపడుతూ అడిగింది.

"హాయిగా విద్రపోయాను. నీ కలవరింతలు విన్నాకే లేచాను"

"ఏమని కలవరించాను. మీకు గుర్తుందా?"

"నిద్రపోతూ అనే మాటలకు విలువేమిటి? గుర్తెందుకు పెట్టుకోవాలి?"

"కొన్ని కలలు నిజమవుతాయంటారు ముఖ్యంగా తెల్లవారుఝాము వచ్చినవి!"

"ఇలాంటి పిచ్చి నమ్మకాలు మీ మమ్మీతోపాటు నీకూ వంట పట్టాయన్నమాట?"

"కాదండీ ఇవాల్టి కల మాత్రం భయం పుట్టించింది!" గుండీలు సవరించింది..

"సైన్సు స్టూడెంట్ వి. ఇలా మాట్లాడటం ఏమాత్రం బాగోలేదు" బెల్టు బిగించేశాడు.

"మీరు తొందరపడి పోతున్నారు. ఒక్క క్షణం నిలబడి నామాటలు వింటారా!"

క్యాప్ అతని చేతులకు అందించి దగ్గరగా నిలబడింది.

"చెప్పా కదా! క్రిమినల్స్ ఒక్కక్షణం అయినా మాకోసం చూడరు. త్వరగా చెప్పాలి" అంటూ హడావుడిగా స్టిక్ అందుకుని గాగుల్స్ తగిలించుకున్నాడు.

"సరే చెప్పు వింటాను" అన్నాడు నింపాదిగా! అతని భుజంమీద చెంపలానించి కన్నులు మూసుకుంది తులసి!

"ఇవాళ నాకు చాల భయంగా ఉంది!"

"పోలీసు భార్యకి భయమేమిటోయ్? కారణం ఉండాలిగా?"

"ఏ మాటలయితే కలలో కూడా వినకూడదనుకున్నానో ఆ మాటలే విన్నాను. అదంతా నిజమే అయితే నేను చచ్చిపోతానండీ!"

"కలలు నిజాలెందుకవుతాయి పిచ్చిదానా?"

"అయినా నాకు భయంగానే ఉంది!"

"విషయమేమి జరిగిందో వివరించు"

"ద్రవిడ మాహేశ్వరుడి జటా జూటంలోంచి కృష్ణసర్పం క్రిందికి దిగి వచ్చి చాలా అందమయిన అమ్మాయిగా మారిపోయిందండీ!"

"ఇలలో జరగనివే కదా కలలో కన్పిస్తాయి. తరువాత?"

"నేను ఆమెకు సోదరిని అవుతానట!"

"తమాషాగా ఉందోయ్ వింటానికి!"

"మీరు ఆమెకు పూర్వజన్మలో భర్తఅట! మిమ్మల్ని తీసుకుపోతుందట!" అంతవరకే చెప్పగలిగింది. ఆ తరువాత మాటలు పెగలలేదు.

బావురుమని ఏడ్చేసింది తులసి!

భుజంమీదినించి చేతులవరకు పోలీస్ షర్ట్ తడిచిపోయింది.

"హమ్మయ్య! అర్థమయింది. అదన్నమాట నీ బాధ! చాల చదువుకున్నావు కాని పాములు కలలో ఎందుకు కన్పిస్తాయో తెలుసా నీకు?"

"ఇలా భయపెట్టేందుకేనేమో అనుకుంటున్నానండీ!"

"కాదు! సెక్స్ పరమయిన కోరికలు తీరనప్పుడు అవి సర్పాల్లా కలల్లో దర్సనమిస్తాయని నిర్వచించాడు కలలమేధావి సిగ్మండ్ ఫ్రాయిడ్!"

"ఏ సంభాషణ ప్రారంభించినా అక్కడికే తీసుకుపోతారు. ఛీ ఛీ! మిమ్మల్ని అసలు కదిలించకూడదు. వెళ్ళిరండి మహానుభావా! ఒకవేళ ఆ సర్పసుందరి ఆహ్వానిస్తే ఆమెతో కలసి వెళ్ళిపోకండేం?"

"భర్తని నమ్మలేకపోవటం అది ఆడవాళ్ళ బలహీనత!"

ఎ.ఎస్.పి హడావుడిగా స్టిక్ ఊగించుకుంటూ వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిపోగానే మేడమీదికి వచ్చింది తల్లి!

దిండులో తల దూర్చిన తులసిని తట్టిలేపింది.

"ఎందుకేడుస్తున్నావు?" వాచిపోయి ఎర్రపడిన కళ్ళలోకి చూస్తూ అడిగింది.

"ఏమీ లేదమ్మా! ఎప్పుడేడ్చాను?"

"ఏమీ లేకపోవటం ఏమిటి! కళ్ళు అలా వాచిపోయి ఉంటేనూ!"

"ఎందుకమ్మా గొడవచేస్తావు. ఏమీ లేదన్నానుకదా!"

"కన్నతల్లివయినా కనుమరుగు ఉండాలనేది ఈ విషయంలో కాదు, అసలు జరిగిందేమిటో నాకు చెప్పమ్మా!" అని గడ్డం పుచ్చుకుని బ్రతిమాలింది.

రాత్రి వచ్చిన కల భర్తతో జరిగినా సంభాషణ వివరించింది తులసి!

"దేవుడులాంటి భర్త దొరికాడమ్మా నీకు కాని మీ హనీమూన్ కి అంతరాయం కలిగిస్తూ ఆ యోగి రావటం విడ్డూరంగా అనిపిస్తోంది. ఈ గ్రంథం ఇంతటితో అయిపోయిందా ఇంకా ఉందా అనే విషయమే బాధిస్తోంది.

నీ భవిష్యత్తేమిటో ఈ పూట తేలిపోతుందిలే భయపడకు క్రిందికి వెడదాంపద! చెప్తాను. అంది తల్లి.

"ఏం చేయబోతున్నావేమిటి?" అని అడిగింది తులసి.

"సోదిచెప్పే దాసరాణి సింగమ్మకి కబురుపెట్టాను."

"ఆమె ఎవరు? అలాంటి వాళ్ళు ఏవో లేనిపోని కల్లబొల్లి కబుర్లు చెప్పి ఆడవాళ్ళని భయపెట్టేస్తుంటారు. నాకిలాంటివి యిష్టం ఉండదు."

"తప్పమ్మా! అలా అనకూడదు. దాసరాణి సింగమ్మ చేయి చూచి చెప్తే తిరుగుండదు. ఆమె పెద్దాపురం పేరంటాలుకి నమ్మిన భక్తురాలు.

వాక్శుద్ధి కలిగిన సాదెమ్మ అని అందరూ చెప్పుకుంటారు. క్రొత్తగా పెళ్ళయిన వాళ్ళందరూ ఆమె దగ్గరే చేయి చూపించుకుంటారు.

మూడు పిడికెళ్ళు బియ్యం చిటికెడు నువ్వులు, పసుపు, కుంకుమ, గాజులు ఇస్తే చాలమ్మా ఉన్నది ఉన్నట్టుగా చెబుతుంది!

గతంలో ఆమె చేయి చూచి మాటలు అక్షరాల జరిగాయి. వాళ్ళంతా ఆమెను పెద్దాపురం పేరంటాలుకి అపరావతారంగానే కొలుచుకుంటున్నారమ్మా! నీకు ఆసక్తిలేకపోయినా నా తృప్తికోసం చేయి చూపించుకో!

కారు పంపించాను. ఆమె మరి కాస్సేపటికి వస్తుంది.

ముఖం తుడుచుకో! ముఖం కందిపోయి కన్పిస్తోంది. స్నానంచేసి బొట్టు పెట్టుకుని చీరమార్చుకుని క్రిందికిరా త్వరగా!" అంటూ బాత్ రూం లోకి నడిపించి మరీ క్రిందికిదిగి వెళ్ళిపోయింది తల్లి!

అలంకరణ ముగించి మెట్లు దిగుతూ ఉండగా యింటిముందు కారు ఆగింది. తల్లి తనకయితే చెప్పింది ఇప్పుడే కాని ఇరుగు పొరుగు వారందరికి ముందుగానే చెప్పి ఉండాలి! వారంతా ఈ విడ్డూరం చూడటానికి అమితాసక్తితో అలంకరణలు చేసుకుని మరీ వచ్చారు.

కొంతమంది అతివలు కారుదిగుతున్న దాసరాణి సింగమ్మకి హారతి ఇచ్చి మరీ స్వాగతం పలుకుతున్నారు. ఆమె గురించి వారి మధ్య ఇంతకు మునుపే చాల ప్రచారం జరిగింది కాబోలు ఎంతో భక్తి ప్రపత్తులు ప్రదర్శిస్తున్నారు ఆమెపట్ల!

వారిలో ఆమెపట్ల ఆసక్తి మాత్రమే కాదు ఏదో ఆవేశం ఉద్విగ్నతలాంటివి కనిపిస్తున్నాయి. సోదిచెప్పే వారంటే పల్లెసీమల్లో భిక్షకుల స్థాయిలో ఉంటారని ఊహించుకుంది తులసి!

వారిలో ఇంత ఘనమయిన వారుంటారని ఇప్పుడే తెలుసుకుంది చూస్తోంది.

తల్లి తాను కట్టుకునే చీరల్ని ఖరీదయిన వాటిని క్రొత్తవాటిని కార్పెట్ మీద పరచి దాసరాణి సింగమ్మని వాటిమీద నడిపించింది.

ఆమె కట్టూబొట్టూ చిత్రంగా ఉండటాన్ని గమనిస్తోంది తులసి.

కాసె బిగించిన గోచి పోసి చీరకట్టుకుంది సింగమ్మ!

ధోవతి కట్టుకుంటే కుచ్చిళ్ళు ముందు ప్రక్క వ్రేలాడినట్లు ఆమె చీరకుచ్చిళ్ళు ముందు ప్రక్క వ్రేలాడుతున్నాయి. ఎడకాలి చుట్టూ అంచులు కనిపించేలా బిగువుగా తిరిగివచ్చిన చీర నడుం దగ్గర దోపుకుంది. పిరుదులు ఉన్నంతగా కనిపిస్తున్నాయి.

మ్రుక్కున వెడల్పాటి ముక్కెర చివరి తాపిన ముత్యం గుల్ గుల్ మంటూ తల త్రిప్పినప్పుడల్లా కదలాడుతోంది. ఒక చంకలో ఈత చివుళ్ళు ఎండించి అల్లిన బుట్ట పట్టుకుంది.

మరో చేతిలో తంబురా లాంటి సొరకాయడొక్కు! బుట్టలో పసుపు కుంకుమల మధ్య లక్కతో తయారు చేసిన అమ్మవారి బొమ్మ ఒకటుంది. అదే పెద్దాపురం పేరంటాలు కాబోలు!

మోచేతులు ముంజేతులకు వెండి కడియాలున్నాయి.

కాళ్ళు అనాచ్ఛాదితంగా మొరటుగా ఉన్నాయి. చీలమండల దగ్గర నాగపట్టాలున్నాయి. కాలి వ్రేళ్ళకు మెట్టెలు కాని ఒంటిచుట్టు చిటికెలు కానిలేనేలేవు.

దాసరాణి సింగమ్మ నేరుగా వచ్చి సోఫాలు కుర్చీలు అన్ని విడిచిపెట్టి కటిక నేలమీద చతికిలపడింది. అమ్మ వారున్న బుట్టణి ముందుంచుకుని తంబురాలాంటి తీగలు బిగించిన సొరకాయ డొల్ల వాయిద్య విశేషాన్ని చేతులలోకి తీసుకుంది.

"టింగ్....టింగ్...టింగ్...."మని మీటటం అప్పుడే ప్రారంభించింది.

ఆమె అలా నేలమీద కూర్చోవటం ఆడవారందరికి నొప్పి కలిగించింది. ఎంతో శ్రద్ధాభక్తులతో ఆమె చుట్టూ కూర్చున్నారు.

ఈత చివుళ్ళ బుట్టలోంచి ఒక తాటియాకు చదరు తీసి దానిమీద లక్కతో తయారు చేసిన అమ్మవారి బొమ్మ నుంచింది దాసరాలు.

"దయచేయవే దొరసానీ. అమ్మ ముందు నిక్కి కూచోరాదు. కట్టెదుట నేలమీద వేంచేసి అమ్మవారి బొమ్మని కళ్ళకద్దుకో! పేరంటాలు ప్రసన్నురాలయితే సౌభాగ్యం కలిగేను. కడుపు పండేను. కనికరించేను మా తల్లి మంగళ గౌరవమ్మ అపరావతారమే!

కనకదుర్గమ్మ కరుణావతారమే. రారా!!" అంటూ తులసిని ఆహ్వానించింది దాసరాణి సింగమ్మ! అప్పటికే దాసరాలు ముఖంలోకి తెచ్చుకాబోతున్న దేవీ ఆవేశం తాలూకు ఛాయలు ప్రసన్నమయినాయి.

మంత్ర ముగ్ధలా మవునంగాలేచి వచ్చి ఆమె ముందు బాసికంపట్టు వేసుకుని బుద్దిమంతురాల్లా కూర్చుంది తులసి!

"బుద్ధిమంతురాలివే బిడ్డా! జాతకంలో వక్రగతులుండాయే కాని చల్లని తల్లివై వర్ధిల్లుతావు సౌభాగ్యవత్యా వెళ్ళిపోతావు.

అమ్మమీద మనసెట్టు! తల్లి పాదాలమీద చెయ్యెట్టు! దృష్టి ఈ ముక్కుముక్కెరమీద నిలబెట్టుకో!
ధన్యురాలవుతావు, దయగల తల్లి మా పేరంటాలు ఆశీస్సులు పొందుతావు. హిమ్ మ్...." అంటూ సవరించిన సొరకాయ డొల్ల వాయిద్యంలోని శృతికి అనుగుణంగా రాగంతీయడం ప్రారంభించింది దాసరాలు.

ఎవరికీ వారే ముగ్ధులైపోయి చూస్తున్నారు.

"కంచి కామాక్షి పలకవే!!

మధుర మీనాక్షి పలకవే!!

కొండవీటి కోటీశ్వరుడా పలుకు.

బెజవాడ కనక దుర్గమ్మ పలకవే!" అంటూ రాగానికి అనుశ్రుతిగా ఆవాహనలు ప్రార్ధనలు ప్రారంభించింది.

అమ్మవారి పాదాలమీద చేతులుంచి, ముక్కు ముక్కెరమీదదృష్టి నిలిపి ఏకాగ్రహమయిన మనసుతో వింటోంది తులసి.

"అమ్మవారి ముందు మూడు పిడికిళ్ళు బియ్యం పెట్టుకో ఒడి నిండుతాది.

చిటికెడు నువ్వులిచ్చుకో నీ యింట చిరునవ్వులు పండుతాయి!

ముత్యమంత పసుపు ముద్ద ఎట్టవే కట్టుకున్నాడు మురిపాలు కురుస్తాడు.

పట్టెడు కుంకుమ అమ్మకియ్యవే పుట్టెడు సౌభాగ్యమై నీ బతుకు పండుతాది!

పట్టెడు గాజులిచ్చుకో బతుకంతా బారసాలౌది నా తల్లి" అంటూ కట్నాలు అడిగింది దాసరాలు! తల్లి అప్పటికే అన్ని సిద్ధంగా ఉంచిన వెండి పళ్ళెం తెచ్చి ఆమె ముందుంచింది.

ఉద్వేగంతో వూగిపోతూ పూనకం వచ్చినదానిలా అయింది సింగమ్మ. తానే పెద్దాపురం పేరంటాలు దైవ స్వరూపురాలు అయిపోయినట్లు గీతాలాపనగా మాట్లాడటం లాంటి పాట ప్రారంభించింది.

ఆమె ముక్కున తాపిన ముంగిర వంక జూస్తూ ఒక్కొక్క వస్తువునూ అమ్మవారి ముందు చదరుమీద అమర్చుతోంది తులసి.

పూర్తిగా ఆవేశం నించి అమ్మవారి అపరావతారమయింది దాసరాణి సింగమ్మ!

ఆమె కంఠం నించి ఉరుములు కురుస్తున్నట్లు వాణి పలుకుతోంది.

హుం....హుమ్...హుమ్మా....హుమ్మా....?! ఓయమ్మ! చిన్న తనమంతా నా తల్లి చిరు నవ్వు కురిపించి, చదువులతల్లి కన్న వాళ్ళని మురిపించి ఇంతకాలం ఎదిగి వచ్చావే నా తల్లి!

ఓ నా తల్లి! జరిగింది మహబాగు!

తల్లి నీడలో ఎదిగావు! ఆ తల్లి దయవల్లనే ఇందాక సల్లగున్నావు" అంటూ గ్రుక్క త్రిప్పుకోకుండా చెప్పింది దాసరాలు!

"జరిగిపోయిన దాన్ని చెప్పటం కాదే తల్లి! జరగాల్సిన నాటకం నువ్వు నడిపించేదేకదా! ఎలా జరిపిస్తావో అది చెప్పు!" అనగలిగింది.

"ముందు చూపు కలిగిందా ముసలిదానా! అయితే చెప్తా విను!"

"మనుష్యమాత్రులం కదా తల్లీ! ముందు సంగతి మాకేం తెలుస్తుంది! చెప్పు వింటాం"

"చిన్నారి వినవే చెబుతాను భవిష్యవాణి!

నన్ను గుర్తించినావా వచ్చాను వచ్చాను!! ఆకాశ మార్గాన దూరమంతా తరలించుకొచ్చాను! నన్ను గుర్తించవే! ఆది శక్తి అవతారాన్ని పేరంటాలుని పిలవగా వచ్చాను! నీ బ్రతుకు ఏమవుద్దో చెబుతాను విను! చెవ్వెట్టి యినుకో! మనసెట్టి తెలుసుకో!

సలసల కాగుతున్న సమురు బాయే నీ బండారం! నేను దయతలచి చెబుతున్నా ఏ దేవతా నిన్ను దయతలచదు కాదలచదు" అంటూ ముందుంచిన తులసి చేయిని దూరంగా విసిరికొట్టింది దాసరాలు!

ఈ మాట విని తులసి తల్లిలో దుఃఖావేశం కట్టలు త్రెంచుకుంది. నోటికి అడ్డుగా వుంచిన చీర కొంగు తొలగించి అతగోడు బాలగోడుగా రోదనం ప్రారంభించింది. కర్పూరకదండాన్ని వెలిగించి హారతి ఇచ్చింది వృద్ధురాలు! తల్లి సాగిలపడి ఆమె ముందు మ్రొక్కింది.

"జరుగనున్న కష్టాలు వల్లించావు. అసలు కథేమిటో కారణమేమిటో చెప్పలేదు. ఆ కష్టాలు ఎలా తొలగిపోతాయో కూడా నువ్వే చెప్పు" అంటూ సోది వినటంతో అలవాటయిన సమయస్ఫూర్తితో అడిగింది వృద్ధురాలు!

దాసరాలిమీద అమ్మవారి ఆవేశం ఇంకా తగ్గలేదు.

"చెప్పేందుకే వచ్చాను. చెవులెట్టి యినుకోండి! నా మాటలకు నరదోషం లేదని తెలుసుకోండి!

ఈ చిన్నారికి సర్పదోషం తగిలింది తల్లులారో.... నా తల్లు లారో!!

అట్టిట్టు చేస్తాది! సర్పదోషం ఆరళ్ళు పెడతాది తల్లులారో....నా తల్లులారో!!

బతుకంత నిప్పులు చెరుగుతాదే!నాగదోషం నా బిడ్డలారా!!

నా కళ్ళు గట్టిగా పట్టుకో! నా శక్తినమ్ముకో! నా రూపాన్ని మనసులో మలచుకో! నన్నే నమ్ముకుంటే తోడుగా వుంటాను. నీడగా ఉంటాను.

కాలువలయే కన్నీటికి చెలియలికట్టలు కట్టిస్తాను.
నీ బతుకు కిన్నెరసానిపాట కావాలంటే నా నీడ వుండాలే గువ్వ! అర్ధమయిందా?" అంటూ చెప్పటం ముగించింది.

దాసరాణి ఈ మాటలు అన్న తరువాత కన్నులువిప్పి చూసింది.

"అంతా కన్నీరు పెడతారెందుకు? పొర్లు మాటలు దొర్లాయా?" ఆమెలోంచి భవిష్యవాణి పలికించిన పెద్దాపురం పేరంటాల దేవీ ఆవేశం అదృశ్యమయిపోయింది. దాసరాలు మామూలు స్త్రీలా కనిపించింది వారందరికీ.

అందరికీ కనిపించిన అమ్మవారు అదృశ్యమయిన భావన కలిగింది.

"నిన్ను నమ్ముకోవాలంటే ఏం చేయాలి తల్లీ!" అని వివరం అడిగింది వృద్ధురాలు.

"అమ్మ వచ్చింది. వెళ్ళిపోయింది. ఇంకెవర్ని అడుగుతావు. నాకేం తెలుసు" అంది దాసరాలు.

లక్కతో చేసిన పేరంటాలు విగ్రహం ముందు మ్రొక్కి లేచింది తులసి!

క్రిందపడి దొర్లి రోదిస్తున్న తల్లిని తీసుకువచ్చి సోఫాలో కూర్చోపెట్టింది. ఫ్రిజ్ లోంచి వాటర్ బాటిల్ అందించి ఆమె కళ్ళు తుడిచింది.

కన్నతల్లి దుఃఖోపశమనానికి చాతనయినంత ప్రయత్నాలు చేసింది.

పేరంటాలు ఆవేశించినపుడు దాసరాలు చెప్పిన మాటలన్నింటిని తిరిగి ఆమె ముందు వల్లించి వివరాలు అడగటం ప్రారంభించారు స్త్రీలు.

"అమ్మాయికి నాగదోషం తగిలింది. నాగదేవతల చూపు నరులమీద పడరాదు. పడిన తరువాత ఫలితాలను

అనుభవించక తప్పదు.

అమ్మను నమ్ముకుంటే అశుభాలన్నీ తొలగిపోతాయి. అంటూ తంబురా వంటి సొరకాయ డొల్లని ప్రక్కనుంచేసి చదరు మీది లక్కబొమ్మని బుట్టలో పెట్టుకుంది.

"నాగదోషం ఎందుకు తగుల్తుంది? ఆ దోషం ఎలాపోతుంది?" అని అడిగింది వృద్ధురాలు.

"నరుడి మీద నాగదృష్టి పడటానికి కారణాలు చాల ఉంటాయమ్మ! కుబుసం విడుస్తున్న వేళ, గ్రుడ్లు పెడుతున్న వేళ నాగులను దాటి నడిచివెళ్ళరాదు. జంటనాగుల్ని విడదీయరాదు.

ఆశ్లేష అనేది నాగ నక్షత్రం! ఆ నక్షత్రం ఆకాశంలో పొడుస్తున్న వేళ నాగులన్నీ నమస్కరించుకునేందుకు బయట తారాడుతుంటాయి. ఆ సమయంలో వాటికి అపచారం చేయకూడదు.

భూమిలోపల, వెలుపల, ఆకాశంలో నాగావీదులు ఉంటాయి! ఆ ఆ వీధులలో నాగులు సంచారం చేస్తున్నప్పుడే వాటి ఏకాగ్రతకి భంగం కలిగించినా నాగదోషం అంటుకుంటుంది.

వారి ప్రియులు కాని, ప్రియురాళ్ళు కాని, బిడ్డలు కాని నరుల అధీనంలో పెట్టుకున్నప్పుడు వాటి దృష్టి నరుల మీదికి వస్తుంది. అది కూడ నాగదోషమే!"

అంటూ నాగదోషం వివరాలను చెప్పింది దాసరాలు.

ఆమె చెప్పిన చివరి మాటలు తులసి దృష్టిని బాగా ఆకర్షించాయి.

"నాగుల జంటల్ని విడదీయటం జరగొచ్చు! కాని వాటి ప్రియులు మన దగ్గరెందుకుంటారు?" అని దాసరాలుని ప్రశ్నించిందామె!

"రేఖ వక్రిస్తే పూల రేకులు కత్తులు అవుతాయే దొరసాని! నాగులు నరులవుతారు. నరులు మాత్రం నాగులు కాలేరు. పౌరుషాన్ని స్వార్థానికి, విశ్వాసాన్ని స్వలాభాలనే వదిలి పెట్టుకున్న జాతికదా నరజాతి.

నాగదోషమే నీకు భర్త రూపంలో ఎదురు అయింది. కారణాలు నాకు తెలుసా? అమ్మ ఆవేశించినప్పుడే అడుగు. అమ్మ అనుగ్రహం కలిగితే చెప్తాది! నివారణకి ఉపాయం కూడ చెప్పొచ్చు!" అని చెప్పి వెళ్ళిపోయేందుకు లేచి నిలబడింది. బయట కారులో కూర్చున్నంతవరకూ సాగనంపారు.

తల్లి చాల నీరసంతో శక్తి హీనురాలుగా కన్పిస్తోంది.

"జీవితంలో జరగబోయే వాటిని గూర్చి తెలుసుకోవాలనుకోవటం దురాశ. ఆ ప్రయత్నంలోనే ఇలాంటి బాధలన్నీ వస్తాయి. మన బాధలేవో మనకున్నాయి. మన శక్తిమేరకు వాటిని పరిష్కరించుకుంటాం.

సమస్య ఎదురు అయినప్పుడు ఎదుర్కొవడంలో మానవత్వం ఉంది.

కాని ముందుగానే తెలుసుకోవాలని ప్రయత్నించితట్టుకోలేక దిగులుపడి కూర్చోవటంలో లేదు. ఇప్పుడామె నామీద నాగదోషం ఉందని చెప్తోంది.

నిజం అనుకోవాలా? అబద్ధం అనుకోవాలా?

నిజం అయితే మనం ఏం చేయాలిప్పుడు? అన్నీ సమస్యలే కదా! మనమే సృష్టించుకున్నాం." అంటూ నిష్టూర మాడింది తులసి! తల్లి తలను ఒడిలోకి తీసుకుని.

"నీకు తెలియదు తులసీ! ఆమె చెప్పే మాటలలో ఒక అక్షరం పొల్లుపోకుండ ఆమె చెప్పిన మాటలు ఆమెవి కాదు. ఆమె పెద్దాపురం పేరంటాల దీక్షతో ఉంటుందెప్పుడు. పేరంటాలే ఆమె శరీరం మీదికి ఆవహించి భవిష్య వాణిని వినిపిస్తుంది. నీకు నాగదోషం ఉందమ్మా.

ద్రవిడ మాహేశ్వరుడు ఎదురు వచ్చి హనీమూన్ ణి ఆటంక పరచటం, ఆ తరువాత కేసు గొడవలు అన్నీ నాగదోషం కారణంగానే జరిగాయి.

ఇంకేం జరుగనున్నాయో!

"తులసీ నీకేదన్నా అయితే నేనెలా బ్రతుకుతాను" అంటూ కుమిలి కుమిలి దుఃఖించటం ప్రారంభించింది తల్లి.

సరిగ్గా ఆ సమయంలోనే ఉమ, కల్యాణి లోపలకు వచ్చారు.

ఎప్పుడు ఆ ఇంటికి వచ్చినా ఆలస్యం చేశారంటూ గయిమని విరుచుకుపడే తులసి వారిని చూచికూడా మౌనంగానే ఉండిపోయింది.

"ఏమయిందే! ఎందుకు మీరంతా అలా ఉన్నారు?" అని అదిగింది ఉమ.

"దాసరాణి సింగమ్మ వచ్చింది. భవిష్యవాణి చెప్పి వెళ్ళింది" అంది ప్రక్కింటావిడ!

"చెపితే ఏమయిందట! సోలెడు బియ్యం కోసం చెప్పే మాటలన్నీ నిజాలవుతాయని వీళ్ళు దిగులెట్టుకు కూర్చున్నారా?"

"అలా అనకమ్మా! ఆమె పేరంటాలు అపరావతారం అంటారు"

"సింగినాదం అంటారండీ! మీలాంటి వాళ్ళే కదా అనేది! వాళ్ళు దిగులుపడి కూర్చుంటే ఓదార్చటం మర్చిపోయి ఇంకా ఆ మాటలు నిజమవుతాయని వాళ్ళని ఎక్కబొడుస్తున్నారు.

"నలుగురాడవాళ్ళు చేరారంటే ప్రపంచ యుద్ధంలాంటి దేదో రాకమానదు. ఒకరికొకరు అండగా ఉండే పద్ధతి ఇదేనా?" అంటూ ముఖం చిన్న బుచ్చుకుని మరీ అడిగింది ఉమ.

వారంతా ముఖముఖాలు చూచుకున్నారు.

"ఇంతకాలం కళ్ళెదుట మనం చూస్తున్నదంతా అబద్ధం! నాలుగు ముక్కలు చదివొచ్చి ఈవిడగారు చెప్పేది నిజం. మనకెందుకొచ్చిన గొడవ. వాళ్ళ తిప్పలేదో వాళ్ళేపడతామంటున్నారు.

"వెళ్ళదాం పదండి!" అంది అంతసేపూ ఆసక్తిగా ఉన్న ప్రక్కింటి మహిళ.

అదే మిగిలిన వారందరూ తీర్మానించారు.

ఒకరినొకరు చూపులతో హెచ్చరించుకుని అంతా వెళ్ళిపోయారు.

"ఇలాంటి చాదస్తాలు తలకెక్కించుకోటానికేనా సైన్సులో డిగ్రీలు సంపాదిస్తున్నావు?" తులసిని మందలించింది ఉమ.

"చూడవే! అమ్మ ఇలా ఉందని కాదు కాని నాకు కూడ కొన్ని నిదర్శనాలు కన్పిస్తున్నాయి! విజ్ఞాన శాస్త్రమంటే తెలియని విషయాలను వెతుక్కుంటూ పోవటమే కదా. వాస్తవాలు పుస్తకాల్లోనే కాదే! జీవితాల్లోనే ఉంటాయని మనం తెలుసుకోవాలి ముందు.

పెళ్ళి అయింది. హనీమూన్ కి వెడుతూ ఉండగా ద్రవిడ మాహేస్వరుడి సంఘటనా జరిగిందా? ఈ రోజు రాత్రి

కలలో మనమంతా ద్రవిడ మాహేస్వరున్ని వెతుక్కుంటూ స్మశానానికి వెళ్ళావంట.

అక్కడ అతని జటా జూటంలోంచి దిగి వచ్చిన కృష్ణ సర్పం ఏమందో తెలుసా? ఈ నాటి నీ పతి దేవుడే ఆ నాటి నా ప్రియుడు అంది.

చెల్లీ అంటూ నన్ను గాఢంగా కౌగలించుకుంది. తలుచుకుంటే ఇప్పుడు కూడ ఒళ్ళు జలదరిస్తోంది. దాసరాణి కూడ నాకు నాగదోషం సోకిందని చెప్పింది. ఈ మూడు వేరువేరు సంఘటనలయినా వాటి మధ్య ఏదో ఒక లింకు ఉందనిపిస్తోందా? లేదా?" అని ప్రశ్నించింది తులసి!!

## 6

"కలలు నిజాలవుతాయా? అనేది మనకిప్పుడు చర్చనీయాంశం కాదు. కాని యోగి ఎక్కడున్నాడు? అతని బ్యాక్ గ్రౌండ్ ఏమిటి?

ఎన్నడూ రాని వాడు ఈ ప్రాంతాలకి వచ్చి జనానికి వెర్రెత్తి పోయేలాగ మంత్రాలు మహిమలు చూపు కుంటూ తిరగటానికి కారణం ఏమిటి? అతని వెనుక ఉన్నవి ఐపి ఈ విషయంలో ఇంత ఎక్కువగా ఎందుకు కల్పించుకుంటున్నాడు అనే విషయాల గురించి తెలుసుకోవలసిన అవసరముంది" అని తీర్మానించింది ఉమ. కళ్యాణి ఆ అభిప్రాయంతో ఏకీభవించింది.

తల్లి క్రింద గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకుంది. ఆమె మనసులో రగులుతున్న అగ్నిపర్వతాలేమిటో, చిమ్ముతూన్న లావా ఏమిటో ఆ భగవంతుడికే తెలియాలి.

స్నేహ బృందం ముగ్గురూ టెర్రస్ మీద కేన్ కుర్చీల్లో కూర్చున్నారు.

జరుగుతున్న సంఘటనలకి అర్థాన్ని వెతకాలని పరిష్కారాన్ని తెలుసుకోవాలనే ముగ్గురూ అనుకుంటున్నారు వీటన్నిటికి వెనుక ఎవరో కుట్రదారులున్నారని పోలీసులాగానే భావిస్తోంది ఉమ.

తులసి, కళ్యాణి దైవఘటనలు జరుగుతున్నాయని, నాగదోషంనిజమే అని విధి ప్రతికూలంగా ఉందని గాఢంగా నమ్ముతున్నారు.

రెండు పక్షాల నించి ప్రాణాలను తెగించి అయినా సరే విషయాన్ని పరిశోధించి తీరాలని మాత్రం తీర్మానించారు.

"ఈ విషయాన్ని పోలీసులు పరిశోధిస్తున్నారు. అంత కన్నా ఎక్కువ మనం ఏం చేయగలం?" అంటూ తన

నిరుత్సాహాన్ని ప్రకటించింది కళ్యాణి.

"ఏం చేయగలమా? కప్పు వెనుక కప్పు ఐస్ క్రీం లాగించగలం" అంది ఉమ వ్యాఖ్యానంగా! కళ్యాణికి పౌరుషం వచ్చింది.

"అవసరమయితే ఏ సాహసానికయినా నీ కన్నాముందు నేను ఉంటానే ఉమా! మరీ అంత పప్పుసుద్దక్రింద జమకట్టి మాట్లాడకు" అంది రోషంగా.

"వెరిగుడ్! ఇప్పుడు సరిఅయినదారికొచ్చావు. అందుకే రెచ్చగొట్టాను. ఇప్పుడు కరెక్టు టెంపరేచర్ లోకి వచ్చావు." అంటూ ముందుగా తాను లేచింది ఉమ.

"తెలియని విషయాల్లో తలదూర్చి ప్రమాదాలు నెత్తికి తెచ్చుకోవటం మంచిది కాదేమోనే! మొదటే అమ్మకు ఒంట్లో బాగుండలేదు" అంది తులసి.

"ప్రమాదాల సంగతి అంటావా? శాస్త్రవిజ్ఞానంలో పరిశోధనలు చేయటంలో ఎందరు మహాపురుషులయిన శాస్త్రవేత్తలు ప్రాణాలు బలి ఇవ్వలేదు. మనం వారికన్నా గొప్పవాళ్ళంగాదు."

ఈ జరిగేదంతా స్వార్ధపరులయిన మనుష్యుల కుట్ర అని నేను అంటున్నాను.

దైవ మహిమలూ, వంకాయలూ, చింతకాయలూ అని మీరు అంటున్నారు.

మూర్ఖంగా వాదించుకోవటంకాదు. పరిశోధించాలని నేను అంటున్నారు. దీనికి మీరేమంటారు? అని ప్రశ్నించింది ఉమ.

"నీ మాత్రం దమ్ముచాలని వాళ్ళు ఇక్కడెవరూలేరంటాను" అంది కళ్యాణి.

"నువ్వేమంటావే తులసీ!" అని ప్రశ్నించింది.

"నాకోసం మీరు ప్రమాదాల్లోకి దిగుతున్నారు" అంది తులసి ఆర్ద్రంగా!

వెంటనే ఉమ కరిగిపోయినట్లు చూచింది. భుజంమీద చేయివేసి బుజ్జగించింది.

"పిచ్చిదానా! స్నేహమంటే అంతేనా నువ్వు అర్థం చేసుకుంది? ఒకరికోసం ఒకరు ప్రాణం యిచ్చుకోవాలి! మన

శరీరాలు వేరయినా ప్రాణాలు ఒక్కటే! నీ సమస్యలు మావికావా? ఒకవేళ నువ్వు వెనకడుగు వేసినా నేను మాత్రం ఈ మిష్టరీని తెమల్చుకోకుండా వదలి పెట్టను" అంది ఉమ.

తల్లిని జాగ్రత్తగా చూచుకోమని పనిమనిషికి చెప్పి బయలుదేరింది తులసి.

కారు గేటు దాటగానే కట్టెమోపు ఎదురొచ్చింది. మరికొంతదూరం పోయాక ఒంటి బ్రాహ్మణుడు ఎదురొచ్చాడు.

"రేపు వెడదామే ఈ రోజు శకునాలు సరిగాలేవు" అంది తులసి;

"నిన్ను ఎక్కడ తంతానో నాకే తెలియదు. సైన్సులో డిగ్రీలు వెలిగిస్తున్నావు. ఇంకా శకునాలు, చింతకాయలంటావేమిటే తెలివి తక్కువదానా? ఎప్పటికి బాగుపడతావోకాని నీతో ఎ.ఎస్.పి. గారికి చాల బాధలున్నాయి!" అంటూ త్రిప్పికొట్టింది ఉమ! ముందుగా కంట్రోల్ రూంకి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు.

ముగ్గురూ దిగి లోనికి వచహరు. "ఎ.ఎస్.పి. గారు లేరు మేడమ్!"

"వారికోసం రాలేదు. వేరే పనిమీద వచ్చాం!"

"అయ్యగారిని కలవండి!" సర్కిల్ ఉన్న గదివైపు చూపించాడు.

సర్కిల్ గారు వారిని సాదరంగా ఆహ్వానించాడు. డ్రింక్స్ ఇచ్చి వివరాలు అడిగాడు.

సార్! ఈ రోజు పత్రికలలో యోగి గురించినవార్తలు రాలేదు" అడిగింది ఉమ.

"అవునమ్మా! అతని గురించినవార్తలు ఎక్కువగా ప్రచారం కావటమువల్ల కొన్ని క్రొత్తసమస్యలు తలెత్తుతున్నాయి. అందువల్ల వార్తలు విశేషంగా ప్రచురించటాన్ని నిలువుచేయాలని మేమే పత్రికల వాళ్ళని కోరాం."

"సమస్యలేముంటాయి. రాజీ కుదిరిపోయింది కదా!"

"ఇది పబ్లిక్ ఇంటరెస్టెడ్ ఇష్యూ అని నేను ముందే చెప్పాను. ఎ.ఎస్.పి.గారు వినలేదు. ముక్కుసూటిగా పోతే ముఖం పగిలిపోయే రోజులు కదమ్మా ఇవి.

ఒక వి.ఐ.పి. కల్పించుకోవటంతో పరిస్థితి మారింది.

అయినా అటువాళ్ళని ప్రజలకే వదిలెయ్యాలి. నామట్టుకు నేను ఓ నమస్కారంపెట్టి అంతటితో నా పని తీర్చుకున్నాను."

"ఎ.ఎస్.పి. గారికి అంతకోసం ఎందుకొచ్చిందో నాకు యిప్పటికీ అర్థం కాలేదు" అంటూ తులసివంక చూశాడు సర్కిల్.

"సార్! వారికి కోపంరావడం ఈ దాడికి కారణంకాదు. అలా ఆయన వ్యక్తిగత కోపాన్ని అధికారంతో తీర్చుకునే తరహా మనిషి కారు" అంటూ భర్తను సమర్థించుకుంది తులసి.

"మరయితే ఎందుకు అంత సెన్సిటివ్ గా తీసుకున్నారు?"

"యోగి భిక్ష అర్థించేందుకు వచ్చారు. అందుకేవచ్చారో మరెందుకువచ్చారో తెలియదు. కాని వచ్చి ఆయన అడిగింది భిక్ష మాత్రమే. ఆ తరువాత నాకు అనుమానంవచ్చింది. వారాల తరబడి భోజనంతో నిమిత్తం లేని మనిషికి భిక్షతో పనేమిటి?

భిక్ష అర్థించటం తప్పుకాదు. ఆ తరువాత జరిగినా సంఘటనే ఈ పరిస్థితులన్నీఏర్పడటానికి కారణం. యోగి ఒక సామాన్య సన్యాసిని కాదని శక్తివంతుడయిన మహానుభావుడని అని నిరూపించుకోవాలని ప్రయత్నించారు. దాన్ని బెదిరింపుగా అర్థం చేసుకున్నారు ఎ.ఎస్.పి. గారు.

అంతే జరిగింది" అంటూ వివరించింది తులసి.

"ఆయన దగ్గర శక్తులున్నాయో లేదో! అలాగని జనం నమ్ముతున్నారు. వాస్తవ పరిస్థితుల్ని ఫాలో కావటం మా విధి. ఏమయినా ఈ పరిస్థితి సుఖాంతం కావటం నాకు చాలా ఆనందాన్ని ఇస్తోంది." అంటూ తృప్తిగా నవ్వాడు సర్కిల్.

"సుఖాంతమయిందా! ఆయన గురించి వార్తలు వస్తున్నాయా?"

"ఇంకా పనిలేదమ్మా! ఇది పబ్లిక్ ఇంటరెస్టెడ్ ఇష్యూ అంటూ వందలాది దరఖాస్తులు కోర్టు పరిశీలనకి వచ్చాయి అందువల్ల జడ్జిగారు కేసుని కొట్టిపారేశారు ఎ.ఎస్.పి. గారు ఈ కేసులో ఒక్క మెమో అయినా తింటారనుకున్నాను. కాని అలాంటిదేమీ జరగలేదు.

క్రొత్తగా రిక్రూట్ అయ్యారు. ఉడుకు రక్తం కదా! కాస్తంత తొందరపడ్డారు. ఇలాంటివి చూచిచూచి మాకు తల పండంది" అంటూ తన అనుభవం గురించి సుదీర్ఘ సంభాషణకి ఉపక్రమించాడు.

"అయితే యోగి ఇప్పుడెక్కడున్నారో మీకు తెలియదా?" ఉమ కట్ చేసింది.

"లేదమ్మా! ఇక తెలుసుకోవలసిన అవసరము కూడా మాకు లేదు"

ముగ్గురూ ఆలోచనలో పడిపోయారు. ఉత్సాహం నీరు కారింది.

"మీకు చివరి వార్తలు అందేసరికి ఆయన ఎక్కడున్నారు" అంది ఉమ.

"పోలీసుల ఎంక్వయిరీ ప్రశ్నల్లా ఉన్నాయి మీ ప్రశ్నలు"

"అవునండీ! అది డి.ఎస్.పి గారమ్మాయి" అంది కళ్యాణి.

"అలాగా సంతోషం! మాకు చివరి వార్తలు అందే సమయానికి ఆయన ఊరిబయట స్మశానంలో ఉన్నారు" సర్కిల్ వివరించారు.

తులసి గుండెలు ఝల్లుమన్నాయి. తన కల జ్ఞాపకం వచ్చింది.

అది నిజమవుతుందా? గుండెలు దడదడలాడాయి.

"అదెలా సాధ్యం? వారు అదుపులో ఉంచుకుని ప్రతి అయిదు నిముషాలకు వార్త పంపుతామన్నారు. అది కదా రాజీ!" అందామె ఆశ్చర్యంగా.

"చూడండి పాపాయిలూ! మరొకరికయితే చెప్పను. మీరు పోలీసుకుటుంబాలకు సంబంధించినవారే కనుక చెప్తున్నాను.

మా డ్యూటీలు మేం చేసుకుపోవాలి. ఒక కేసుని మేం తీసుకున్న తరువాత ఎవరూ ప్రమేయం కల్పించుకోకూడదు. మరొకరి ప్రమేయం వచ్చాక దాని రూపం అనేక విధాలుగా మారుతుంది. మాకు కూడ పట్టుదల, ఆసక్తి పెరుగుతాయి.

వారు వార్తలు పంపుతూనే ఉన్నారు. వాచింగ్ కోసం పంపిన ఉద్యోగి పరమ భక్తుడు. అతడుకూడ వారికే సహకరించాడు. ఇవన్నీ మేము చెప్పకూడదు. మీరు వినకూడదు" అన్నాడాయన.

చెప్పవలసింది అంతా చెప్పేసి ఉపాయంగా తప్పించుకోవాలని ఆయన చేస్తున్న ప్రయత్నం ఉమకు బాగా నవ్వు తెప్పించింది.

కాని తులసికి ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

తాను కలలో కన్పించిన మిగిలిన దృశ్యాలు కూడ నిజమవుతాయా?

"అయితే ఇప్పుడు వారిని కలుసుకోవాలంటే ఏం చెయ్యాలి?" కళ్యాణి.

"బహుశా సాధ్యపడకపోవచ్చు" సర్కిల్.

"వెళ్ళొస్తామండి!" అని లేచింది ఉమ. ఆయన ఆప్యాయంగా వారిని వాకిలి వరకూ వచ్చి సాగనంపారు.

"ఇంక మనం ఇంటికి వెళ్ళిపోవచ్చా?" అంది కళ్యాణి ఉత్సాహంగా.

"నేను చెప్పలేదూ? నాకు వచ్చిన కలలో సగం నిజమయింది అప్పుడే" అంది తులసి. ఆమె ముఖంలో కాంతి తగ్గిపోవటాన్ని గమనించింది ఉమ.

"ఇది యాదృచ్ఛికం ఎందుకు కాకూడదు?"

"అయితే వెళ్ళి చూద్దామంటావా?"

కేవలం ఇది నా వ్యక్తిగత సమస్య అనుకోకు తులసీ! జరిగినా సంఘటనలో నమ్మటానికి వీలులేని విచిత్రమయిన అంశాలు కొన్ని ఉన్నాయి. మంత్రాలు చదివితే నాగులు ఆదేశాలను పాటించడం ఏమిటి?

ఈ మంత్రక్షరీ విద్య నిజమా? అబద్ధమా?? సర్పాలు సమ్మోహితులవుతాయా? నాగదోషాలుంటాయా?.

"మన పరిశోధనకి పనికి వచ్చే అంశాలే కదా ఇవన్నీ" అంది ఉమ.

"అవునవును మనం ముందుకేవెళ్ళాలి" అంది అయిష్టంగానే బద్ధకస్తురాలు కళ్యాణి! తులసి ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో పడిపోయింది.

"గుడ్డిగా దూసుకుపోవటం మంచిదికాదోయ్. దగ్గరకు వెళ్ళే ముందుగా కొన్ని వివరాలు సంపాదించాలి! యోగి గురించి తెలుసుకోవాలంటే ఎవరిదగ్గరకు వెళ్ళాలో ఆ విషయం ఆలోచించాలి ముందు" అంది ఉమ.

"యోగి గురించి తెలుసుకోవాలంటే ఎక్కడకు వెళ్లాలని ప్రశ్నిస్తావేంటి? అతన్ని మనం ఎక్కడ చూచామో అక్కడినించే అన్వేషణ ప్రారంభించాలి!"

"ఐస్ క్రీం షాపుకి వెళ్ళాలనే కదా నీ ఉబలాటం తథాస్తు!"

"యోగి గురించి వివరాలు తెలుస్తే నాకు ఐస్ క్రీమ్ ప్రజంట్ చెయ్యాలి!"

"ఎన్ని కిలోలు తింటావో ముందు చెప్పు! ఆ తరువాతే అగ్రిమెంట్!" వారి మాటలు వింటున్న తులసి ఐస్ క్రీం షాపు ముందు కారు ఆపింది.

"నీవు వస్తున్నావని భయపడి షాపు మూసేశారు" అంది ఉమ విండోలోంచి బయటకు చూస్తూ! ముగ్గురూ క్రిందకిదిగి పరిశీలించారు.

లోపలనుంచి శబ్దాలు వినిపిస్తున్నాయి.

కొద్దిసేపు ఎదురు చూచాక లోపలనించి ఒక వ్యక్తి తలుపులు తెరుచుకుని వెలుపలకు వచ్చాడు! వారివంక సందేహంగా చూచాడు.

"షాపు యజమాని ఉన్నారా?"

"లేదండి ఆయన నిన్న ఈ షాపు మాకు అమ్మేశారు. రిపేరు చేస్తున్నాం"

"నీ చూపు పడినప్పుడే అనుకున్నాను. అతనికిలాంటి ఖర్మ ఏదో పాడుతుందని" ఎదుటివ్యక్తికి వినిపించకుండా గొణిగింది ఉమ.

"ఎందుకండీ! పాపం ఆయన షాపెందుకు అమ్మేశారు?" అంది కళ్యాణి.

"పాపం అంటారేమండీ! రెండు రోజుల్లో ఆయన లక్షాధికారి అయ్యారు."

ఐస్ ఫ్యాక్టరీనే కొనాలని తిరుగుతున్నారు అవునండి! అంతా అప్పుడే అనుకున్నాను. ద్రవిడ మాహేశ్వరుడు స్వయంగా వచ్చి కూర్చున్నారంటే మాటలా! ఆపూటే ఆయన అదృష్ట రేఖ పొడుగుసాగింది.

"హిందుస్థాన్ కాంటెస్సా కొన్నారు"

ఈ మాటలు విని దిగులుగా చూచింది తులసి!

తాను కలలో చూచినా, ఊహించినా అది అబద్దం కావాలని కోరుకుంటోందామె. కాని విన్నవే కలలో కన్నవే అన్ని వాస్తవాలయి కళ్ళముందు నిలుస్తున్నాయి. క్షణక్షణం భయం పెరుగుతోంది.

"వారిల్లెక్కడ?" ఇంక తెగింపు తెచ్చుకుని అడిగింది తులసి!

"సెహబాష్! ఆ పట్టుదల నీలో రావాలి" అనుకుంది ఉమ.

షాపుని క్రొత్తగా కొన్న యజమాని పాతయజమాని అడ్రస్ టెలిఫోన్ నంబర్ ఒక స్లిప్ మీద వ్రాసి వారికి అందించాడు. తులసి డ్రయివింగ్ లో తడబడటం చూసి ఉమ స్టీరింగ్ అందుకుంది.

ఎంతో చెప్పాలని ఉందామెకు. తులసి మానసిక స్థితి అంతాఅర్ధం చేసుకుంది. కాని యెలా వివరించాలి! ఎక్కువ చెప్పలేకపోయింది.

"మానసికంగా క్రుంగిపోవటమే మనిషి పరాజయానికి మొదటి మెట్టు" అంది. తులసిలో అప్పటికే కొంత తెగింపు వచ్చింది.

"ఏది ఎలా పరిణమించినా నేను ఇంకా వెనుకాడను ఉమా! మమ్మీని తలుచుకుంటేనే బాధగా ఉంటుంది. భయపడే వారినే పరాజయాలు వెన్నంటుతాయి. నావల్ల జరిగినా పొరపాటు ఏమీ లేనప్పుడు దేవుడికయినా నేనెందుకు భయపడాలి" అందామె.

ఉమ ఉత్సాహంతో తాము సంపాదించిన విలాసానికి అభిముఖంగా కారు పోనిచ్చింది. ఒక చిన్న డాబాయిల్లు! జుబిలియేషన్స్ జరుగుతున్నట్టుగా తోరణాలు రంగులు కన్పిస్తున్నాయి.

ఇంటి యజమాని సోఫాలో కూర్చుని అతిధులకు నవ్విస్తున్నాడు. క్రొత్తగా సంపన్నుడయినా వ్యక్తి కావటం నించి ముఖంలో సరికొత్త తేజస్సు లీవి కన్పిస్తున్నాయి.

"మీతో మాటాడాలి" అంది ఉమ పరిచయాలు లేకుండానే!

అతడు వారిని గుర్తించాడు!" మాట్లాడండి!" అన్నాడు బెట్టుగా!

"ఇక్కడకాదు" చుట్టూ ఉన్నవారి వంక సందేహంగా చూస్తూ అంది.

"గదిలోకి వెడదాం. ఇంకేమీ అభ్యంతరంలేదు కదా!"

"వెడదాం పదండి!" ముందు దారితీశాడు. క్రొత్త సంపదలతో పాటు క్రొత్త అలవాట్లు వచ్చాయేమో అని సందేహంగా చూస్తోంది అతని అర్ధాంగీ! యోగి ముందు పొర్లుదండాలు పెట్టిన ఆమె మెడచుట్టూ ఇప్పుడు నగలు ధగధగలాడుతున్నాయి.

"లోపలికి ఎవరూ రారుకదా?" ఉమ అడిగింది.

"ఆ భయమేమీలేదు. సదేహించకుండా చెప్పండి" అన్నాడు.

"మీరు షాపు అమ్మేశారట కదా?"

"అవును. ఐస్ ఫ్యాక్టరీ కోనేందుకు అవకాశం వచ్చింది."

"మీకు వ్యక్తిగతమయినా అభ్యంతరం లేకపోతే" ప్రశ్న అడుగుతాను.

కొద్దిక్షణాలు సందేహించాడు." అడగండి" అన్నాడు సంశయంగానే!

"మీరు హఠాత్తుగా లక్షాధికారి యెలా అయిపోయారు!"

"దైవం తలుచుకుంటే మనిషి దశ తిరగటం ఎంతసేపు?"

"కొంచెం వివరంగా చెప్పండి"

"నాకుడబ్బు ఎలా వచ్చిందో చెప్పాలంటే ఇరవై సంవత్సరాలుగా నా మనసుని దిగజార్చి, మెదడు తినేసిన ఓ చిక్కు కథ చెప్పాలి! సూటిగా చెప్పాలంటే యోగి వారం పెట్టాకనే నాకు అదృష్ట దేవత ప్రత్యక్షమయింది"

"మీరు చెప్తున్నా మాటలకి నమ్మకంకాక మరొక ఆధారం ఏమిటి?"

"మీ ప్రశ్నకి సమాధానం నా జీవిత కథ! కాని అదంతా చెప్పి సమయాన్ని వృధా చేసుకోను! యోగివల్లనే నాకు చిక్కులు వీడి ధనం వచ్చింది!"

"ఆయన మీకు వరాలిచ్చాడా?"

"లేదు. ఎన్నడూ నాతో మాట్లాడలేదు. రెప్పలు విప్పి నావంక ఒక్కసారి కూడ చూడలేదు. నా షాపులో అడుగుపెట్టాడు దేవుడు. నా దశ తిరిగింది."

"ఈ శతాబ్దంలో ఇలాంటి కథ ఎలా నమ్మాలి!"

"నమ్మిచెడిన వారులేరు, నమ్మకపోతే పోతారు. కాని ఏ శతాబ్దంలో అయినా నమ్మి తీరవలసినది ఒకటుంది"

"ఏమిటండీ అది" ఆసక్తిగా అడిగింది.

"కనులముందు జరుగుతున్న వాస్తవానికి కాలదోషంలేదు, నమ్మితీరాలి."

"ఆయన మంచి ఎలా చేయగలరో చెడుకూడ అలాగే చేయగలరా?"

"అపచారం తల్లీ! అటువంటి అవుసరం ఆ మహానుభావుడికిలేదు. ఆయనకు శక్తి ఉంది. అది మంచికి మాత్రమే ఉపయోగపడుతుంది"

"ప్రస్తుతం యోగి ఎక్కడున్నారు?"

"వృధా ప్రయాస! తనంత తాను రావాలే తప్ప నోట్లు క్రుమ్మరించినా రారు"

"తీసుకుపోవాలని కాదు. దర్శించాలని!"

"ఎక్కడున్నారో నాకూ తెలియదు. నగరంలోనే ఉన్నారని విన్నాను."

"వినటం ఏమిటి? మీ దశను మార్చిన మహానుభావుడు ఎక్కడున్నాడో తెలుసుకోవాలని అనిపించలేదా మీకు?" అని ప్రశ్నించింది. ఉమ

"ప్రతిక్షణం ఆయనకోసం పరితపిస్తాను. కాని ఆయనపట్ల కృతజ్ఞతగా ఉండటం అంటే దూరంగా ఉండటమే జీవిత కాలమంతా అడవులలో గడిపిన మనిషి ఎందుకొచ్చారో తెలియదు. మళ్ళీ ఏ క్షణంలో ఎక్కడికి వెళ్ళిపోతారో తెలియదు. మనుషుల పొడవారికి గిట్టదు.

మేలుజాతి సర్పంలా మనుషుల ఉనికికి దూరంగా తొలగిపోతారు.

పదే పదే దగ్గరగా వెళ్ళాలనుకోవటమంటే ఆయన సమాధికి భంగం కలిగించటమే!" అతడు భక్తిభావంతో చెబుతున్నాడు.

"ఖచ్చితంగా ఎక్కడుంటారో తెలియక పోవచ్చు. ఊహించగలరా?"

అతడు కొద్ది క్షణాలు మౌనంలో మునిగిపోయి ఆలోచించాడు.

"ఈశ్వరుడు ఎక్కడుంటే మాహేశ్వరుడు కూడ అక్కడే ఉంటాడు." మాట్లాడవలసింది ఇంకా ఏమీ లేదన్నట్టుగా అతడు లేచాడు.

కృతజ్ఞతలు చెప్పి ఆయన దగ్గర నించి బయటపడ్డారు.

"అతడు చెప్పినచోటు ఏమిటి నాకు అర్థం కాలేదు" అంది కళ్యాణి.

"చాల స్పష్టంగానే చెప్పాడు. స్మశానంలో ఉంటాడని!" అంది ఉమ.

కలలో మరికొంత భాగం నిజమయినందుకు తులసి తల్లడిల్లి పోయింది.
"నగరంలో ఎన్ని ఉన్నాయో అన్నీ గాలించి వద్దాం" అంది పట్టుదలగా .

"త్వరపడకు, అక్కడ వెతకటం ఎలాగూ అనివార్యమే కాని ముందుగా ఒకసారి రాజీ కుదిర్చిన వి.ఐ.పై. గారిని దర్శించి వద్దాం. మరి కొన్ని వివరాలు తెలుస్తాయి కదా?" అని ప్రతిపాదించింది ఉమ.

"కలుసుకోవటం సాధ్యమంటావా వారిని. ఎక్కడున్నారో.?"

"ఐ.బి.లో ఉన్నారని విన్నాను. వెళ్ళి చూద్దాం" పరిస్థితి తీవ్రమయిన దశకు వస్తోందని ముగ్గురికీ  అనిపించాక వారిలో చిలిపితనం వాచాలత్వం వెనుక తట్టు పట్టినాయి.

ఐ.బి. ముందు చాల వాహనాలు నిలిపి ఉన్నాయి. ఆశ్రితులు చెట్లక్రింద తమ వంతు సమయం కోసం పిలుపుకోసం ఎదురుచూస్తూ ముచ్చట్లాడుకుంటున్నారు. సెక్యూరిటీలో ఉన్న పోలీసు అధికారుల అండ సంపాదించి వారు ప్రయివేట్ రూంలోకి ప్రవేశం సంపాదించారు.

పి.ఎస్. ద్వారా విద్యార్థినులు వచ్చిన వార్త అందుకుని కిటకిటలాడుతున్న అభిమానుల్ని హాలులో నిలిపేసి లోపలకు వచ్చారాయన.

"నమస్తే అమూల్యమయిన సమయం మీది."

"ఫరవాలేదు. అందరికోసమే కదా. విషయమేమిటో చెప్పండి. త్వరగా"

"సర్! ద్రవిడ మాహేశ్వర యోగి విషయంలో మీకెందుకు కల్పించుకున్నారు."

"ఆయన చాల అరుదయిన మహావ్యక్తి! సర్వ శక్తి సంపన్నుడు!"

"ఆ సమయంలో మీరు అక్కడికి ఎందుకొచ్చారు?"

"ఏ క్షణంలో ఎక్కడుండాలో విచారించి నిర్ణయించే బలమైన యంత్రాంగం మాకుంది."

"వారి గురించి మీకు యింతకు మునుపే తెలుసా?"

హై లెవెల్ సొసైటీలో విన్నాను. ఉన్నత శ్రేణి సమాజంలో అయన గురించిన అద్భుత కథలు ఎన్నో ప్రచారంలో ఉన్నాయి.

"ఉన్నత శ్రేణి సమాజం, హైలెవెల్ సొసైటీ అనే పదాలు మీరంటున్నారు. అంటే మంత్రులు, కోటీశ్వరులు, పారిశ్రామికవేత్తలు విద్యావేత్తలు వారేనా?"

"యూ ఆర్ మిస్టేకెన్! ఉన్నతశ్రేణి సమాజం నటే తాత్వికులు. అయినా చిన్న వాళ్ళు మీరు. ఆయన గురించి ఎందుకింత ఎక్కువగా ఆలోచిస్తున్నారు?"

"శాస్త్రీయ పరిశోధనా దృష్టితో యోగిని పరిశీలించాలి."

"బహుశా మీ శక్తి చాలదనుకుంటాను మీ అనే మాట నేను వ్యక్తిగతమయిన అర్ధంలో అనలేదు. ఇవాళ మనకు తెలిసిన సైన్సు కొన్ని విషయాలను నిర్వచించగల స్థితిలో లేదు. నేను యూనివర్శిటీలో సైన్సు విభాగం నించే ఈ రంగానికి వచ్చాను. మీకు తెలుసు కదా?" అన్నారాయన.

గొప్పవారి గురించి తెలియకపోయినా తెలియదు అనటం భావ్యం కాదు. కనుక అవునని ముగ్గురూ తలలు ఊగించారు.

"వారి ఏకాగ్రతకి భంగం రాకుండా మీరు పరిశోధించాలి, సైన్సు పరిశోధన అంటే నేను కాదనలేదు. మూడు దశాబ్దాల వృత్తి బలహీనత అది. మీరు సక్రమమయిన పద్ధతిలో సాగిస్తామంటే నేను సహకరించ గలనని హామీ యిస్తున్నాను" అన్నారాయన.

"సర్ మాకు కావలసింది హామీలుకావు. వారు ఎక్కడున్నారో మీకు తెలుసా? తెలిస్తే చెప్పండి." అని అడిగింది ఉమ.

ఆయన కొద్దిసేపు ఆలోచించి బదులిచ్చారు.

"నగరంలో ఉంటే రాత్రి సమయాలు స్మశానంలో ఉంటారు. నగరం విడిచి వెళ్ళిపోతే నల్లమల కొండల్లో ఉంటారు. ప్రయత్నించండి. కాని మీరు చాల జాగ్రత్తగా మసలు కోవాలి."

"థాంక్యు సర్ థాంక్యు వెరిమచ్" అంది ఉమ.

ఆయన హడావుడిగా హాలులోకి వెళ్ళి జనంలో కలిశారు.

"కలలో నేను రాత్రి సమయంలోనే స్మశానంలోకి వెళ్ళినట్టు చూచాను. మరో అంశం కూడ యదార్ధమయింది. కల అంతా నిజమవుతుందేమో.?"

చెమరించిన కన్నులతో, జీరబోయిన కంఠంలో అంది తులసి.

"సగం మునిగాక భయం ఎందుకే వెళ్ళి చూద్దాం. చీకటి పడటానికి ఇంకా నాలుగు గంటల సమయం ఉంది. హోటల్ లో తిండితిని వెళ్ళిపోదాం." అంది ఉమ.

ముగ్గురూ కలిసి నగరం శివార్లలోని ఒక చోట సెలెక్ట్ చేశాడు.

"జన సాంద్రత హెచ్చుగా ఉండనిచోటు అది."

ఆ వైపుగా కారుని పరుగెత్తించారు జాగ్రత్తగా వివరాలు సేకరిస్తూ ఆ చోటుకి చేరుకోవటానికి నలభై నిముషాలు పట్టింది.

గేటు ముందు కారు ఆపగానే తులసి గుండెలు ఝల్లుమన్నాయి.

రాత్రి తాను కలలో చూచిన చోటు అదే! మరుక్షణం చెమటలు శరీరాన్ని ముంచెత్తినాయి. శరీరంలో వొణుకు ప్రారంభమయింది.

చల్లగా మారిపోయిన శరీరాన్ని తాకిచూచింది ఉమ.

"నీ కేమయింది ఇంతలో.?" అంది ఆశ్చర్యంగా.

"నేను కలలో చూచిన చోటు యిదే గేటు కూడ యిదే."

"ఆర్ యూ ట్రూ.?" ఈసారి ఉమ ఉలికి పడక తప్పలేదు.

"ఎస్! అయామ్!?" అంటూ ఆమె ఎత్తు గుండెలమీద తల ఆనించి రోదించటం ప్రారంభించింది తులసి! "యిదే యిదే! ఆ చోటు యిదే! ఆ గేటు యిదే!"

"దాన్ని నువ్వు చూచుకో! నేను వెళ్ళి తెలుసుకుంటాను" అంటూ కళ్యాణి గేటు తెరుచుకుని లోపలకు వెళ్ళింది.
కొంతదూరం వెళ్ళి ఎవరయినా కన్పిస్తే వెంటపెట్టుకురావటమో! లేకపోతే కొద్ది అడుగులు వేసి దిబ్బముఖం పెట్టుకుని తిరిగిరావటమో చేయగలదు. అంతకన్నా ఇదేం చేయగలదు?" అనుకుంది ఉమ!

తులసిని ఓదార్చ వలసిన సమయం! అందుకని కారుదిగలేదు.

క్షణాలు గడచినాయి....నిముషాలుగా మారినాయి!

అరగంట గడిచిపోయింది. అయినా కళ్యాణి తిరిగి రాలేదు.

కంగారుగా కారుదిగి ఎలుగెత్తి పిల్చింది "కళ్యాణి" నిశ్శబ్దమే సమాధానం.

## 7

కళ్యాణి బదులు పలకకపోవటానికి బలమైన కారణం ఉందనిపించింది.

వారిద్దరూ గేటువైపు అడుగులు వేశారు.

కలలో కన్పించిన అంశాలు ఒక్కొక్కటి వాస్తవమవుతుంటే తులసి బాగా భయపడింది. కాని తానుచూచిన గేటు కిర్రుమంటూ అదే పద్ధతిలో తెరుచుకుంటున్నప్పుడు మరింతగా చలించిపోయింది.

క్షణక్షణం భయంకర నరకంలాంటి అనుభవం అయింది.

వారిద్దరూ లోపలకు అడుగు పెట్టారు. ఎండుటాకులు కాళ్ళక్రింద పడి శబ్దంచేస్తూ నలిగిపోతున్నాయి. దారికి రెండువైపులా గచ్చపొదలు! చుట్టూ శాఖలను విస్తరించి ఆకులు విరబోసుకున్న పెద్దపెద్ద వృక్షాలు కూడా ఎప్పుడో ఒకప్పుడు తాను చూచినవిగానే అనిపించాయి.

తులసి రెండడుగులు వెనకగా నడుస్తోంది. జరుగుతున్నదంతా అపరిమితమయిన విస్మయాన్ని కలిగిస్తోందామెకు.

"ఈ కళ్యాణికి ఏమయింది?" అని కంగారు పడుతూ అంది ఉమ.

"కళ్యాణీ! కళ్యాణీ! ఎక్కడున్నావే? బదులు పలుకు" అంది కంఠనాళాలు తెగిపోయేలాగా అరిచింది. కంగారు, దుఃఖమూ కంఠ స్వరంలో విచిత్ర విచిత్రంగా ధ్వనించాయి.

ఆ పిలుపు కారుహారన్ కూడా విన్పించని ఆ ప్రశాంత ప్రదేశంలో స్మశాన భూమి అంతటిని చుట్టి వచ్చింది. దాన్ని అందుకుంటే కళ్యాణి కూడా కంగారుపడి బదులు పలకాలి. కాని నిశ్శబ్ధమే వారికి సమాధానమై మిగిలింది.

అన్ని వంకలనించి ప్రతిధ్వనులే వచ్చాయికాని కళ్యాణి కంఠస్వరం రాలేదు.

"ఇది ఎక్కడో చిక్కడిపోయింది. ఏదో కొంపమునిగింది" అంటూనే ముందుగా ముందుకు పరుగులుతీసింది ఉమ. ముళ్ళు, పొదలు, అడ్డతీగలుచీకిరిబాకిరిగా అల్లుకుపోయిన ఆ ప్రదేశంలో కళ్యాణిని ఎలుగెత్తి పిలుస్తూ నలువంకలకూ పరుగులుతీశారు. ఏం జరుగుతున్నదో తెలియదు.

ఎవరు ఏ వంకకు పరుగెడుతున్నారో తెలియదు.

పాదరక్షలు ఉన్నా ముళ్ళ పొదలతో కాళ్ళు చీరుకుపోయినాయి. బట్టలుకూడా చిరుగులు పట్టాయి. క్షణంక్షణం ఉద్వేగం అధికమయింది.

అనుక్షణం అనుమానం అధికమయింది.

ఏ పిలుపుకీ బదులు రాకపోవటం ఎంతో విడ్డూరమనిపించింది.

సమాదులన్నీ వెదికారు. చితీ మంటల క్రీనీడల్లో స్నేహితురాలి జాడకోసం ఆర్తితో పిలిచారు. చెమటతో శరీరంమే కాదు. బట్టలుకూడా తడిశాయి. వారి ముఖాల్లో కంగారుకుతోడు ఇప్పుడు దుఃఖావేశం తోడు అయింది.

వాస్తవానికి తులసి ఎంత ఖంగుతిందో ఎప్పుడూ ధైర్యంగా సాహసోపేతంగా కన్పించే ఉమ అంతకన్నా ఎక్కువ చలించి పోయింది.

"ఒంటరిగా దాన్ని రానివ్వకుండా ఉన్నా బాగుండేది" అంది జీరకంఠ స్వరంతో.

"దానికి ఏమయిందంటావు? అసలు బ్రతికుందా?" తులసి ప్రశ్నించింది.

"ఛా.ఏమిటే ఆ మాటలు? ఇంతలో ఏమవుతుంది. ఏదయినా ప్రమాదం జరిగిందే అనుకున్నా సహాయంకోసం పిలవాలి. అరిచి గోల చెయ్యాలి. ఏమీ వినిపించకుండా ఏమవుతుందంటావు?"

"అదే నాకూ అనుమానంగా ఉంది." ఉమ ఏడ్చేసింది.

"ఎందుకేడుస్తావు? నువ్వు ఎంతోసేపుగా చెప్తున్నావే ధైర్యం సాహసం అని. అవన్నీ కావలసింది ఇలాంటప్పుడే! ఇలాంటప్పుడు కంగారు పడితేనే అసలేం జరుగుతుందో తెలియకుండా అయోమయం అవుతుంది.

"చెరోవంక వెదుకుదాం పద." అంది తులసి.

ఆమె తెగింపు ఉమకి కూడా స్ఫూర్తినిచ్చింది.

"నువ్వు ఒంటరిగా వెళ్ళి వెతగ్గలవా?" అంది.

"తప్పనిసరి అయింది కాబట్టి తలొంచుకుని చేసుకుంటూ పోవాలి అంతే."

"నువ్వు కొత్తగా కన్పిస్తున్నావే తులసీ"

నేను క్రొత్తగా కన్పించను. నువ్వే క్రొత్తగా చూస్తున్నావు. ఆ వైపు ఒక పాడుబడిన బావి, సమాధులు చెట్లు ఉంటాయి. అక్కడంతా నువ్వు వెదుకు.

ఈ వైపు కూలిపోతున్న ఒక రెల్లు పాకల సమాధు, చెట్ల క్రింద సాగనంపేందుకు వచ్చేవారు కూర్చునేందుకు అరుగులు ఉంటాయి. నేను ఈ వైపు వెడతాను" అంటూ నిర్భీతిగా బయలుదేరింది తులసి.

మనుషులకు పరీక్షలు ఎదురు అయినప్పుడే మనోజనం తెలుస్తుంది.

"ఈ ప్రాంతమంతా ఇదివరకే చూచావా? నీ కెలా తెలుసు?" అంది ఉమ.

"ఎలా తెలుసేమిటి? ఈ ప్రాంతాలను నేను కలలో చూచాను, నేను చూచినా ప్రతిఅంశం ఈ చోటుకి ప్రతిబింబమే! బయల్దేరు" తులసి పరుగుతీసింది చెరొక వైపు పరుగుతీశారు దారి డొంకలేని పొదల మధ్య వెతుకుతున్నారు. సమాధులమీదుగా దుమకాల్సివస్తోంది. రాళ్ళు రప్పలు పాదాలకు ఎదురు తాకి రక్తపు జీరలు క్రమ్ముతున్నాయి.

వారి పిలుపులకి వారి పిలుపులే బదులుపలుకుతున్నాయి.

స్మశాన భూమి అంతా ప్రతిధ్వనించింది. కళ్యాణీ! కళ్యాణీ!!

ఆకాశంలో వెలుగుతున్న నక్షత్రాలే దారిచూపుతున్నాయి. వెళ్ళి వెళ్ళి, కంఠం పొడారిపోయేంతవరకూ అరచి అరచి ఒకచోటున ఆగిపోయింది తులసి! ఆమె ఎదురుగా ఒకపాక కన్పించింది.

కలలోని అంశాలలో మిగిలిఉన్న ఒకే ఒక దృశ్యం కన్నుల ఎదుట కన్పించేసరికి స్పృహ కోల్పోయినంతపని అయింది. అమితమయిన వేగంతో గుండెలు కొట్టుకుంటున్నాయి. ఏదో ఒక అవాంఛితాన్ని చూడబోతున్నానని ఆమె మనసు మూలుగుతోంది.

కాని వెనకడుగు వేయాలనిపించలేదు. వెదురు చీలికల తలుపుల మీద చేయివేసింది. కిర్రుమంటూ అవి తెరుచుకున్నాయి.

లోపల ఒక గ్రుడ్డిదీపపు వెలుగు మందంగా చిమ్ముతోంది.

ద్రవిడ మాహేశ్వరుడు పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు. అతని కనురెప్పలు ముకుళించి ఉన్నాయి.

శివరాజ్ గాయపరచిన మగపాము ఓవంక పడిఉంది. అతని ముందు నివశఅయి పడివుంది కళ్యాణి! ఆమె శరీరం మీద చలనమే లేదు. ఊపిరి పీల్చుతున్న జాడకూడ కన్పించలేదు.

ఒక్క ఉరుకున వెళ్ళి ఆమెను తట్టి చూచింది తులసి! శరీరం చల్లగా అయిపోయి ఉంది. మరొకవైపుకి

పొర్లించిగుండె ద్వయ్యలైపోగా కెవ్వుమని అరిచింది.

"కళ్యాణి నోరు చిరవిస్మయకరంగా సగం తెరిచిఉంది. నోటి నించి రక్త ప్రవాహాలు వచ్చిన సూచనగా ముఖమంతా రక్తంతో తడిసి పోయి గడ్డకట్టివుంది. ముక్కులనించి, కర్ణ పుటాలనించి కూడ రక్తధారలు చిమ్మినాయి.

శరీరం కట్టెలా బిగుసుకుపోయింది. తన కోసం ప్రాణాలర్పించిన అమృతమయి! మన ముగ్గురిది ఒకే ప్రాణమంటూ మోసగించి వెళ్ళి పోయింది.

అదృశ్యం చూచి పరిస్థితి అర్ధంచేసుకాగానే గుండెలు అవిసేలాగ వెర్రికేక పెట్టింది తులసి! "కళ్యాణీ! కళ్యాణి! ఓనా కళ్యాణీ!!"

ఆ పిలుపులు స్మశానమంతటా మార్మోగినాయి. స్నేహితురాలి గుండె కోతని ఆర్తి పూర్వకమయిన పిలుపుల్ని అందుకోగల దూరంలో లేదు కళ్యాణి!

కాని ఆ పిలుపుల్ని మరోమూల తిరుగుతున్న ఉమ అందుకుంది. అలజడి వినిపించిన దిక్కుగా తారాజువ్వలా పరుగుతీసింది. ఏదో అవాంచితం జరిగిపోయిందని గ్రహించిందామె! తులసి గుండెల్ని చీల్చుకువచ్చిన ఆ కేకలు సాదారణమయినవి కావు. ఆ రోధన ధ్వనికి అర్ధం అసాధారణ మయినదే అయుండాలి!

మోకాళ్ళు దాటి తొడలవరకూ ముళ్ళ కంపలు పట్టి శరీరాన్ని  చీరుతున్నా గ్రహించలేదు ఉమ! ఆఘమేఘాల మీద వచ్చి పాకముందు ఆగింది.

లోపల దృశ్యం స్పష్టంగా కన్పిస్తోందామెకు.

యోగి నీరవ నిశ్శబ్ద సమాధిలో మునిగి స్థాణువులయా అయిపోయి ఉన్నాడు.

అతనిముందు రక్త స్రవంతుల మధ్య ఓలలాడుతోంది విగతజీవి కళ్యాణి!

"దాన్ని నువ్వు చూచుకో! నేను వెళ్ళి తెలుసుకుంటాను" అని చివరి మాటలు చెప్పి కనుమరుగైపోయిన కళ్యాణి ఇకలేదు.

"తులసిని నాకు అప్పగించి వెళ్ళి నువ్వేం తెలుసుకున్నావే కళ్యాణీ! చూచిన దాన్ని వర్ణించి చెప్పేందుకు మరింక తిరిగిరావు కదా!! జీవిత మంతా స్నేహాన్ని అందించి అమృతం తాగిన వాళ్ళలా అమరుల్ని చేస్తావనుకున్నాను.

స్నేహానికి బదులు స్మృతుల్ని మాత్రమే విడిచి వెళ్ళిపోయావా?

వెన్నెలలా చిరునవ్వులు కురిసి వెన్నపూసలా కరిగిపోయావ్! ఆ చిరునవ్వుల కోసం మళ్ళీ ఎన్ని జన్మలు వెతుక్కోవాలి కళ్యాణీ!" అంటూ ఆమె మనసు ఆక్రోశించింది. ఇంత జరుగుతున్నా పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుని ఉన్నాడు ద్రవిడ మాహేశ్వరుడు! మనుషుల ప్రాణాలతో ఆటలాడుకోవటం అతనికి సరదా కాబోలు! పెద్దవాళ్ళ అండదండలతో కేసునించి బయట పడ్డాననే గర్వం అయ్యుండాలి!

పువ్వులా నవ్వుతూ వచ్చిన కళ్యాణి ప్రాణాలను నమిలి మింగేశాడు.

మాహేశ్వరుడి మీద విపరీతమయిన కోపంతో ఊగిపోయింది ఉమ.

"ఈ దరిద్రుడే మన కళ్యాణి ప్రాణాలను తీశాడు" అంది ఆవేశంగా! దుఃఖ వివశురాలయి ఉన్న తులసి ఉలికిపడి చూచింది.

"దౌర్భాగ్యుడా! మా కళ్యాణి ప్రాణాలను పొట్టన పెట్టుకున్నావు" అంటూ అతని ముందుకు దుమికింది ఉమ!

చేయిచాచి ముందు వెనుకలు ఆలోచించకుండా అతని ముఖంమీద కొట్టింది.

చేతులు కొంకర్లు తిరిగాయి అతని శరీరం రాయికన్నా కఠినంగా అనిపించింది. దాంతో మరింత కోపంతో రెచ్చిపోయిందామె.

ద్రవిడ మాహేస్వరుడు మాత్రం కన్నులు విప్పి అయినా చూడలేదు. ఉమ కొట్టిన దెబ్బ ఈగవాలినట్టుగా అయినా అనిపించలేదతనికి.

ఉమకు ఆవేశం కట్టలు త్రెంచుకుంది. ఉచితానుచితాలు మరచిపోయింది.

"ఒక నిండుప్రాణాన్ని తీసుకున్నది కాక ఇంకా దొంగనాటకాలాడుతున్నావా?"

అంటూ అతని భుజంమీద చాచి తన్నిందామె!

అది చూచి కంగారుగా లేచి నిలబడింది తులసి!

"విధి క్రూరమయినదే కావచ్చు. మనకు అన్యాయం చేసి ఉండవచ్చు. అందుకని దైవానికి అపచారంచేయకు ఉమా!"

అంటూ అడ్డువెళ్ళి నిలిచింది.

"వీడు దైవం కాదు దయ్యం పాషండుడు! మనుషుల ప్రాణాలతో ఆడుకుంటాడు" అంటూ అతని శరీరంతో బంతాట ఆడినట్లు ప్రహరించటం ప్రారంభించింది ఉమ! తులసి అడ్డు నిలిచినా లెక్కచేయలేదు.

శరీరం కాఠిన్యానికి కాళ్ళ ఎముకలు చిట్లినట్లు అనిపించాయి.

ఒక రాయి ఎత్తి అతని వీపుమీద కొట్టింది.

యోగ సమాధివల్ల వజ్ర కర్కశంగా మారిపోయిన కఠిన శరీరానికి తగిలి శిలాశకలం పెచ్చులూడిపోయింది. కొట్టి కొట్టి అలసిపోయిందామె. ఆ తాపులు అతని ఏకాగ్రతను భగ్నం చేయలేక పోయాయి.

కాని ఊల బెండులా అతడు ప్రక్కకి ఒరిగిపోయాడు!

చేయగలిగిందేమీ లేక ఆమె కోపమంతా శోకంగా మారిపోయింది.

ఆవేశమంతా దుఃఖ పరవశమై కట్టలు త్రెంచుకుంది.

కళ్యాణి శరీరం మీద పడిగోలుగోలున వినిపించడం ప్రారంభించింది.

వారు చాల సేపు అలా దుఃఖించారు. దానికి సాక్షి ప్రాణంలేని కళ్యాణి శరీరం!

రెండవసాక్షి ప్రాణం ఉందో లేదో తెలియని యోగి శరీరం!

ఓదార్చిన వారెవరూ లేరు. చాలాసేపు దుఃఖించాక వారే ఒకరి నొకరు ఓదార్చుకున్నారు. సంబాళించుకుని లేచి కారు దగ్గరకు వచ్చారు.

మైత్రి అనే బంధానికి ప్రాణానికి ప్రాణంగా కట్టుబడి ముగ్గురుగా వెళ్ళిన వాళ్ళు ఇద్దరే తిరిగివచ్చారు. పోలీస్ కంట్రోల్ రూంకి వెళ్ళారు. అప్పటికే ఏ.ఎస్.పి. డ్యూటీనుంచి దిగిరావటం కార్యాలయంలో తన గదిలో పనులు చూచుకుని వెళ్ళిపోవటం జరిగాయి.

టెలిఫోన్ మీద వార్త అందుకుని పరుగు పరుగున తిరిగి వచ్చాడు!

సెర్చిలైట్లు, ఆయుధాలతో సిబ్బందిని తయారు చేశాడు.

అయిదు నిముషాల అనంతరం ముందు కారుదిగి చూపగా వ్యాన్ లు బయల్దేరాయి.

స్మశాన ప్రాంతమంతా సెర్చిలైట్ల కాంతితో పట్టపగలులా తయారయింది.

ఉమ, తులసి ముందుగా నడిచి పటాలానికి దారి చూపించారు.

యోగికి సంకెళ్ళువేసి యీడ్చుకువచ్చే దృశ్యాన్ని ఊహించుకొంటోంది ఉమ! కాని వారు వెళ్ళే సమయానికి కుటీరంలో గ్రుడ్డి దీపం ఆరిపోయింది.

విగత ప్రాణులయిన కళ్యాణి శరీరమే కాని యోగి వారికి కన్పించలేదు.

"రాస్కల్ పారిపోయాడు" అంది ఉమ! గాయపడిన మగపాము చనిపోయి ఉంది.

"ఆయన సమాధి చాలించి ఉంటారు. ఏకాగ్రతకి ఏకాంతానికి భంగకరమయిన చోటున అలాంటి వారు ఉండరు." అంది తులసి!

వివిధ కోణాలనించి కళ్యాణిని ఫోటోలు తీశారు. పాముశవాన్ని ఫోటో తీశారు. పోలీసులు సెర్చిలైట్లతో స్మశానానికి ప్రతి అంగుళం గాలించి వదిలిపెట్టారు. ఈ వార్త అందుకుని వచ్చిన జాయింట్ కలెక్టర్ అతని కుటుంబమూ కళ్యాణి శవంమీద పడి గోలు గోలున విలపించారు.

జరిగిన ఘోరం నగరం మీద దావానలంలా వ్యాపించింది.

వందలాది వాహనాలు వేలాది జనం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు.

తారీఖు మారింది. ఉషోదయం సమయానికి పెద్ద ఊరేగింపు నగరమంతా తిరిగి గవర్నమెంట్ హాస్పిటల్ ముందాగింది. చనిపోయిన పాముని మార్చురీకి పంపారు. తెల్లవారేలోగా పోస్టు మార్టం ముగించి రిపోర్టు యిచ్చారు.

ఆ తరువాత కళ్యాణి అంతిమయాత్ర సాగింది.

* * *

"ఎందుకలా కొంపలు మునిగిపోయినట్లు కూర్చున్నావు? పైకి వెళ్ళి అబ్బాయికి కాఫీ ఇచ్చిరా!" అంది అప్పుడే పూజ ముగించి హాలులోకి వచ్చిన తల్లి!

"ఆయన ఇంకా లేవలేదు. రెండు రోజులుగా నైట్ డ్యూటీ చేస్తున్నారు" అంది తులసి!

"అల్లుడుగారు నైట్ డ్యూటీ చేస్తుంటే నువ్వేంచేస్తున్నావు? నిన్నటి రాత్రి అంతా అసలు ఇంటికేరాలేదు. పగలంతా రాలేదు. రాత్రి ప్రొద్దుపోయి వచ్చావు. అన్నం కూడ తినకుండ పిల్లిలా పైకి వెళ్ళి పడుకున్నావు!

ఇలా అయితే నీ ఆరోగ్యం ఏమవుతుందనుకున్నావు?

ఇలాంటి రోజుల్లో అలాంటి అల్లుడు దొరికాడని నేను మురిసిపోతుంటే కొంపలంటుకున్నట్లు ఆ కూర్చోవటాలేమిటి?

లేమ్మా! లే! లేచి వెళ్ళి కళ్ళువిప్పగానే ముఖం చూపించి కాసిని వేడి వేడి కాఫీ అందించు! మంగళ సూత్రాన్ని కళ్ళకద్దుకోవటంతో భార్యకీ, భార్య ముఖం చూడటంతో భర్తకీ రోజు ప్రారంభం కావాలి!

ఎప్పుడు నేర్చుకుంటారే మీరు? వెళ్ళు!!" అంటూ కాఫీ కప్పు అందించి మాట్లాడే వీలు లేకుండా పైకి సాగనంపింది తల్లి!

మెట్లు యెక్కి మేడమీదకి వచ్చింది తులసి!!

శివరాజ్ ఇంకా ముసుగులోంచి బయటకు రాలేదు.

'వేడి వేడి కాఫీ తెచ్చాను శ్రీవారూ అందుకోండి" అతను మేలుకునే ఉన్నాడని తెలుసు.

"పోస్టు మార్టమ్ రిపోర్ట్ చదివారా? ఏమని వ్రాశారు?" మూడ్ చెదిరిపోయింది. గంభీరంగా అయిపోయాడు. ఆమెను విడిచిపుచ్చి సోఫాలోకి వచ్చి కూర్చున్నాడు. కిటికీలకు అమర్చిన తెరలుతొలగించింది తులసి.

గాలి వెలుతురు ఒకేసారి వచ్చినాయి.

"ఆ సమయంలో మీరు అక్కడకు ఎందుకు వెళ్ళినట్టు!? నగరమంతా ఎవరినోట విన్నా మొదటి ప్రశ్న ఇదే! మా డిపార్టుమెంటు కూడ ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలనుకుంటోంది."

"యోగిని చూడాలనే మేము వెళ్ళాము!"

"ఆ సమయంలోనా? అటువంటి చోటుకా? ముగ్గురు ఆడ పిల్లలు వాటే వండర్!"

"మారుతున్న కాలాన్ని కొందరు మనుషులు ఇంకా జీర్ణించుకోవటల్లేదు. ఆ సమయంలో ఆ చోటుకి ఆడపిల్లలయితే వెళ్ళకూడదు. మగవాళ్లయితే వెళ్ళొచ్చా?! యోగిని కలిసి మాట్లాడటానికి అంతకన్నా వేరుమార్గం లేదుకదా?"

'అతన్ని కలుసుకోవటానికి మీరు అనుకోవటం ఏమిటి? కారణం ఉండాలికదా? ఒక నిండు ప్రాణం బలికావటానికి అదే కారణం?"

"నా పరిశోధనాలో ఆయనను కలుసుకోవటం ఒక అంశం! వారిద్దరూ నాకు స్నేహితులు. సాయంగా వచ్చారు. అనుమానించవలసిందే ముంది!?"

"మీ దృష్టిలో లేకపోవచ్చు! ప్రజలు అతి జాగ్రత్తగా గమనించే ఒక సమస్యలో మీ కారణాలకు ఎంత పరిగణ ఉంటుందనుకుంటున్నావు. పరిశోధనలు చేసుకోవచ్చు. కాని సాహసోపేతమయిన పరిశోధనలకి ముందుగా ప్రభుత్వం అనుమతి కావాలి.

క్రైంతో సంబంధం ఉన్న సంఘటన అయితే పరిశోధన కారణంగా ఎవరిని స్పేర్ చేయటం జరుగదు అన్నాడు సీరియస్ గా!

"ఈ విషయంలో క్రైంకి సంబంధం ఏమిటి?"

"అది హత్య అయితే!? కాదని నిరూపించగలవారు ఎవరు?? ప్రజలు అనుమానించకుండా మీరు చూపించగల సాక్ష్యాలేమున్నాయి."

"పోస్టుమార్టమ్ రిపోర్టులో ఏం వ్రాశారు"

"వాళ్ళు కొన్ని అభిప్రాయాలు వ్రాస్తారు. కొన్ని అంశాలను మాత్రమే ధృవీకరిస్తారు. వాడే పదాలు అతి జాగ్రత్తగా వాడినా కోర్టులో ఉల్టా చేయగల అవకాశాలుంటాయి. ఆమె గుండె పగిలి చనిపోయిందని వ్రాశారు. కారణాలు వివరించరు.

అతి భయంకరమయిన వార్త విందా? అతి భయంకరమయిన దృశ్యాన్ని చూచిందా? ఎవరయినా భయపెట్టి గుండె

పగిలిపోయేలా చేశారా? ఇలా ఎన్నో ప్రశ్నలు ఉంటాయి. వాటికి సమాధానం వెతకాల్సింది మేము. డాక్టర్లు ఏమీ చెప్పరు. ఏదిఏమయినా ఈ కేసులో నువ్వు ఇన్ వాల్వ్ అవుతారు."

ఆ ఇన్ వాల్వ్మెంట్ అవమానకరమయిన గిల్టీపరిస్థితులకు దారి తీయకూడదని మనస్ఫూర్తిగా నేను కోరుకుంటున్నాను.

"అందుకే మిమ్మల్ని చూచి నేను గర్విస్తాను." అంది తులసి!

అతడు లేచి బాత్ రూంలోకి వెళ్ళిపోయాడు. ఆప్యాయంగా డైనింగ్ టేబిల్ దగ్గర నిలబడి అన్నీ వడ్డించి తినిపించింది.

అతను హడావుడిగా డ్రసప్ అయి వెళ్ళిపోయాడు. తల్లి గమనిస్తూనే వుంది.

హాయిగా గాలి పీల్చుకుని టిఫిన్ చేయాలని కూర్చుంది.

గల గల నవ్వుతూ డైనింగ్ టేబిల్ దగ్గరకు రాగానే తిండికోసం చిన్న పిల్లలా ఎగబడే కళ్యాణి గుర్తువచ్చిందామెకి! కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. తినేందుకు మనస్కరించక వరండాలోకి వచ్చి కేన్ ఛెయిర్ లో కూర్చుంది.

అప్పుడే గేటుదాటి వస్తున్న ఉమ కన్పించింది.

ఎన్నడూ లేనంతగా ఆమె మొహం వాడిపోయి ఉంది.

"బాగా చివాట్లు తిని వస్తున్నావా?" ప్రశ్నించింది తులసి ఆమె వాలకం చూచి.

"నువ్వు కూడా తినే కూర్చున్నావుకదా?" అంది చురుకు అయిన ఉమ! ఒకరు పోలీసు అధికారి అర్ధాంగి! మరొకరు పోలీసాఫీసరు కూతురు.

ఏమాత్రం క్రైం అనే అనుమానం వచ్చేందుకు వీలున్న చోటున కుటుంబ సభ్యులపేర్లు వినిపించటానికి పోలీసు అధికారులు ఎందుకుంటారు. ఇద్దరి వూహలూ యదార్ధమే అయినాయి.

నవ్వుకున్నారు అర్ధం చేసుకుని ఆ నవ్వులో జీవంలేదు.

"పోస్టుమార్టమ్ రిపోర్టు గురించి అడిగావా?" తులసి!

"అడిగే డాడీ చేత చివాట్లు తిన్నాను. ఇంక ఈ పరిశోధనలు చాలించటం చాలా ఉత్తమమని సలహా యిచ్చారాయన" ఉమ.

"మరేం చేయాలని నిర్ణయించుకున్నావే!"

"నాకు మా అన్నయ్య సపోర్టు ఉంది. తుదికంటా సాగించలేని వాజెమ్మలు అసలు పోరాటాన్ని ప్రారంభించకూడదు. ముగించేవరకూ ముందుకు పోలేనివాళ్ళు పరిశోధనలు మొదలుపెట్టకూడదే! అదే నిర్ణయించుకున్నాను."

"అయితే నాకొక తోడు మిగిలి ఉందన్నమాట?" అంది తులసి తృప్తిగా.

"నిజమయిన స్నేహానికి మొదలెట్టటమే కాని ముగింపు వుండదు. పిచ్చిదానిలా కళ్యాణి మనని మోసగించి వెళ్ళిపోయింది. ఉమ కంఠం జీరవోయింది. చెంపలమీద చారికలు కడుతున్న అశ్రుధారల్ని పయ్యెదకొంగులతో ఒత్తుతున్నారు. స్తిమిత పడేందుకు మరో అర నిమిషం పట్టింది.

"మన పోలీసు పటాలం కళ్యాణిమరణాన్ని హత్యగా అనుమానించే అవకాశాలు మిగిలే ఉన్నాయట." అంది తులసి.

"వారి అభిప్రాయం అది కాకపోయినా ప్రజలలో అటువంటి అనుమానం తొంగి చూచినప్పుడు కేసుల్ని ఆ కోణం నించి కూడా పరిశీలిస్తారు. సహజం"

"వారి అనుమానమే కాని మన కళ్యాణికి శత్రువులు ఎవరున్నారు. తిండి స్నేహం తప్ప మరో లోకం తెలియనిదాన్ని ఎందుకు హత్య చేస్తారు?"

"దానికి శత్రువులు లేరంటే ఒప్పుకుంటాను. హత్యలన్నీ శత్రుత్వాలవల్లనే జరుగుతాయంటే మాత్రం నేను అంగీకరించను." ఖండితంగా చెప్పింది ఉమ.

"ఈ అనుమానం నీకూ ఉందన్నమాట. హత్య చేయగల అవకాశం యెవరికుంది?"

"యెవరో యెందుకు చేస్తారు? ఆ పిశాచం ఉన్నాడు కదా?"

"ద్రవిడ మాహేశ్వరుడా?" కనులు విప్పార్చి ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. ఆ పిశాచేశ్వరుడే!" అంది ఉమ అక్కసుగా!

"నువ్వు పొరపడుతున్నావే ఉమా! ఆయనకు అలాంటి అవుసరం ఏముంది?"

"ఈ యుగంలో క్రిమినల్స్ యెలా వుంటున్నారో నీకు తెలియదు."

"నేనలా అనుకోవటంలేదు. కళ్యాణి ఏ రోజున భయంకరమయిన ఘోరదృశ్యాన్ని చూచింది. అది అనూహ్యమయిన స్థాయిలో ప్రపంచంలోనే ఏ హర్రర్ సినిమాలో కూడా చూడని దృశ్యమై ఉండాలి అందుకే దానికి గుండె పగిలిపోయింది."

"అయితే అది ఆ సమయంలో చూడగల భయంకర దృశ్యం ఏముంటుంది?"

"ఆ విషయాన్ని తెలుసుకుంటే మన పరిశోధన సగం పూర్తి అయినట్లే!" అంది తులసి.

"తెలుసుకుందాం మన పరిశోధనకొనసాగించాలి!"

"యోగుల దగ్గర చాలా చిత్రమయిన శక్తులుంటాయి. ఈ విషయం నాకన్నా నీకేబాగా తెలియాలి ఆయనని తాకినప్పుడు నీకే మనిపించింది!" అని ప్రశ్నించింది తులసి!

"శరీరం చాలా కఠినంగా ఉంది. కాళ్ళు చేతులు చిట్లి రక్తం వచ్చింది"

"శరీరం అలా రాయిలా బిగుసుకుపోవటం సాధ్యమేనంటావా?"

"రాయిలా కాదు. ఇంకా కఠినంగా వజ్రంలా బిగిసిపోయింది! అందుకు ఏ మాయో మంత్రమో కారణం అయి వుండాలనికూడా అనిపించింది నాకు! ఎందుకు అలా వుందంటావు?"

"ఎందుకేమిటి? క్రింద వాలిపోతున్నప్పుడు కూడా ఎలా కూర్చున్నారో అలాగే వాలిపోయారు. అదీ యోగ సమాధి! ఎదురుగా శవం ఉన్నా సజీవమయిన మనిషి వున్నా ఒకటే వారికి.

"కళ్యాణి వచ్చిన సంగతి కాని చనిపోయిన సంగతి కాని ఆయనకీ తెలియదు. నువ్వు వారి శరీరాన్ని బాధించిన సంగతి కూడా వారికి తెలియదు. ఆయనమీద ఆరోపించటం తప్ప."

"ఆయనకాకపోతే కారణం మరెవరంటావు?"

"ఇప్పుడెలా ఊహించగలం? అది ఎలాంటి భయంకర దృశ్యాన్ని చూచిందో ఎవరికీ చెప్పలేదు కదా! కలలో యోగిగాను కన్పించినప్పుడు అతని జటాజూటంలోంచి కృష్ణ సర్పం దిగివచ్చి ఒక అందమయిన యువతిగా మారింది.

అలాంటి దృశ్యాన్ని చూడటమో మరేదో జరిగివుండాలి.

"ఇప్పటికి మనం తెలుసుకున్న దేమీలేదంటావు?"

"తెలుసుకోవలసిందే ఎక్కువగా ఉన్నదంటున్నాను."

"తిరిగి యోగి కన్పిస్తారంటావా? బహుశా మరొక చోటుకి వెళ్ళి పోయి వుంటారేమో! ఎలా తెలుస్తుంది?"

"అలాంటివారికి సంకల్ప బలాలుంటాయి. మనం చేసేది మంచి పని అనుకున్నప్పుడు వారే మనల్ని ముందుకు నడిపిస్తారు!" అంది తులసి.

"నువ్వు చెప్పేమాటలు అంధ విశ్వాసాలు, అభూత కల్పనలు అని నా వ్యక్తి గత విశ్వాసం! దాన్ని ఒక విద్యావిషయంగా పరిశీలించడానికి అభ్యంతరం ఉండదు. ఎందుకంటే నా మాటల్ని సశాస్త్రీయంగా అనిపించగలగటం. అదొక మంచి అవకాశం గదా!?" అంది తులసి.

భవిష్య కార్యాచరణాన్ని రూపొందించుకునేందుకు వారు ఇద్దరూ బయలుదేరి ప్రొఫెసర్ సమతాబెనర్జీ కొరకు వచ్చారు.

ఆమె గదిముందు నలుగురు పి.ఎ.లు నిలబడి వున్నారు.

"ఇదేమిటి?" అంది తులసి ఆశ్చర్యంగా.

"వైజ్ఞానిక పరిశోధన రంగంలో ఆమె మనకన్నా ఫాస్టుగా ఉంటారు. ఏం జరుగుతుందో చూద్దాంపద"అంది ఉమ.

రౌండ్ దిక్లాక్ ఏ సమయంలో వచ్చినా, ఎంత ప్రముఖులతో మాటాడుతున్నా లోనికి అనుమతించాడు.

లోపల ఉన్నతస్థాయి పోలీసు అధికారులు ఇద్దరు కూర్చుని ఉన్నారు. వారు చేస్తున్నపని విజ్ఞాన ఖని అయిన ఆమె

నోటినించి జాలవారుతున్న ఆణిముత్యాలవంటి సశాస్త్రీయమయిన సైన్సు ప్రవచనాన్ని వినటమే.

వీపు క్రింద రెండు ఎత్తుదిండ్లు పెట్టుకొని తెల్లని ప్రక్క మీద తెగిపోయిన మల్లెచెండులా వాలి కూర్చుంది ప్రొఫెసర్ బెనర్జీ.

"....కనుక యోగిని హంతకుడుగా మీరు అనుమానించటంలో అడ్డంలేదు. క్లిష్టమయిన ఈ కేసువిషయంలో పై అధికారుల ఆదేశాల మేరకు మేధావులను సంప్రదించేందుకు మీరు పూనుకున్నారు.

కేసులు ఇన్వెష్టిగేషన్ సాగుతున్నప్పుడు కేసునేచర్ కి సంబంధించిన శాస్త్ర విషయాలలో మేధావుల సలహా తీసుకోవాలనే ఆలోచన చాలా గొప్పది. ఈ నేరపరిశోధనకి అది ఎంతగానో ఉపకరిస్తుంది.

నాకు తెలిసింది చెప్పాను.

నాకన్నా తెలిసినవారు ఎందరో ఉంటారు. ఈ పృథ్వీమీద! విజ్ఞానం ఏ ఒక్కరిసొత్తూకాదు. వారినికూడా విచారించి తెలుసుకోండి? ఇలాంటి కార్యక్రమాన్ని తీసుకున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను" అంటూ ముగించింది ప్రొఫెసర్ బెనర్జీ.

అధికారులు శెలవుపుచ్చుకొని వెళ్ళిపోయారు.

ముందుగా కళ్యాణి మృతికి కండొలెన్స్ చెప్పిన తరువాత అన్నదామె.

"యోగులు వారి ఏకాగ్రతకి ఏ కాంతానికి భంగంకలిగే చోటుకి రారు. వచ్చినా ఎంతోకాలం ఉండరు. ద్రవిడమాహేస్వరుడు ఇలా కన్పిసున్నాడంటే అందుకు కారణం ఉందని మీరు తెలుసుకోవాలి.

ఆయన ఒక ఆశయంతో ఏదో సాధించాలని నగరానికి వచ్చారు" అని వివరించింది.

## 8

కళ్యాణ్ మరణానికి ప్రత్యక్షసాక్షి అయిన యోగి నగరంలోనే ఉన్నారని, ఆయన ఆశయం పూర్తి అయేంతవరకు ఉంటారని ప్రొఫెసర్ సమతాబెనర్జీ నిర్ణయించారు. సర్! మేము కలిసిన వారిలో ఆవిడ ఒక్కరే సరయిన అంచనా వేయగలిగారని అనిపించిందిమాకు అని నివేదించాడు పోలీస్ ఆఫీసర్.

అదివిని సాలోచనగా తల ఊహించాడు శివరాజ్.

"నగరమంతా నిఘావేయండి! ఇది అరణ్యంకాదు అతడు తప్పించుకు పోవడానికి! సాయంత్రంలోగా ఆచూకి తీసుకురావాలి! ఈ కేసు విషయంలో మనం ప్రస్నించవలసిన మొదటి వ్యక్తి అతడే!" ఆదేశాలందించాడు.

అధికారులు పోలీసు పటాలాన్ని వెంటపెట్టుకుని నగరం నాలుగు మూలలా పరిశోధించటం ప్రారంభించారు అప్పటికప్పుడే.

"సార్! మీకోసం ఎవరో వచ్చారు! పాములుపట్టే బసవయ్యలాగే ఉన్నాడు"

"వెంటనే అతన్ని లోపలకు తీసుకురండి. అని ఆదేశించాడు శివరాజ్.

ఒక వ్యక్తిని లోపలకు తీసుకువచ్చారు.

"పత్రికలలో వార్తలన్నీ చదివాను దొరగారూ! మీకు సలహా యివ్వాలని వచ్చాను"

"సలహా యిస్తావా? ఎవరడిగారునిన్ను?"

"అడిగితే ఎవరూ చెప్పలేని సంగతులు ఇవి. నేర్చుకున్నది దాచుకుంటే నేరం."

"చెప్పు! ఉపయోగపడితే బహుమతులు ఇస్తాం. యోగి ఎక్కడున్నాడు."

"నాగరాణి ఎక్కడుందో అక్కడే యోగి వుంటాడు."

'యోగి శిగలోకదా నాగరాణి ఉంటుంది? తలక్రిందులుగాచేసి చెప్తావేంటి?"

అదే మీకు తెలియని అద్భుతం! నేను నేర్చిన విద్యారహస్యం అదే! యోగి యోగికాదు. మనలాంటి ఒక మనిషే! పెనునాగులు అతన్ని ఆశించి సమ్మోహపరచి యోగిగా మార్చాయి. అతని జటాజూటాన్ని వాల్మీకంగా వాడుకుంటున్నాయి. దొరగారూ! ఇదంతా నాగులు ఆడించే నాటకంకాని యోగి ఆడించే నాటకంకాదు. నాగులే సూత్రధారులు! యోగీ వేషధారి.

వాటిలో తెల్లనిత్రాచు మగపాము. అది చనిపోయింది. మీరేదాన్ని గాయపరిచారు. ఆ గాయంవల్ల అది చనిపోయింది దొరా!

నీ భార్యకి నాగదోషంకూడా వుంది. మీ కుటుంబం అంతా చాల ప్రమాదంలో పడింది దొరా! నాగులు యోగిని ఆశించి నగరానికి నడిపించడానికి కారణం మీరే! మీ కుటుంబంతో వాటికి సంబంధం ఉంది.

"ఈ విషయాలన్నీ నీకెలా తెలిశాయి?" అని ప్రశ్నించాడు శివరాజ్.

"నా అంజనం ప్రపంచానికి అద్దమే దొరా! ఏమయినా కన్పిస్తోంది."

"అయితే యోగి యిప్పుడెక్కడున్నాడో చెప్పగలవా?"

"బ్రతికివున్న నాగరాణి నా ప్రయత్నాన్ని గుర్తించకుండా పరాకున ఉంటే ప్రయత్నం ఫలిస్తుంది. అది తెలుసుకుని అడ్డుపడితే నా ప్రయత్నం ఫలించదు అంతా మీ అదృష్టం ప్రయత్నం చేస్తాను" అంటూ తన దగ్గరవున్న సామాగ్రి అంతా క్రిందికి దించాడు.

"పది సంవత్సరాలలోపు బాలుడ్ని పిలిపించండి" అన్నాడు.

పోలీసులు పది సంవత్సరాల బాలుడికోసం పరుగులుతీశారు. తీసుకొచ్చారు.

అంజనధారి అంజనం వేశాడు బాలుడి అరచేతిలో.

ఏవో మంత్రాలు చదివి కన్పించే విషయాలను వివరించమన్నాడు.

"క్లీం కైటభా! హ్రీంహరిద్రా!

హ్రూంపిశంగా! క్లూంకురంగినీ!

ఆ లోక్య అంజనాద్రీ!! చూడరాబాలకా! నీ అరచేతి అంజనంలో చూడు కళ్ళకు కట్టింది కట్టినట్లు వర్ణించి మాకు వివరించరా?" అన్నాడు.

బాలుడి ముఖం ఎర్రగా అయిపోయింది. భయపడ్డాడు.

"భయంలేదురా బాలకా వర్ణించు" అన్నాడు.

బాలుడు డిమ్ గా అయిపోయి ఆ దృశ్యాలను వివరిస్తున్నాడు.

"మరండీ! మరండీ! రెండు కొండలున్నాయండి! ఆ కొండల మధ్యనుండీ ఒక బాట ఉందండి! ఆ బాటవెంట ముందుకుపోతే....పోతే... ఆ ఒక గుహ ఉందండి! ఆ గుహలోపల అంతా చీకటి! చీకటి!! ఆ చీకటిలోనండీ ఒక రాయిమీద ఒక గోచి పాతరాయుడు కూర్చున్నాడండి.

అతడి తల మీద పెద్ద కొప్పు ఉందండి! అమ్మో! దానిలోంచి నల్లని త్రాచు తొంగిచూస్తోందండి! గోచిపాతరాయు కళ్ళు మూసుకున్నాడండి!!.

"అనలోక్య పిశంగికా!! అహోయకురంగినీ వెనక్కి వచ్చి ఆ చోటు గుర్తులు చెప్పండి" అని అంజనం మంత్రం రివర్స్ చేశాడు.

బాలుడు మళ్ళీ వర్ణించటం ప్రారంభించాడు.

గుహ చుట్టూ రెల్లు పొదలు__బుషెస్ అండీ__దట్టంగా పెరిగి కన్పిస్తున్నాయండి! వాటి మధ్య ఒక బాదంచెట్టు ఉందండి! ఇంకా వెనక్కి....వెనక్కి..వస్తే....వస్తే...మనం ఉన్నామండి" అన్నాడు. బాలుడు.

ఆ తరువాత అతని ముఖం మామూలుగా అయిపోయింది.

"ఏమిటండీ! నేనేం మాట్లాడుతున్నాను. నాకేం కన్పిస్తుంది?" అన్నాడు కంగారుగా! చుట్టూవున్నా పోలీసులు ముసిముసిగా నవ్వుతున్నారు.

"ఏమీ లేదు కాని ఈ అయిదు రూపాయలు తీసుకుని స్టార్ చాక్లెట్ కొనుక్కో!" అని అయిదురూపాయల నోటు అందించాడు శివరాజ్.

బాలుడు అది తీసుకుని తుర్రుమని పారి పోయినాడు.

"దొరా! రెల్లు దుబ్బుల మధ్య గుహ ఉన్నచోట యోగిఉన్నాడు! ఆ గుహ ముందు ఒక బాదంచెట్టు ఉంది. అదేగుర్తు! కట్నం ఇప్పించండి. మీకు అంతా జయమే కలగాల."

"కట్నమా? ఎంత కావాలేమిటి?"

"నూట పదార్లు దొరగారూ! పిశంగిగాడు మరింత సంతోషిస్తారు" అన్నాడు.

మంత్రాక్షరిలోని ఆ మాట వింటూనే శివరాజ్ రైటర్ ని పిలిచి అతనికి డబ్బు యిచ్చి రసీదు ఫైల్ చేయమని చెప్పి పంపించేశాడు.

నగరం నాలుగుమూలలనించి పోలీసు వర్తమానాలు వస్తూనే ఉన్నాయి నిర్విరామంగా.

"యోగి ఉన్న జాడలు ఎక్కడా కన్పించటల్లేదు" అని.

సాయంత్రంఅయ్యేంతవరకూ ఎదురు చూచాడు ఆశతో.

కాని అలాంటి వార్తలే వస్తున్నాయి ఎంతసేపూ!!

నగరమంతా గాలించటం పూర్తి అయింది. చాల మంది మెస్ తిరిగివచ్చి వాళ్ళ అనుభవాలను వివరించారు. యోగి నగరంలో ఉన్నాడని అనుమానించటంలో అర్థం లేదని వాళ్ళ రిపోర్టు.

పరిస్థితి కూలం కషంగా సమీక్షించుచున్న తరువాత ఎనిమిదిన్నర గంటల వేళ ఆఫీసర్స్ క్లబ్ కి వెళ్లాడు శివరాజ్.

ఒక వంక టెన్నిస్ మరో వంక వాలిబాల్ ఫ్లడ్ లైట్ల కాంతిలో జోరుగా సాగుతున్నాయి. ఒక వంక ఇంగ్లీషు అడవి కంచెల లోపల చెట్ల క్రింద అమర్చిన టేబిల్స్ చుట్టూ కుర్చీలో కూర్చుని మందు భాయీలు మజా చేసుకుంటున్నారు.

వాళ్ళని గమనిస్తూ హాలు దాటి ఎ.సి. రూంలోకి కాలు పెట్టాడి శివరాజ్.

అక్కడ ఎప్పుడు అయినా ముగ్గురే ఉంటారు.

ఎస్.పి గారు, మేజిస్ట్రేట్ గారు, జిల్లా కలెక్టరుగారు.

"కళ్యాణి మరణించిన కేసులో మొదటి ప్రత్యక్షసాక్షి అయి వుంటాడని నువ్వు అనుమానించిన యోగి కోసం పగలంతా మన వాళ్ళ చేత వెతికించావు. కాని ఆయన కన్పించలేదు.

కన్పించే అవకాశాలు ఇక లేవు! ఆ విషయం చెప్పేందుకే మీరు వచ్చారు. అవునా! రిపోర్టు నాకు చేరింది!" అన్నారు ఎస్.పి.

వచ్చిన విషయం అదే అయితే వెళ్ళిపోవచ్చు అని ధ్వని కూడ ఉంది.

మిగిలిన ఇద్దరూ గంభీరంగా కూర్చుని వింటున్నారు.

జిల్లాని పాలించే త్రిమూర్తులు వారు.

వారి సమక్షంలో మాట్లాడే ప్రతిమాట జిల్లా చారిత్రకి రికార్డ్ అవుతుంది.

"మన వారినించి అందిన రిపోర్టు అదే!" అన్నాడు శివరాజ్.

"అది కాక మరేదయినా చెప్పాలనుకుంటున్నావా?"

"యోగ సమాధిలో ఉన్న మనిషి సాక్షి ఎలా అవుతారు. యోగ సమాధి అనే మాటకు అర్థం బాహ్యాబ్దావాన్ని విడిచి పెట్టటం అనేకదా!" అన్నారు.

జడ్జిగారు, న్యాయమూర్తులు ఎవరితో మాట్లాడినా చట్టబద్ధంగా మాట్లాడాలనేది ఎవరూ విధించని నియమం. వృత్తి నియమం.

తాను విపరీతమయిన ప్రతిపాదనలు చేయకుండా ముందే అదుపుచేయాలని వారు ప్రయత్నిస్తున్నారు. యోగి మీద తన దృష్టి వేరు. వారికున్న భక్తి ప్రపత్తులు వేరు.

"ఒకసారి ఆయన్ని అనుమానిస్తే పబ్లిక్ యింటరి స్టెడ్ పిటిషన్ దాఖలు అయింది. మళ్ళీ ఆయనని ఈ వ్యవహారాల్లోకి లాగటం అంటే జిల్లా ప్రజల ఆసక్తిని నిర్లక్ష్యం చేయటమే అవుతుంది" అన్నారు జిల్లా కలెక్టర్! జిల్లాని పాలించే ఆ త్రిమూర్తులది ఒకే అభిప్రాయం అని అర్థమయింది. అయినా శివరాజ్ తన పట్టుదలని విడిచి పెట్టలేదు.

"సర్! అలౌకిక శక్తులు కొందరి దగ్గరుంటాయనే విషయం మీద నేనూ విశ్వాసం ఉంచి మాట్లాడుతున్నానిప్పుడు. ఈ కేసు ఇప్పుడు మంచి మలుపు తిరిగినట్లు అనిపిస్తోంది.

యోగికి, నాగుకి అవినా భావ సంబంధం ఉంది! పరస్పరం ఆకర్షించుకుని పరస్పరం సమ్మోహ పర్చుకుని వారి సహజీవనం సాగుతోంది.

కళ్యాణి మరణానికి సాక్షి యోగి అయిన అతడు సర్ప సమ్మోహితుడు అయితే కేసు ముగిసినట్లే! నేరాన్ని నాగులమీద మోపాలి.

నాగులు యోగిని నడిపిస్తున్నాయా? యోగి నాగులును అనుసరించుచున్నాడా అనే అంశాలను తేల్చుకునేందుకు

అవకాశం వచ్చింది" అన్నాడు. వారు ముగ్గురూ గంభీర మౌనముద్ర వహించారు. చాల ఆలోచించారు.

"ఆయన ఎక్కడున్నారో తెలియందే అవకాశం ఎలావచ్చింది?" కొద్ది నిముషాల అనంతరం ఎస్.పి శివరాజ్ ని ప్రశ్నించారు.

"ఆయన ఎక్కడున్నారో తెలిసింది సర్! అంజనం వేయించాను"

ఎస్.పి మౌనం వహించాడు! ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు.

ఒక విధంగా మాట్లాడితే చట్టానికి విరుద్ధం.

మరోవిధంగా మాట్లాడితే ప్రజల ఆసక్తికి విరుద్ధం.

చట్టాన్ని ప్రజల ఆసక్తిని భద్రంగా కాపాడు కోవలసిన పెద్దలు ఇద్దరూ అక్కడే ఉన్నారు. మాటపెగిలి రాలేదు.

జడ్జిగారు మాట్లాడతారని ఎదురు చూచారు.

కాని ఆయన కూడ మాట్లాడలేదు. మాట్లాడ దలుచుకోలేదని సూచన చేస్తూ చూపులు మరోవైపు మరలించుకున్నారు.

"శివరాజ్! ఈ విషయంలో నీకు అనుమానాలే కాదు. చాల ఆసక్తి కూడ ఉందని అర్థమవుతోంది. చట్టానికి, ప్రజల ఆసక్తికి ఘర్షణ రాకుండా నేను మధ్యే మార్గం చెబుతాను.

నువ్వు వ్యక్తి గత హోదాలో కేసుని పరిశోధించు, వ్యక్తి గతమయిన ఆసక్తి కూడ ఉంది కాబట్టి అలాచేయటం తప్పుకాదు.

ఆయన మీద అనుమానాలను అభివ్యక్తికలించేందుకు విస్పష్టమయిన ఆధారాలకు వ్యక్తిగత హోదాలో నువ్వు సంపాదించి తిరిగి రాగలిగితే అప్పుడు డిపార్ట్ మెంట్ పరంగా ఈ సమస్యని ఆలోచిద్దాం! నా ప్రతివాదనలో ఏదైనా పొరపాటు ఉండవచ్చు! పెద్దలున్నారు కదా! వారిని కూడ సంప్రదించు" అంటూ జడ్జిగారి వంక చూచారు జిల్లాకలెక్టర్.

ఆయన తలదించుకుని వినిపించి వినిపించకుండా "దట్స్ గుడ్" అన్నారు.

"కావాలంటే వారం రోజులు శలవు తీసుకో!" ప్రోత్సహించారు ఎస్.పి.

జిల్లాని పాలించే త్రిమూర్తులు ఏకాభిప్రాయంగా ఓ సలహా ఇచ్చినట్లు అయింది. సెల్యూట్ ఇచ్చి వెలుపలకు తిరిగి వచ్చాడు శివరాజ్.

"పెద్దలు తప్పుకున్నారు. ఒంటరిగా పోరాడాలి!!

లేదా ఆ సమస్యని వదిలిపెట్టి ఊరుకోవాలి!"

"ఎలా చేయటం మంచిది??" ఆలోచనలో పడిపోయాడు!

యాంత్రికంగా జీపు డ్రయివ్ చేసుకుంటూ పోలీసు కంట్రోల్ రూంచేరుకున్నాడు శివరాజ్! ఛాంబర్ లో ఆలోచనామగ్నుడు అయిపోయి కూర్చున్నాడు చాలసేపు.

పది గంటలు అవుతూ ఉండగా ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

వ్యక్తిగతమయిన కారణాలవల్ల వారంరోజులు శలవు మంజూరు చేయవలసిందిగా కాగితం వ్రాసి ఆఫీసు సూపరింటెండెంట్ కి ఇచ్చాడు.

ఈ విషయమై ఎస్.పి గారికి వెంటనే టెలిఫోన్ లో తెలియచేశాడు.

"అతన్ని వెంటనే రిలీవ్ చేయండి. ఉదయం కార్యాలయానికి వచ్చి దస్కత్తులు చేస్తారు" అని ఆర్డర్ యిచ్చేశారు ఎస్.పి!

కంట్రోల్ రూంలో జీపువదిలేసి బయటకు వచ్చి హాయిగా గాలి పీల్చుకున్నాడు. హనీమూన్ కి పెట్టిన శలవు ఉపయోగపడలేదు.

ఈసారి అయినా ఉపయోగపడాలి!

ఆటోలో కూర్చుని యింటి అడ్రస్ చెప్పాడు.

వరండాలో కేన్ కుర్చీలో కూర్చుని కనిపించింది తులసి! ఆటోదిగి వస్తున్న భర్తవంక చిత్రంగా చూచింది. స్వేచ్ఛని అనుభవిస్తున్న మనిషిలా అతని ముఖంలో ఒక వినూత్నమయిన స్ఫూర్తి కనుపించిందామెకు.

"ఏమిటివాళ హుషారుగా ఉన్నారు? నీకు ఏమయింది?" అని అడిగింది.

"హాయ్! హాయ్!" ఒళ్ళు విరుచుకుంటూ అన్నాడు. "మనమిప్పుడు స్వేచ్ఛా జీవులం" ఉల్లాసంగా ఉంది అతని కంఠస్వరం.

"ఒకప్పుడు మాత్రం స్వేచ్ఛా జీవులుకారా? ఎవరు కట్టిపడేశారేమిటి?"

"తాళి కట్టిన వాళ్ళంతా భార్యలచేత కట్టిపడేయించుకుంటున్నారు. ఒక్కరోజయినా ముచ్చటగా ఈరోజు శలవుపెట్టి ఇంటిదగ్గరే ఉండిపోండి! అని అడిగావా నువ్వు! ప్చ్! నాకా అదృష్టం ఎప్పుడో!"

"ప్రస్తుతానికి స్వీట్ చాక్లెట్స్ తో సరిపెట్టుకోండి! త్వరలోనే అటువంటి మంచిరోజు ఒకటి రావాలని కోరుకుందాం. అవునూ! నాకిప్పుడు అనిపిస్తోంది. మీరు శలవు పెట్టారా? ఈజిట్ నాట్ రైట్?!"

"ఎగ్జాక్ట్ లీ రైట్! వారం రోజులు శలవు పెట్టాను."

"ఏం చేస్తారట వారం రోజులూ! నోట్లో వేళ్ళు పెట్టుకుని గోళ్ళుగిల్లుకుంటూ కూర్చుంటారా? కాఫీ తెస్తానుండండి!"

"పైకి తీసుకురా! నేను మళ్ళీ బయటకెళ్ళాలి?"

"ఇప్పుడా! అయితే భోజనం అమర్చుతాను"

"స్వీట్స్ తింటాలే చాలు! నువ్వు త్వరగా వచ్చెయ్యి!" అంటూ వేగంగా పైకి వెళ్ళిపోయాడు శివరాజ్!

టేబిల్ మీద భోజన సామాగ్రి అంతా సరిగ్గా అమర్చి ఉందో లేదో చూచి తల్లిని హెచ్చరించింది తులసి!

"మమ్మీ ఆయన భోజనానికి వస్తున్నారు"

"త్వరగా రండమ్మా! పది గంటలు దాటిపోతోంది. చదువులని, ఉద్యోగాలని పగలంతా తిరుగుతారు. రాత్రి పెందలాడే పడుకోవాలని తెలియదూ! తిన్నంత వంట పట్టాలికదా!" అందితల్లి.

"నిన్ను పలకరిస్తే కొండవీటి చాంతాడంతా లాగుతావు. ఖర్మ ఖర్మ!" చిరునవ్వులు చిందించుకుంటూ మెట్లమీదుగా పైకి పరుగు తీసింది. కేన్ కార్డిల్ మీద ఊగుతూ టెర్రస్ కే అందాన్ని సంతరించే గెటప్ లో వెలిగిపోతున్నాడు శివరాజ్!

"అప్పుడే తయారయిపోయారా? ఈ రోజు విశేషం ఏమిటట! ఇలా నవ మన్మధుడిలా వెలిగిపోతున్నారు?"

"ఈ రోజు ఒక సుందరి నన్ను ఆహ్వానించిందోయ్!"

"అంత ధైర్యం ఎవరికుంటుందిలే! మీరు పోలీసులు కదా!? నా కంటే ఎప్పుడో ఒకప్పుడు తప్పదుకాని ఇంకెవరు పిలుస్తారు. భోజనానికి రండి!"

"ఆకలిగా లేదు తులసీ!"

"మనసులో ఏవో తొందరలున్నాయి. అందుకే ఆకలి తెలియలేదు! కాస్తంత ఎంగిలిపడి వెళ్ళండి! అయితే బాగ్ సర్దు! బహుశా నేను రేపు పగలంతా రాకపోవచ్చు! ఓ ముఖ్యమయిన పనిమీద వెడుతున్నాను." అంటూ మెట్లుదిగి డైనింగ్ టేబిల్ దగ్గర సెటిల్ అయ్యాడు.

ఒకరోజుకి అవసరమయ్యే ముఖ్యమయిన వస్తువులు సర్దింది తులసి! ఎయిర్ బాగ్ లో ఫ్లాస్కు నిండా పాలునింపి ఓ గ్లాసు కూడ ఉంచింది. హడావుడిగా భోజనం ముగిస్తున్న భర్తతో జాయిన అయింది.

ఇద్దరూ ఒకేసారి భోజనం పూర్తి చేశారు.

వరండాలోకి వచ్చి కూర్చున్నాడు శివరాజ్. తులసి బాగ్ తెచ్చి అందించింది.

ఇంటినించి బయటపడి కొద్ది దూరం నడిచాడు. అతడికిఒక చిన్న ఇన్వెస్టిగేషన్ మీద వెడుతున్నట్టుగా అనిపించలేదు.

ఒక మహాయాత్ర వెడుతున్న విధంగా అనుభవం కలుగుతోంది.

తోడుగా ఎవర్ని తీసుకుపోవాలనే ఆలోచన వచ్చింది. ఒంటరిగా వెడితే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది కాస్సేపు. తాను ఒక వెంచెర్ నిర్వహించబోతున్నాడు. సాయానికి అనుకున్నా, సాక్ష్యానికి అనుకున్నా ఒక తోడు అవసరమే అనిపించింది. జ్ఞాపకాలలోకి దిగిపోయాడు.

డిపార్టుమెంటు వ్యక్తులకు ఈ విషయం తెలియనివ్వరాదు. వారిని తీసుకుపోవడంతో మళ్ళీ కథలు మొదటికే వస్తాయి.

అతని మనసులోకి చిన్ననాటి మిత్రుడు అహ్మద్ ఖాన్ గుర్తు కొచ్చాడు!

అహ్మద్ ఖాన్ తో కాలక్షేపం చాల సరదాగా అవుతుంది. అయిదు సంవత్సరాలకు పూర్వం ఎప్పుడూ వెంట వెంట తిరిగేవాడు. పేదరికంలో నలిగిపోతున్నా ఎప్పుడు సరదాగా కబుర్లతో కాలక్షేపం చేసేవాడు.

అలాంటివాడు ప్రక్కనుంటే టెన్షన్స్ రిలాక్స్ అవుతాయి!

ఎన్నోసార్లు తాను వెళ్ళిన ఆ చిన్నడాబాయింటిని జ్ఞాపకం చేసుకున్నాడు! ముందుగా ఎక్కడికి వెళ్ళాలి? యెలా వెళ్ళాలి అనే అంశాలను నిర్ణయించుకున్న తరువాత టాక్స్ ని పిలిచి ఎక్కాడు!

చిన్న చిన్న సందుల్లో చాల మలుపులు తిరిగి ఆ చిన్నడాబా ఇంటిముందు టాక్స్ ఆగింది. అప్పటినించి వెల్ల వేయించటానికి నోచుకోకుండా వర్షపు నీటిపాచీ మరకలతో రంగు వెలిసిపోయి కళావిహీనంగా కన్పించింది.

టాక్సీ ఇంటిముందు ఆగగానే ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. ఘోషావస్త్రాలలో ఉన్న ఓ యువతి తొంగిచూచింది.

"ఎవరు కావాలండీ అన్నగారూ!?" అని ప్రశ్నించింది తీయని తెలుగు భాషలో.

"అహ్మద్ అని ఒకాయన ఉండాలి ఈ ఇంటిలో!"

"ఉండాలి ఏమిటి అన్నగారూ! ఆయన ఇంట్లోనే ఉన్నారు?"

"ఒకసారి రమ్మని పిలుస్తారా?"

"ఆయన మూడోభార్య గదిలో వున్నారు. అలాంటప్పుడు పిలిస్తే కోప్పడతారు"

"మీ చిన్ననాటి స్నేహితుడు వచ్చాడని చెప్పేందుకు వీలుకాదా?"

"ఆ ప్రక్క నున్న కిటికీ దగ్గరకు వెళ్ళి తట్టి మీ పేరుచెప్పండి!" అని చూపించి ఆమె మళ్ళీ తలుపులు బిడాయించుకుంది.

ఆ పని చేసేందుకు డ్రయివర్ ని పంపించాడు శివరాజ్!

డ్రయివర్ అంతా వింటున్నాడు. పరిస్థితి అర్థం చేసుకున్నాడు.

ఆ పద్ధతులు అలవాటయిన వాడిలా కిటికీ దగ్గరకు వెళ్ళి మూసి ఉన్న తలుపుల మీద మునివ్రేళ్ళతో తట్టాడు!

"అహ్మద్ భాయ్! అహ్మద్ భాయ్! ఎ ఎస్ పి శివరాజ్ సాబ్ వచ్చారు కొంచెం బయటకు వస్తావా?" అన్నాడు కంఠాన్ని పెంచి.

"కౌన్ ఆగయా? ఫిర్ బతావో!" లోపలనించి విన్పించింది.

"ఎ ఎస్ పి శివరాజ్ సాబ్ ఆగయా! తోడాసాబాహర్ ఆ! బాత్ కరో!"

ఈ మాటలకు సమాధానంగా తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. బనియన్ మీద జారిపోతున్న గళ్ళలుంగీ గట్టిగా బిగించి ముడివేస్తూ సుడిగాలిలా బయటకువచ్చాడు అహ్మద్ భాయి.

"ఆదాబ్ సాబ్! ఎ ఎస్ పి సాబ్ ఆదాబ్!" అన్నాడు కారు డోరు దగ్గర నిలబడి.

"అరెభాయ్! ఇదెప్పటినించి నేర్చుకున్నావు? ఆదాబ్ లు!"

"మీరు ఎ ఎస్ పి దొర అయిపోయారు కదా!?"

"నీ ముఖంలే నోరు మూసుకో! నీతో కొంచెం పనుంది, కారులో కూర్చో!"

"అబ్ ఆగయా!" అంటూ హడావుడిగా ఇంటి లోపలికి పరుగుతీశాడు.

"ఎ ఎస్ పి సాబ్ హమ్ కో ధేఖ్ నే ఆగయా! దేఖో!" అంటూ ఇల్లంతా దీపాలు ఆన్ చేయించి హడావిడి చేస్తున్నాడు.

ప్యాంటు షర్టు వేసుకుని రెండు నిముషాల్లో తిరిగొచ్చాడు!

కిటికీ ఊచల వెనుకనించి మూడు ఆడతలలు తొంగి చూస్తూ ఉండగా దర్జాగా ఎ ఎస్ పి సాబ్ ప్రక్కన కూర్చున్నాడు. శివరాజు అతని భుజంమీద చేయివేసి ఆప్యాయంగా అడిగాడు! "మిత్రమా! బాగున్నావా?"

కారు బయలుదేరింది. మెయిన్ రోడ్డు మీదికి వచ్చారు.

"ఏం బాగులేభాయ్! ముగ్గురు భార్యలు పదిమంది సంతానం. ఏటా మూడు కాన్పులు! పెద్దలు సంపాదించిన

ఇళ్ళమీద నెల నెలా రెండువేలు అద్దెలు వస్తాయి. అంతలో ముడుచుకుంటున్నాం.

నేను అప్పుడప్పుడూ చుట్టుప్రక్కల గ్రామాలకి సైకిల్ మీద బట్టల మూటలు తీసుకుపోతాను. బాగానే మిగుల్తుయి కాని అదంతా పిల్లల గౌన్లు, చొక్కాలు, భార్యల చీరలు జాకెట్లకి సరిపోతుంటాయి.

కుచేలుడి నిరుపేద ఇంటికి కృష్ణుడల్తా నువ్వు వచ్చావు. నీకూ సత్యభామ, రుక్మిణి ఉన్నారా?" అని ప్రశ్నించాడు అహ్మద్!

"అవన్నీ ఎలాకుదుర్తాయి! కొద్దిరోజుల క్రితమే తులసిని పెళ్ళి చేసుకున్నాను. మనక్లాస్ మేట్ ఇంటర్ లో! నీకుకూడా తెలుసుకదా! ఊలు జడ తులసి ఇప్పుడు వాలుజడ తులసి అయింది. అంటూ తీయతీయని బాలకా తాలూకు మధుర జ్ఞాపకాలని మననంచేశాడు శివరాజ్.

"చాలా మంచిపిల్ల భాయ్! పిరికిపిల్ల!"

"ఇప్పుడు చాలా ధైర్యవంతురాలయి పోయిందిలే! రిసెర్చి చేస్తోంది."

"పెళ్ళయి కొద్దిరోజులే అంటున్నావు. ఈ వేళప్పుడు వదిలివచ్చేశావేంటి భాయ్?" అని అడిగాడు అహ్మద్.

"నగరమంతా నీకు తెలుసుకదా! ఒక చోటు గురించి విచారిద్దామని!?"

"ఏదయినా కేసు విషయమా? భార్య పిల్లలు గలవాడిని భాయ్"

"డిపార్టుమెంట్ విషయంకాదు. వ్యక్తి గత విషయం. భయంగా ఉంటే నీవు రావద్దులే. నాకు వివరాలు మాత్రం చెప్పు" అర్థించాడు.

"చిన్నతనంనించి చదువులేకుండా బలాదూర్ తిరిగాను. ఈ సిటీలో నాకు తెలియనిచోటులేదు. ఎక్కడికి వెళ్ళాలో చెప్పు"

"రెండు కొండలమధ్య సన్నదారి! ఆ దారి వెంట వెడితే ఒక గుహ! గుహచుట్టూ ఎత్తుగా పెరిగిపోయినరెల్లు. ప్రక్కనే బాదం చెట్టు" అంటూ అంజనంలో చూచిన బాలుడు వర్ణించినదాన్ని యధాతథంగా విన్పించాడు.

"మన నగరం వెలుపల హైవేప్రక్కన ఐదో కిలోమీటరు దగ్గర కొండలున్నాయి. గండుచీమలు పారాడే బాదంచెట్లు కూడా అక్కడే కన్పిస్తాయి.

అడవిలాంటి చోటు! దూరంగా చిన్న గ్రామాలు ఉన్నాయి. సైకిల్ మీద బట్టల వ్యాపారానికి వెడుతూ ఒకటి రెండుసార్లు దూరంనించి ఆ కొండలు చూచాను. కాని ఈ సమయంలో వెళ్ళదగిన చోటు కాదు" అన్నాడు అహ్మద్.

"భయంగా ఉంటే నువ్వు దిగిపోవచ్చు! డ్రైవర్ కారాపు"

"వద్దులేభాయ్! నువ్వు ఒంటరిగా వెళ్ళినా తెలుసుకోలేవు! నేను కూడా నీ వెంటవస్తాను. దారి చూపుతాను" అన్నాడు అహ్మద్.

కారుహైవే మీదికి వేగంగా పరుగుతీసింది.

పదినిముషాల ప్రయాణం అనంతరం దూరంగా తూర్పున కొండలు కన్పించాయి.

కొండలకు అభిముఖంగా ప్రయాణంసాగించి ఒక చోటున కారు నిలిచిపోయింది.

అక్కడనించి డ్రైవర్ ని వెనక్కి పంపేసి నడక ప్రారభించారు.

కిట్టు భుజానికి తగిలించుకుని నడుస్తున్నాడు శివరాజ్.

ముందు అహ్మద్ దారి చూపుతున్నాడు. దారికి రెండు ప్రక్కలా ఎత్తుగా పెరిగిన వృక్షాలున్నాయి.

"చూడుభాయ్ చాలాదూరం నడిచాం! ఇంక రాళ్ళ గుట్టల మధ్య గుహకోసం వెతుక్కుంటూ తిరగాలి. అలసటగాకూడా ఉంది. ఎక్కడయినా మంచినీరు దొరుకుతుందేమో చూస్తాను. అన్నాడు అహ్మద్.

"నీవు భయపడతావేమో! నేనుకూడా వస్తాను పద"

"ఇదంతా నాకు అలవాటయిన ప్రాంతమే! నువ్వుకూడా అలసిపోవటం ఎందుకు? ఎంతదూరం తిరగాలో తెలియదు. ఓ కిలోమీటరు దూరంలో రైతులు వేసుకున్న తాత్కాలిక రెల్లుపాకలు ఒకటి రెండు ఉండాలి!. మంచినీరు దొరికితేసరి! లేకపోతే అక్కడకు వెడతాను. మంచి నీరు త్రాగి నీకుకూడా తీసుకువస్తాను. వారు నన్ను అప్పుడప్పుడు చూస్తుంటారు కాబట్టి అనుమానించరు. నిన్ను చూస్తే వివరాల్లోకి దిగుతారు.

నువ్వు రాతిచట్టుమీద కిట్టు తలక్రింద పెట్టుకుని పడుకో! నిద్రపోయినా నేనువచ్చి లేపుతాను. కొంచెం అలసట తీర్చుకున్నట్టు అవుతుంది" అన్నాడు.

అతని ప్రతిపాదన సబబుగానే ఉన్నట్లు అనిపించింది.

నిద్రపోవటం, అలసట తీర్చుకోవటంలో పోలీసాఫీసర్ బలాన్ని అతను అంచనావేయలేక మాట్లాడుతున్నాడు. మూడురోజులు మంచినీరు, నిద్ర, ఆహారంలేకుండా పనిచేయగల శక్తి తనకుంది.

అదలా ఉంచి టార్గెట్ దగ్గర అయ్యాక దాహంనెపంతో దూరంగా వెళ్ళటానికి అతనికి మనస్కరించలేదు. సమయం చిక్కినప్పుడు ఏకాంతంగా ఆలోచించుకుని పరిసరాలకు అనుగుణంగా పథకాన్ని రూపొందించుకుని అవకాశాన్ని జారవిడుచుకోవటం ఎందుకు అని ఆలోచించాడు.

"అహ్మద్ భాయ్! నువ్వు వెళ్ళిరా! వీలుచిక్కితే నాకుకూడా మంచి నీరు తీసుకురా. లేదంటే నువ్వే దాహంతీర్చుకునిరా! కాని త్వరగా వచ్చెయ్యి. తెల్లవారేలోగా మన అన్వేషణ ముగించాలి. రాత్రి యోగ సమాధిలో ఉండే యోగి పగలు నగరసంచారానికో, పాదపూజలకో వెళ్ళవచ్చు" అని హెచ్చరించాడు శివరాజ్.

పాకలున్నాయని ఊహించిన దిక్కుకు మంచినీరుకోసం అన్వేషిస్తూ బయలుదేరాడు అహ్మద్.

కొన్ని మలుపులు తిరిగి ఒక ఈకలిప్టస్ తోటగట్టున నడుస్తున్నాడు. గలగలమని చప్పుడయింది.
పరిచయమయిన ప్రాంతాలే! చాలమంది తన పేదగాధ ఎరిగినవారే. తన దగ్గర డబ్బులేదు. దొంగలభయం అసలేలేదు.

గలగల మరింత దగ్గర అయ్యింది. ఆగిపోయాడు! తల ఎత్తి చూశాడు.

బారులా తీర్చివున్నా ఈకలిప్టస్ కాండాలమధ్య నించి ఓ గాలితెర ఎండుటాకుల్ని దొర్లించుకుంటూ తన ముందునుంచే వెళ్ళిపోయింది నవ్వుకున్నాడు. అనుమానంతో మొదలు అవుతుంది భయం. కొద్దిదూరం వెళ్ళాక మళ్ళా గలగల విన్పించింది.

గాలి దొర్లించే ఎండుటాకుల సవ్వడి అనుకున్నాడు.

అడుగు ముందుకు వేయాలని ప్రయత్నించితే అడ్డుగానిలిచిందొక స్త్రీ మూర్తి.

చీకటి ప్రపంచంలో వెలిగించిన చిరు వెన్నెల దీపంలా వెలుగుతోంది.

"ఎవరు నువ్వు?" అని ప్రశ్నించాడు కంగారుగా.

"భయమెందుకు భాయీ! ఆడదాన్ని! మిత్రుణ్ణి ఒంటరిగా వదలి వచ్చావు. ఎంత మంచివాడవో! నీకు కృతజ్ఞతలు చెప్పాలి"

"కృతజ్ఞతలుకాదు నాకు మంచినీరు కావాలి"

"అలాగే!" అంటూ ఒక అడవి ప్రత్తి వృక్షంచాటుకు వెళ్ళి మట్టితో తయారయిన 'ఈతకాయ' లో మంచినీరు తెచ్చి అందించింది.

అమృతం తాగినట్లు కళ్ళు, కాళ్ళు తేలిపోయాయి.

"ఇదినేను తీసుకుపోవచ్చా! నా మిత్రుడికిస్తాను"

"కావాలంటే ఉంచుకో! కాని నీ మిత్రుడి దాహం తీర్చే హక్కు నాది!"

"చిత్రంగా మాట్లాడుతున్నావే! చినపాలెంలో పంచాంగం చదివే నాగంభొట్లుగారి అమ్మాయివి కాదుకదా!?"

"అలాగే అనుకో అభ్యంతరమేముంది"

'నా దగ్గర ఎప్పుడయినా చీరలుకొన్నారా అమ్మా?"

"కుబుసంలాంటి చీరలు కావాలి అన్నానాకు. మనుషులు నేయలేరు."

"ఏమిటీ మాటలు? ఈ వేళ్ళప్పుడు ఇక్కడ ఒంటరిగా ఉన్నావేం?"

"రెప్పలుండే మనుషులు రెప్పవాల్చాక మైదానాలమీద ఈ చల్లగాలి సాక్షిగా, ఆకాశంలో నక్షత్రాల సాక్షిగా విహరించాలని ఉంటుంది నాకు. ముచ్చట తీర్చుకుంటున్నాను.

సమయంకాని సమయంలో ఎదురొచ్చావు అన్నా! నీకు దాహం తీర్చాను నీ మిత్రుడుకి జీవితంలో ప్రేమదాహం కూడా తీర్చుతాను" అన్నదామె. ఆ స్వరం కోయిలలకు కూడా ఉండదు.

అహ్మద్ విభ్రాంతుడయినాడు.

ఇటువంటి అందాల అతివలు భూలోకంలో ఉంటారా?

శరీరమంతా ఝల్లుమన్నది.

అది అందమేకాదు. ధీశక్తిని తునాతునకలుగా కోస్తున్న

భయంకర వజ్రధార.

"అన్నా! దాహం తీర్చాను. అలసట తీరిందా?"

"తీరింది తల్లీ! దండాలు" అన్నాడు అప్రయత్నంగా.

"కాసేపు కూర్చో!" ఈ రహస్యమేమిటో పూర్తిగా తెలుసుకుందామని చతికిల పడిపోయాడు.

అతని కను రెప్పలమీద వ్రేళ్ళు ఆనించింది సుందరి.

నెమ్మదిగా నేలమీదికి వాలిపోయి కాళ్ళు చాపేశాడు.

"నిద్ర వస్తోందా అన్నా!"

"అవును తల్లీ! నీ స్పర్శలో ఏదో మైమరపు"

"శరీరాన్ని మరచినవాడే అమృతమయుడు! ఆదమరచి హాయిగా శయనించు సోదరా!" చేతులు తొలగించింది.

అహ్మద్ క్షణంలో గురకపెట్టి నిద్రపోయాడు.

కొండదారువైపు వక్రగతిలో పయనమయింది అతిలోక సౌందర్య మాధుర్య అయిన సర్పసుందరి!!

వెళ్ళిన మనిషి తిరిగి వచ్చేందుకు ఏదయినా అంతరాయం కలిగిందా అనే అనుమానం కలిగేంతవరకు సహనంతో ఎదురు చూచాడు శివరాజ్!

అటువంటి అనుమానం వచ్చాక కూర్చుండ లేకపోయినాడు.

కిట్ తీసుకుని మిత్రుడు వెళ్ళిన దిక్కుగా కొద్ది అడుగులువేశాడు.

ఎలుగెత్తి పిలిచాడు! ఏ విధంగానూ జాడ తెలియలేదు. తిరిగి వస్తానని మనసుని సర్ది చెప్పుకోవటం అసాధ్యమయింది.

కావలసిన దానికన్న ఎక్కువ ఆలస్య మయింది.

ఒకరాతి చట్టు మీద మరో రాయికి వెన్ను ఆనించి కాళ్ళు చాపికూర్చున్నాడు అతని కోసం ఎదురుచూస్తూ. కిట్ ప్రక్కనే ఉంది.

నిండు పున్నమి!

సమయం అర్ధరాత్రి అవుతోంది.

కిట్ ది జిప్ లాగి టవల్ తీసి భుజంమీద వేసుకున్నాడు. తులసి చేసిన అమరిక ఆ సమయంలో అతనికంట పడింది. ప్లాస్కునిండా వేడి పాలున్నాయి. ఒక గ్లాసు కూడ పెట్టింది.

టవల్ క్రింద పరచి దానిమీద ప్లాస్క్ ఉంచాడు పాలు బాగా వేడిగానే ఉన్నాయి. పొగలు క్రక్కుతున్నాయి. గ్లాసు నిండా ఒంపుకున్నాడు! ఈ విషయం ముందుగా తెలిస్తే అహ్మద్ మంచినీటి కోసం పరుగు తీయాల్సిన అవసరం వుండేది కాదు.

అతనికి పశ్చాత్తాపం కలిగింది!

ఈ అమరిక చేసినట్లు తులసి తనతో చెప్పవలసింది! భర్తలు దూరంలో ఉన్నప్పుడు కార్యనిమగ్నులై ఉన్నప్పుడు ఏదో విధంగా తమ తాలూకు జ్ఞాపకాలు వారి మనసులోకి రావాలని కోరుకుంటారు.

ఒకసారి గ్లాస్ సిప్ చేశాడు. చెక్కర ఎక్కువ అయినట్లు అనిపించింది. మరీ వేడిగా ఉన్నట్లు అనిపించాయి. దాన్ని తిరిగి టవల్ మీద ఉంచాడు. మనసులో తులసి తాలూకు జ్ఞాపకాలు సందడి చేస్తూ ఉండగా ఓ రాయి చాటున కాలి

అందెల సవ్వడి అతనికి వినిపించింది. మనసు చేసే మోసం అనుకున్నాడు.

రవంతసేపు ఆగి పాలగ్లాసు అందుకో బోతుండగా తిరిగి అదే చప్పుడు అల్లంత దూరంలో విన్పించింది. మనసులో వున్న ఆలోచనల తాలూకు ఆలాపనా కాదు అది.

యదార్ధమే! కాలి అందెలు గలగల లాడించిన చిరు సవ్వడి!

అతడు తల త్రిప్పి చూచాడు. పండు వెన్నెల పుచ్చ పూవులు రాసిపోసినట్లుగా పరుచుకుపోయి కన్పించింది. కాని ఎవ్వరూ కన్పించలేదు..

ఇది భ్రమా? వాస్తవమా? అర్ధ సత్యమా?

కొద్దిసేపు దిక్కులు చూచాడు! ఎవరూ వున్నట్లు అనిపించలేదు. అహ్మద్ తిరిగి వచ్చి తమాషా చేస్తున్నాడా? లేదు! అతడు తమాషా చేసే స్వభావం కలవాడే అయినా అటువంటి శబ్దాన్ని వినిపించలేదు.

నాట్య రాణుల పాదాల అందెల బంగరు మువ్వలధ్వనినేవిన్నాడు తాను.

గుండె ఝల్లుమంది! శరీరం మీద రోమాలు నిక్కబొడిచి నాయి. లేచి నిలబడి చుట్టూ పరికించి చూచాడు.

మనుషుల జాడ మచ్చుకయినా లేదు.

ఏదో భ్రాంతి అనే నిర్ణయానికి వచ్చాడు.

తిరిగి పాలగ్లాసు ముందు కూర్చుని టవల్ అంచులు సర్ధాడు.

కొద్ది సేపటికి చల్లని మందమారుతం వీక్షించి.

మధురమైన ఊహలు మనసు పొరల మీద తేలివచ్చినట్లు సంపెంగ విరుల మధుర పరిమళం అతని ముక్కుపుటాలను సోకింది.

ఇదేమిటి?

హఠాత్తుగా ఇంతటి వివశమయిన సంపెంగల గుభాళింపు రావటానికి కారణం ఏమయి వుంటుంది.

ఆ పరిమళం ఎంత అధికంగా ఉందంటే అతని చుట్టూ ఆవహించి ముంచెత్తటమే కాకుండా, బట్టలకూ అతను కూర్చున రాతిచట్టు లకు కూడ అదే సుగంధం అంటుకున్నట్లుగా అనిపించింది.

శరీరం పలుమార్లు జలదరించింది.

ఎవరయినా వచ్చారా? అనే అనుమానం కూడ కలిగింది.

పాద మంజీరాల చప్పుడు మళ్ళీ విన్పించటంలో త్రుళ్ళింతపడి లేచాడు. చుట్టూ కలయచూచాడు. ఎవరూ కన్పించకపోయినా కూర్చోవాలని అనిపించలేదు. కొద్ది అడుగులు వేసి బండలచాటున పరీక్షించాడు.

గాలి ఎగువకు వెళ్ళాడు. అంత దూరంలో కఠినమయిన శిలా వేదికల మీద సుకుమారమయిన అడుగుల చప్పుడు విన్పించింది.

సుతి మెత్తని పాదాలతో మృదువుగా అడుగులు వేస్తూ మృదుల మృదులంగా ఎవరో నడిచిపోతున్నారు. చీలమండలకు పైన నాగపడగల కడియాలు పాదాలమీద వ్రేలాడుతున్న నాగపట్టాలు! తళుక్కున మెరిశాయి.

శివరాజ్ ఆ వైపుగా పరుగు తీశాడు. మరికొంతదూరం పోయాడు కాని అడుగులు వాటి చప్పుడు హఠాత్తుగా అదృశ్యమయింది.

అపరిమితమయిన ఆశ్చర్యంతో మునిగిపోయినాడు.

ఎవరు తనతో దోబూచులు ఆడుతున్నారు. ఈ దాగుడు మూతలకు అర్ధమేమిటి? వారికి అలా కవ్వింతలాడాల్సిన అవసరమేమిటి?

ఇంకా ఎంతసేపు వెతికినా ఎవరు కన్పించలేదు. శబ్దం విన్పించలేదు.

అహ్మద్ వస్తున్నాడన్న ఆశతో మరోమారు దూరానికి చూచి నిరాశతో టవల్ పరుచుకున్న చోటికి తిరిగి వచ్చాడు.

ఇంకా కాలయాపన చేయటంలో అర్ధమే లేదు.

త్వరగా పాలు త్రాగేసి కర్తవ్యాన్ని ముగించుకునేందుకు వెళ్ళిపోవాలి!

మునుపటిలాగే రాతి చట్టుకి వీపు ఆనించి రిలాక్స్ అయి కూర్చున్నాడు. కాళ్ళు ముందుకు చాచాడు! త్రాగేందుకు పాలగ్లాసు అందుకున్నాడు.

అది తేలికగా అన్పించింది.

గ్లాసుని నిండుగా పాలతో నింపుకున్నాడు. మరీ వేడి ఎక్కువగా వుందనే అభిప్రాయంతో దాన్ని చల్లారేందుకు టవల్ మీద వుంచాడు.

పాలు సగమే ఉన్నాయేమిటి? ఏదో జరుగుతోంది.

ఎవరో తనని ఆటలు పట్టిస్తున్నారు. శత్రువులు ఎవరయినా వచ్చారా? తమరాకని ముందుగా గమనించి ఎవరయినా ఫాలో చేశారా? అహ్మద్ రాకపోవటంలో అర్థమేమిటి చెప్మా! గ్లాసుని పరిశీలించాడు.

పాలు సగానికి తరిగిపోవటమే కాదు దానిమీద ముద్రలు కన్పించాయి, బహుశా అవి చేతివ్రేళ్ళు ముద్రలు అయి వుంటాయా?

పోలీసు ఆలోచనతో చప్పున దాన్ని క్రింద దింపేసి చేతి రుమాలతో అడుగున సుతారంగా పట్టుకుని నెమ్మదిగా పైకెత్తి చూశాడు.

గ్లాసు మీద ముద్రతమయింది చేతి వ్రేలి ముద్రలు కావు.

పెదవులానించిన గుర్తులు తాను ఎంగిలిచేసి అక్కడపెట్టిన పాలు ఎవరో త్రాగటం మాత్రమే కాకుండా గ్లాసుమీధ ఆప్యాయంగా ముద్దుపెట్టినట్లు గుర్తులు స్పష్టంగా కన్పించాయి.

ఈ కాలం ప్రియురాళ్ళు అయితే మందు గ్లాసులమీద ముద్దులు పెట్టి యిస్తారు. ప్రియుణ్ణి రెచ్చగొట్టటానికి! తృప్తికాని తృప్తి కలిగించటానికి!

అర్థాంగి అయితే అర్దరాత్రి శయ్యమీద శరీరాన్ని జీవితాన్ని పంచుకున్న విధంగానే పాలగ్లాసు పంచుకుంటుంది.

ఇక్కడ ఈ పనిచేయటానికి ఎవరున్నారు? ఏ లోకంనించి దిగివచ్చారు?

శివరాజ్ మరింత సంభ్రమంలో మునిగిపోయినాడు. మళ్ళీ చూచాడు. గ్లాసుమీద సుందర తరమయిన అధరాలను అద్దిన గుర్తులు.

తాను ఉన్నత స్థాయి పోలీసు అధికారి ననే విషయాన్ని క్షణం మర్చి అయోమయంగా నిలిచిపోయినాడు.

ఆ క్షణంలో గాలి అలలమీద తేలి వచ్చిందొక మధుర స్వరం! మందాకినీ తరంగాల మీద రాయంచలరాణి ప్రియునికి రాయబారం పంపినట్లు అనిపించింది.

వీణానాదంలో వేణువుని కలబోసి వేదపనలు ఆలపించినట్లుంది.

తన చెవులను నమ్మలేకపోయాడు. మళ్ళీ చెవులు రిక్కించివిన్నాడు.

"నాగరాజా! నన్ను గుర్తించవోయీ!" అక్షరనాదాలు అమృత బిందువులై కురిశాయి ఆ సుస్వరాల కంఠ మాధుర్యానికి నిలువెల్లా పులకించాడు.

కాని ఎప్పుడయితే మనిషి కంఠస్వరం వినిపించిందో వెంటనే అతనిలో పోలీసు అధికారి స్పీడప్ అయిపోయి ప్రశ్నించడం ప్రారంభించాడు.

"ఎవరు? ఎవరు? మాట్లాడుతున్నవారు ఎవరు?? నా ఎదుటకు రావాలి! ఈ దోబూచులెందుకు? దొంగాటలెందుకు? నా పేరు నాగరాజు కాదు. శివరాజ్! ఎదుటకువస్తే నా విలాసమేమిటో వివరిస్తాను. కమాన్! కం టూ మీ!" అన్నాడు.

"ఎందుకంత వేగిరపాటు!? నీ పేరు నాకు తెలియనిదికాదు. నీ విలాసం నేను చవిచూడనిదికాదు.
అందుకోవాలని తొందరగా ఉందా? అలరింపులకు వేగిరపాటు కలిగిందా? మూడు దశాబ్దాలనాడు నన్ను విడిచి పోయినప్పుడులేని తొందర తోసుకువచ్చిందా ఇప్పుడు?

విధి ఎంత విడ్డూరమోయి నా ప్రాణమా! మూడు దశాబ్దాల అనంతరం నిన్నూ నన్నూ ఈ వెన్నెల విరిసిన ఏకాంతంతో కలిపింది?

ఆనాడు కౌగిలిలో విడిపోయినావు! అంత నిర్దయగా వెళ్ళిపోయావు! ప్రియురాలి గుండె బుస బుసలాడించి పొంగు చల్లారగనే కాలమనేతెరల చాటుకు వెళ్ళిపోయావు. ఇప్పుడు కాలపు ఉక్కు తెరలను పిడికిళ్ళతో బ్రద్దలుకొట్టుకుని మళ్ళీ ప్రపంచ దృశ్యంలో ప్రాణివయి అవతరించావు."

"నువ్వెవరు?? నువ్వెవరు?? అని ప్రశ్నిస్తావా నన్ను?"

నీ మనసు అద్దంలో కనిపించే ప్రతిబింబం ఎవరిది? ఏకాంతంలో అంతర్లోకాల వాకిళ్ళు తెరిచినప్పుడు నీముందు ప్రత్యక్షమయ్యే రూపం ఎవరిది? యుగ యుగాంతరాల విశ్వయానంలో ఆత్మలు స్త్రీ సంయోగంతో పెనవేసుకొని ప్రాణి రూపాలయినప్పుడు ఒకటి నీవు! మరొకటి యెవరనుకున్నావు? నేనే!!

నీ యెదుటకు రమ్మని అడుగుతున్నావా? నన్ను గుర్తించాలంటున్నావా? మగవాడి మనసులో యెంత మరపు యెంత దగ ఉంటుందో నిరూపించావు.

మూడు దశాబ్దాల వియోగంలో కూడ నా యెదుట నీవున్నావు. నా లోపల నీవున్నావు. నా లోకమంతా నీవుగానే వున్నావు!

కాని నన్ను మాత్రం నీవు మరచిపోయావన్నమాట? ఈ కంఠ స్వరాన్ని గుర్తించలేని పరాయి వాడివయ్యావన్నమాట!

అతని ఆత్మ లోకాన్ని నాగలోకపు నీడలు పట్టియుగాల వెనక్కు ఈడ్చుకు పోతున్నట్లుగా అనిపించింది. ఏవో జ్ఞాపకాలు దోబూచులాడినట్లు అనిపించాయి.

మాటాడుతూ పోటాడుతూ మనసుని వేటాడిన ఆ మగువ మాటలు క్రొత్తవిగా అతనికి అనిపించలేదు. మరపు లోయలలోకి దొర్లి పడిపోయిన మధుర జ్ఞాపకాల మనసు తెరల మీదకి తేలి వచ్చినట్లు అనిపించింది.

క్రమ శిక్షణలో, కఠిన పరిశ్రమలో రాటుతేలిన అతని శరీరం అణువు అణువూ అగ్ని సంయోగంలో కరిగిన వెన్నపూసలా జారిపోయింది.

"నిన్ను చూడాలనుంది! నా ముందుకు రావెందుకని?" అన్నాడు అప్రయత్నంగా అర్థింపుగా అన్నాడు.

తళుక్కుమని తటిల్లతలు మెరిశాయి!

సహస్ర వర్షోపజీవులయిన శ్వేత ఫణీంద్రాల శరీర కాంతిలా... అల్లన అల్లన అతనిముందు మురిపించే ముత్యాల పేరులా ప్రత్యక్షమయింది ఓ రూపం!

ఆ సౌందర్య జిగీషకు అతడు విభ్రాంతుడయినాడు.

రెప్పలు వేయటం మరచి అమృతపాయి అబునాడు!

అచేతనుడయి, మంత్రముగ్ధుడై జన్మాంతరాలకు తరలి వెళుతున్న ఆత్మ శకలాల కాంతి కిరణంలా అలా నిలిచిపోయినాడు.

ఆమె దగ్గరగా వచ్చింది. అరవిచ్చిన మల్లెలా అందాల నవ్వు అతనికి ఇచ్చింది! పెదవులు పద్మరాగ ప్రభలు ఒలికించుతున్నది. కనుబొమలురాత్రి సముద్రపు కెరటాల్లా కవ్వింపుగా విరిగి పడినాయి!

రాజీవ పత్రాల్లా ఉన్న చేతులు అతని చెంపలు తాకి సమ్మోహపరచినాయి! రెప్పలులేని కళ్ళు ఆమెకున్నాయి.

వేలకోయిల కంఠాన్ని సవరించినట్లు అన్నదామె!" ప్రియతముడా! ఎంత కాలానికి దర్సన మిచ్చినావోయీ! చిరకాలం నిలిచి ఎదురు చూచేనందుకు ఆడదాని హృదయ శకలం చిరంజీవి అనుకున్నావా?" అన్నదామె.

పద్మ సంభవునికి ప్రభాత గీతికలు విన్పించేందుకు నల్లకలువల రాణి మీ మాణిక్యవీణను సవరించినట్లు మంజులమై మనోహరమై స్నిగ్ధమయి కోమలమయి మోహా విదగ్ధమై ప్రతిధ్వనించింది ఆ కంఠస్వరం!

శివరాజ్ మంతాక్షరిలో మనసు లగ్నమయినట్లు సమ్మోహితుడయినాడు.

"ఈ జరుగుతున్నదంతా ఏమిటి? ఎవరు నువ్వు?" అని ప్రశ్నించాడు.

"జరుగుతున్నది జన్మాంతరాల ప్రేమ సమాగమం! నేను నీ అర్ధాంగిని!"

"నా భార్యపేరు తులసి! నువ్వెవరో నాకు తెలియదు."

"తులసి! ఎంత పవిత్రమైనపేరు! విష్ణు దేవుని అర్ధాంగి! మహావైష్ణవి! నువ్వు జన్మకో వనితను వలచి వాసుదేవుడవు కావాలనుకుంటున్నావా?"

మరు జన్మలు సృష్టించిన మరపు తెరలు మబ్బులా క్రమ్మినాయి.

మూడు దశాబ్దాల వియోగంలో నిట్టూర్పులు సృష్టించిన ఉష్ణవాయుల తుఫాను ఈ క్షణంలో అంతమవుతుందనుకున్నాను.

"నన్ను కన్నులలో ముద్రించుకుని అంతర్ధానమయినవాడిని మరో మగువమనసులో నిలుపుకుని ప్రత్యక్షమయినావా?" అని ప్రశ్నించిందామె.

ఆమె మాటలు అతనికి సగం అర్ధమయినాయి. సగం అర్ధం కాలేదు.

నిరుత్తరుడైనాడు. కళ్ళు అప్పగించిచూస్తూ ఉండిపోయాడు!

ఆమె అతని చేయి పట్టుకుని ముందుకు నడిపించింది.

మైమరపించే స్పర్శకు మంత్ర ముగ్ధుడై ముందుకు నడిచివెళ్ళాడు! అలా ఎంత దూరం వెళ్ళాడో అతనికి తెలియదు. నడిచి నడిచి ఒక గుహ అంతర్భాగంలోకి వెళ్ళారు. ప్రవేశించుతున్న సమయాన అది గుహ అంతరాంగణమే కాని వారు ప్రవేశించాక ఆ చోటు అంతా అద్భుతంగా మారిపోయి ప్రత్యక్షమయింది. ప్రేయసీ ప్రియులకు తన్మయ భావం కలిగించే ఒక వండర్ వరల్డు కనుల ముందు నిలిచింది.

ఆమె అతన్ని తీసుకువెళ్ళి మెత్తని శయ్య మీద కూర్చోపెట్టింది. యాంత్రికంగా చెప్పినట్లు చేస్తున్నాడేకాని అవుననలేదు, కాదనలేదు.

ఆమె అతని ఒడిలో తలపెట్టుకుని పడుకుంది!

చెంపలు నిమురుతూ చిలిపి చూపులు చూస్తోంది!

పులకించుచు మిగిలిన ప్రపంచాన్ని మరిచిపోయాడు. శివరాజ్!

అగ్నిలోపడిన ఆవు నేయిచుక్కల్లా క్షణాలు ఆవిరి అయిపోతున్నాయి!

కనురెప్పలు అరమోడ్చి విస్మృతుడే అవుతున్నాడు!!

* * * *

ఎండ చురుక్కు మనిపించాక కళ్ళు విప్పాడు!

దుమ్ము దులుపుకుని లేచి నిలబడ్డాడు! ఎక్కి వస్తున్న ప్రొద్దువంక చూచాడు అంతసేపు ఆదమరచి నిదురించినందుకు సిగ్గుపడిపోయినాడు.

కరిగిపోయిన కాలం తిరిగి రాదుకదా!

పశ్చాత్తాపంతో క్రుంగిపోయాడు! కర్తవ్యాన్ని మరచి విస్మృతుడు అయినందుకు తనని తానే నిందించుకున్నాడు.

తలలు వూగించే వృక్షాలు మధ్యనించి తిరుగు ప్రయాణంఅయ్యాడు అహ్మద్!

ఇంతసేపు తాను ఎలా నిదురించినట్టు?

అలాంటి చోటున అంతగా ఆదమరచి నిదురించటం సాధ్యమేనా? క్రమంగా గతరాత్రి జరిగిన సంఘటనలు జ్ఞాపకం రావటం మొదలెట్టాయి. మంచినీరు త్రాగాలని బయలుదేరాడు!

అర్ధాంతరంగా కనిపించిన ఆ సుందరివలననే తాను విస్మృతి లోనికి జారిపోయానని అర్ధమయింది. వెంటనే తిరిగి వచ్చేస్తానని ఎంతగా ఎదురు చూశాడో శివరాజ్! విసిగి తన పనిమీద వెళ్ళిపోయుంటాడు.

మనసు మార్చుకుని మోసగాడుగా భావించి ఉంటాడు!

తిరిగి అతను కనిపిస్తాడా? అడుగులు త్వరగా పడుతున్నాయి!

వృక్షాల మధ్య అలవాటయిన దారిలో మలుపులు అన్నీ తిరిగి కొండ ప్రాంతానికి చేరుకున్నాడు. తాను బయలుదేరిన చోటు అతనికి బాగా జ్ఞాపకం! అక్కడకు వచ్చి చూచాడు.

శివరాజ్ వెంట తీసుకువచ్చిన కిట్ అక్కడే ఉంది. టవల్ పరిచి దానిమీద గ్లాసు దానిలో కొంచెం మిగిలిన పాలు ఉన్నాయి. ప్రక్కనే ఫ్లాస్క్ పెట్టి ఉంది. దానిలో సగం వరకూ పాలున్నాయి.

తన దగ్గర పాలు ఉన్నట్లు శివరాజ్ చెప్పలేదు. ఆ మాట చెప్పిఉంటే వెళ్ళవలసిన అవసరమే వచ్చేదికాదు. మిత్రుడు ఏమయిపోయాడు? అహ్మద్ కంగారు పడిపోయాడు.

ఒకవేళ పరిసర ప్రాంతాలలోనే ఉన్నాడేమో!?

ఎలుగెత్తి పిలిచాడు. మిత్రుడిని పేరుపెట్టి పిలిచాడు. పొదల చాటున, రాతి గుట్టలమాటున అంతా కలయతిరిగి వచ్చాడు. కాని ఆ ప్రాంతాలలో శివరాజు ఉన్న జాడ కనిపించలేదు.

ఒకవేళ తనకోసంగాని వెదుకుతూపోలేదుకదా?

వచ్చి వుండవచ్చు! కాని కిట్ ని అలాగేవదిలేసి ఎందుకు వస్తాడు? పాలు త్రాగుతూ అర్ధాంతరంగా లేచి

వెళ్ళిపోయినట్టు అర్థమవుతోంది. అలా ఎందుకు వెళ్ళిపోయుంటాడు.

అలా వెడితే రాకపోవటానికి కారణం ఏమిటి? చాలా సేపు ఎదురుచూచాడు ఆశతో! కాని శివరాజు తిరిగి రాలేదు.

వస్తాడన్న ఆశలు చిగురించలేదు. క్రమంగా నీరసం ఆవహించింది! తిరిగి వెళ్ళిపోవటం తప్ప మరొకదారిలేదని మధ్యాహ్నా సమయానికి నిర్ణయించుకున్నాడు. కిట్టు సర్దుకుని భుజానికి తగిలించుకున్నాడు.

మరోసారి కొండ అంతా తిరిగి క్రిందికి దిగి వచ్చాడు.

హైవేమీద శివారు ప్రాంతాలకి తిరిగే షటిల్ సర్వీస్ లో ఎక్కి పోలీసు కంట్రోల్ రూంకి చేరుకునే సమయానికి సాయంత్రం నాలుగు గంటలయింది. ఎస్. పి. గారు కార్యాలయంలోనే ఉండటం వలన హడావుడిగా ఉంది.

అతన్ని ఎవరూ పట్టించుకోలేదు.

కొద్దిసేపు ప్రయత్నించి ఒక ఎస్.ఐ.తో మాట్లాడే అవకాశం సంపాదించాడు.

"సార్! సార్! శివరాజుగారు కనిపించటం లేదు సార్!"

"ఆయన శలవులో ఉన్నారు. వారం రోజుల తర్వాత వస్తే కనిపిస్తారు!"

"శలవులో కాదుసార్! అడవిలోకి వెళ్ళారు!"

"ఏమిటి కన్ ఫ్యూషన్! సరిగ్గా చెప్పు" విసుక్కున్నాడు! అవకాశం దొరకగానే ఓ కుర్చీలో చతికిలపడ్డాడు. ఆఫర్ చేయకుండానే టేబిల్ మీద మూతపెట్టి ఉన్న వాటర్ గ్లాసు అందుకుని ఖాళీచేశాడు!

అతడేదో కంగారులో ఉన్నాడని ముఖ్యమైన విషయమేదో చెప్పబోతున్నాడని గ్రహించాడు ఎస్.ఐ. ఫైలు ప్రక్కనుంచి మనసు అతని మాటలమీదుంచాడు.

"సార్! రాత్రి ప్రొద్దుపోయాక ఎ ఎస్ పి శివరాజ్ మా యింటికి వచ్చారుసార్!"

"అసలు నువ్వెవరు? పేరు అడ్రస్ ఇవ్వు"

అహ్మద్ వివరాలన్నీ యిచ్చి మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు.

"వారితో కలిసి బయలుదేరాను. ఆయన ఎందుకోసం వెడుతున్నారో వివరాలు నాకు ఇవ్వలేదు. కొండమీదికి వెళ్ళాం, మంచి నీటి కోసం వెళ్ళి నేను అక్కడే నిద్రపోయాను. తెల్లవారి వచ్చాక చూస్తే శివరాజ్ కనిపించలేదు"

"ఏమిటయ్యా కంగారు? ప్రాణం తీస్తున్నావు? అని ప్రశ్నించటం మొదలుపెట్టాడు. పది నిమిషాల వ్యవధిలో జరిగిన విషయమంతా రాబట్టుకున్నాడు. జరిగినదాన్ని ఒకటి రెండుసార్లు సమీక్షించుకున్నాడు ఒక మిష్టరీ ఉన్నదని అతనికి అర్ధమైపోయింది. ఒక చిన్న క్లూ సంపాదించుకున్నాడు.

ఒక యువతి అతనికి పిలవ కుండా మంచినీరు యివ్వటానికి శివరాజు కనిపించకుండా పోవటానికి సంబంధం ఉందని అర్ధం చేసుకున్నాడు.

అతను చెప్పిన విషయాల్లో ఒక కేసుకి స్వరూపం ఉన్నదని భావించాక దాన్ని వివరంగా వ్రాసుకున్నాడు. ఎ ఎస్ పి గారికి సబంధించిన అంశం కాబట్టి పెద్దలకు ఈ విషయాన్ని ముందుగా తెలియచేయటం అవసరమని భావించాడు.

"నీవు రిపోర్ట్ రాసి సంతకం పెట్టాల్సి వుంటుంది. వెళ్ళి పోకు" అని హెచ్చరించి యస్. పి. గారి ఛాంబర్ కి వచ్చాడు యస్.ఐ.

"సర్! శివరాజ్ గారి గురించి సమాచారం వచ్చింది!"

"ఏమిటది?"

తాను వ్రాసిన రిపోర్టు ఆయన ముందుంచాడు!

"అతనితో వెళ్ళిన వ్యక్తిని నా దగ్గరకు తీసుకురండి!"

ఒక పిసి పరుగున వెళ్ళి అహ్మద్ ని లోపలకు తీసుకువచ్చాడు! పెద్దాయన దగ్గర ఎంతో వినయ విధేయలతో విషయమంతా వివరించి తాను తెచ్చిన కిట్ అప్పగించి వెళ్ళిపోయేందుకు అనుమతి అడిగాడు!

"ఎ ఎస్ పి ఎక్కడికి వెళ్ళి ఉంటారని నీ అభిప్రాయం"

"చెప్పలేదుసార్! ఆయన ఏ పని మీద వెళ్ళారనే విషయాన్ని నేను తర్కించి అడగలేదు. ఎంత చిన్న నాటి మిత్రుడు అయినా పోలీసు అధికారి కూడ కదసార్! ఒకటి రెండుసార్లు అనుమానం, భయం వ్యక్తం చేశాను తిరిగి వెళ్ళిపొదలుచుకుంటే అభ్యంతరం లేదన్నట్టు సూచించాడు! ఆ చోటు వివరాలు నేను ఇచ్చాక తనలో ఉండి తీరాలని

పట్టుబట్టలేదు. మిత్రుడిమీద ఆసక్తి కలిగి ఉండాలనే ఉత్సాహంలో నేనే వెళ్లాను. ఇదంతా ఇలా అవుతుంది అనుకోలేదు సార్ ఆయన కోసం త్వరగా వెతికించండిసార్!

ఆ ప్రాంతాలన్నీ నాకు బాగా తెలుసు! కావాలంటే నేను కూడదారులు చూపించేందుకు సాయంగా వస్తాను" అన్నాడు అహ్మద్.

"అవుసరమయితే మా వాళ్ళు వచ్చి నన్ను కలుస్తారు. సహకరించు. ఒకటి రెండు రోజుల్లో నేను అనుమతించేంతవరకూ పొరుగూరికి ప్రయాణాలు మాత్రం పెట్టుకోకు" అని సలహాయిచ్చారు ఎస్.పి!

"బట్టల వ్యాపారానికి తప్ప  పొరుగూరు వెళ్ళే పని ఉండదు సార్!"

"మంచిదే వెళ్ళిరా! మీ మిత్రుడు మా డిపార్టుమెంటు అధికారి మా మనిషి! మేం చూచుకుంటాంవెళ్ళిరా!" అనుమతి యిచ్చేశారు.

బరువెక్కిన గుండెలతో బయట పడ్డాడు అహ్మద్!

చిన్ననాటి మిత్రుడు గొప్పవాడై తనంత తానుగా వచ్చి కలిశాడనే ఆనందం కొద్ది గంటలు అయినా యివ్వలేదు! క్రుంగిపోయాడు!

ఎ ఎస్. ఐని వెంటపెట్టుకుని ఎస్.పి శివరాజ్ స్వజనంతో సంప్రదింపుకి బయల్దేరారు వెంటనే! తల్లి గదిలో నిద్రపోతూ ఉంది.

తులసి హాలులో కూర్చుని సైన్సు జనరల్ చదువుతోంది. ఉమ ఆసక్తిగా వింటూ కూర్చుని ఉంది. శివరాజ్ తిరిగి వస్తానన్న సమయం అయింది. అందుకోసమే ఎదురు చూస్తూ కాలక్షేపానికి మాత్రమే జనరల్ చదువుతోంది. అడుగుల సవ్వడి అతనిదే అని తలెత్తి చూచిందామె!

ఎస్.పి గారు ఆ వెనుక ఎస్. ఐగారు రావటం చూచి చివాలున లేచినిలబడ్డాడు.

"తల్లీ! పెళ్ళయిం తరువాత ఇదే నిన్ను చూడటం!"

"మీ ఆశీస్సుల కోసం నేనే వద్దామనుకున్నాను అంకుల్!"

"శివరాజ్! లేరా? ఎక్కడకు వెళ్ళారు?"

"ఆయన వారం రోజులు శలవుపెట్టారు కదా!"

"హనీమూన్ వెడతారని నేను అనుకున్నాను వెళ్ళలేదా?"

"ఆలోచన ఉంది కాని అది వాయిదా పడుతూనే ఉంది అంకుల్!" ఆయన రాత్రి ఇంటికి వచ్చి శలవు పెట్టిన విషయం చెప్పారు. ఏదోపని ఉందని హడావుడిగా కిట్టు సర్ధమని వెళ్ళిపోయారు అంకుల్!"

"ఎక్కడికి వెళ్ళుతున్నారో, ఎందుకు వెడుతున్నారో చెప్పారా?"

"లేదంకుల్! నేను తరచి ప్రశ్నించలేదు. ఈ పూట తిరిగి వస్తామంటే ఎదురు చూస్తూ కూర్చున్నాను. ఆఫీస్ కీ వచ్చారేమో ఫోన్ చేద్దామనుకుంటున్నాను"

"రాలేదమ్మా!" అంటూ ఎస్ ఐ వంక అర్ధవంతంగా చూచారు ఎస్.పి!

బయటకు హడావాడిగా వెళ్ళి ఓ నిముషం కాకుండానే తిరిగి వచ్చాడు!

ఎస్.ఐ కిట్ తెచ్చి టేబిల్ మీద ఉంచాడు.

దానివంక భయంగా చూచింది తులసి!

"ఇదేనా బేబి ఆయన తీసుకువెళ్ళిన కిట్టు?

"అవునంకుల్! వారికేమయింది?" అని అడిగింది జీరవోతున్న కంఠంతో.

"రాత్రి ఆయన ఒక మిత్రుడితో కలసి కొండలవైపు వెళ్ళారమ్మా!" అంటూ ప్రారంభించి జరిగిన సంగతి ఓదార్పుగా చెప్పారు ఎస్.పి.

అది విని సోఫాలో కుప్పకూలిపోయింది తులసి!

"బేబి! ఎందుకు అంత భయపడతావు. ఆయనకేమీ అయివుండదమ్మా!"

పోలీసు వీరులకు పరాజయం ఉండదు. వెంటవెళ్ళినవాడు మంచి నీటి కోసం చీలిపోవటం ఆలస్యం కావటంవల్ల ఆయన ఎక్కడకు వెళ్ళారో తెలియలేదు. చిన్న అనుమానం కూడ ఉంది.

పాలు త్రాగుతూ వదలి ఎందుకు వెళ్లారనే అనుమానం అది! అదికూడ నీవు ఊహించు కుంటున్న ప్రమాదానికి సంకేతం కాదమ్మా! పాలు త్రాగుతూ ఉండగా అతనికి కావలసిన వారు కన్పించటమో వారిని వెంబడించటమో జరిగి ఉంటుంది!

డ్యూటీ కన్నా పాలుత్రాగటం ముఖ్యమని మా అధికారులు భావించరు, ఎవరయినా దాడి చేస్తే ఆ గుర్తులు అక్కడ కన్పిస్తాయి.

వదలి తనంతటతానే వెళ్ళిపోయారు కనుక ఇన్ వెస్టిగేషన్ పనే అనిమనం నిర్ధారించుకోవచ్చు!' అని వివరించారు.

మరికాసేపు ఓదార్చి ఎస్. ఐతో కలసి వెళ్ళిపోయాడు ఎస్.పి!! కిట్టుని చేతుల్లోకి తీసుకుని ధైర్యాన్ని కూడ దీసుకునేందుకు ప్రయత్నిస్తోంది తులసి!

## 10

"ఈ నిండు పున్నమి శాశ్వతంకాదు. ఈ పండు వెన్నెల శాశ్వతం కాదు. క్షణాలను జారిపోనివ్వకు! పున్నమి ఘడియలు దాటిపోతే నేను పారిపోతాను. ప్రతి క్షణాన్ని అమృతంలా ఆస్వాదించాలి!" అన్నదామె అతని శరీరాన్ని పాములా పెనవేసుకుంది. చుట్టపెట్టుకుని తనలో ఇముడ్చుకుంది. దశాబ్దాల పాటు విరహంతో నిలువరించుకున్న మనసు తాపం తీర్చుకున్నట్లు గాఢమయిన పరిష్వంగాలను అందించింది.

శివరాజ్ ఉక్కిరి బిక్కిరి అయాడు! తనని తాను మరచిన స్వాప్నికమయిన స్థితిలో తలమునక లయ్యాడు! పూర్వ జన్మస్మృతులు మేల్కొంటున్నాయి.

"ఈ చోటుకు నన్నెందుకు తీసుకువచ్చావు?"

"కసి తీర్చుకోవటానికి ప్రియతమా! ఈ కసి ఈనాటిది కాదు"

"అందుకోసం ప్రేమ నటించాలా?"

"ఇది నటనకాదు. కసిఅంటే ద్వేషం కాదు. మూడు దశాబ్దాలపాటు మనసు పొరలమాటున దాగి ఉడికించిన ప్రేమ తాపంగా, తమకంగా మారింది. అదే కసిగా ఈనాడు నీమీదికి దాడిచేస్తోంది." అంటూ కసిగా నవ్వింది సర్పసుందరి.

అలా నవ్వుతున్నప్పుడు పెదవులు అందంగా వొంపుతిరిగినాయి.

కనుబొమలు మన్మధుడిచేతి విల్లులా పైకిలేచి ఒంపుతిరిగాయి. ఆ విల్లునించి గురి తప్పక జారివచ్చి గ్రుచ్చుకుంటున్న బాణాలు నాగభామిని కంటిచూపులే! ఆ చూపులు అతన్ని తాకినప్పుడు గుండెల్ని వేడెక్కిస్తున్నాయి. గుబులు పుట్టిస్తున్నాయి.

ఆ సమయంలో తాను సర్పపరిష్వంగంలో ఉన్నానని దానినించి బయటపడాలనే తాపత్రయాన్ని క్షణకాలం మర్చిపోతున్నాడు!

వివశుడైపోతున్నాడు! ఒక స్త్రీలో ఆకర్షణ ఉంటుంది. యెంతో వశీకరణశక్తి ఉంటుంది! కాని ఇలా తనధీశక్తిని పుంభావపు భేషజాన్ని జయించి నీరుకార్చ గలదని అతడెన్నడూ ఊహించనయినాలేదు.

"ప్రేమ తమకం తీరనివాళ్ళు కట్టిపడేసి కసితీర్చుకోవాలను కోవటం ఎంత అమాయకత్వం? అది సాధ్యమవుతుందనే వెర్రి ఆశలు పెంచుకున్నావా సర్పసుందరి?" అని ప్రశ్నించాడు శివరాజ్!

"మనసు ఒక పురుషుడి మీద ఏకాగ్రంగా నిలిపిన తరువాత ఆ స్త్రీ హృదయానికి ఓటమిలేదు నాగరాజా!"

"నా పేరు నాగరాజు కాదు శివరాజ్!"

"శివుని ఆభరణమే కదా నాగరాజు! పేరులో ఏమి పెన్నిధి ఉన్నదోయి! నా మనసు అలా భావించింది కదా! ముచ్చట తీర్చుకోనివ్వు!"

"ఒకరిని మరొకరు అనుకోవటం ముచ్చట ఏమిటే మూర్ఖురాలా?"

"ఆత్మలు ప్రాణులుగా అవతరించే ముహూర్తాన గత స్మృతులను జీర్ణ వస్త్రాలవలె విడిచి క్రొత్త యోగులను ప్రవేశిస్తాయి రాప్రియతమా! ఆనాటి నా మనోభావుడు నా చెలికాడు, నా ప్రియుడు. ఈనాడు మానవ యోనినించి ప్రభవించినాడు! అయినా నీవు నీవే! ఆనాటి నా ప్రియతముడవే! ఆనాడు సర్పరాజుగా తమకం తీర్చావు.

నీవు మనిషిగా అవతరించావు. ఆ తమకం తీర్చుకునేందుకే యీ రూపాన్ని పొందానునేను. దాంతో ఈ ప్రయత్నము.

యోగి సమాధి చాలిస్తే నేను యీ శరీరాన్ని చాలించి సర్పంగా మారిపోతాను. యీ అమృత ఘడియలను జారిపోనివ్వకు." అతన్ని మరింత గాఢమయిన కౌగిలిలో ఉక్కిరి బిక్కిరి చేసింది నాగభామిని!

మృదువుగా ఆమెను ప్రక్కకు ఒత్తిగించినాడు శివరాజ్.

"ప్రేమ స్రవంతులు రెండు హృదయాలనించి స్రవించాలి! అవి సంగమించాలి. ఒకచేతితో చప్పట్లు కొట్టగలవా? సుందరీ! నన్ను అర్థం చేసుకోవాలని ఎందుకు ప్రయత్నించవు"

"ఇంతస్వార్థం ఎందుకు? నీ గురించి మాత్రమే నువ్వు ఆలోచిస్తున్నావు. నీ స్వార్థమే నన్ను అర్థంచేసుకోనివ్వదు. మరొకసారి ఆలోచించు! నన్ను వెళ్ళిపోనివ్వు!"

"అందనివేట ఆకలిని పెంచుతుంది. ఇప్పుడు నువ్వు నాకు మరింత అపురూపమైపోయావు" అన్నదామె! శృంఖలాలు బిగించుకుపోయినందువల్ల మరింతగా బందీ అయిపోయినట్లు భావించాడు.

"ఎంతసేపని ఇలా కౌగలించుకుంటావు?"

"ఎంతసేపయినా! ఎన్నిరోజులు సంవత్సరాలయినా! ఎన్నియుగాలయినా నిన్ను విడిచిపోవాలని పించదు నాకు" అన్నదామె.

మెత్తని శయ్యమీద మేనువాల్చి పడుకున్నాడు. దేవలోకపు జిలుగువస్త్రంలా మెత్తని శయ్యమీద పల్చని దుప్పటిపరచి ఉంది. అది వారి కదలికలను అనుగుణంగా కుబుసంలా సాగుతోంది.

తలక్రింద సుకుమారమయిన దిండు.

శేషశయ్యను తలపించే ప్రక్కమీద పడుకున్నాడు. శరీరమంతా తేలిక అయిపోయినట్లు అనిపిస్తున్నా ఆమె పరిష్వంగంవల్ల ఊపిరులు బరువుగా పీల్చాల్సి వస్తోంది.

ఇది భూలోకమా? నాగలోకమా? ఇంత అభిరుచిగల శయ్యమందిరాలను ఎందరు అమర్చుకోగలరు? విలువకి అందని మన్మధతాపాన్ని రేపే వస్తువులు ఆ గదిలో ఎన్నోవున్నాయి.

ఈ కొండలమధ్య ఈలాంటి మందిరం ఒకటి ఉందని ఊహించేందుకు వీలుకానంత అద్భుతంగా ఉంది. అదంతా ఆమె కల్పన అయి వుండాలి.

తలమీద పడగలా కన్పిస్తోంది ఒక అతి పల్చని వస్త్రం వారిని పరివేష్టించి మిగిలిన ప్రపంచానించి వేరుచేస్తోంది.

ఉద్యోగం నేర్పిన చలాకితనంలో అందులోంచి బయటపడాలని పథకాలు వేయటం ప్రారంభించాడు.

అతని ఆలోచనలు సుడులుతిరుగుతున్నాయి. ఎంత సమయం గడిచిపోయిందో తెలియదు.

గాఢంగా అతనిని కౌగలించుకున్న సర్పసుందరి హఠాత్తుగా తన పట్టు సడలించింది.

"ప్రియతమా! నన్ను నిరాశపరచినావు. తెలవారుతోంది. యోగి సమాధినించి బయటపడేందుకు సమయం అయింది. తిరిగి అతడు సమాధిలోకి వెళ్ళేంతవరకు నేను పాముగానే ఉండిపోవాలి! వియోగం అనివార్యం" అందామె ఆతృతగా.

"యోగి సమాధిలోకి వెళ్ళటానికి, నీవు స్త్రీగా వుండతనికి సంబంధం ఏమిటి? నీ మాటలు వినేందుకే చాల విడ్డూరంగా వున్నాయి" అని ముఖాన్ని మరోవైపుకి మరలించుకుని తిరిగి నవ్వటం ప్రారంభించాడు. అంతా నిశ్శబ్ధమే ఆవరించింది.

ముందుగా ఒక స్త్రీ ప్రసవవేదన పడుతున్న ఆర్తనాదాలు విన్పించాయి. ఆ తరువాత ఒక పాము గ్రుడ్లు పెట్టేందుకు పడుతున్న అవస్థ తాలూకు హిస్సింస్సీ వినిపించాయి. ఆ బుసబుసలు విని అతడు తల తిప్పిచూశాడు.

అందాల సుందరి ధరించిన పాము కుబుసంలాంటి వస్త్రాలు ఆమె ధరించిన ఆభరణాలు అక్కడ కుప్పగాపదివున్నాయి. చేతనావిహీనమైన పాంచ భౌతిక శరీరాన్ని విడిచి నిర్లిప్తంగా వెళ్ళిపోతున్న మహామాయా కుండలినిలాగ వాటిమధ్య నించి వెళ్ళిపోతున్న కృష్ణ సర్పం అతని కంటపడింది.

అది గదిమధ్యలో ఉన్న తంపరాసిలాంటి ఒక కలుగులో తల దూర్చింది. క్రమంగా నడుము తోక అంతా అదృశ్యమై రంధ్రంలోకి వెళ్ళిపోయింది. తల విదిల్చి అమితాశ్చర్యంతో లేచి నిలబడ్డాడు శివరాజ్.

తనను అలా తెచ్చి తమకంలో బంధించిన సుందరి తమకం తీరకముందే సర్పంగా మారిపోయిందని గ్రహించాడు. తిరిగి ఆమె వచ్చేందుకు ఎంతోకొంత సమయం పట్టవచ్చు! కాళ్ళు చేతులు విదిల్చిలేచి నిలుచున్నాడు. అప్పుడప్పుడే చెరనించి విముక్తుడు అయినట్లుగా ఒళ్ళు విరుచుకుని హాయిగా ఊపిరిపీల్చుకున్నాడు.

గడియారంవంక చూచుకున్నాడు. ఆరున్నరగంటలు అయింది. తెల్లవారిపోయిందన్నమాట!?

అంటే ఆమెతోతాను ఆరుగంటల సమయం గడిపాడు. ఆరుక్షణాల్లో గడిచినాయి.

ఇక్కడ నించి బయటపడటం ఎలాగ?

ఆమె చెప్పినమాటలన్నీ జ్ఞాపకం వస్తున్నాయి. యోగి సమాధి చాలించిన తరువాత ఆమెకు స్త్రీ రూపం ఉండదు. యోగి సమాధిలోకి వెడితేనే మానవకాంతగా మారుతుంది. తాను అన్వేషించాలనుకున్న యోగి ఈ పరిసర ప్రాంతాలలోనే ఎక్కడో ఉన్నాడు. అతన్ని చేరుకోవడం ఎలా? ముందు యీ గదినుంచి బయటపడడం ఎలా?

ప్రథమంలో అతనీ చర్యలన్నింటిని ఇంద్రజాలంగా భావించాడు. కాని అంతకు భిన్నమయినది ఏదో కన్పిస్తోంది. తిరిగి అతడు సమాధిలోకి వెళ్ళేందుకు సమయం పట్టవచ్చు. పరిస్థితిని జాగ్రత్తగా విశ్లేషిస్తే అతడు పగటిపూట మామూలుగా ఉంటాడని రాత్రి సమయాల్లో సమాధిలోకి వెడతాడని అర్ధమవుతోంది.
యీ అవకాశాన్ని వినియోగించుకొని యీ చోటునుంచి బయట పడాలి.

అప్పుడు తానున్న చోటుని క్షుణ్ణంగా పరిశీలించేందుకు అవకాశం కన్పించింది.

గది వలయాకృతింగా ఉంది. ఖచ్చితంగా చెప్పాలంటే ఒక పుట్టలోపలి భాగంలా కన్పిస్తోంది. గదికి కిటికీలుకాని, వాకిళ్ళుకాని లేవు.

గాలి వెలుతురు ధారాళంగా వస్తున్నాయి.

చుట్టూ మట్టిగోడలకు ఏదో మెరుగుపూతలు పులిమినట్లు కన్పిస్తున్నాయి. అతడు గోడనించి ఓ చిటికెడు మట్టితీసి చూశాడు. నిస్సందేహంగా జిలుగు వెలుగులు చిమ్ముతూ నూనె మెరుగులు రాచినట్లున్న పుట్టమట్టి అది.

యీ సర్పసుందరి తనని ఒక పుట్టలోకి తీసుకువచ్చి బంధించిందా? ఆమె సర్పంగామారి ఓ కలుగునుంచి వెలుపలకు వెళ్ళిపోయింది కాని తాను బయటపడడం ఎలాగన్నది పెద్ద సమస్య? సమాధానం లేని ప్రశ్న అది.

గది సువిశాలంగానే ఉంది. అందమయిన అలంకరణలు ఎన్నో ఉన్నాయి. పైనించి విధ్యుద్దీపాలవంటి మణిదీపాలు కాంతుల్ని చిమ్ముతున్నాయి. ఒక వెదురుకర్రల బల్లమీద పాలు పళ్ళు ఎన్నోరకాలున్నాయి.

ఇది కలా నిజమా అని ధృవపరచుకునేందుకు దానిమీద ద్రాక్షపండు ఒకటి తీసుకుని మునిపంటిక్రింద పెట్టుకుని కొరికాడు. పుల్లపుల్లగా తియ్యతియ్యగా రవింత వగరుగా ద్రాక్షపండు రుచి! రసం గొంతు జారింది. ఇది కలకాదు సుమా! వాస్తవమే!

తన శరీరంమీద బట్టలవంక చూచుకున్నాడు. ఇంటిదగ్గర తాను ధరించిన మఫ్టీ డ్రస్! కిట్టు మాత్రం బయటనే ఉందిపోయింది.

అక్కడేం జరిగి ఉంటుంది? అహ్మద్భాయీ తిరిగి వచ్చే ఉంటాడు. అక్కడ కిట్టూచూచి భయపడి ఉంటాడు. తనకోసం వెదుకుతుంటాడు.ఏమి జరిగిందని భావిస్తాడో! యీ వార్తను డిపార్టుమెంటు ప్రతిస్పందన ఎలా ఉంటుందో! తులసి ఎంతగా పరితపించిపోతుందో.

ఇంక తనకు బయటపడే దారిఉందా? అసలులేదా?? ఏమిటివిముక్తి.

గది అంతా కలియతిరిగాడు. తానుకూడా పాముగా మారిపోతే తప్ప బయటకు వెళ్ళటం అసాధ్యం! కాని అదెలా సాధ్యం?

ఉండేందుకు చాలా మంచిచోటు.

ట్రయినింగ్ లో తాను పొందిన అనుభవాలను స్మరించి ఆ గదిని క్షుణ్ణంగా పరిశీలించటం ప్రారంభించాడు. అది శత్రు కేంద్రంకాదు. శృంగార శయ్యామందిరం! అందుకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి.

పన్నీరు, గంధం, కస్తూరి, పూలదండలు!!

గదిలోని పూలదండలు అన్నీ లావుపాటి దారపుపోగులవంటి గట్టి నారతో తయారు చేయటాన్ని గమనించాడు.

మరోమూల పొడవయిన పాముకుబుసాలు కనిపించాయి పదహారు అడుగుల పొడవున్న కుబుసాలు! వెడల్పయిన పడగ! దానిమీద సీతమ్మవారి పాదాలు! అన్ని ఒకే విధంగా మాసలోంచి తీసినట్లున్నాయి. వెన్నుమీద నల్లరంగు చారికలు ఆద్యంతమూ ఉన్నాయి. నిలువుగా నేలమీద పరిస్తే అదే పాము అన్న భ్రాంతిని కలిగించే విధంగా కన్పిస్తున్నాయి.

ఒక వంక రంధ్రాలుచేసి సారాన్ని పీల్చుకుని ఖాళీచేసిన పక్షి గ్రుడ్లు రాసిగా పోసి ఉన్నాయి. తాను ఒక పుట్టలో ఉన్నాననే అభిప్రాయం కలగగానే శరీరం జలదరించడం ప్రారంభించింది!

సర్పాలకు అత్యంత ప్రీతిపాత్రమయిన ఒక శివలింగము కన్పించింది.

మాహేశ్వరలింగం మృత్తికామూర్తి! నల్లని సిరామిక్ బొమ్మలా తళుకులీనుతోంది. దానిమీద ఒక బిల్వ పత్రంకూడా ఉంది.

చంద్రశేఖరుని ఆకృతి తలపిస్తూ శిగలో నెలవంకలాగ ఒక తెల్లగన్నేరు పూవు శివలింగంమీద అర్పించి తెల్లగా కన్పిస్తోంది.

సర్పాలకుకూడా పాతాళలోకంలో ఒక ప్రత్యేక జీవిత విధానం ఉంటుందని అతడు గ్రహించాడు. కాని ఆ వస్తువులు ఏవీ అతడు ఆ భూ గృహంనించి బయటపడే సాధనాలుగా అతనికి అన్పించలేదు.

ఆలోచనా మగ్నుడు అయి తిరుగుతూ ఉండిపోయాడు చాలాసేపు! ఎక్కడ ఎలాంటి ఆధారమూ కన్పించలేదు. శరీరమంతా నిరాశ నిస్పృహలు ఆవరించినాయి.

తిరిగి శయ్యమీదికి వచ్చాడు! ఐదుగురు బాలికలతో సమంగా ఏర్పాటుచేసిన మంచం మీద మెత్తని పరుపుతో సుకుమారమయిన తల్పం ఏర్పాటు చేయబడింది.

ఇంచుమించుగా రాత్రి అంతా నిద్రలేదు.

ఆకలి దప్పులు తెలియలేదు. నిద్రముంచుకొస్తున్నట్లుగా అనిపించింది.

అతడు మరింత రెప్పలు విప్పలేకపోయాడు! ఆదమరచి నిద్రపోయాడు!

ఎంతసేపో అయింది. త్రుళ్ళిపడి రెప్పలు విప్పాడు మళ్ళీ! అరనిముషం మనసుని స్వాధీన పరుచుకున్న తరువాత కాని తన చుట్టూ ఉన్న వాస్తవాలు జ్ఞాపకం రాలేదు.

ఆకలిగా అనిపించి లేచి వెళ్ళి పళ్ళు పాలు తీసుకున్నాడు.

పచ్చి గ్రుడ్లున్నాయి. కాని తినాలని పించలేదు.

తిరిగి వచ్చి మంచంమీద కూర్చుంటూ ఉండగా అతనికి జ్ఞాపకం వచ్చింది.

తాను గది అంతా బయటపడే దారికోసం అన్వేషించాడు.

కాని మంచం క్రింద చూడలేదు.

అదొక్కటే మిగిలిఉన్న చివరి ఆశ. చివాలున మంచం దిగాడు!

గదిలోకి వచ్చే చల్లనిగాలి మంచం క్రింది నించే వస్తోందని అర్ధమయింది.

మనసు క్షణంసేపు ఆశా ప్రపూర్ణమయింది.

నేలలోకి దింపిన వెదురు కర్రలను కదిలించటం ప్రారంభించాడు!!

* * *

"ఎన్ని గంటలని అలా కూర్చుంటావు?" తల్లి ప్రశ్నించింది.

వరండాలో చీకటిలో కూర్చున్న తులసి తల్లి వెంట హాలులోకి నడిచింది.

"అబ్బాయి ఈపూట కూడ రానని చెప్పాడా?" అన్నదామె. ఆమెకు ఇంకా తెలియదు.

జరిగిన సంగతి అనారోగ్య వంతురాలయిన తల్లికి చెప్పాలా? వద్దా??

క్రొత్త సమాచారం ఏమైనా వచ్చిందేమో తెలుసుకుని వస్తానని వెళ్ళిన ఉమ ఇంకా తిరిగిరాలేదు. మనసులో తుఫానులే చెలరేగు తున్నాయి.

బయట ప్రపంచంలో ఏం జరుగుతోందిప్పుడు?

హాలులో కూర్చోవాలని పించలేదు. తల్లితో మాటకలపాలని కూడ అన్పించలేదు.

అశాంతిగా తిరిగి వచ్చి వరండాలో కూర్చుంది.

ఆ వెనుకనే తల్లివచ్చి లైటు వెలిగించి మరోసోఫాలో కూర్చుంది.

"ఈ మూగభాష ఏమిటే?" అంది ఆవేదన నిండిన స్వరంతో.

"ఈ మూగభాష ఏమిటే?" అంది ఆవేదన నిండిన స్వరంతో.

"ఉమ వస్తానంటే కూర్చున్నాను! ప్రతి చిన్న విషయానికి ఎందుకు అంత హడావుడి చేస్తావు?"

"హమ్మయ్య అంతేకదా? మనసులో ఏముందో చెప్పవు. కన్న తల్లిని నాకెలా ఉంటుంది?

గుండె విప్పుకుంటే బరువులు తగ్గుతాయమ్మా! అది కూడ నేనే చెప్పాలా? ఏం చదువులమ్మా మీ చదువులు? లోకజ్ఞానంలేని చదువులు?

"పెందలాడే వెళ్ళి టాబ్లెట్స్ వేసుకుని టానిక్ త్రాగి పడుకో మమ్మీ!"

"అన్నానికి వస్తావా? అబ్బాయి వచ్చేంత వరకూ ఉంటావా?"

"ఉంటాలే! నువ్వెళ్ళు!" సహనంలేని కంఠస్వరం!

"పెళ్ళి అయి వారం తిరగలేదు! నా పొడ పనికి రాకుండా పోయిందన్న మాట? అప్పుడే అంత చేదయి పోయానానీకు? నాకు చెప్పవు కాని మొత్తం మీద ఏదో ఉంది నీ మనసులో! నిన్ను చదివించి చాల తప్పు చేశానే!

కాళ్ళు విరగ్గొట్టి ఓ మూలన కూర్చోబెడితే బాగుపడే దానివి! అవునూ! క్రొత్తగా వచ్చాయే కంట్రోలు టాబ్లెట్లు అనికాని వాడేవు. అబ్బాయి వాడమన్నా నాకు యిష్టంలేదని చెప్పు! పాతిక సంవత్సరాలు వస్తున్నా పిల్లల్ని కనాలనే జ్ఞానం ఉండదు ఈ కాలం వాళ్లకి! ఎప్పటికయినా తప్పదు కదా!"

"అబ్బా విసిగించకు మమ్మీ! పెందలాడే పడుకోవెళ్ళి?"

"అవున్లే! మొగుడొచ్చాక తల్లి మాటలు విసుగేమరి?" అంటూ లోనికి వెళ్ళింది తల్లి. లేచి వెళ్ళి వరండాలో దీపం తీసేసి మళ్ళీ చీకటిలో ఒంటరిగా కూర్చుంది తులసి!

చదువు, పరిశోధన స్నేహితులతో కాలక్షేపం లాంటి వ్యాసంగాలతో సాఫీగా సాగిపోతున్న జీవితంలో పెళ్ళి అనేది పిడుగు పాటులా అన్పిస్తోందామెకు.

భర్త చాలామంచి హృదయం కలిగినవాడే అయినా, అతడు కావాలని చేసిన అపకారం ఏమి లేకపోయినా ఆ మొత్తం సంఘటన తన జీవితంలోకి ఒక ప్రధానమయిన మలుపుకి కారణం అయినట్లు కన్పిస్తోంది.

"ఇంకా ఇక్కడే కూర్చున్నావేమిటి? నీకు పిచ్చి పట్టిందా?" దగ్గరాగా వచ్చి చనువుగా భుజంమీద చేయివేసింది ఉమ!

నిశ్చలమయిన జలంలోకి రాయి విసిరినట్లు ఉలికిపడి లేచింది గడియారం పన్నెండు గంటలు దాటిన సమయాన్ని సూచిస్తోంది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నదంటే తల్లి నిద్రపోతూ ఉందనే అర్థం.

"అర్ధరాత్రి అయ్యేంతవరకూ ఎక్కడ ఊరేగావు?" అంది విస్మయంగా చూస్తూ.

"పరిస్థితి ఏమిటో అంతా కన్ ఫ్యూజిన్ గా ఉందోయ్!" అంటూ మరో కేన్ చెయిర్ లో రిలాక్స్ అయి కూర్చుంది"కాసిని మంచినీరు తెచ్చిపెట్టు" అంది రుమాలుతో నుదురుమీద అద్దుకుంటూ!

తులసి లోనికివెళ్ళి ఫ్రిజ్ లోంచి వాటర్ బాటిల్ తెచ్చి అందించింది.

నువ్వు అన్న విధంగా ఊరేగినట్లు ఊరంతా తిరిగానే! అందరూ తలో విధంగా అనుకుంటున్నారు. అవన్నీ వింటోంటే బేజారు అవుతోంది.

పుకార్లు చాల ఉంటాయి. అన్నీ నమ్మాల్సిన అవుసరం లేదనుకో.

కాని ఒక మాట మాత్రం అది పుకారే అనిపించినా చాల బాధ కలిగించింది.

కళ్యాణి లాగానే శివరాజ్ కూడ ఖతం అయిపోయాడని చెప్పు కుంటున్నారు జనం!

ఇలాంటి పుకార్లు వింటున్న ఈ రోజు ఎంత చెడ్డదో చెప్పలేను అంది!

ఉమ మాటలు విని తులసి వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించింది! ఓదార్చేందుకు మాటలు వెతుక్కుంటూ మౌనంగా ఉండిపోయింది ఉమ! రవంతసేపు దుఃఖం దిగిపోయాక తనంతతానుగానే తేరుకుని కళ్ళు, ముఖము తుడుచుకుంది తులసి.

"అలా జరుగుతుందని నేను అనుకోను! కళ్యాణి కి త్వరగా గుండె చెదిరిపోయేందుకు అవకాశముంది! ఈయన పరిస్థితి వేరు! ట్రయినింగ్ లో మెడల్ సంపాదించిన పోలీసాఫీసర్! అంత త్వరగా ఓడిపోతారను కోను.

హఠాత్తుగా శత్రువులు కన్పిస్తే ఎక్కడి వస్తువులు అక్కడ వొదిలేసి వారిని వెన్నంటి వెళ్ళి ఉంటారనిపిస్తోంది" అన్నదామె.

"తిరిగి రాకపోవటానికి కారణాల గురించే చర్చలు జరుగుతున్నాయి."

"నువ్వు ఈ మాటలన్నీ ఎక్కడ విన్నావు?"

"ఇప్పుడు మన సమస్యలకి సమాధానం మనమే వెతుక్కోవాలి? మన వాళ్ళందరితో చర్చించే ఈ నిర్ణయం తీసుకున్నాను" అంది ఉమ.

"అర్ధరాత్రి వరకూ తిరిగి సాధించిన ఘనకార్యం ఇదన్నమాట."

"మనం ఏమి చేస్తే బాగుంటుందంటావు?" అని అడిగింది తులసి.

"యూనివర్సిటీ హాస్టల్ నించి బయలుదేరటానికి అంతా సిద్దంగా ఉన్నారు"

"అదే చోటుకి వెళ్ళటంలో అర్ధమేమిటి? ఒకసారి పోలీసులు వచ్చాక మళ్ళీ ఆ చోటుకి ఎవరొస్తారు! అంతా వృధా ప్రయాస" అంది తులసి!

"నువ్వు చాల డిప్రెషన్ లో ఉన్నావు. ఎవరేమిటో అర్ధం కావట్లేదు. అదే చోటుకి వెళ్ళాలని నేను అనలేదు. ఇదంతా ఎందుకుగాని మాట్లాడకుండా రా నా వెంట. బయల్దేరు" అంటూ తొందరించింది ఉమ.

నిజంగానే భయంవనల ఆలోచనలు మందగించుతున్నాయి. ఎవరో ఒకరు చెప్పినట్టు వినాలికదా! "అలాగే" అంటూ లేచింది తులసి!

తలుపులు వేసుకుని జాగ్రత్తగా ఉండమని చెప్పేందుకు లోనికి వెళ్ళింది! కాని పరిస్థితి ఆమె ఊహించినట్లుగా కాక మరో విధంగా వుంది.

పని మనిషి నిద్రపోతోంది. తల్లి మేలుకుని వుంది. వారి మాటలు కొంతయినా వింది. పూర్తిగా అర్ధం కాకపోయినా అశుభాన్ని శంకించింది.

"జరిగిందేమిటో నాకు చెప్పకుండా దాస్తావెందుకు? తులసీ! నేను నీ కన్న తల్లిని అనుకుంటున్నావా? శత్రువు అనుకుంటున్నావా?" అని ప్రశ్నించింది జాలిగా! తులసి మనసు కరిగిపోయింది.

"మమ్మీ! ఆయన తిరిగి రాలేదు కిట్ మాత్రమే తిరిగి వచ్చింది!"

"అంటే ఏమయింది?" అంటూ బావురుమంది. తల్లి నోరుమూసింది తులసి. అందుకే నీకేదీ చెప్పనంటున్నాను. ఏం జరిగిందో తెలియదు. ఏదో జరిగిందని వూహించుకుని హడావుడి చేయకు. అర్ధరాత్రి యెవరన్నా వింటే బాగుండదు. ఏం జరిగిందో తెలుసుకునేందుకే మేం బయలుదేరుతున్నాం! గదిలోకి వెళ్ళి పడుకో ప్రశాంతంగా!

ఉమతోపాటుగా బయలుదేరింది. పన్నెండున్నరయింది. వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి. అర్ధరాత్రి సంచారాన్ని కనిపెట్టి చూచేందుకు అక్కడక్కడ పెట్రోల్ వాన్ లు నిలిపి ఉన్నాయి.

క్రీనీడల్లో నిలిపిన వాహనాల్లోంచి కొన్ని కళ్ళు వేదిలోకి ప్రతి కదలికని అతి జాగ్రత్తగా గమనిస్తున్నాయి.

కారు యూనివర్సిటీ హాస్టల్ కాంప్ లోకి ప్రవేశించాక అక్కడ చాల సందడిగా ఉండటాన్ని గమనించి ఆశ్చర్య పడిపోయింది తులసి. తన కోసం ఇంతమంది నిద్రమాని సిద్దంగా ఉండటం కన్నీరు పూరించింది!

తాను ఒంటరిని కాను అనే భావం కొండంత ధైర్యాన్నిచ్చింది.

ఈ ఏర్పాటు అంతటికి కారకురాలయిన ఉమ ముందుగా కారు దిగింది.

ఇంచు మించు పాతికమంది విద్యార్ధినుల మధ్య ఒక యువకుడు కూర్చుని ఉన్నాడు! అతని ముఖం బాగా వాడిపోయి అలసటగా ఉంది.

"మధ్యాహ్నం నుంచి మనవాళ్ళు ప్రశ్నలతో వేధిస్తున్నారు. పాపం ఎంతగా అలిసిపోయాడో చూడవే మన ఆపద్బాంధవుడు" అంది.

"ఎవరతను ఎందుకలా డిటెన్యూని కూర్చోపెట్టినట్టు కూర్చోపెట్టారు?"

"మనవాళ్ళు తలుచుకోవాలేకానిమొత్తం పురుష ప్రపంచాన్ని డిటెన్షన్ లో పెట్టగలరు. పాపం అర్భక ప్రాణి ఎంతగా వడిలిపోయాడో చూడు!? అతని పేరు అహ్మద్! శివరాజ్ ని చివరిసారిగా చూచిన మందభాగ్యుడు!

మనపాలిటి పెన్నిధి. తిరిగి అతన్ని  చూపించాల్సిన బాధ్యత అహ్మద్ మీద ఉందని మనవాళ్ళు తీర్మానించారు. డిటెన్యూలని పోలీసులయినా కొంత రిలాక్స్ కానిస్తారు. మనవాళ్ళు అతన్ని బాగా టైట్ చేశారు" అంది.

ఇద్దరూ వారి దగ్గరకు వెళ్ళారు!

"ఎంతసేపని ఎదురు చూడాలమ్మా మీకోసం?" అంది ఓ అమ్మాయి.

"వెళ్ళిరావద్దా! ప్రపంచమంతా మునిగిపోయినట్లు పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయి వుంది మన తులసి. దాన్ని ఓదార్చి తీసుకువచ్చేందుకు ఇంత సమయం పట్టింది." అని బదులిచ్చింది ఉమ.

"దిగులెందుకు మనం శివరాజ్ ని చూడబోతున్నాంకదా" అందా అమ్మాయి.

అందరూ ఆశ్చర్యంగా ఆ అమ్మాయిని చూశారు.

"ఎందుకు మీరందరూ నా వంక అలా చూస్తారు? శివరాజ్ ఎక్కడున్నాడనీ తెలియదనుకుంటున్నారా? ఎంత అమాయకులు మీరు? పోలీసు మనుషులు నమ్మేశారు కదాని మీరు కూడా నమ్మేస్తున్నారు అతని మాటల్ని!

కాని అసలు విషయం నాకు తెలుసు! శివరాజ్ ఎక్కడున్నాడో అహ్మద్ కి తెలిసే ఆ విషయాన్ని దాస్తున్నాడు. అవును కదూ అహ్మద్!" అన్నదా అమ్మాయి.

అహ్మద్ నివ్వెరపోయినాడు. చెవులుపట్టుకుని లేచి నిలుచున్నాడు.

"నన్ను యిరికించకండి బాబోయ్! నాకు తెలియదు. నిజంగా తెలియదు" అన్నాడు.

"అబద్ధాలాడకు అహ్మద్! నిలబడ్డావెందుకు? పారిపోవాలనా? కూర్చో! నింపాదిగా జ్ఞాపకంచేసుకుని చెప్పు! తెలుసుకదూ!" అంటూ అనుమానితుడిని బలవంతం చేస్తున్నట్లు అడిగిందా అమ్మాయి.

"కావాలంటే మేము విడిపోయిన చోటు చూపిస్తాను. ఏదో చిన్న నాటి స్నేహితుడు కదా! అడిగాడని తీసుకుపోయాను ఇలా పీకలమీదికి వస్తుందని నేను ఊహించలేదమ్మా! మంచినీళ్ళ కోసంవెళ్ళి తెంల్లారిందాకా నిద్రపోయాను. లేకపోతే అతని విషయం నాకు తెలిసేది." అని వాపోయాడు.

"కహానీలు వినిపించకు భాయ్! అర్ధరాత్రి ఒక చోటుకి తోడుగా వెళ్ళిన మనిషి ఏ మార్చిపెట్టి మంచినీళ్ళకోసం పోయావు కథ అంతవరకూ నమ్మేందుకు వీలుగానే వుంది కాని అక్కడే పడుకుని తెల్లారాక వెళ్ళాను. అతను కనిపించలేదు. కిట్టు కనిపించింది అంటున్నావే! ఆ మాటలు నమ్మబుద్ధి కావటల్లేదు.

ఆ పరిస్థితుల్లో మంచి నీటి కోసం వెళ్ళిన వాళ్ళకి యెవరికయినా నిద్రపడుతుందా? పట్టినా అంతసేపు మొద్దునిద్ర మొద్దునిద్ర పోగలరా?

నిజం చెప్పకపోతే ఈ అనుమానాలన్నీ పోలీసులకి అందిస్తాం. ఆ తరువాత నీ భార్యలు ముగ్గురూ విలపిస్తారు" అందామె బెదిరింపుగా.

అతడు ఏదో విషయాన్ని దాస్తున్నాడనే అనుమానం యెవరికీ రాలేదు. ఆ అమ్మాయి ఒక్కర్తె పట్టుదలగా మాట్లాడుతోంటే వారికి బాధగా కూడా వుంది.

"ఇంక పోనిద్దు! తెలియందే అతను మాత్రం ఏం చెప్పగలడు?" అంది మరో అమ్మాయి.

"జీత్ రహో బహెన్!" అతను సంబరపడిపోయి ఆశీర్వదించాడు

"నువ్వు నోర్మూసుకోవే! అంత నిద్రపట్టటం అసహజంగా ఉంది"

"చెప్పాను కదా నాకు కన్పించిన అమ్మాయి కళ్ళమీద వ్రేళ్ళు ఆనించగానే నిద్ర ముంచుకొచ్చేసింది. ఆ తరువాత నాకేమీ తెలియదు అన్నాడు అహ్మద్.

"ఆ అమ్మాయి యెవరో నీకు తెలుసు అన్నావు కదూ?"

"నాకు తెలియదు యెన్నడూ చూడలేదు. చినపాలెం నాగంభొట్లు గారి అమ్మాయివా అని అడిగితే యెందుకు కాకూడదు అంది."

"అయితే మమ్మల్ని అతని దగ్గరకు తీసుకుపో!" అహ్మద్ ఒప్పుకున్నాడు విధిలేక!!

## 11

"ఆ పేరుతో అడిగితే అందరికీ తెలియదమ్మా! నాగంభొట్లు గారిని ఎవరూ పేరుపెట్టి పిలవరు! లింకుల కరణంగారంటేనే తెలుస్తుంది.

"అదేం పేరు? విచిత్రంగా ఉందే!"

"సరి కదమ్మా! ఆయన పేరుకాదు. తీరు కూడా విచిత్రం! వారి దగ్గర పెద్ద లింకులు చిన్న లింకులు అని రెండు గొలుసులుంటాయి. చేయి తడిపినవారికి పెద్దలింకుల గొలుసుతోటి చేయి తడపని వారికి చిన్న లింకుల గొలుసు తోటి కొలుస్తారని చెప్పుకుంటారు. అందుకే భూమి పుట్ర కొలిపించుకునే వాళ్ళు ఆయన్ని లింకుల కరణంగారని పిలుస్తుంటారు.

అదుగో ఆ సున్నం కొట్టిన పెంకుటిల్లే వారిది! అయినా ఈవేళప్పుడు ఇంతమంది వచ్చారేమిటి? ఏమన్నా పనా?"

"అవునమ్మా ఈ వేళప్పుడు పనిలేకుండా ఎవరొస్తారు?" రాగం తీసిందో అమ్మాయి. తనలాగే రాగం తీయటం ఆవిడకు చిన్న తనమనిపించింది.

"అయినా మాకెందుకులే అవన్నీ! ఈ వేళప్పుడు వీధివాకిలి తీస్తే మావారు ఊరుకోరు. నిద్ర లేచారంటే నా మీద విరుచుకు పడతారు. వెళ్ళండి. అదే ఇల్లు!" మరోమారు ఆవులించి తలుపులు మూసిందా ఇల్లాలు!

నాలుగు కార్లలో క్రిక్కిరిసి వచ్చిన ఆడపిల్లలు లింకుల కరణం గారి సున్నం కొట్టిన పెంకుటి పంచమీద దాడికి వచ్చినట్లు దిగిపోయారు.

ముందుగా అహ్మద్ ని పంపించారు.

అతడు భయపడుతూనే ఇంటి తలుపులు తట్టి పిలిచాడు! "కరణం గారూ!! ఏమండోయ్ కరణంగారూ! ఓసారి తలుపు తీస్తారా?"

వెంటనే బదులు వినిపించింది. "ఎవరయ్యా ఈ వేళప్పుడు?" విసుగు.

"నేనండీ అహ్మద్ ని! సైకిల్ మీద బట్టలమ్మే అహ్మద్ ని!"

"ఈ వేళప్పుడు బట్టలేమిటిరా నీ బొంద! మా ఆవిడ నిద్ర పోతుంది! పగటిపూట అఘోరించవోయ్! వెళ్ళు! వెళ్ళు!!"

"బట్టలబేరం కాదయ్యగారూ! మీతో కొంచెం మాట్లాడాలి!"

"అర్ధరాత్రి పూట మాటలేమిటోయ్?" తలుపులు తెరుచుకున్నాయి! లింకుల కరణంగారు అంతమందిని ఒకేసారి చూడటంతో ఖంగుతిన్నారు.

అందరూ ఆడపిల్లలు కావటం గమనించి వెంటనే సంబాళించుకున్నారు.

"ఏమిటింతమంది?" అన్నారు అర్ధోక్తిలో ఆగిపోతూ!

"మీతో మాట్లాడాలని వచ్చాం!"

"అంతముఖ్యమయిన పనా తల్లులారా?"

"మరేనండి! చాల ముఖ్యమయిన పని!"

"చెప్పండి! ఏమిటాపని?" లోపలికి రమ్మనలేదు. తన ఎత్తయిన అరుగుల అంచుమీద బైఠాయించాడు! ఆడపిల్లలు యిబ్బంది పడుతున్నట్లు ముఖాలు చూచుకున్నారు.

"మీతో పర్సనల్ గా మాట్లాడాలి!" తనే ముందుగా లోపలకు దారి తీసింది ఉమ!

లింకుల కరణంగారు సంశయిస్తూ లోపలి వెళ్ళారు.

ఆ వెనుకనే పటాలం అంతా లోపలి నడిచింది అహ్మద్ తో సహా! వెంటనే వాకిలి తలుపులు మూసుకున్నాయి. ఈ సందడికి కరణంగారి అర్ధాంగి చప్పున లేచి నిలబడింది. జరుగుతున్నదేమిటో అర్ధంకాక అయోమయంగా చూచింది.

కరణంగారు ఎటువంటి పరిస్థితి అయినా తనకి అనుగుణంగా మలుచుకోవటంలో అఖండుడు! తాపీగా కుర్చీలో పీఠంవేసి కూర్చున్నాడు!

"పాపం చిన్న పిల్లలు! చాలమంది వచ్చారు. వేళకాని వేళప్పుడు! ఎంతో ముఖ్యమయిన పని వుంటే తప్ప ఊరికే ఎందుకొస్తారు? మంచి తీర్ధం పుచ్చుకుంటారా అమ్మలూ!" అంటూ మర్యాదలు ప్రారంభించారు.

"ఏమండీ! మీ అమ్మాయి ఎక్కడ?" సూటిగా ప్రశ్నించింది ఉమ!

"అమ్మాయి అంటే మీరు ఎవరి గురించి మాట్లాడుతున్నారు?" ఎదురు ప్రశ్న వేశాడు.

ఆ అడగటంలో తనకి అమ్మాయిలు ఉన్నదీ లేనిదీ తెలియనివ్వలేదు.

"ఎవరంటారేమిటి? ఎర్రగా పొడవుగా నాగకన్యలా ఉంటుందే!"

"తొందర పడకమ్మా గుర్తులు నేను అడగలేదు. పేరు చెప్పమంటున్నాను"

ఉమ తెల్లముఖం వేసుకుని చూడడం తప్ప మరేమి చేయలేక పోయింది! అహ్మద్ దగ్గర సాగినట్టుగా తమ బుకాయింపు లింకుల కరణంగారి దగ్గర సాగవని వారికి చాలామందికి అర్ధమయిపోయింది.

"అర్ధరాత్రి సమయంలో కొండలదగ్గర అడవి ప్రత్తిచెట్ల మధ్య నాకు కన్పించింది బాబుగారూ! మీ అమ్మాయేమోనని అడిగితే ఎలా అనుకున్నా అభ్యంతరం లేదు అంది" అని జరిగిన సంగతి వివరించాడు అహ్మద్!

అప్పుడయినా రవంత సమాచారం వస్తుందని వారు ఆశించారు. కాని కరణంగారు మరింత రిజర్వ్డ్

అయిపోయాడు! అర్ధరాత్రి ఏమిటి? ఆడపిల్ల ఏమిటి? మా అమ్మాయి అని చెప్పడం ఏమిటి? అందుకోసం ఇంతమంది అర్ధరాత్రి వచ్చి తన ఇంటి తలుపులు తట్టడం ఏమిటి?

కరణంగారి బుర్రలో ఎన్నో సందేహాలు ఉదయించినాయి. పూర్తికథ వినేంతవరకూ పెదవి దాటి సమాచారం యివ్వరాదని నిర్ణయించుకున్నాడు!

చీకట్లో యేముందో చూడకుండా అడుగేయటం తెలివి తక్కువ.

"అనుకున్నా అభ్యంతరం లేదు అంది కాని ఫలానా వారి అమ్మాయని అని తేల్చి చెప్పలేదు కదా! పోనీ చెప్పిందే అనుకుందాం! అది పట్టుకుని మీరంతా ఇంటికి వచ్చారంటే శుభమో అశుభమో ఒక కారణం ఉండి ఉండాలి!

ముందా విషయం చెప్పండి! మీరెందుకు వచ్చారు?"

"ఆ తరువాత మా మనిషి అదృశ్యమయిపోయాడు!"

"అతడు అదృశ్యమయిపోవటానికి మీరు మా యింటికి రావటానికి ఏమిటి సంబంధం?" నిక్కచ్చిగా నిలదీసినట్టు ప్రశ్నించాడు!

ఆయనతో పరాచికం కొరివితో తలగోక్కునట్టు అయింది. జిడ్డులా పేరుకుపోయిన మచ్చు కొంతయినా విడిపోయి దారి కన్పిస్తుందని ఆశించారు.

ఆయన ప్రశ్నలు మరింత అయోమయాన్ని సృష్టిస్తున్నాయి.

"ఆ అమ్మాయి అహ్మద్ ని నిద్రపుచ్చింది." అంది ఉమ ఆపుకోలేని అసహనంతో!

"అంతమనిషి! చెట్టంత వాడిని నిద్రపుచ్చటం ఏమిటమ్మా?" శాంతంగా అడిగాడు.

"నాకు కన్పించిన అమ్మాయి కళ్ళమీద వ్రేళ్ళు పెట్టగానే నిద్రముంచుకొచ్చింది!"

"ఎంత అమాయకుడివయ్యా ఆహ్మదూ! అర్ధరాత్రి! అందమైన ప్రకృతి! అమ్మాయి ఒంటరిగా దగ్గరకొచ్చి పలకరించిందంటే నీకు నిద్ర యెలావచ్చింది?

ఆమె మీద కోరికయినా కలగాలి! భయమయినా వెయ్యాలి!"

సరే ఆ సంగతి అలా ఉంచు! అసలు ఆసమయంలో మీరు అక్కడ ఎందుకున్నారు? నీతో ఉన్న రెండో మనిషి ఎవరు?" నిద్రకు నీళ్ళు వొదులుకుని ఆసక్తిగా వింటూ కూర్చుంది అతని అర్ధాంగి!

ఇంకా ఈ భాగోతం చాలించాలి! కదా అంతా వింటేకాని కరణం గారు పిసిరింత అయినా సమాచారం బయటకురానివ్వరు అని నిర్ధారణ అయింది.

ఉమ ఆయనకు విషయమంతా పూసగ్రుచ్చినట్టు ఏ అంశాన్ని విడవకుండా అంతా వివరించింది! లింకుల కారణంగారు కనురెప్పలు క్రిందికి వాల్చి నుదురు మీద వ్రేళ్ళతో రాచుకుంటూ అంతాప్రశాంతంగా విన్నాడు.

వారింక చెప్పవలసింది ఏమీలేదని నిర్ధారించుకున్నాక నోరు విప్పాడు!

"చూడమ్మా! నాకు అసలు ఆడపిల్లలు లేరు. నలుగురూ మగ బిడ్డలే! మీరు చూచిన అమ్మాయి నా కూతురు కాదు. ఎవరో మిమ్మల్ని అబద్ధాలు చెప్పి మోసగించారు. ఇంత దూరం మీరు రావటం వృధా అయింది! మజ్జిగపుచ్చుకుని వెళ్ళండి!" అన్నాడు.

ఆయన సలహాని ఆజ్ఞగా భావించి వంటగదిలోకి వెళ్ళింది అర్ధాంగి!

మంచినీరయినా త్రాగే శక్తిలేకుండా ప్రతి ఒక్కరిని నీరసం ఆవహించింది.

"అయితే మరి ఎవరయి ఉంటారు?" ప్రతి ఒక్కరిలో అదేప్రశ్న! ఆ ప్రశ్న అప్రయత్నంగా ఉమ పెదవులు దాటి వచ్చింది.

లింకుల కరణంగారు గట్టిగా పీఠం సరిచేసుకుని కూర్చున్నారు.

"నా పెద్దరికం మీద నమ్మకముంచి అలా అడిగారు బాగుంది!" ఇది.

"ఈ ప్రాంతాలలో అప్పుడప్పుడు జరుగుతున్న తతంగమే! ఇలాంటి కథ వినటం ఇదే నాకు ప్రథమంకాదు.

మూడు దశాబ్దాలకు పూర్వం ఒక సంఘటన జరిగింది. అది మొదలు అప్పుడప్పుడు ఆ అమ్మాయి పాడుకొంటూనో, రోదిస్తూనో ఒంటరిగా విచారంగా తిరుగుతూనే చాలమందికి కన్పించింది!

ఒకప్పుడు జరిగిన కథే అందుకు కారణం అని నేను ఊహించాను. అసలు విచిత్ర మేమిటంటే ఆ కథకూ నాకు ఆడపిల్లలు లేకపోవటానికి కూడ సంబంధం ఉంది" అన్నాడాయన!

శ్రోతలు మంత్రముగ్ధులైపోయి వింటున్నారు.

ముప్పయి సంవత్సరాలకు మునుపు జరిగిన ఒక విషన్న విషాదాంత ఇతిహాసం అక్షరాశ్రువులై లింకుల కరణంగారి పెదవుల వెంట జారుతున్నాయి.

ప్రేమ తమకంతో పెనవేసుకున్న జంట నాగుల ఆరంభ కౌశి అది!!

కొరతలే లేని సంయోగ ఆనంద ఆర్ణవం!

అక్షరాలు ఆవాహనలై వారిని అవియోగ కథా వీధికి నడిపించాయి!!

* * *

అప్పటికి నావయసు ఇరవైఅయిదు సంవత్సరాలుంటాయి.

కొత్తగా పెళ్ళయింది. అత్తారింటికి వెళ్ళాలంటే ఆ కొండ మలుపు తిరిగి పోవాలి. రాకపోకల్లో వీలయినంతవరకు చీకటి పడకుండా జాగ్రత్త పడేవాడిని! ఆరోజు బాగా జ్ఞాపకం లేదు కాని ఏదో పండగ! ఎవరో భూమి కొలిపించుకునేందుకు వచ్చారు. ఎట్టివాడురాలేదు. నేనే గొలుసు తీసుకుని బయల్దేరాను.

ఆ పగలంతా తగవులు తీర్చటంతో సరిపోయింది. చీకటిపడుతూ ఉండగా అత్తారింటికి బయలుదేరాను. గొలుసు భుజాన పెట్టుకుని మోసుకుపోవటం అసౌకర్యాన్ని కలిగిస్తుంది. అటువంటి అవుసరం లేకుండా దాన్ని గుర్తుగా ఒక పెద్ద పుట్ట ప్రక్కనే రాయి చాటున దాచి వెళ్ళాను.

అప్పటికి నా భార్య గర్భవతి! ఆ రాత్రికి అక్కడే ఉండి ఉదయం బండి కట్టించుకుని ఆమెను తీసుకు వచ్చాను. వచ్చే సమయంలో గొలుసు తెచ్చుకోవటం మర్చిపోయాను. రెండురోజులు గడిచాయి. తిరిగి జ్ఞాపకం రాలేదు.

మూడవరోజు ఉదయమే ఒక పార్టీ నా దగ్గరకు వచ్చింది తగవు తీర్చమని!

అప్పుడు కాని నాకు గొలుసు విషయం జ్ఞాపకం రాలేదు.

చీకటి పడింది. ఆ చోటుకి వెళ్లేందుకు బయల్దేరాను.

"మళ్ళీ ఈ సమయంలో ఎక్కడికి బయల్దేరారు. పగలంతా తిరిగి వచ్చారు. భోజనం ముగించి వెళ్ళండి!" అని హెచ్చరించింది నా భార్య!

తిరిగి వచ్చేందుకు కొంత ఆలస్యం కావచ్చు. అంతసేపు ఎదురు చూడడం ఎందుకని భోజనం ముగించి వీధిలో పలకరించేవారికి బదులు చెప్పుకుంటూ ఊరుదాటాను. అప్పటికి సమయం పదిగంటలు దాటింది.

ఆ చోటు వెతుక్కుంటూ చేరుకునేసరికి పదకొండు దాటింది. ఏ నాటిదో తాతలనాటి గొలుసు! అచ్చివచ్చిన గొలుసు. దాని వల్లనే మా కుటుంబంలో ఎన్నో తరాలు సుఖంగా బ్రతుకుతూ వచ్చాయి.

అందుకోసమే తెగించి దాన్ని తెచ్చుకునేందుకు కొంత సాహసం చేశాను.

కొండమీదినించి కిలకిలమని నవ్వులు విన్పించినాయి! ఆ సమయంలో అటువంటిచోటున ఎవరయినా మనుషులు ఉండేందుకు అవకాశముందని ఊహించలేదు. ఉలిక్కిపడి ఆ వైపు చూశాను. నాలాగే ఎవరయినా వచ్చి ఉండవచ్చు కదా!

నాకు ఎవరూ కన్పించలేదు. ఉత్సాహపూరితమయిన ఆ మాటలే విన్పిస్తున్నాయి.

"అడవిపూలు అన్నీకోసి నీ కోసమే మాలగా గ్రుచ్చాను. తీసుకో!"

"పండువెన్నెల! ఎదుట పడుచుపిల్ల! పూవులుతెచ్చి చేతికిస్తున్నా వంటే రసికత్వమంటే ఏమిటో నీకు తెలియదనేకదా అర్థం." అన్నదా అమ్మాయి కిలకిలనవ్వింది.

"మరేం చేయాలంటావు?" తలలో మాల ముడిచి మంచి చేసుకోవాలి!

"ఈ విద్యలన్నీ ఎప్పుడు నేర్చుకున్నావు? నువ్వు పూర్తిగా నా స్వంతమయినప్పుడు నిన్ను నేనెందుకు బ్రతిమాలుకోవాలట? అర్థంలేని మాట!"

"అదేంకాదు. నువ్వు నన్ను బ్రతిమాలుకోవాల్సిందే!"

"ఎందుకు అలాచేయాలని అడుగుతున్నాను"

"మరి మనుషులు అలాగే చేస్తుంటారు కదా!?" అన్నదా అమ్మాయి.

తరువాత అతను బ్రతిమాలుకోవటం విన్పించింది. చాలా తెలివయిన పిల్ల.

వచ్చినపని పూర్తి అయింది. ఇంకా వెళ్ళిపోదామని లేచాను ఆమె మాటలు మళ్ళా జ్ఞాపకం వచ్చినాయి.

ఒక్కసారి ఒళ్ళు ఝల్లుమంది. కరెంట్ షాక్ తగిలినట్లుగా అయిపోయాను. అరనిమిషం తరువాత నన్నునేనుగా చూచుకుంటే రాతిబొమ్మలా అయ్యాననిపించింది. ఆమె అన్న మాటలకు అర్ధమేమిటి? అంతరార్ధమేమిటి?

మరి మనుషులు అలాగే చేస్తుంటారు కదా? అంటే__? ఆమె ఎవరు? నేను వినటంలో ఏదయినా పొరపాటు ఉందా? ఆమె అనటంలో ఏదయినా పొరపాటు ఉందా? మరోసారి మనసంతా కేంద్రీకరించుకుని గుర్తుచేసుకున్నాను.

ఆమె అన్నమాట అదే! అదే!! తాను మనిషి కాకపోవటం ఏమిటి.

వెన్నె రాత్రి ఇలాగే అడవుల్లో కొండల్లో గంధర్వులు, యక్షులు, కిన్నెరులు, కింపురుషులు, దేవతలు వచ్చి విహరిస్తారని చెప్పుకుంటారు. అలాంటిది ఏదైనా సంభవించిందా! ఇది ఏ శతాబ్దం? ఎందుకిలాంటి ఆలోచనలు వస్తున్నాయి.

వెంటనే ఇంటికి తిరిగి వెళ్ళిపోవాలనే ఆలోచనలు మర్చిపోయాను.

సందేహాన్ని తీర్చుకునేందుకు మనసు బాగా ఉత్సహించింది.

వారిమాటలను మరింత దగ్గరగా వినేందుకు మరింతపైకి వెళ్ళాను. మాటలు విన్పించాయి.

"మొగలు చెండులో మల్లెలు పొదిగియిచ్చాను కదా! మరి నాకేమి ఇస్తావు?"

"నీకు కావలసిందేమిటో కోరుకో!" అందామె కిలకిల నవ్వుతూ.

"దాహం తీర్చుకోవాలనుంది!" తమకంగా అన్నాడు.

"పుట్ట ప్రక్కన పుణ్యస్త్రీలు పెట్టిన పాలున్నాయిగా వెళ్ళిత్రాగు"

"ఆకలిగా ఉంది. మగవాడి ఆకలి అర్ధంచేసుకోలేని ఆడపిల్లవా నువ్వు?"

"పాపం!ఇంత ఆకలిమీద నువ్వున్నావని అర్థం చేసుకోలేదు నేను. చాలా పొరపాటయిపోయింది. చెట్టుమీద పక్షులు పెట్టుకున్న గిజిగాడి గూడిలో పక్షిగ్రుడ్లున్నాయి. కడుపునిండా త్రాగొచ్చు. వెళ్ళిరా" అందామె.

అతడు నిరాశతో వేడివేడిగా నిట్టూర్చాడు. ఆ నిట్టూర్పు బుసలా విన్పించింది. వారి మాటలకు ఆ కదలికకూ వినిపించే శబ్దాలకూ ఏవో అసాధారణమయిన అర్థాలున్నాయని అనిపించింది. నా ఉత్సకత మరింతగా పెరిగింది.

దగ్గరగా వెళ్ళి వారిని చూడాలనిపించింది. ఏదైనా చేటు వస్తుందనే ఆలోచనరాలేదు.

నెమ్మదిగా అడుగులో అడుగువేసుకొంటూ కొండపైకి వెళ్ళాను.

ఆ ప్రాంతమంతా గచ్చపొదలతో నిండిపోయివుంది. అడుగుతీసి అడుగు వేయాలంటేనే భయంగా అనిపించింది.అయినా నాలో కలిగిన ఆసక్తి నన్ను వెనకడుగు వేయనీయలేదు. వెదుకుతూ ముందుకు వెళ్ళాను.

ఒక గచ్చపొదలోంచి వారిమాటలు విన్పిస్తున్నాయి. లోపల ఉన్న ఆమె ఆభరణాల కాంతి కాబోలు మినుకుమినుకుమంటూ కాంతులు కన్పించాయి.

"ఈ రాత్రి ఇలాగే నిలిచిపోతే బాగుంటుందికదూ!"

"అవును! మానవజీవితపు అనుభవాలు అపురూపంగా ఉన్నాయి"

అవమానం వచ్చినప్పుడు తెలుసుకోవాలనిపించింది. తీరా వారుమనుషులుకారని మానవాకృతిలో ఉన్నవారు మాత్రమే అని అర్థమయాక పారిపోవాలని మనసులో నిర్ణయించుకున్నాను. నిలవడం అసాధ్యమనిపించింది క్షణానికొక మాటు శరీరం ఝల్లుమంటోంది.

వెంటనే వెనుదిరిగి పరుగుతీయటం ప్రారంభించాను.

కాని వారు నా అడుగుల చప్పుడు గమనించారు. పొదలోంచి రెండు ఆకారాలు గంభీరంగాలేచి నా వైపు రావడం కన్పించింది.

ఇంక ప్రాణభయం గుండెల్ని పిండేయసాగింది.

శక్తి ఉన్నంతవరకు పరుగుతీశాను. కళ్ళుమూసుకునిముళ్ళురాళ్ళు లెక్కచేయకుండా ఒకటే పరుగు. పిచ్చి పరుగు! ఏవైపు వెడుతున్నానో నాకే తెలియదు. మనసు మనసులోలేదు.

నన్ను నేను గుర్తించుకునే శక్తిలేదు.

బాగా అలసట వచ్చాక ఒకచోట నిలిచిపోయాను. తలదించుకుని గుండెలనిండా గాలిపీల్చుకుంటూ అలసట తీర్చుకున్నాను. ఇంకా నా దారి ఏమిటో వెతుక్కోవాలి! తలెత్తి చూశాను.

ఆ యిద్దరూ నా ఎదురుగానే ఉన్నారు. కన్నులు చెదిరాయి! బహుశా ఆ క్షణం నా జీవితంలో అంతటికి అధ్భుతమయినది, అపురూపమైనది. అరుదైనదికూడ! మనుషులుకాని మనుషుల్ని చూస్తున్నాను.

ఇప్పుడు నేను ఎక్కడున్నాను? తలతిప్పి పరిసరాలను గమనించాను. ఎక్కడనించి బయలుదేరానో అక్కడే ఉన్నాను. అంటే ఇంతసేపు ఎక్కడెక్కడ పరుగెత్తాను. మళ్ళీ బయలుదేరిన చోటుకే ఎలా వచ్చాను. ఏమో అదంతా నాకు అర్థంకాలేదు.

తిరిగి భయంతో పరుగెత్తినా ఒక గమ్యాన్ని చేరటమనేది నా చేతుల్లోలేదనిపించింది. అక్కడ నా నిర్ణయాలకువిలువలేదు.

అతడు కోపంతో బుసలుకొడుతున్నాడు.

ఆమె అందంగా నవ్వుతోంది! నేను అయోమయంగా చూస్తున్నాను.

"అన్నా! ఎందుకు అంత ప్రయాసం? ఎక్కడికి వెళ్ళగలవ్ నువ్వు?"

"తల్లీ పొరపాటయిందిక్షమించండి! నేను వెళ్ళిపోతాను"

"నరుడినీడ నాగుమీద పడరాదు. అలా జరిగిన తరువాత ఎవరో ఒకరు ప్రాణాపాయంలో పడకతప్పదు.అదే జరిగిందిప్పుడు! నీ వింక తిరిగి వెళ్ళలేవు" అన్నాడాయువకుడు. భయంతో గడగడలాడి పోయాను.

ఇంకా అవే జీవితంలో ఆఖరు క్షణాలనిపించాయి.

కాని ఆమె అతన్ని వారించింది.

"ప్రియతమా! ఈ పిరికివాడు ఇప్పుడు చూస్తున్నదంతాకల! క్షణంలో అతడు విస్మృతుడు అవుతాడు. చూస్తూ వుండు" అని దగ్గరగా వచ్చిందామె.

నేను స్థాణువులాగా అయిపోయాను భయంతో.

ఆమె వేళ్ళు నా రెప్పలను తాకాయి. క్రమంగా స్మృతి కోల్పోయాను! రెప్పలు బరువుగా వ్రాలాయి. అంతు తెలియని నిద్ర ముంచుకొచ్చింది.

నేను రెప్పలు విప్పే సమయానికి తెల్లారిపోయింది.

ఎండుపుల్లలు సేకరించుకుందుకు వచ్చిన చిన్నపిల్లలు చుట్టూ నిలబడి వింతగా చూస్తున్నారు. కళ్ళు విప్పడంతో రవంత భయపడి దూరంగా జరిగారు.

ఎండ చురుక్కుమనిపించింది లేచి కూర్చున్నాను.

గొలుసు ప్రక్కనే పడివుంది. దాన్ని తీసుకొని తిరుగు ప్రయాణం అయ్యాను దారిలో రాతఃరి జరిగిన సంగతులు అన్నీ జ్ఞాపకం వచ్చినాయి.

కలకల అనే మాట మనసు పొరలమీదికి వస్తుంది. కాని మనసుని ఎంతగా నమ్మించాలని చూచినా అది కలమాత్రమే అనుకోలేక పోయాను.

హడావుడిగా నడిచి వస్తున్న నన్ను విస్మయంగా చూచారు గ్రామస్థులు.

"పంతులుగారూ! ఎక్కడనుంచి వస్తున్నారు?"

"ముఖం అలా అయిపోయిందేమిటి?"

"కళ్ళు గుంటలు పడిపోయాయేమిటి?" లాంటి ప్రశ్నలు విన్పించాయి.

నేనెలా ఉన్నానో నాకు తెలియదు. ఎవరికీ ఏమీ చెప్పలేదు. శరీరాన్ని నీరసం ఆవహించి అడుగుతీసి అడుగువేయలేని స్థితి అయింది.

ఎలాగో ఇల్లు చేరుకున్నాను.

గొలుసు బయట గదిలో ఉంచి తలుపులు మూసుకున్నాను. నాకు గాలి సోకిందా? దయ్యం పట్టిందా? మనసు మనసులో లేదు.

ఏదో వింత మార్పు శరీరంలో ప్రతి అణువునా! నేను నేనుకాదనిపించింది.

దాదాపు పదిగంటలు దాటిపోయేంతవరకు మామూలు మనిషిని కాలేదు ఇంకా ఆ తరువాత గదిలో ఉండనీయలేదు.

తలుపుల మీద చప్పుడు అయింది. తప్పని సరిగా బయట కొచ్చాను.

"అలాగే ఉండిపోయా రేమిటి? స్నానం చేయరా?" నా భార్య అడిగింది.

"ఈ రోజంతా అలాగే ఉండిపోవాలనిపిస్తోంది!" అన్నాను.

"అవునులెండి! అలాగే ఉంటుంది!"

"రాత్రి క్షణంలా గడిచి పోయింది! ఆమె అందాన్ని వర్ణించలేను"

"అందరూ నాముఖాన్నీ నవ్విపోతున్నారు. ఇంకా సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారా? అయినా మీకిలా పుట్టిందేమిటి?"

"ఆమె మాట్లాడితే వీణమీటినట్లుంది. కదిలితే మెరుపులు తారాడినట్లుంది. ఆ చూపులు
సమ్మోహనకరంగామనసుని పట్టి లాగాయి చూచేవారు అని మేషులై పోతారు దేవతలై పోతారు. రెప్ప వేయాలనిపించదు. ఆమె నడిచేప్పుడు నాగపడగల మ్రోత అవి సర్పలోకపు మంజీరనాదాలు!

వేలిమీదికి మెరుపుతీగ వచ్చినట్లుగా ఉంది" అన్నాను.

అంతసేపు విడ్డూరంగా నా ముఖంలోకి చూస్తున్న నా భార్య హఠాత్తుగా గొంతు పెంచేసి ఏడవటం ప్రారంభించింది.

"నా కొంప మునిగింది దేవుడో! ఈ పిచ్చివాలకం ఏమిటి భగవంతుడో! నా సంసారం నిప్పుల కుంపటి అయింది నాయనో!" ఆమె రోదనా పూర్వకమయిన రాగ సుధలు ఆలకించి ఇరుగుపొరుగు వారంతా మాయింటికి వచ్చేశారు హడావుడిగా!

"ఎందుకమ్మ అలా ఏడుస్తావు!" ఓదార్పు నెపంతో విచారణ ప్రారంభించారు.

"నా కాపురం నట్టేట మునిగిపోయింది పిన్నిగారూ!"

"చెట్టంత మొగుణ్ణి ఎదురుగా పెట్టుకొని అలాంటి అవాచికం మాటలు అనకూడదమ్మా! ఏమయిందసలు బాగానే ఉన్నాడు కదా!"

"పైకి బాగానే కన్పిస్తున్నారు. రాత్రి ఏదో గాలిసోకింది."

"మగాళ్ళ కిలాంటివి సహజం! ఆడదే సర్దుకుపోవాలి! మగ మహారాజులు అని ఎందుకన్నారు! వాళ్ళు ఏ తిరుగుళ్ళు తిరిగొచ్చినా తప్పు లేదు. మనం గడపదాటితే పాతివ్రత్యానికి భంగం! కులట అంటారు.

సర్దుకుపోవాలి! నీ మొగుడు రాత్రి ఎవర్తి దగ్గరో ఉండొచ్చాడా?"

"అయ్యో ఖర్మ! మా ఆయనకి అంతమాత్రం ఇది కూడానా? కట్టుకున్న దాన్ని నేనె ప్రక్కనుంటే రాతి బొమ్మ అనుకుంటారో, ప్రాణం లేని కట్టె అనుకుంటారో గురకపెట్టి నిద్రపోతారు! కాళ్ళు వొత్తుతుంటే కళ్ళు మూసేస్తారు.

చిలకలు చుట్టిస్తుంటే సగం నమిలి నోరు తెరిచేస్తారు! మరో ఆడది పొరపాటున ఇలాంటి మగాడి ముఖం చూడదు. చూచినా ఈ నిర్వాకం తెలిశాక అరక్షణం నిలబడదు. మా ఆయన గురించి మరో ఆడదాని భయంలేదు నాకు.

ఆయనేదో పిచ్చిగా మాట్లాడుతున్నారు పిన్నిగారూ!" అని వాపోయింది.

"అలాగా! రాత్రి ఎక్కడెక్కడో తిరిగొచ్చాడు! గాలి సోకిందేమో!" అంది పిన్నిగారూ.

"అంతే! అంతే!!" అంటూ మిగిలిన వారంతా మద్దతు ప్రకటించించారు.

"ఎక్కడెక్కడ తిరిగొచ్చావు నాయనా?"

"స్వర్గంలో విహరించాను! ఆ అందం! ఆ కంఠస్వరం."

"నిజమేనమ్మోయ్! మాటలు అలాగే ఉన్నాయి. ఏదో అడగాలి సోకింది."

"వచ్చి ఏం చేసింది నాయనా?"

"ఆమె నన్ను తాకింది! ఆ స్పర్శలో మధురాతి మధురమయిన అనుభవం! రెప్పలమీద వ్రేళ్ళు ఆనించగానే ఆదమరచి నిద్రపోయాను.

"అంతకన్నా మీరేంచేస్తారు! నాకు తెలియదా?" అంది భార్య.

"ఇదేమయి ఉంటుంది పిన్నిగారూ?" అని అడిగింది జాలిగా.

"తప్పకుండా గాలి సోకిందమ్మా! భూతవైద్యుడిని పిలిపించాలి" ఇవాళ ఊళ్ళో లేడనుకుంటాను. ఎవరో వచ్చి తీసుకుపోయారు" అందావిడ.

ఒక్కొక్కరు తిరిగి వెళ్ళిపోవటం ప్రారంభించారు.

స్నానం ముగించి కచేరికివచ్చి కూర్చున్నాను.

అందరూ నన్ను వింతగా చూస్తున్నారు. కొందరయితే దగ్గరకు వచ్చేందుకు కూడ భయపడ్డారు. యధావిధిగా నా పనులు చూచుకున్నాను. మళ్ళీ జనంలో మామూలు ధోరణి రావటానికి పదిరోజులు పట్టింది.

పది రోజులు పరాయి గ్రామంలో గడిపి తిరిగొచ్చిన చంటిగాడు ఈ కొత్తలన్నీ విని నేరుగా నా దగ్గరకు వచ్చాడు. ప్రక్కనే కూర్చున్నాడు. భుజంమీద చేయివేశాడు! జాలిగా చూచాడు. వీపు నిమిరాడు.

ఆ సానుభూతిని నేను భరించిలేకపోయాను.

అసలే కలతపడి ఉన్న మనసు మరింత కలతపడింది.

నా కన్నులు చెమ్మగిల్లటం గమనించాడు చంటిగాడు.

"ఏమయింది భాయ్! ఏం జరిగిందసలు! అలా అయిపోయావేమిటి?"

"నేను బాగానే ఉన్నాను. జనానికే పిచ్చి పట్టింది." వింతగా చూచాడు.

"జనానికి  పిచ్చి పట్టటం ఏమిట్రా? అసలేమయిందో చెప్పు"

"వేరుగా నేను చెప్పడం ఎందుకు? విన్నావుగా. నాకు గాలి సోకిందట."

"అలాంటి వాటిమీద నాకు నమ్మకం లేదు. అనారోగ్యం చేసిందా?"

"అదేంకాదు. ఒక్కోసారి జనాలు సామూహికంగా అతి భయంకరమయిన అపార్ధంలో పడిపోతారు. అసలేమయిందంటే..." అని ప్రారంభించి మిత్రుడితో జరిగిన సంగతి అంతా వివరించాను.

"ఇంతకూ ఆ రాత్రి అది జరిగిందంటావా? కలగన్నావా?"

"నిజంగా జరిగిందనే నూటికి నూరు పాలు నమ్ముతున్నాను."

ఈ విషయం మీద చంటిగాడు మరో పదిరోజులు చర్చించాడు. అది వాస్తవమనే విశ్వాసాన్ని నేను విడిచి పెట్టలేదు.

"అయితే ఈసారి పున్నమికి మనం వెళ్ళి చూద్దాం. నాకిలాంటి నమ్మకాలు భయాలు లేవు. నేను కూడ వస్తాను. తెలుసుకుందాం." అన్నాడు.

"ఇప్పటికి జరిగింది చాలు! మళ్ళీ ఆ ఛాయలకు రాను"

"మన చుట్టూ చాల వింతలుంటాయి. అవి ప్రకృతి శక్తులు! దేవుడు దయ్యం అని మీలాంటి పిచ్చివాళ్ళు అంటారు. ఆ విచిత్ర శక్తులు కొన్ని తెలుస్తాయి. కొన్ని తెలియవు. తెలియని వాటిగురించి తెలుసుకోవటంలో తప్పులేదు. ఈసారి ప్రక్కన నేనుంటాగా బయల్దేరు" అన్నాడు?

"అయితే వచ్చే పౌర్ణమికు అర్ధరాత్రి సమయానికి వెడదాం" అన్నాను. ఆ మాటలు అంటున్నప్పుడు అతడు కాక మరెవరో వింటున్నట్టు అనుమానం వచ్చింది.

ఆ అనుమానానికి ఆధారంలేదు. భ్రాంతి అయి వుంటుంది అనుకున్నాను.

మిగిలిన రోజులు కూడా గడిచాయి. ఆరోజు పౌర్ణమి.

సాయంత్రం వెళ్ళాలని మే మిద్దరం నిర్ణయించుకున్నాం.

మధ్యాహ్నం కచేరినించి ఇంటికి వచ్చేసరికి మాయింటి అరుగుమీద ఒకవ్యక్తి కూర్చున్నాడు! అతని వేషం చూస్తే

పండితుడిలా అనిపించాడు.

"ఎవరండి మీరు? ఎవరు కావాలని?" అని పలకరించాను.

"మీ కోసమే వచ్చాను. చాలసేపుగా ఎదురుచూస్తున్నాను."

కాళ్ళు కడుక్కునేందుకు నీరిచ్చి, మంచి తీర్థమిచ్చి ఊయల బల్లమీద కూర్చోబెట్టి అతనికి బంధుమర్యాదలు చేశాను. ఆయన చాల సంతోషించినట్లు కన్పించాడు.

"బాబూ! నేను నాగభైరవి ఉపాసన చేస్తాను.  నా పేరు భవాని పండితుడు!"

అంబ అనుజ్ఞ అయిం తరువాతే నీ దగ్గరకు వచ్చాను. నిన్ను వెతికి పట్టుకోవటానికి కొంత ఆలస్యమయింది కానీ సరయిన సమయానికే వచ్చాననిపిస్తోంది!

జంటనాగుల నీడ నీ మీద పడింది! బహుశా నీవు నాగదోషానికి గురి అయావు. దానివల్ల నీ వంశాంకురాలు వాడిపోతాయి!

నీకు స్త్రీ సంతానం కలుగదు. అంతేకాదు! నువ్వు ప్రాణాపాయానికి గురిఅయే అవకాశం కూడ ఉంది! ఈ తావీదు నీ దగ్గరుంచుకో!

దీనితో నీ ప్రాణాలను కాపాడగలను కాని వాడిపోతున్న నీ వంశాంకురాలును ఉద్ధరించలేను! మూడుతరాలు మీరు నాగ దేవతను కులదైవంగా ఆరాధిస్తే ఆ తరువాత మీకు స్త్రీ సంతానం కలగవచ్చు!

ఎన్నడూ నీ నీడ నాగు మీదపడరాదు! నాగన్న నీ ఎదుట పడగ విప్పి ఆడినా నమస్కరించి తప్పుకుపోవాలే కానీ హాని తలపెట్టకూడదు!

నా మనసుకి తోచింది చెప్పాను. ఆ తరువాత నీ యిష్టం!" అని చెప్పి తావీదు యిచ్చి వెళ్ళిపోయాడు భవానీ పండితుడు!

అనూహ్యమయిన సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయో అర్థం కాలేదు.

ఈ విషయమంతా చంటిగాడికి చెప్పాను. వాడు నవ్వాడు!

"ఏ మాత్రం దండుకుపోయాడేమిటి?" అన్నాడు వ్యాఖ్యానంగా!

"నేనేమీ ఇవ్వలేదు. అతను నన్ను అడగలేదు"

"ఇలాగే వచ్చి ముందు నమ్మిస్తారు. బాగా నమ్మకం కుదిరి భక్తులుగా మారాక దండుకోవడం ప్రారంభిస్తారు. ఇంకా ఏపిచ్చి కాలంలో ఉన్నావు నువ్వు. చీకటిపడుతోంది. త్వరగా బయల్దేరు ఈ రోజే పౌర్ణమి మనం కొండమీదికి వెళ్ళాలి!
ఎవరికీ చెప్పకుండా ఎవరికీ అనుమానం రాకుండా బయల్దేరు" అంటూ తొందరించాడు చంటిగాడు.

"నాకెందుకో భయంగా ఉంది భాయ్! మనం వెళ్ళటం మంచిదే నంటావా?"

"ఇలాంటి వింతలు చూడకపోతే మనం బ్రతికి ఎందుకు?"

"ఏదయినా ప్రమాదం జరిగితే!?" అన్నాను.

"నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డువేస్తాను. నువ్వేమీ భయపడకు" అన్నాడు చంటి.

## 12

చంటిగాడు నాకన్నా అయిదారేళ్ళు చిన్నవాడు! హుషారయినవాడు!

కొందరికి మూర్ఖంగా అనిపిస్తుంది. కాని పట్టు పట్టాడంటే విడిచి పెట్టని స్వభావం కలవాడు! అక్కడకూడ పాలేరు పనులుచేసి కొద్దిగా సంపాదించుకుని వెనక వేసుకుని వచ్చి గ్రామంలో స్థిరపడ్డాడు.

సహజంగా చీకటిలో గ్రామీణ ప్రాంతాలలో తిరగాలంటే యెవరికయినా భయమనిపిస్తుంది. వాడికి మాత్రం అలాంటి భయంలేదు. వృత్తిరీత్యా అలవాటు గాఢంధకారంలో పొలం గట్టులవెంట, డొంకబాటల్లో నాగజెముడు, బ్రహ్మజెముడు పుట్టల వెంట తిరగడం వాడికి సరదా!

చీకటిలో ముందు ఏముందో తెలియకుండా ఉన్న చోటున కాలుపెట్టాలన్నా చేయిపెట్టాలన్నా భయమనిపిస్తుంది. వాడికి మాత్రం అలాంటి భయంలేదు. బ్రతుకుతున్నాడంటే అదంతా భగవంతుడి దయే అనుకోవాలి!

నిర్భయంగా ముందు నడుస్తున్నాడు. ఆ వెనుక నేను వెడుతున్నాను.

"నీకు దొంగల భయంలేదురా చంటి!" అని నేను ప్రశ్నించాను.

"దొంగల భయం నాకెందుకు పంతులుగారూ! నాదగ్గరేముందని? ఎండి వాడిపోయిన పుగాకు దుంపా, బూరుగు దూది, చిట్టంటు రాళ్ళు తప్ప నా దగ్గరేమున్నాయి" అన్నాడు.

చిట్టంటురాయి అంటే పలుకురాయి. రాయిమీద రాయిపెట్టి రాపిడి చేస్తే నిప్పురవ్వ పుడుతుంది. దానికి బూరుగుదూది అంటుకుని చుట్టని కాల్చుతుంది. ఈ మొత్తం సరంజామాని చిన్నతోలు సంచితో అమర్చుకుని బొడ్లోదోపుకుంటే అగ్గిపెట్టెతో పనిలేదు.

అగ్గిపెట్టెలు పాపులర్ గా వాడుకలోకి రాకమునుపు గ్రామాలన్నింటీలో జనం అంతా ఇలాగే నిప్పు పుట్టించుకునేవారు. అగ్గిపెట్టెలు సిగార్ లైట్లు ఇంకా అధినాతనమయిన గాస్ లైట్లు వాడుకలోకి వచ్చినా మా చంటిగాడు ఆ వెనుకటి అలవాటు విడిచిపెట్టి ముందుకి రాలేదు.

"చీకట్లో అంత నిర్భీతిగా నడుస్తావు. మరి పాములు పురుగు పుట్రా ఉంటాయని భయం వెయ్యదా నీకు?" అని ప్రశ్నించాను.

"ఆ భయముంటే చెప్పులెందుకు వేసుకోను?" అని ఎదురు ప్రశ్న వేశాడు. అటువంటి చోటున చెప్పులు కూడ లేని నగ్న పాదాలతో నడవటం చాల విడ్డూరమయిన సంగతి! కానీ గ్రామీణుల్లో ఇప్పటికి అలాంటి వారు చాలామంది ఉన్నారు.

"ఈరోజు కూడ ఆ అమ్మాయి కనిపిస్తే ఏం చేస్తావు?" అన్నాను.

"కళ్ళు మూసుకుని కావిలించుకుంటాను"

"కావిలించుకునేప్పుడు కళ్ళు మూసుకోవటం ఎందుకురా!"

"భయం తెలియకుండా ఉండటానికి!"

"నీకు కూడ భయమనేది తెలుసన్నమాట?" కవ్వించాను.

"భయమంటే భయంకాదులెండి! బిడియపడతాను"

"ఆడపిల్లలు సిగ్గుపడాలి కాని నీకెందుకురా సిగ్గు?"

"అదంతేలెండి!" అంటూ ముందుకు చురుగ్గా అడుగులేశాడు.

నిండు వెన్నెలలో కొద్దిసేపు నడిచాక ఆ ప్రాంతాలకు చేరుకున్నాం. నాకు గుండెలు పీచు పీచుమంటున్నాయి. కాని చంటి హుషారుగానే ఉన్నాడు.

ఒకపొద చూపించాను. "ఇక్కడేరా చంటీ వాళ్ళు నాకు కన్పించారు!" అన్నాను.

అతడు పొద కదిలించాడు బయటినుంచి. ఈ వైపునించి లోపలకు దూరి ఆ వైపునించి నవ్వుతూ వెలుపలకు వచ్చాడు. ఆ రెండు క్షణాలు ఊపిరి బిగబట్టాను.

"లోపల అంతా ఖాళీగానే ఉంది పంతులుగారూ! ఎవరూ లేరు"

"అన్నప్పుడల్లా ఉంటారా? ఈరోజు వస్తారో లేదో! వచ్చినా ఈ వైపుకి రాకపోవచ్చు. ఈ కొండలు రాళ్ళు అడవులు అన్ని వాళ్ళవే కదా! ఎక్కువ ఎక్కడా విహరిస్తారో!" వాడు నా మాటలు వింటూ నాలుగు వైపులా చూశాడు.

"అయితే మనం ఒక పని చెయ్యాలి?"

"వెనక్కి తిరిగి వెళ్ళిపోదామంటావా?"

"కాదు! ఇక్కడే ఎవరికీ కన్పించకుండా దాక్కోవాలి!"

"అలా అనుకున్నప్పుడు అసలు రావటం ఎందుకు?"

"అనుమానం లేనప్పుడే వాళ్ళు మనకి మరింత దగ్గరగా వస్తారు"

"వాళ్ళకి అనుమానం రాకుండా ఉండాలంటే మంచిచోటు దొరకాలి"

జంతువుల గురించి అనుమానం వచ్చిన అటవికుడిలాగ ఆలోచించాడు.

"ఆ చెట్టు కొమ్మమీదికి ఎక్కి దాక్కుందాం" అన్నాడు.

ముందుగా నేను చెట్టుమీదికి ఎక్కేందుకు సాయంచేశాడు. ఆ తరువాత సునాయాసంగా తానుకూడ పైకి ఎక్కివచ్చేశాడు. ఒకేకొమ్మ మీద దగ్గరదగ్గరగా కూర్చున్నాం. మా చుట్టూ ఉనికి తెలియకుండా చుట్టూ చెట్టుకొమ్మలు గుబుర్లెత్తి ఉన్నాయి.

చాలాసేపు ఎదురు చూశాం. ఆ వైపుగా ఎవరూరాలేదు.

రాత్రి పదకొండు గంటలు దాటింది. పుచ్చపువ్వులాంటి వెన్నెల! చల్లనిగాలి తెమ్మెరలు ఆహ్లాదం గొలుపుతున్నాయి. కొద్దిసేపు అయ్యాక చంటి హాయిగా నిద్దరోయాడు. గురకపెట్టడం విన్పించింది.

వచ్చినపనేమిటి? ఆ సమయంలో ఎలా నిద్రపట్టిందో! భయం, దిగులు, గుబులు, టెన్షన్స్ అంటే ఏమిటో తెలియని మానవుడు. చిన్నగా పిలిచాను. పలకలేదు. తట్టిలేపాలని ప్రయత్నించాను. ప్రయోజనం లేదు. గట్టిగా కుదిపాను. ఉలిక్కిపడి కళ్ళు విప్పాడు.

"పంతులుగారూ మనమెక్కడ ఉన్నాం" అన్నాడు నిద్రమత్తులో అయోమయంగా.

"చెట్టు కొమ్మమీద ఉన్నాం. ఏమిటా మొద్దునిద్ర? జారిపడిపోగలవ్! జాగ్రత్త. గట్టిగా పట్టుకుని కూర్చో!" అన్నాను భయం భయంగా.

"నేను క్రిందపడాలంటే బ్రహ్మదేవుడు దిగిరావాలి! కుదురుగా సీటు దొరికింది. వెనుక అనుకునేందుకు నిలువుకొమ్మ దొరికింది. కాళ్ళు బారచాపుకునేందుకు మరోకొమ్మ! కాళ్ళక్రింద సీటు క్రింద మెత్తగా ఆకులు.

"నాకేమీ భయంలేదుగాని వాళ్ళు వచ్చారా?" అన్నాడు.

"ష్!ష్!! గట్టిగా అరవకు సమయం దగ్గరపడుతోంది"

"అరిస్తే పారిపోతారా? మరీ అంత భయమైతే ఎలా పంతులు గారూ!" అంటూ కొమ్మమీదలేచి చుట్టూ కలయచూశాడు.

ఎవరూ కనిపించకపోవడంతో మళ్ళీ కుదురుగా కూర్చున్నాడు కాళ్ళు చాచుకుని.

"మీకు నిద్రపట్టలేదా?" అన్నాడు ఆవులిస్తూ.

"కంఠస్వరాన్ని తగ్గించి మాట్లాడమంటే ఎందుకలా అరుస్తావు?"

"అవునవును. నెమ్మదిగా మాట్లాడాలికదూ! పొరపాటయింది.

వాళ్ళు మరికాస్సేపట్లో వస్తారనుకుందాం. మనం చూస్తాం. చూచినా తరువాత నేనేం చెయ్యాలి?

"మళ్ళా మొదటకొచ్చావా? ఏం చెయ్యాలని వచ్చావు?"

"వెంటపడి పట్టుకుంటాను. మనుషులుగా దొరికితే చెట్టుకి కట్టి పడేస్తా! పాములుగా మారితే ఉత్తరీయంలో మూటకట్టేస్తా!"

"వాటికి దైవశక్తులుంటాయి. మరీ అంత మూర్ఖంగా ప్రవర్తించకు"

"నేలమీద సాష్టాంగం పడి మ్రొక్కులు చెల్లించుకోవాలా?"

"ముందు వాటిని చూడాలి. అవి ఎలాప్రవర్తిస్తాయో కనిపెట్టాలి! ఆ తరువాతనే ఏంచెయ్యాలో నిర్ణయించాలి. తొందరపడకూడదు"

"అదంతా నాకు తెలియదు. నేను నిద్రపోతాను. ఎప్పుడేం చెయ్యాలో నిద్రలేపి మీరే చెప్పండి" అంటూ మళ్ళా తలవాల్చేశాడు.

రెండు నిముషాల అనంతరం యధావిధిగా గుర్రుకొట్టటం విన్పించింది.

తిరిగి ఎదురుచూడడం ప్రారంభించాను.

చంద్రుడు సరిగా ఆకాశమధ్యమంలోకి వచ్చాడు.

అర్ధరాత్రి పన్నెండు గంటలయింది. దూరంగా గుడ్ల గూబ అరిచింది. ఎక్కడో కుక్కలు ఏడుస్తున్నాయి. చెట్టు కొమ్మలమధ్య మాలాగే వ్రేలాడుతున్న గబ్బిలాయిలు రెండు రెక్కలు పటపటలాడించుకుంటూ లేచి వెళ్ళిపోతున్నాయి. బెగ్గురు పక్షుల మూలుగు వినిపించింది.

ఝునక్....ఝునక్ మని పాదమంజీరాల సవ్వడి వినిపించింది.

తల ఎత్తి చూచాను. పొదలమాటున నీడలు కన్పించినాయి.

గాలి వీచే సవ్వడి ప్రకృతి చేస్తున్న పూత్కారంలా వినిపిస్తోంది. చప్పుడు కాకుండా కొమ్మల మధ్యలేచి కూర్చున్నాను. తలనిక్కించి చూచాను.

ఇతఃపూర్వం నాకు కనిపించిన నాగదంపతులే!

పొదలమధ్య తిరుగుతూ కన్పించారు. మైమరాపులో ఉన్నారు.

వారిమధ్యకు వెళ్ళాలంటే భయమనిపించింది. ఒకసారి వారి ముందుకుపోయాక తిరిగి పారిపోవడంకూడా అసాధ్యమే! నేను ఆ రోజు దూరంగా పరుగెత్తాలని ప్రయత్నించి తిరిగితిరిగి వారి ముందుకే వచ్చాను.

ఆ సంఘటన జ్ఞాపకంవచ్చి ఒళ్ళు జలదరించింది.

నాకు కన్పించిన రెండు ఆకృతులు పొడలోకి దూరాయి. దానిలోంచి కిలకిలలు విన్పించాయి. ప్రేమ మొర్మోరాలు గాలి అలల మీద తేలివచ్చాయి. వారిని చూడగానే కలిగిన భయంవల్ల చెమటలు క్రమ్మిన శరీరం చల్లగాలికి రవంత సేదదీర్చుకుంది. కాస్తంత ధైర్యం వచ్చింది.

చంటిని పట్టి కుదిపాను. ఉలిక్కిపడి లేచికూర్చున్నాడు.

"ఏమయింది పంతులుగారూ! వాళ్ళొచ్చారా?" అన్నాడు.

"ష్ ష్ అరవకు. పెద్దగా మాట్లాడకు_వచ్చారు" అన్నాను.

"ఎక్కడున్నారు? మీరు చూచారా? కలగన్నారా?"

చూశాను. ఆ పొడలోకి వెళ్ళిపోయారు.

"అయితే నేను వెళ్ళి చూస్తాను" ఉత్సాహంతో క్రిందికి ఉరకాలని ప్రయత్నించాడు.

"చాలా ప్రమాదం. తొందరపడకు" అంటూ వారించాను.

చంటి రెండు క్షణాలు మాత్రమే మౌనంగా ఉన్నాడు.

"పొదలోపలికి వెళ్ళింది పాములా? మనుషులా?" అని ప్రశ్నించాడు.

"మనుషులే! కాని వాళ్ళు నాగాదేవతలు చంటీ!" అన్నాను.

"ఎవరైతే మనకి భయమేంటి? రండి పంతులుగారూ! ఆలస్యం చేస్తే వాళ్ళువెళ్ళిపోతారు. ఆ తరువాత తెల్లముఖాలు వేసుకుని చూడాల్సిందే కాని మనం చేయగలిందేమీ ఉండదు. ఆలస్యం చేయకండి!" అంటూ నాకన్నా ముందుగా వాడు కొమ్మ మీదినించి దిగ నారంభించాడు.

ఇంక తప్పనిసరి కనుక నేను కూడా వాడిని అనుసరించాను.

రవంత జంకుకొంకులులేవు. భయంలేదు. కలికి పాదరక్షలు కూడా లేవు. నుదురుబెదురు లేకుండా ముందుకు నడిచాడు.

పొదదగ్గరకు వెళ్ళాడు. వాడు ఆలోచించలేదు. ఏదయినా ప్రమాదం ముంచుకురాగలదని ఆలోచించనయినాలేదు. పొదదగ్గరకు వెళ్ళి ఒకరితో ఒకరై పెనుగులాడుతున్న జంటను చూచేందుకు ఒక గచ్చకొమ్మను ప్రక్కకు ఒత్తిగించాడు. లోపలివారిమీద వెన్నెల కిరణాలు పడుతున్నాయి.

వారు పెనవేసుకుపోయి ఉన్నారు. పొదలోకి రెండు మానవాకారాలు వెళ్ళటం నేను ప్రత్యక్షంగా చూచాను. కాని ఇప్పుడు మాకు కన్పించింది మనుషులు కాదు. పెనవేసుకుని ఉన్న రెండు సర్పాలు!

ఎప్పుడైతే అలికిడి అయిందో అవి రెండు విడివడ్డాయి. భయంకరమైన పూత్కారాలతో పడగలఎత్తి నాల్కలసాచాయి.

నా కయితే శరీరం వణుకుతోంది. కాని చంటి భయపడ లేదు.

అతడు తలపాగా చుట్టుకున్న వస్త్రాన్ని విప్పి వాటిమీదికి విసిరాడు. ఒక పాము వస్త్రం క్రింద కప్పుపడిపోయింది. రెండవది పొదలమధ్య దూరి పారిపోవటానికి ప్రయత్నించింది.

చంటి చేతిలోకర్రపుల్ల అయినా లేకుండా దాన్ని వెంబడించాడు.

అతనివెంట నేను పరుగెట్టాను. అది రాతి చట్టులమధ్య చెట్టుకొమ్మల క్రిందనించి పరుగులు తీస్తూ చాలాదూరం వెళ్ళింది.

అమిత వేగంతో దాన్ని వెంబడించినా చివరకు అందుకోలేకపోయాడు.

అది ఒక పుట్టలోకి దూరి ప్రాణాలను దక్కించుకుంది.

"బాబుగారూ! ఒకటి తప్పించుకొని పారిపోయింది" అన్నాడు.

"రెండోది కూడ తప్పించుకుని పారిపోయిందేమో" అన్నాను అనుమానంగా.

"అసాధ్యం పంతులుగారూ! అసాధ్యం! బట్టమీదపడిన తరువాత దానిలోంచి పాములు బయటపడి తప్పించుకు పోలేవు దాన్ని కాటువేయాలని ప్రయత్నిస్తే కోరలు చిక్కుపడి బట్టలు దాని తలకు చుట్టుకుంటాయి. దానితో చుట్టలు తిరిగి పోతుందేకాని తప్పించుకు పోవటం సాధ్యపడదు. కావాలంటే చూడండి" అంటూ పొద దగ్గిరకు తీసుకువచ్చాడు అతడు ఏమి చెప్పాడో అదే జరిగింది.

పొదలోకి అతడు విసిరిన వస్త్రంలో తలదూరిపోయి ఉంది. దానిని కాటు వేయాలని ప్రయత్నించినప్పుడు పాము కోరలు దారపు పోగుల మధ్య చిక్కుపడిపోయాయి. వాటిని వదిలించుకోవాలనే ప్రయత్నంలో బట్ట మొత్తందాని పడగచుట్టూ చుట్టుకుపోయింది.

ఇంక కళ్ళు కన్పించక బయటపడే దిక్కు తోచక అది తంటాలు పడుతోంది. దాన్ని పడగ క్రిందగా పట్టుకుని వస్త్రాన్ని తొలగించాడు.

వస్త్రం మధ్య చిక్కుపడిన కోరల్ని ఉపాయంగా ఊడదీశాడు. కాని అప్పటికే అది అతని స్వాధీనమయింది.

దాన్ని తలపాగాలో మూట కట్టాడు.

"పంతులుగారూ మనదే విజయం! వెడదాం పదండి! ఆ పుట్టలోకి వెళ్ళిన పాము సంగతి రేపు తేల్చుకుంటాను. అన్నాడు. అప్పటివరకూ మేము సాధించిన విజయం సంతోషాన్ని కలిగించింది.

కాని మేము తొందర పడ్డామని మూర్ఖంగా ప్రవర్తిస్తున్నామని, అందుకొక దుష్టపరిణామం మాకు ఎదురు అవుతుందని అనిపించింది.

ఏది ఎలా జరిగినా ఇప్పుడు వెనుకంజ వేయటంలో అర్థం లేదు. మేము బాగా చీకటి ఉండగానే గ్రామానికి చేరుకున్నాం. తెల్లవారిన తరువాత మా విజయాన్ని గ్రామానికంతా ఎరుక పరచాలి కదా!

కాస్సేపు నిద్రపోదామని రెప్ప వాల్చాను.

రెప్పలు అంటుకున్న కాస్సేపటికే కల వచ్చింది. కలలో నాగదేవత కన్పించింది. ఆమెను నేను ముందే చూచాను కనుక గుర్తించాను.

"మీరు నా భర్తను బంధించి తీసుకువచ్చారు. వెంటనే విడిచి పెట్టక పోతే ప్రతీకారం తీర్చుకుంటాను! స్వేచ్ఛగా అడవులలో కొండలలో తిరుగుతున్న మేము మీకు ఎలాంటి అపకారం చేయలేదు.

నిష్కారణంగా నా భర్తని బంధించారు.

నా భర్తను విడిచి పెట్టకపోతే మీ వంశాలు అంతరిస్తాయి" అని పలువిధాలుగా అది భయపెట్టటం ప్రారంభించింది.

నాకు ఎంతోభయమనిపించింది. చంటిగాడి మాటలువిని అనవసరమయిన విషయంలో తలదూర్చామని అనిపించింది.

నేను చేతులు ముకుళించి ప్రార్థించాను.

"అమ్మా! నాగదేవతా! పొరపాటయింది నన్ను క్షమించు. నేను వెంటనే వెళ్ళి నీ భర్తను విడిచి పెట్టేలా చేస్తాను" అన్నాను.

కల జరుగుతూ ఉండగానే మెలుకువ వచ్చింది. నా గదిలో బుసలు వినిపించటం ప్రారంభించాయి. నేలంతా జరజరమని పాములు పరాకుతున్నట్లు ఒళ్ళంతా జలదరిస్తోంది. ఇంక ఒక్క క్షణం గదిలో ఉండాలనిపించలేదు. వెంటనే బయటకు పరుగులుతీశాను. అప్పుడే తెల్లవారుతోంది.

రచ్చబండ దగ్గర జనం గుమికూడి ఉన్నారు.

చంటిగాడు అప్పటికే నాగరాజుని తీసుకువచ్చి వారి ముందు ఆడిస్తున్నాడు! ఒక పొడవాటి ఈటితో దాన్ని పడగమీద తడుతూ రెచ్చగొడుతున్నాడు. రోషంతో అది పడగవిప్పి పూత్కారం చేస్తుంటే జనం చప్పట్లు చరిచి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చంటిగాడు అంత పెద్దపాముని తీసుకు వచ్చినందుకు అతన్ని అభినందిస్తున్నారు. వాడు ఆనందపరవశంలో ఉన్నాడు.

నా మాటలు వినిపించుకోగలిగిన స్థితిలో మాత్రం లేదు.

పొలం పనులకు వేళ అయ్యేంతవరకూ జనం వాడి చుట్టూ గుమికూడి సర్పనాట్యాన్ని తిలగించారు

ఆ తరువాత జనం పలుచ బడ్డారు.

"చంటీ దాన్ని విడిచిపెట్టు" అన్నాను అర్థింపుగా!

అతడు దాని మెడమీద ఈటె ఆనించి పట్టుకున్నాడు.

"ఇంతసేపు ఆడించాక విడిచిపెడితే ప్రమాదం పంతులుగారూ!"

"విడిచి పెట్టకపోతే మరింత ప్రమాదం" అన్నాను.

వాడు నా మాటలు పట్టించుకోలేదు.

ఊరిబయటకు వచ్చాక పామును విడిచి పెట్టాడు. అది తప్పించుకుపోవాలని ప్రయత్నించుతోంది. ఈటెను గురిచూచి దాని మెడలో దింపాడు. విపరీతంగా మెలికలు తిరిగి అది ప్రాణాలు విడిచిపెట్టింది.

శరీరంలో ప్రతి వెన్నుపూసను చితగొట్టి తలనించి తోక వరకు నజ్జు నజ్జు చేశాడు. ప్రాణాలు పోయాయని నిర్ధారించుకున్న తరువాత ఈటెతో చిన్నగోయి తీసి దాన్ని మట్టి క్రింద పూడ్చేశాడు.

"పంతులుగారూ! ఆ రెండో పాము వస్తుందనే కదా మీ భయం వస్తే దాని గతి కూడా యింతే!" అంటూ వికవిక నవ్వి వెళ్ళిపోయాడు.

ఆ ఘట్టం అంతటితో పూర్తి అయిందని వాడు అనుకున్నాడు.

కాని అసలు కథ అప్పుడే ప్రారంభం అయింది.

ఒకటి రెండు రోజులు గడిచాక చంటి కన్పించాడు. ముఖం వాడిపోయి వుంది. కారణం ఏమిటని అడిగాను. వాడు దిగులుగా చూచాడు.

"రెండు రోజులుగా మా యింటిలో పాము బుసలు విన్పిస్తున్నాయి. రాత్రిపూట పాములుప్రాకుతున్నట్లు జరజరమని

శబ్దాలు విన్పిస్తున్నాయి. నాకు అవంటే భయంలేదు నీకు తెలుసుకదా! వెదికితే కన్పించవు. పొరపాటున నిద్రపట్టిందనుకో కలలో గుంపులు గుంపులు పాములు కన్పించటం.

శరీరమంతా చుట్టుకు పోతున్నట్లుగా అనిపించటం.

లేచి చూస్తే ఏమీ ఉండదు. అంతా మాయగా ఉంది. సరిగ్గా నిద్రపట్టటం లేదు. అన్నం తినబుద్ధి కావటల్లేదు. ఏం చేయమంటావు?" అన్నాడు.

"ఒకవేళ పాము కాని పగబట్టి మీ యింటికి వచ్చిందేమో?"

"వెతికితే కన్పించాలి కదా? ఇల్లంతా గాలించాను"

"ఎవరయినా మంత్రగాడిని పిలిచి చూపించు"

"వాళ్ళేం చేస్తారు. డబ్బు దండుకుపోవటం తప్ప!"

"అయితే ఈ రాత్రికి నేను వస్తాను. అసలు జరుగుతున్నదేమిటో నేనూ గమనిస్తాను. ఏం చేయాలో అప్పుడు నిర్ణయించుకుందాం" అన్నాను.

ఈ మాటలకు వాడు ఒప్పుకున్నాడు.

ఆ రాత్రి పదకొండు గంటలు దాటిన తరువాత ఆ యింటి వైపుగా వెళ్ళాను.

చంటి ఆ ఇంటిలో ఒక్కడే ఉంటున్నాడు.

ముణగదీసుకుని పడుకొని ఉన్నాడు. నిద్రపోతున్నాడనుకున్నాను.

కాని శరీరమంతా చెమటలతో తడిసిపోయి ఉంది. మూలుగుతున్నాడు.

"ఏమయింది నీకు?" అని ప్రశ్నించాడు.

"అది నీకు కన్పించలేదా?" ఎదురు ప్రశ్న వేశాడు.

"అదెవరు? నాకు కన్పించటమేమిటి?"

"పాము! నన్ను కరిచింది. నేనింక బ్రతకను పంతులుగారూ!"

"నువ్వు ఎందుకో భయపడ్డావనుకుంటాను"

"భయపడటమేమిటి? అది బుసపెట్టటం నీకు విన్పించలేదా?"

"అదేమీ లేదు. ఇల్లు ప్రశాంతంగానే ఉంది కదా!?"

"కాదు! కాదు. అది బుసపెట్టటం నాకు వినిపిస్తోంది!" కంగారు తిన్న గొడ్డులా వెర్రిచూపులు చూడటం ప్రారంభించాడు.

వాడు ఆ కలవరింతలనించి కోలుకోలేదు.

ఒక్కక్షణం నిద్ర పోలేక పోయాడు.

మూడు నెలలపాటు ఒక్కపూట అయినా భోంచేయాలేక పోయాడు!

చంటి నీరసించాడు! ఎక్కడయినా క్షణంసేపు ఏకాంతంగా కూర్చుంటే చాలు. మరుక్షణంలో పాము పాము అని అరిచేవాడు.

"అది నన్ను కరుస్తోంది" అంటూ మంచంమీదనుంచి దొర్లిక్రింద పడేవాడు.

చివరకు ఆ పేరు స్మరిస్తూనే ప్రాణం విడిచి పెట్టాడు!

ఆ తరువాత ఒకరిద్దరికి నాగ దేవత కనిపించింది. అలాంటప్పుడు చినపాలెం కారణంగారి అమ్మాయిని అని చెప్పటం జరిగింది. ఆ దంపతుల్ని విడదీయటంలో నా పాత్ర కూడా కొంత వుంది. ఆ కారణంగానే నాకు ఆడపిల్లలు పుట్టలేదు.

నాకు తావీదు యిచ్చిన భవానీ పండితుడు మరొకసారి నా దగ్గరకు వచ్చాడు. నాగదోషం పోయేలా నాగశిల వేయించాడు. తావీదువిప్పి తీసుకుపోయాడు. ఆ తరువాత నాగదేవత నాకు కనిపించలేదు.

కాని ఎవరో ఒకరికి కనిపించి కరణంగారి అమ్మాయిని అని చెప్పుకోవడం జరుగుతూనే ఉంది. ఇది జరిగిపోయి ముప్పై సంవత్సరాలయింది" అంటూ కథ చెప్పటం ముగించాడు కరణంగారు.

ఇంక ఆయన దగ్గర తెలుసుకోవాల్సిన సంగతులేవీ లేవని అర్థమయ్యాక ఆడపిల్లలు అందరూ తిరుగు ముఖం పట్టారు.

లింకుల కరణంగారు యింటి తలుపులు మూసుకుంటూ ఉండగా కార్లు గ్రామం నించి బయలుదేరి వేగంగా వెళ్ళిపోతున్నాయి.

తులసిలో ధైర్యం క్షణక్షణానికీ దిగజారుతోంది!

ఉమ ముఖం ప్రశ్నార్థకంగా అయ్యింది!!

* * *

శివరాజ్ పూర్తి బలాన్ని ప్రయోగించాడు. మంచె కోసం నేలలో పాతిన వెదురు కర్రలు వూడి వచ్చినాయి. దాని క్రింద నించి చల్లని గాలి వీస్తోంది.

కానీ ఆ కొద్దిపాటి ఆధారం అతనికి ఎలా ఉపకరించేదీ తోచలేదు. అక్కడా త్రవ్వితే బయటపడేందుకు దారి దొరకవచ్చు. కానీ త్రవ్విన మట్టిని ఏం చేయాలి? అది పగటి ప్రొద్దు అయిందీ, రాత్రి ప్రొద్దు అయిందీ తెలుసుకునేందుకు దారిలేదు. తన నిస్సహాయతమీద అంతానికి జాలి వేసింది.

క్రిమినల్స్ ఎటాక్ నీ చేయటంలో రకరకాల సమస్యలు ఎదురవుతాయి. వారి వలయంలో బందీలు కావటం కూడా తటస్థపడుతుంది. కానీ ఇలా ఒక సర్పం తనకి పరిచయంలేని విచిత్రలోకంలో బంధించటంతో అయోమయంలో పడిపోయాడు శివరాజ్! పోలీసు బుర్రతో పదే పదే ఆలోచించాడు.

ఎంత ఆలోచించినా ఈ జటిల సమస్య నించి బయటపడలేక పోయాడు. మిగిలి వున్న ఒక్క ఆధారం నాగభామిని!

ఆమె ఏ కారణం చేతనో తనని గాఢంగా ప్రేమించింది. ఆమె ఆవాసం యోగి జటాజూటంలో! అతడు యోగ సమాధిలోకి వెళ్ళిన తరువాత కానీ ఆమె మానవరూపంలో తిరిగిరాలేదు. తాను బయటపడాలంటే ఆమెకు తన మీద ఉన్న ప్రేమనే ఒక సాధనంగా ఉపయోగించుకోవాలి!

ఈ ఆలోచన తనకి బాగా ఉన్నట్లు అనిపించింది.

ఈ పద్ధతి విజయవంతం కావాలంటే ముందు ఆమెను నమ్మించాలి! తాను కూడా ప్రేమించినట్లుగా నటించాలి! పారిపోవాలని ప్రయత్నించకూడదు. అటువంటి ప్రయత్నం చేసిన దాఖలాలు కన్పించకూడదు.

వెంటనే వెదురు కర్రలను యధాతథంగా అమర్చాడు. ప్రక్కసర్ది దానిమీద విలాసంగా పవళించాడు. నాగభామినికోసం ఎదురు చూడటం ప్రారంభించాడు! రెప్పలు వాల్చి ఆలోచనలో మునిగిపోయాడు.

ఎన్ని గంటలు అలాగడచిపోయాయో మరి!

కొద్దిగా అలికిడి అయింది. తలత్రిప్పి చూశాడు.

అంతకు పూర్వం నాగ భామిని వెళ్ళిన బొరియలోంచి తిరిగి వచ్చింది.

వచ్చినప్పుడు సర్పాకృతిలోనే ఉంది. వెలుపలకు రాగానే మానవకాంత అయింది. ఆమె వంక యెంతో ఆసక్తిగా చూచాడు శివరాజ్.

ఆమె అందాన్ని మొదటిసారి తనివితీరా చూచాడు. కళ్ళు జిగేల్ మన్నాయి. ఆమె అందం అతనికి అచ్చెరువు కలిగించింది. ఇంతకు పూర్వం ఆమెను చూచినప్పుడు పారిపోయే అవకాశం కోసమే అతను ఆకాంక్షించాడు.

పాముతో అనివార్యంగా సహవాసం చేయాల్సివచ్చినప్పుడు కలిగే జుగుప్స అతని మనసంతా నిండిపోయివుంది. కనురెప్పలు విప్పి ఆమెను ఆదరంగా చూడలేకపోయాడు. ఒక నేరస్తురాలు తనని బంధించినట్లుగా మాత్రమే భావించాడు. ఏ క్షణంలో అయినా తను పారిపోగలనని తెలుసు.

ఇప్పుడు అలాకాదు. ఆమె సహకారం లేకుండా పారిపోవటం అసాధ్యమని అర్ధమయిపోయింది. రూపాలు సైతం మార్చగల మాయావిని.

ఆమె సహకారాన్ని పొందటం అంటే తాను అంతకన్నా మాయావిగా నటించటం తప్ప మరో మార్గమే లేదని నిర్ణయించుకున్నాడు.

ప్రియుడు నిద్రపోతున్నాడని భావించింది. సుకుమారమైన పాదాలు నేలకు సుతారంగా తాకించి నడుస్తున్నా నాగపట్టాలు ఘల్లు ఘల్లుమని మ్రోగుతున్నాయి. ఆ అడుగుల సవ్వడి వింటూ ఆమె తనకు ఎంత దగ్గరగా వచ్చిందో వూహించుకుంటున్నాడు.

బాగా దగ్గరికి వచ్చాక చప్పుడు ఆగిపోయింది.

నాగభామిని ముందుకు వంగి అతని రెప్పలమీద పెదవులు ఆనించింది.

ఆ స్పర్శలో అద్భుతమైన పరవశాన్ని కలిగించే షాక్! ఏదో మైమరపు చవిచూచాడు! ఆ కొద్ది క్షణాలు తనని తాను విస్మరించాడు!

"నిద్ర పోతున్నావా? నటిస్తున్నావా?" అని అడిగింది మృదు మధుర స్వరంతో.

సమాధానంగా అతను రెప్పలు విప్పి చూశాడు. చిరునవ్వునవ్వాడు. ఆమె అర్ధం చేసుకుంది. చేతులను అతని భుజాల చుట్టూ పెనవేసింది.

కలకలనాదం చేస్తున్నట్టుగా మధురంగా నవ్వింది!

"ఆ నాటి చిలిపి తనాన్ని నువ్వింకా మర్చిపోలేదు" అంది.

"ఏనాటి చిలిపితనం! ఫ్లాష్ బాక్ లు నాకర్ధంకావు"

"అవును కదూ! మూడు దశాబ్దాలకు పూర్వం ఎడబాటు తెలియని ప్రేయసీ ప్రియులుగా మనం గడిపిన రోజులు నీకెలా గుర్తుంటాయి. అంతా మర్చిపోయావు, ఆ స్మృతులు! ఆ జన్మ అనుభవాలు!!

యుగయుగాల ఆత్మయులలో యెన్ని మరుపులు? ఏ జన్మకా జన్మలో యెన్నెన్ని క్రొత్త బంధాలో! మజిలీకొక అనుభవం.

"జన్మకో అనుబంధం!" అన్నదామె విషాదంగా. కనులు చెమరించాయి.

శివరాజ్ ఆమె వంక విచిత్రంగా చూశాడు.

అర్ధం చేసుకోవాలని ప్రయత్నించాడు. యెలా అర్ధం అవుతుంది.

పునర్జన్మ అనే విచిత్రమైన తెరకు అవతల ఆమె ఉంది.

తాను మరోవైపు ఉన్నాడు. ఆమె అనుభూతులు అతనికి అర్థం కావు. ఆమె హృదయమంతా నిండి ఉన్న విషాదం అతన్ని బాధించదు.

"మన మధ్య మూడు దశాబ్దాల అగాధం ఉన్నప్పుడు నువ్వు నన్ను మర్చిపోవటం మంచిదికదా!" అన్నాడు. ఆమె కాంక్షగా అశాంతిగా అతనివైపు చూచింది.

"నీ పేరులో, నీ స్పర్శలో మైమరపు తప్ప మరపు అనేది నాకు తెలియదు. కాలం మన మధ్య మూడు దశాబ్దాల అగాధాన్ని మాత్రమే కాదు ఒక జన్మ దూరాన్ని కూడా విధించింది. ఆనాడు పెనవేసుకు పోయిన మన ఆత్మల సంయోగంనించి విడివడి వెళ్ళిపోయావు. ఆ తరువాత శవంగా కనిపించావు.

మృత్యువు అన్ని అనుభవాలకు ఆఖరిమెట్టు. అది నీ తమకాన్ని చల్లార్చగా విధి మరో జన్మను ప్రసాదించింది.

పాత జ్ఞాపకాలనించి బయటపడి కొత్త అనుభవాలకోసం పరుగులు తీస్తున్నావు. వియోగాన్ని మర్చిపోగలగటం ఎంతో అదృష్టం! నీకు అది అయాచితంగానే లభించింది! నేను మాత్రం వియోగ విషాద మూర్తి గానే మిగిలిపోయాను. దురదృష్టం నన్నింకా వెన్నాడుతోంది!

"ప్రియతమా! ఆనాడు అర్ధాంతరంగా ఆగిపోయిన అనుభవాల్ని తిరిగి నాకు అందించు" అన్నదామె! శరీరాన్ని అల్లుకు పోతోంది.

పర్ప పరిష్వం గల సర్పాలకు ఆనందాను భావమే!

కానీ మనుషులకు?? అతడు బలవంతగా రెప్పలు మూసుకున్నాడు!

మనసంతా కూడదీసుకుని ఆమెను గాఢంగా కౌగలించుకున్నాడు. ఆమె ఆకృతి ఎంతో కోమలంగా సుకుమారంగా కన్పిస్తోంది.

కానీ తాకగానే పాము బెరడు శరీరాన్ని చుట్టుకున్నట్లు ఒక్కసారి ఒళ్ళంతా జలదరించింది! పాము బుస ముఖానికి తగులుతున్నట్లు ఆమె ఊర్పులు అతని చెంపల్ని తాకి వెగటు గగుర్పాటు కలిగించాయి.

బలవంతంగా చెంపలమీద చుంబించాడు. పాము పాడగా పెదవులకు తాకిన అనుభవం కలిగింది. శరీరమంతా జలదరించింది.

"కోటి వరాల ముద్దు నాకు ప్రసాదించావు. నీకేంకావాలో కోరుకో!" అంది.

అటువంటి ఆవకాశం కోసమే అతడు ఇంతసేపూ ఎదురు చూచాడు. శరీరానికి గగుర్పాటు కలుగుతున్నామె కౌగలింతను భరించాడు.

వెగటు కలిగించే చుంబనాలను సహించాడు.

ఇప్పుడు అవకాశం దొరికింది కాబట్టి వృధా పోనివ్వదలుచుకో లేదు.

"నాకు ఆనందంగా వెన్నెలలో విహరించాలని ఉంది!" అన్నాడు.

ఆమె భయం భయంగా చూచింది.

"అంత సమయం ఉండదనుకుంటాను! యోగి ఈరోజు త్వరగానే యోగ ముద్రను చాలిస్తాడు. అతను కన్నులు విప్పే సమయానికి నేను తిరిగి జటాజూటంలోకి వెళ్ళిపోవాలి! బయట రవ్వంత ఆలస్యమయితే యోగి శపిస్తాడు." అన్నదామె.

"నాకు కావలసింది అదే!" అనుకున్నాడు మనసులో.

"ఎంతసేపు విహరించాలానే నిర్ణయాన్ని నీకే వదిలేస్తున్నాను! పాము పుట్టలో ఇలాంటి ఇరుకుగోడల మధ్య ఉండటం నాకు అలవాటు లేదు కొండచరియల మీద పొదరిళ్ళలో విహరించాలి!" అన్నాడు పట్టుదలగా.

"నాగరాజుగా వున్నప్పుడు నీకోరిక ఇలాగే ఉండేది! నీ ముచ్చటలు తీర్చటానికే కొండచరియల మీద పొదరిళ్ళలో విహరించేందుకు వచ్చాను. అలా చేయటం జంతువులకు తప్పుకాదు.
నరుడి దృష్టి బహు చెడ్డది! అది నాగులమీద పడరాదు.

"మరి నువ్వు కావాలనుకుంటున్న ఈ శివరాజ్ మనిషి కాదా?"

"నీ సంగతి వేరు! మన అనుబంధం వేయి జన్మలనించి వచ్చింది!" అన్నదామె.

కానీ అతడు పట్టినట్టు విడిచిపెట్టలేదు.

ఆమె అతని రెప్పలు మూసుకోమని కోరింది. అతడు రెప్పలు మూశాడు.

నాగభామిని అతని భ్రుకుటి మీద బొటన వ్రేలుంచింది.

"నువ్వు అంతా మర్చిపోతున్నావు" అంది. రెండుక్షణాలు అతనికి స్పృహలేదు. రెప్పలు విప్పిచూస్తే వారు కొండచరియ మీద ఒక పొదరింటిలో ఉన్నారు!!

## 13

"అహ్మద్ చెప్పినచోటు లింకుల కరనంగారు చెప్పినచోటు ఒక్కటే కాబట్టి మనసంతా అన్వేషణ ఆ చోటునించే ప్రారంభించాలి! మనుషులే కాక అలౌకిక శక్తుల ప్రమేయం కూడ ఉన్న ఈ మిష్టరీని చేదించటానికి అంతకుమించి మరోమార్గంలేదు" అని ప్రతిపాదించింది ఉమ!

కారువేగంగా పోతోంది. విద్యార్థినులు కొందరు భయంగాను, కొందరు సాహసోపేతంగాను ఆలోచిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ థ్రిల్ ఫీలవుతున్నారు.

ఉమ మాటలు కొందరికి ఉత్సాహాన్ని, కొందరికి భయాన్ని కలిగించాయి.

"ఆ చోటుని మనమే కాదు మన కన్నా ముందు పోలీసులు గుర్తించారు. మనకన్నా ముందుగానే అక్కడ నిఘా వేశారు. కాబట్టి ఇంతమంది కలిసి ఆ చోటుని వెళ్ళటం మంచిదికాదను కుంటాను" అన్నది తులసి!

ఆమె మనసు భయం భయంగా ఉంది.

తొందరపాటు వల్ల ఎవరో పొరపాటు పనిచేసినా అవతలి వారికి ప్రాణాపాయం కలిగే అవకాశాలున్నాయి. అటువంటి అపాయకరమైన పనిచేయటం కన్నా అసలేమీ చేయక పోవటమే మంచిది.

"అయితే మరేం చేయాలంటావు?" అంది మరో యువతి.

"తిరిగి వెళ్ళిపోవటమే మంచిది అనిపిస్తోంది."

"తోక ముడిచి పారిపోవటం కన్నా ఒకరిద్దరు వెళ్ళి తెలుసుకోవటం మంచిది" అంటూ మరో ప్రతిపాదన చేసింది ఉమ. ఈ మాటలు భయపడుతున్న వారికి సంతోషాన్ని కలిగించాయి.

ఏదో ఒక సాహసం చేయాలనుకుంటున్నవారికి నిరుత్సాహం కలిగించాయి.

కొంతసేపు చర్చలు జరిగాక తులసి ఉమ ముందుకు పోవాలని అహ్మద్ తోడుగా ఉండాలని నిర్ణయించారు మిగిలిన వారంతా వెనుదిరిగి వెళ్ళి పోయేందుకు ఒప్పుకున్నారు. అహ్మద్ ముఖం భయ భ్రాంతమై ఉంది.

అతడు ఒకచోటు ఎంపిక చేశాడు. ఆ చోటుకి రాగానే ముగ్గురు దిగిపోయారు కార్లు చీకటిలో ముందుకు దూసుకు వెళ్ళాయి.

ఒకప్పుడు ఇలాగే పోలీసుల కంటపడకుండా ముగ్గురు రావటం, అక్కడే కళ్యాణి ప్రాణాలు కోల్పోవటం జ్ఞాపకానికి వచ్చింది.

అలౌకిక శక్తులు ఉన్నాయో లేవో గుర్తించటం అసాధ్యం! ఉంటే మాత్రం వాటిని మానవ శక్తితో ఎదుర్కోవటం అసాధ్యమని భావిస్తోంది తులసి.

అహ్మద్ కాలుతగిలి ఒకరాయి క్రిందికి దొర్లిపడింది పెద్దగా శబ్దం చేస్తూ? దగ్గరలో ఉన్న ఒక గార్డు ఆ వైపుగా టార్చిలైటు ఫోకస్ వేశాడు.

ముగ్గురూ దగ్గరలో ఉన్న ఒక రాతి చట్టు చాటున నక్కి కూర్చున్నారు.

ఒకటి తరువాత రెండు మూడు లైట్లు ఆ వంకకు కాంతిని చిమ్మాయి.

కొంతసేపు అన్వేషణ సాగాక సెర్చిలైట్లు ఆర్పేశారు.

కానీ పోలీసుల చూపులు ఆ వైపునించి మరలిపోలేదు. ప్రతి చిన్న శబ్దాన్ని వారు ఎంతో మెళుకువతో వింటున్నారు. తమ చుట్టూ జరుగుతున్న ప్రతి చిన్న కదలికని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

కొద్దిసేపు టెన్షన్ నీ నిశ్శబ్దాన్ని భరించాక పోలీసువారి చూపు మరోవైపుకి మరలింది అనినిర్ధారణ అయ్యాక ముందుకు దారితీశాడు అహ్మద్! చిన్ననాటి స్నేహితుడిని రక్షించుకోవటం అనే పనిలో పాల్గొనటం ఆనందదాయకంగానే ఉంది.

కానీ ఒక వంక పోలీసులు, మరోవంక అర్థంకాని అతీతశక్తులు వాటిమధ్య తాము సాధించగలిగిందేమిటి అనేది సందేహ స్పదంగానే మిగిలిపోయింది అతని మనసులో!

తమ శ్రమ వృధా అయిపోతుందన్న అనుమానం లేకపోలేదు. తన యిష్టా యిష్టాలతో నిమిత్తం లేకుండా ఈ పరిస్థితిలో చిక్కి పోవటం తలుచుకుంటూ అడుగులు ముందుకేస్తున్నాడు.

శివరాజ్ అదృశ్యమయిన చోటునే తాము నిఘావేయాలి! ఏదైనా సమాచారం తెలిస్తే అక్కడే తెలియాలి.

కానీ అతని వస్తువులు కన్పించిన చోటున పోలీసులు తమ దృష్టి అంతటిని కేంద్రీకరించారు. అదే చోటున అధికారులు గుంపు కట్టి నిలిచిఉన్నారు. వారు చుట్టూ పోలీసుల వలయం పకడ్బందీగా ఏర్పాటయింది. అంతమంది దృష్టిని మళ్ళించి ఆ చోటుకు చేరుకోవాలనుకోవటం దురాశ.

అంత నేర్పుగా ఆలోచించటం తనకి శక్తికి మించిన పని!

డిపార్టుమెంటువారు కాక ఇతరులు ఎవరు కన్పించినా వారు ఆ క్షణంలో విడిచి పెట్టటం జరగదు.

"అక్కడే శివరాజ్ కూర్చున్నాడు. నేను తిరిగి వచ్చాక అతని వస్తువులు ఆ చోటునే నాకు కన్పించినాయి." అన్నాడు అహ్మద్.

"ఆ చోటుకి చేరటం అసాధ్యం. ఈ స్థితిలో మనం ఆ ప్రయత్నానికి పూనుకోవడం దుస్సాహసం" అంది తులసి భయంగా!

"మూర్ఖంగా ఆలోచించకే! మనిషి ఎక్కడనించి అదృశ్యమయ్యాడో అక్కడికే తిరిగి వస్తాడనుకోవటం భ్రమ! ఏదో బలమయిన కారణం ఉండబట్టీ ఆ చోటువిడిచి వెళ్ళాడు.

ఎక్కడకు వెళ్ళి ఉంటాడో తెలుసుకునేందుకు ప్రయత్నించాలి!

కానీ వెళ్ళిన చోటునే కాచిపెట్టుకు కూర్చోవటంలో అర్థంలేదు.

పోలీసు వారికి కావలసినంత బలగం ఉంది కాబట్టి కొందరు అక్కడ నిఘావేశారు. మిగిలినవారు వేరు వేరు స్థలాల్లో అన్వేషణ జరుపుతుంటారు.

మనం ఉంది ముగ్గురు వ్యక్తులమే కాబట్టి ఇంకా సూటిగా ఆలోచించాలి! ఈ పరిసరాలలోంచి అతివేగంగా మనిషి అదృశ్యమయేందుకు అవకాశాలు ఎక్కడున్నాయి? ఆలోచించి అర్థంచేసుకోవాలి, అహ్మద్! నీ ఆలోచనలకి పదును పెట్టాలి! ఈ ప్రాంతాలనించి మనిషి అతివేగంగా అదృశ్యం కావటానికి ఎటువంటి అవకాశాలున్నాయి?" అని ప్రశ్నించింది ఉమ.

ఆ మాటలు అతనికి ప్రోత్సాహాన్ని కలిగించినాయి.

మనసుకి ప్రేరణ కలిగించి ఆలోచనలు ఉగ్దీపితంచేసినాయి. తులసి మాటలు కలిగించిన నిరాశనించి బయటపడి చురుకుగా ఆలోచించటం ప్రారంభించాడు.

"పుట్టలు, చెట్లు ఉన్నాయి. వాటి సాయంతో మరొకరికి కంపించకుండా ముందుకుపోవచ్చు. కాని
అసలు కన్పించకుండా అదృశ్యమయేందుకు అవకాశాలు లేవు" అన్నాడు.

"ఇప్పుడు మనం ప్రమాదంలో ఉన్నామనే సంగతి నీకుతెలుసా?" అతని మనసుకి మరింత పదును పెట్టె ప్రయత్నం ప్రారంభించింది ఉమ. ఆలోచనల ద్వారా అంది రానిమార్గాలు భయం కలిగినప్పుడు, బాధ కలిగినప్పుడు అప్రయత్నంగా వస్తాయి.

అది మనిషిలోని నిగూఢ శక్తి!

దాన్ని బయటకు తీయాలంటే భయమో, బాధో కలగాలి!

"అవును వారికంట పడ్డామంటే మనల్ని ఊరికే విడిచిపెట్టరు" అంటూ బదులిచ్చాడు భయకంపిత స్వరంతో.

"మనల్ని వారు చూచారనుకో!" నొక్కి చెప్పింది ఉమ.

"అమ్మో అలాంటి మాటలు అనకండి అమ్మాయిగారూ ప్రాణాలు పోతాయి! తెలియకపోయి వచ్చి ఇరుక్కున్నాను. భార్యలు పిల్లలు కలిగిన వాడిని! రెక్కాడితే కానీ డొక్కాడని నిర్భాగ్యున్ని!"

"అంతభయమెందుకు? చూస్తే ఏంచేస్తారంటావు?"

"శత్రువులు అనుకుని కాల్చిపారేసినా ఆశ్చర్యం ఉండదు"

"అయితే ఈ రాయి వాళ్ళ మీదికి విసురుతాను"

"మీకు ఆకతాయితనంగా ఉందా అమ్మాయిగారూ!"

"లేదంటే గొంతెత్తి అరుస్తాను"

"అంతపని చేయొద్దండి బాబూ!"

"పోలీసులు మనల్ని చూస్తారు. చూస్తారేమిటి చూచారనుకో!"

"ఇంక ఇవాళ్ళతో మనపని గోవిందా! నా భార్యలుకి ఇకదక్కను"

"చూచి మన మీద తుపాకులు గురిపెట్టారు"

"తుపాకులంటే తమాషాగా ఉందా నీకు? ప్రాణాలు పోతాయి."

"బుల్లెట్స్ వర్షంలా కురుస్తున్నాయి. అప్పుడేం చేస్తావు?"

"కాలికి మించిన పరుగు తీస్తాను"

"చుట్టూ పోలీసులున్నారు వందల సంఖ్యలో! ఎలా పరుగెడతావు!"

"ఎక్కడయినా దాక్కుంటానండి అమ్మాయిగారూ!"

"దాక్కునేందుకు జాగా ఎక్కడుంది? బుల్లెట్ల వర్షంలో!" ఆ దృశ్యం జరుగుతున్నట్లే అతడు భయపడేలా సీరియస్ గా అడిగింది. అతనికి కన్నులలో భయం తాలూకు నీడలు కన్పించినాయి.

"పుట్టల చాటున చెట్టుకొమ్మల చాటున దాక్కుంటాను" అన్నాడు.

"అంగుళం అంగుళం గాలిస్తుంటే ఏం చేస్తుంటావు?"

"కొండమీది నుంచి క్రిందికి దూకుతాను?"

"అప్పుడయినా ప్రాణాలు పోతాయికదా!"

"నిజమే! ఇంక అలాంటప్పుడు గుహలోకి దూరిపోవటం తప్పమరో దారిలేదు" అన్నాడు అహ్మద్ అప్రయత్నంగానే.

"గుహలో దూరిపోతావా? ఎక్కడుంది ఆ గుహ!?"

"ఇక్కడికి దగ్గరలోనే ఆ కొండ మలుపులో!"

"మనం ఇప్పుడు అక్కడికే పోవాలి" అంది ఉమ! అతనికి తెలియకుండానే అతనినించి కావలసిన సమాచారం రాబట్టిన ఉమ తెలివి తేటల్ని అభినందించింది తులసి.

"అమ్మో! ఆ గుహ చాలా ప్రమాదం అమ్మాయిగారూ?"

"ఏం? ఎందుకు ప్రమాదం? జంతువులుంటాయా?"

"ఏమి ఉంటాయో తెలియదుగాని ఎవరూ వెళ్ళరు"

"ఇప్పుడు మనం వెడుతున్నాం కదా!"

"వొద్దండీ! నా మాట వినండీ! ఆ గుహలోకి పగటి పూట వెళ్లేందుకే అందరూ భయపడుతుంటారండీ! ఇదివరలో కొన్ని కథలు కూడా ఉన్నాయండి! ఆ గుహలో ఏముందో చూడాలని ఒక తెల్లవాడు సెర్చిలైటు తాళ్ళు ఆయుధాలు తీసుకుని వెళ్ళాడట! నలభై సంవత్సరాల యిందంట. ఇంతవరకూ తిరిగిరాలేదట. కట్టెలమోపు తెచ్చుకునేందుకు వచ్చిన పాలేరు కుర్రాడు చచ్చిపోదామని గుహలోకి వెడితే బ్రిటిష్ వాడి అస్థిపంజరం కన్పించిందట.

చచ్చిపోదలుచుకున్న వాళ్ళే గుహలోకి వెడతారట!

ఈ ప్రాంతంలో అందరూ ఆ విషయాన్ని కథలు కధలుగా చెప్పుకుంటూ ఉంటారు. నేను చాల విన్నాను.

ఆ గుహలోకి వెళ్ళటంకన్నా కొండమీదినించి దూకి ప్రాణాలు తీసుకోవటమే మంచిది" అన్నాడు అహ్మద్.

పోలీసులు తమని గుర్తించి బుల్లెట్స్ వర్షంలా కురిపిస్తారని ఉమ వర్ణించినప్పటి భయం ఇంకా అతని కళ్ళలో తొంగిచూస్తోంది.

"చూడు అహ్మద్! యీ ప్రాంతం అంతా గాలింపు జరుగుతోంది. మనం యిక్కడే పాతుకుపోవడం ప్రమాదం! గుహ ఎక్కడుందో మాకు దారి చూపించు. ఆ చీకటిలో నిలబడితే మన ఉనికి ఎవరికీ తెలియదు. మరీ గుహలోపలికి వద్దులే.

గుహ ముఖద్వారం దగ్గర కొద్దిగా లోపలకు వెళ్ళి ప్రాణాలు దక్కించుకుందాం." అని సలహాయిచ్చింది ఉమ.

కొంతసేపు ఆలోచనల మధ్య ఊగిసలాడి చివరకు ఉమ ఇచ్చిన సలహాని పాటించేందుకు తీర్మానించుకున్నాడు

అహ్మద్.

" అలాగే అమ్మాయిగారూ! నేరకపోయి వచ్చాం. యిక్కడ మనం సాధించగలిగింది ఏమిలేదు. కనీసం ప్రాణాలయినా దక్కించుకుందాం! " అంటూ గుహముఖాలవైపుగా దారితీసాడు.

కొంతసేపు బండరాళ్ళ మధ్య జాగ్రత్తగా నడిచి వారు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. గుహముఖం అంచున ఎత్తయిన శిలావేదిక మీద పోటీపడుతూ దానితో పాటు కొన్ని మీటర్ల ఎత్తున అనేక శృంగాలతో పెరిగిపోయిన వాల్మీకం వారికి కనిపించింది. దాన్ని చూడగానే వొళ్ళు జలదరించింది.

శృంగాలకు చుట్టుకుని కొన్ని పాము కుబుసాలు కన్పించాయి. అది అనేక మీటర్ల యెత్తు అనేక మీటర్ల వెడల్పు పరుచుకుపోయి ఒక విశాలమయిన మేడలా అంతస్థులుగా కనిపిస్తోంది.

గుహ ముఖంలోకి ప్రవేశించాలంటే దాన్ని దాటి మాత్రమె వెళ్ళాలి.

అంత ధైర్యం చేయలేక అందరూ నిశ్చేష్టులై చూస్తున్నారు. గుహ ముఖాన్ని మూసివేస్తున్న రెండు అంతస్తుల భవనంలా ఉన్న పుట్టవంక రెప్పలువేయక అచ్చెరువుతో చూస్తోంది తులసి.

వారు ఎన్నడూ చూడని అతి పెద్ద వాల్మీకం అది!

అందరికన్న ముందు దారితీస్తున్న అహ్మద్ అడుగు కదపలేకపోయినాడు. తులసి విభ్రాంతి అయింది. ఆమె మనోగతంలో ఆ నాడు యోగిచేప్పిన మాటలు మెదిలాయి. ఆ తరువాత దాసరాని సింగమ్మ మాటలు జ్ఞాపకం వచ్చాయి వారు చెప్పిన మాటలకు భర్త అదృశ్యమయి ఈ చోటుకు ఏదో సంబంధం ఉన్నట్లుగా తోచిందామెకు.

అవాక్కుపడి నిలిచిపోయింది. రెప్పలు వేయటం మరచిపోయింది అందరికన్నా వెనుకగా ఉంది ఉమ.

తమను ఎవరయినా గమనిస్తారని వేయికళ్ళతో పరిశీలిస్తోంది.

చూచినందువల్ల పోలీసుల అనుమానాలు పెరుగుతాయి. వారి ఆలోచనలు అనవసరమయిన మలుపులు తిరుగుతాయి.

పరిశోధన జాప్యం అవుతుంది.

శివరాజ్ ను తెలుసుకోవాలని వచ్చి సంజాయిషీలు చెప్పుకోవలసి రావటంతో తమ చేష్టలు కట్టు బడతాయి .

ఇంక అక్కడ అలాగే నిలబడటం మంచిదికాదు.

వారిని దాటి గుహముఖాన్ని ఇంచుమించుగా మూసేస్తే పెద్దమేడలా ఎదిగిపోయి కన్పిస్తున్న పుట్టముందుకు వచ్చింది. శృంగాలమీద వ్రేలాడుతున్న పెద్దపెద్ద పాము కుబుసాలు దాని పరిస్థితి ఏమిటో చెప్పకనే చెబుతున్నాయి.

ప్రమాదాలకు భయపడి నిలిచిపోతే ఫలితాంశాలు అందకుండానే ఉండిపోతాయి. పుట్టమీదికి ఎక్కడం ప్రారంభించింది.

వొణికే కాళ్ళతో ఆమె ఇంకా ముందుకే వెడుతోంది.

ఉమ తిరిగివచ్చే ప్రయత్నంలోలేదని ముందుకే వెళ్ళాలనే నిశ్చయంతో ఉందని తెలిశాక తనుకూడా పుట్టమీదికి ఎక్కటం ప్రారంభించింది తులసి! ఎంత ధైర్యం చేయాలనుకున్నా అహ్మద్ మాత్రం ఆ పని చేయలేకపోయాడు.

మేడలావున్న పుట్టమీదికి పూర్తిగా ఎక్కేంతవరకు వారిని చూచాడు.

ఆ తరువాత వారు పుట్టమీదుగా గుహముఖంవైపు దిగిపోవటం ప్రారంభించాక అదృశ్యమైపోయారు.

విద్యార్థినుల దుడుకుతనంచూచి మొదట్లో అతడు చికాకు పడిపోయాడు.

ఇప్పుడు ప్రత్యక్షంగా వారి సాహసంచూశాక తాను అపార్థం చేసుకున్నానని తీర్మానించాడు. కాని అనుసరించిపోయేందుకు మాత్రం కాళ్ళురాలేదు. పుట్ట అగ్రభాగానికిపోయాక ఒక వాల్మీకి శృంగాన్ని పట్టుకొని నిలిచిపోయిన ఉమ అతనివైపు చూచింది. పైకి రావలసిందిగా చేయి ఊపి పిలిచింది.

అంతకన్నా పోలీసులకి దొరికిపోవటం ఎంతో క్షేమకరం అని భావించిన అహ్మద్ అంగీకారంలేనట్లుగా తల ఊగించాడు.

ఆమె మరింకతర్కించలేదు. తిరిగివచ్చి అతని తీసుకుపోవాలని ప్రయత్నించనూలేదు. నేరుగా క్రిందివైపుకు దిగిపోయింది.

తులసికూడ ఆమెను అంతధైర్యంగానే అనుసరించింది.

వారి సాహసాన్ని తలపోస్తూ కుప్పకూలిపోయాడు. సరిగా ఆ సమయంలోనే ఆ సమీపంలో పహరాయిస్తున్న ఒక

గార్డు అతనిని గమనించాడు. రాళ్ళు చాటుచేసుకుని అతని వెనుక తట్టునించి వచ్చిన గన్ బారల్ అతని వీపున ఆనించాడు.

ఉలిక్కిపడి చూడాలని ప్రయత్నించాడు అహ్మద్.

"హాండ్సప్! కదిలావంటే కాల్చేస్తాను చేతులు ఎత్తి నిలబడు!" అన్నాడు.

అతని సూచనలను అనుసరించి చేతులుఎత్తి నిలబడ్డాడు.

తెల్లవారుజాము పూర్తికావస్తున్న సమయం. చల్లనిగాలి వీస్తున్నా అతని శరీరం చెమటతో తడిసిపోయింది. కాళ్ళుచేతులు వణుకుతున్నాయి. ముఖం ఎర్రగా అయిపోయింది భయంతో.

"నన్నే మీ చేయకండి! నాకేమీ తెలియదు. అన్నాడు వొణికే కంఠంతో ఒక తాడుతో అతనిచేతులు దగ్గరగా ఉంచి బిగించాడు గార్డు! అతని దగ్గర ప్రేలుడు పదార్థాలు, ఆయుధాలు ఏమైనా ఉన్నాయేమోనని క్షున్నంగా పరిశీలించాడు. ఏమీలేవని నిర్ధారించుకున్న తరువాత అతని అనుమానాలు సన్నగిల్లాయి.

ఆ మనిషి వాలకం గమనించి తీవ్రవాది డెకాయిట్ లాంటి లక్షాలేవి కన్పించకపోవడంతో గార్డు కొంతశాంతించాడు. అతనికి కొంత ధైర్యంవచ్చి చనువుగా మాట్లాడటం ప్రారంభించాడు.

"ఎవరు నువ్వు? ఇక్కడెందుకు తిరుగుతున్నావు?"

"నాకేమి తెలియదు బాబుగారు! నేను నిర్దోషిని?!"

"అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పు! నీ పేరేమిటి? ఈ సమయంలో ఇక్కడెందుకు తిరుగుతున్నావు?"

"బుద్ది తక్కువయింది బాబూ! చెంపలు వాయించుకుంటాను. ఇంటికి వెళ్ళిపోతాను బాబూ!" అన్నాడు అహ్మద్.

"అడిగిన ప్రశ్నకు సమాధానం చెపితేనే నిన్ను విడిచి పెడతాను"

"ఏం చెప్పమంటారు బాబూ! నేనొక పల్లెటూరి ఆసామిని!"

"అదిసరే! నీ పేరేమిటి?"

"అహ్మద్ భాయి అంటారు బాబుగారు!"

"అయితే ఈవేళప్పుడు ఇక్కడెందుకు తిరుగుతున్నావు?"

"తెల్లవారి సూర్యోదయం సమయానికి పుట్టలోంచి పాములు బయటికి వస్తాయి. వాటిని పట్టుకుని జీవిస్తుంటాను. మీరు వద్దంటే తిరిగి వెళ్ళిపోతాను. వదిలేయండి బాబుగారూ!" అంటూ ఒక అబద్ధంతో ప్రారంభించాడు అహ్మద్.

నిజం చెపితే తననికూడా నేరస్తుడిగా పరిగణించవచ్చు! పుట్ట మీది నుంచి గుహలోకి దిగినవారిని పిలుచుకురమ్మని ఆదేశించవచ్చు! పాములతో నిండిన ఆ పుట్టమీదికి ఎక్కడం కన్న ఒక అబద్ధం ఆది తప్పుకోవడం క్షేమకరం అని అతడు భావించాడు. ఒక అబద్ధం ప్రారంభించాక తానింక అడుసులో కాలుపెట్టినట్లు అవుతుందని చివరకు అది ఒక పెద్ద ఊబిగా మారి ప్రాణాలమీదికి తెస్తుందని అతడు ముందుగా ఊహించలేదు.

"పాములు పట్టుకునేందుకు నీకు పర్మిషన్ ఉందా?"

"పల్లెటూరి వాళ్ళకి అలాంటివన్నీ ఎలా తెలుస్తాయి బాబుగారూ! దయ ఉంచి నన్ను వెళ్ళిపోనివ్వండి బాబూ!" అన్నాడు బ్రతిమాలుతూ!

"ప్రతిమాటకూ వెళ్ళిపోనంటావు. ఏమిటంత తొందర? నువ్వేదో తప్పుచేసి ఉంటావు. లేకపోతే వెళ్ళిపోవటానికి అంతతొందర ఎందుకు? నువ్వుచేసిన తప్పేమిటో చెప్పకుండా వెళ్ళిపోతానంటే ఎలాపోనిస్తానని అనుకున్నావు? ఆ ప్రయత్నం మానుకో!

నిజం చెపితే నిన్ను వెళ్ళిపోనిస్తాను. అంటూ పోలీసు ఎంక్వయిరీ చాకచక్యంతో మాటాడుతూ ప్రారంభించాడు గార్డు!

"అంటే నేను చెప్పినదంతా అబద్ధం అంటారా?"

"అబద్ధమని తెలుస్తూనే ఉంది. అనుమానం ఎందుకు?

"లేదుబాబూ! నేను చెప్పేదంతా యదార్ధం!"

"నువ్వు ఇక్కడికి ఎప్పుడొచ్చావు?"

"ఇప్పుడే చూస్తూ వస్తున్నాను"

"అందుకే అబద్ధమంటున్నాను. చుట్టూ అంతమంది గార్డులు ఉంటే ఎవరి దృష్టిలో పడకుండా ఎలా రాగలిగావు? అన్నాడు పి.సి!

అనుభవంలేని అహ్మద్ పోలీసు ప్రతిభకి డంగయి పోయాడు. ఖిన్నుడయి బదులు చెప్పలేక కిమ్మనక ఉండిపోయాడు.

"అందుకే నువ్వు చెప్పేది అంతా అబద్ధం. నిజం ఏమిటి చెప్పు" గద్దించాడు.

ఈ మాటలకు అహ్మద్ మరింత కృంగిపోయాడు.

"నిజంగానే బాబుగారూ! పాములు పట్టుకునేందుకు వచ్చాను"

"అయితే నేను యిక్కడే కూర్చుంటాను. పుట్టమీదికి ఎక్కి పాముని పట్టి తెస్తావా? పాములంటే నీకు భయంలేకపోతే ఆ కుబుసాలన్నీ ఏరి తీసుకువస్తావా?" అంటూ పుట్టమీది కుబుసాల వంక చూపించాడు.

ఆ వైపుకి చూడగానే అహ్మద్ ధైర్యం మరింత దిగజారిపోయింది.

అక్కడికి వెళ్ళటం కన్నా పోలీసులకి దొరకటం మంచిది అని అతడు అంతకుముందుగానే నిర్ణయించుకుని ఉన్నాడు. నిస్సహాయంగా చూచాడు. అతని బలహీనత చూపుల్లోనే బట్టబయలు అయింది.

"నీలాంటి వాళ్ళని నేను చాల మందిని చూచాను. అబద్ధాలాడావంటే మరింత ఊబిలో యిరుక్కుంటావు. నిజం చెప్తే వొదిలేస్తాను" అన్నాడు.

"నిజంగా వొదిలేస్తావా? బాబుగారూ!"

"అనుమానం ఎందుకు? నేను అబద్ధాలాడే మనిషిలా కన్పిస్తున్నానా?

"లేరండీ మీరు అబద్ధాలెందుకు చెప్తారు. నిజంగానే వదిలేస్తారు"

"వదిలేస్తాను అనే నమ్మకంతో వాస్తవంగా ఎందుకొచ్చావో చెప్పు."

"చెట్లు నరికి కట్టెలు తీసుకుపోయిన నగరంలో అమ్ముకునేందుకు వచ్చానండి బాబుగారూ! ఇది నిజం

వదిలేయండి" అన్నాడు.

"కట్టెలు నరికి తీసుకు పోయేందుకు వచ్చావా?"

"అవునండి! నిజంగా అందుకే వచ్చాను."

"అయితే మరి గొడ్డలి, త్రాడు అలాంటివి తీసుకురాలేదేం?"

"తెచ్చానండి! అక్కడ పెట్టివచ్చాను."

"ఎక్కడ పెట్టానో పద వెళ్ళి చూద్దాం."

"చాల దూరం వెళ్ళాలండి"

"పది కిలోమీటర్లయినా నీ వెంట వస్తాను పద." అన్నాడు పి.సి.

అహ్మద్ కి గుండెలు దిగజారాయి. తాను అబద్ధాల ఊబిలో అలవాటు లేని కారణంగా కూరుకుపోయిన విషయం అప్పటికి అతనికి బాగా అర్థమయింది. కన్నులు చెమరించాయి.

ఇలాంటి దుస్థితిలోకి తనని ఈడ్చిన అమ్మాయిల మీద అతనికి విపరీతమయిన కోపం వచ్చింది. కాని ఏమిచేయగలడు.

"పోలీసు ఆఫీసర్ ణి కిడ్ నాప్ చేసిన ముఠాలో నువ్వు కూడ ఉన్నావు. నీకు సెంట్రల్ జైల్ లో సాంబారు త్రాగక తప్పదులే పద!" అంటూ మెడమీద లాఠీ ఉంచి ముందుకుతోశాడు. ఆ విసురుకి తూలిపడబోయి ఎలాగో నిలద్రొక్కుకుని ముందుకి నడిచాడు.

పి.సి. అతణ్ణి నేరుగా అధికారులమధ్యకు తీసుకుపోయాడు.

"వీడు అనుమానాస్పదంగా తిరుగుతుంటే పట్టుకొన్నాను సర్!" అన్నాడు. వారు చేసిన ముట్టడి ఇరవైనాలుగు గంటలుగా విఫలమయింది.

శివరాజ్ గురించి ఎటువంటి ఆచూకీ తెలియలేదు.

వారు అవకాశాలకోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. అలాంటి సమయంలో ఒక ఆధారం దొరికింది అనగానే పోలీసు బలగం వెల్లువలా అతన్ని ముట్టడించి ప్రశ్నల వర్షం కురిపించారు.

అంతమంది అధికారులను ఒకేసారిచూచి హడలిపోయాడు మరింతగా! కాళ్ళు వొణకటం ప్రారంభించినాయి.

"ఇప్పుడు కూడా అబద్దాలే చెప్పాలనుకుంటున్నావా?" గద్దించాడు.

ముందుగా అతన్ని చూచి బంధించి తీసుకువచ్చి గార్డు!

లేదండి! నాకేమీ తెలియదు! నేను అమాయకున్ని! శివరాజు ఎవరో నాకు తెలియదు నన్ను వెళ్ళిపోనివ్వండి" అన్నాడు హీనమయిపోతున్న కంఠస్వరాన! పి.సి.ఖ ముఖముఖాలు చూచుకున్నారు. ట్రీట్ మెంట్స్ యిచ్చి నిజాన్ని కక్కించాల్సి వస్తుందని అనుకున్నారు.

అందుకు వారు మానసికంగా సిద్దం అవుతుండగా ఒక ఉన్నతాధికారి వారిని తొలగించుకుని అతని ఎదుటకు వచ్చాడు.

"నువ్వు తలెత్తి సరిగా చూడు. నన్ను గుర్తించావా?" అన్నాడు.

"వీరెవరో నాకు తెలియదండి!"

"అబద్దాలాడావంటే అన్యాయమైపోతావు"

"తెలుసండి! పోలీస్ కంట్రోల్ రూంలో చూచాను."

"అయితే జైలులో పడడం విడుదల కావటం నీకు అలవాటన్న మాట?"

"అదేమీ కాదండి ఒక రిపోర్టు యివ్వటానికి వచ్చినప్పుడు చూచాను."

నిజం చెప్పావు. అప్పుడే నిన్నుకూడా నేను చూచాను. ఇదిక అబద్దాలాడి ప్రయోజనం ఉండదు. నువ్వు నేరంచేసే మనిషిలా కన్పించుటల్లేదు పాపం! చాల మంచివాడిలా ఉన్నావు.

ఒక్కొక్కసారి మంచి వాళ్ళు కూడ పొరపాటున మా దగ్గర చిక్కుకు పోతారు. అలాంటప్పుడు బాధపడకూడదు. భయపడకూడదు. జరిగిందేమిటో వాస్తవం చెప్పి వెళ్ళిపోవాలి అంతకన్నా క్షేమకరమయిన మార్గంలేదు. నీ

మేలుకోరి చెబుతున్నాను.

"ఎందుకు తన్నులు తింటావు ఎందుకు శిక్షలు అనుభవిస్తావు. వాస్తవ మేమిటో చెప్పు నిన్ను నేను విడిచి పెట్టేస్తాను" అన్నాడు అధికారి.

అతని కంఠస్వరం చెప్పే తీరు అహ్మద్ కి విశ్వాసం కలిగించినాయి.

"బాబుగారు జరిగినదానిలో నా తప్పేమీ లేదండీ!" అంటూ ప్రారంభించిన గత రాత్రి తాను నిద్రిస్తూ ఉండగా కాతని విద్యార్థినులు రావటం దగ్గర నించి ఉమ, తులసి గుహ ముఖంలోకి వెళ్ళటం భయపడిన తాను బయట నిలచి వుండగా గూర్ఖా కంటపడిపోవటం వరకూ చెప్పాడు.

అతడే శివరాజ్ తప్పిపోయినప్పుడు రిపోర్టు యిచ్చిన మిత్రుడు.

ఆడపిల్లల ప్రేరణలో తాను చేసిందంతా నేరంగా భావించి అబద్ధాలాడి శిక్షనించి తప్పుకో వచ్చునని భ్రాంతిపడి ఊబిలో కూరుకుపోయాడు. అంతా విని అతని కట్లు విప్పించాడు అధికారి.

"నీవు నేరం చేయలేదు. మాకు నువ్వు మిత్రుడివే! అయితే ఇంతసేపు వారికి అందించిన సహకారం ఇకనించి మాకు అందించాలి? అందుకోసం నువ్వు మా వాళ్ళ మధ్యనే ఉండు. నిన్ను గౌరవంగా చూచుకుంటారు." అని చెప్పి పి సిలకు అప్పగించి కొందరు వెంటరాగా గుహముఖంవైపు పరుగు తీశాడు అధికారి.

ఏ ఆధారములేక స్థబ్దుగా ఉండిపోయిన పోలీసుల్లో చైతన్యం వచ్చింది!

## 14

పోలీసులు గుహముఖాన్ని ముట్టడించారు.

సెర్చిలైట్లు ఎదురుగా కొండల మీదనుంచి ఫోకస్ చేశారు. తెల్లవారుతున్న ఆ సమయం పట్టపగలులా అయిపోయింది. తెల్లని కాంతి అన్నివైపులా పరుచుకుంది. ఎదురుగా కన్పించే దృశ్యం భయానకమయినది.

ఏముందో తెలియని గుహలోకి ఎలా ప్రవేశించాలో తెలియకపోయినా వారు వెనుకంజవేయలేదు. అత్యంత సాహసంతో అన్వేషణకు పూనుకున్నారు. ఎంతో ఆశతో అధికారి ముందుకు దారితీశాడు.

పుట్టమీదికి ఎక్కుతున్నపుడు ఉక్కు నాడాల బూట్లు పుట్టమీది మట్టిని నిలిపేస్తున్నాయి. కొన్ని పుట్టకొమ్ములు (వాల్మీక

శృంగాలు) విరిగి పడినాయి కూడ! అయినా వారి దృష్టి అక్కడలేదు.

పూర్తిగా పుట్టమీదికి ఎక్కి రెండోవైపు క్రిందికి దిగారు.

గుహముఖం అంచులుగా ఉన్న కఠిన శిలలమధ్య వారున్నారు. చీకటిగా ఉన్న గుహలోకి కాంతి ప్రసరించాకుండా పుట్ట అద్దునిలిచింది. ముందుకు వెళ్ళేదారి కన్పించదు.

వెనుకకు పోవాలంటే మేడగోడలా అడ్డునిలిచిన వాల్మీకం! ఆ చోటున నిలిచేందుకు కూడ చాల ధైర్యం కావాలి! ముందు దారి వెతుక్కునేందుకు వారు బ్యాటరీ లైట్లు వెలిగించారు.

అవి ఎంతశక్తి వంతమయినవి అయినా చేయగలిగిన సాయం అంతంత మాత్రంగానే ఉంది. తేమగా ఉండి ఫంగస్ తో జారుడుగా తయారయిన రాతిచట్టు దారిమీద ఇనుప నాడాల జోళ్ళలో అతి జాగ్రత్తగా ముందుకు పోతున్నారు.

అధికారి అందరికన్నా ముందునడుస్తూ ఆదర్శవంతంగా దారి చూపుతున్నాడు. పి.సి లు వీలయినంత ఎక్కువ దూరాన్ని పరుచుకు పోయినట్లు నడుస్తూ అనుసరిస్తున్నారు.

గుహంతర్భాగంలోకి కొంత దూరం పోయాక మిగిలిన కాంతి సాంతంగా తగ్గిపోయింది. బ్యాటరీ దీపాల కాంతి ప్రసరించగల దూరం క్రమంగా కొరవడి పోతోంది.

పరిమితమయిన చోటుని మాత్రమే వారు చూడగలుగుతున్నారు. ఆయుధాలను పొజిషన్ లో పట్టుకున్నారు సిద్ధంగా.

కొద్ది దూరం పోయాక గుహ ఒక మలుపు తిరిగింది. మలుపులో ప్రవేశిస్తూ ఉండగా టపటపమని శబ్దాలు వినిపించినాయి.

ఫైర్ అని అరిచాడు అధికారి! ఆయుధాలు భయంకరంగా గర్జించాయి. క్షణం సేపు పరిస్థితి విభ్రాంతికరంగా తయారయింది.

దట్టమయిన పొగ అలుముకుంది. కొన ప్రాణంతో సెర్చిలైట్లు వైపుగా ఎగురుతూ వచ్చిన గబ్బిలాయిలు దబ్బిమని నేల పడ్డాయి. ఒకటి రెండు రక్తపు చుక్కలు తడిగా ఉన్న రాతి చట్టుమీద వెడల్పుగా పరుచుకుని వాటిమధ్య వికారంగా వాటి శరీరాలు రాలి పడ్డాయి.

పోలీసు అధికారి మరింత ముందుకు పోయేందుకు ఆదేశించాడు. పదిమీటర్లు ముందుకు వెళ్ళారో లేదో అక్కడ

గుహలో రాతిచట్టు గోడల్లాగా చీలిపోయి మూడు దారులు ఏర్పడ్డాయి.

ఒక్కొక్క దాన్ని విడిగా పరిశీలించారు.

ప్రతి మార్గమూ చాల ముందుకు పోతున్నట్లు గమనించారు.

ఏ మార్గం వెంట వెడితే వారు తాము ఆశించిన చోటుకి వెళ్ళగలరో ఎవరికీ తెలియదు. ఏ దారి ఎటుపోతుంది అనే ప్రశ్న దగ్గర నిలిచిపోయారు.

కొంతసేపు చర్చలు జరిగాయి. ఇలాంటి విషయాలు చాల అరుదయిన అనుభవాలు! అందరూ ఊహించదగినవి కావు.

"సర్! ఇలా గుహాంతర్భాగంలో దారులున్నప్పుడు ముందుకు వెళ్ళేదారి ఒకటే వుంటుంది. మిగిలినవి అన్నీ కొద్ది దూరం ముందుకు తీసుకుపోయిన తరువాత మూసుకుపోతాయి." అన్నాడొక అనుభవశాలి.

"కాని ఏ దారి ముందుకుపోతుందో ఏ దారులు మూసుకుపోతాయో ఎలా గుర్తించటం ఎలాగంటావు?" అని ప్రశ్నించాడు అధికారి!

"అది తెలుసుకునేందుకు గుర్తులేముంటాయి? వెళ్ళి చూడవలసిందే!" అని బదులిచ్చాడు అనుభవశాలి!

వారు మూడు వర్గాలుగా చీలిపోయారు. తిరిగివచ్చేవారు మార్గాన్ని సరిగా గుర్తించేందుకు ఇద్దరు పిసిలతో అధికారి అక్కడే నిలిచి ఉండేందుకు నిర్ణయమయింది.

తిరిగి వచ్చినవారు బయలుదేరిన చోటును గుర్తించలేకపోతే ఆ మూడు ద్వారాల వెంట చంక్రమణం చేయాల్సిందే! అటువంటి స్థితిలో చిక్కితే శత్రువులతో పనిలేకుండా సిబ్బంది నష్టమవుతుంది. తిరిగి వెళ్ళేదారి గుర్తించేందుకు వీలున్నంతమేర గుహలలో ముందుకు పోవాలన్నది ప్రధాన నియమం.

అధికారి మనసుని ఒక అంశం తొలుస్తోంది.

అహ్మద్ రిపోర్టు ప్రకారం ఇద్దరు యువతులు మాత్రమే గుహలోకి ప్రవేశించారు. వారి దగ్గర సెర్చిలైట్స్ కాని దారిని గుర్తించేందుకు ఉపయోగించే రోప్స్ లాంటి పరికరాలు కాని లేవు.

వారు ఇంకా ముందుకు ఎలా పోగలిగారు.

లోపల కొందరు గ్రూపుగా నివాసముండాలి! వారిని అనుచరులు రిసీవ్ చేసుకొని రహస్య స్థావరానికి తీసుకుపోవాలి. రిసీవ్ చేసుకునేందుకు వచ్చిన వారివద్ద సాధనాలు ఉండవచ్చు.

ఏదిఏమయినా తన ఆలోచనలలో వాస్తవంకన్నా వూహలే ఎక్కువగా ఉన్నట్లు అతడు గుర్తించాడు. అక్కడ తాత్కాలికంగా అయినా మనుషులు ఉండే ఎలాంటి సూచనలు కన్పించలేదు.

పాచి పేరుకుపోయి తడిగా జారుతున్న రాతి చట్టు నేల మీదకి టార్చి ఫోకస్ చేశాడు. మెన్ వెళ్ళిన కాలిగుర్తులు ఫంగస్ మీద ముద్రితమయి కనిపించాయి. అతని ముఖంలో ఆశలు మెరిశాయి.

తాము కాక మరెవరాయినా ఉంటే వారి పాదాల గుర్తులు కూడా కన్పించాలి కదా? అతడు నేలమీద సునిశితంగా పరిశీలించాడు.

పాదాల గుర్తులు కనిపించలేదు. కాని పాములు తిరిగినట్లున్న సన్న సన్నని దారులు పొడవుగా ముందుకు సాగిపోతూ కనిపించాయి. కొన్నిచోట్ల కుబుసంమీదఉన్న పాములు తిరిగిన గుర్తుల్ని తలపిస్తున్న వాటి శరీరం తాలూకు పొలుసులు అంటుకొని ఉన్నాయి.

అధికారికి రెండు కారణాలవలన అక్కడ మనుషులు ఉండేందుకు వీలుంటుందని అనిపించింది. పాముల మీద అక్రమ వ్యాపారం టెర్రరిజం ఈ రెండు కారణాలకు శివరాజ్ అదృశ్యమయిపోవటానికి సంబంధం కనిపించలేదు. ఇద్దరు విద్యార్థినులు రావటానికి కారణం మొదటే బోధపడలేదు. విద్యార్థినులు కొందరు కొన్ని కారణాలవలన ఉగ్రవాదంవైపు మొగ్గు చూపుతున్నారు.

అలాంటివారు మాత్రమే ఇలాంటి చోటున ఉండగలుగుతారు. నగరానికి సమీపంలో రహస్య స్థావరాలు కావాలనుకున్న వారికి చాలా అనుకూలమయిన చోటుగా అది కన్పించింది.

వాస్తవాలకు దూరంగానే అతని ఆలోచనలు సాగుతున్నాయి. ఒక వంకకు పోయిన జవానులు తిరిగి వచ్చారు.

కొంత దూరం పోయాక ఆ దారికి అడ్డుగా కొండరాయి నిలిచి ఉందని మరింక ముందుకు వెళ్ళేదారి లేదని వారి రిపోర్టు.

మరోవంకకు పోయినవారు తిరిగిరాలేదు. కాని దూరంగా ఎర్రబ్యాటరీలైటు కాంతి కనిపించింది. వారు ముందుకు పోగాలిగితే అలా అక్కడ వెలుగు కనిపించే అవకాశంలేదు.

మరోవైపు వెళ్ళినవారి జాడ తెలియలేదు.

కాని ఆ గుహలోంచి అర్థంకాని ధ్వనులు విన్పిస్తున్నాయి. క్రమంగా అవి స్పష్టమవుతూ పెద్దగా విన్పించాయి. అక్కడున్న వారందరికి ఒక విషయం బోధపడింది. నిశ్చేష్టులయి వింటున్నారు.

ఆ గుహ ముఖం నుంచి వెలువడుతున్న శబ్దాలు ఆర్తనాదాలు.

ఏమీ చేయాలో తోచక వారు కొంతసేపు ఎదురు చూశారు. క్రమంగా ఆర్తనాదాలు మరింత పెద్దవిగా స్పష్టంగా వెలువడ్డాయి.

పోలీసు అధికారి ఒక శక్తివంతమయిన బ్యాటరీలైటు తీసుకొని ఆ వైపుకి తానే స్వయంగా వెళ్ళాలని బయలుదేరాడు.

ఈలోగా ఒక వ్యక్తి చీకటిలో దిక్కుతోచని పిక్కబలంతో వారి ముందుకువచ్చి నిలిచిపోయాడు. అతని ముఖంలో ఒక బాధ తాలూకు ప్రతిస్పందన కనిపిస్తోంది. ఆయాసంతో క్షణం మాట్లాడలేకపోయాడు. ఒణికే కాళ్ళని అదుపుచేయలేక మరో పి సి భుజంమీద చేయివేసి నిలువరించుకున్నాడు. కళ్ళల్లో విపరీతమయిన భయం!

"నువ్విప్పుడు మా దగ్గరకు క్షేమంగా చేరగలిగావు. ఇంకా భయమెందుకు? అసలేం జరిగిందక్కడ?" అని ప్రశ్నించాడు అధికారి.

"సర్! మనవాళ్ళంతా ప్రమాదంలో చిక్కిపోయారు. నేను పారిపోయివచ్చాను"

శత్రువులు ఎవరయినా ఎటాక్ చేశారా?"

"కాదు సర్పాలు ఎటాక్ చేశాయిసర్! వందలుకాదు వేలు!" ఆ దృశ్యాన్ని తలుచుకుని భయంగా రెప్పలు వాల్చేడు. అతని ముఖంలో మృత్యువు నీడలు కదలాడుతున్నాయి! అక్కడ తాను చూచిన దృశ్యం తాలూకు భయంతో అణువణువూ చలించిపోతున్నాడు.

శరీరం చమటలు క్రమ్మి తడిసి ముద్దాయిపోయింది.

"అక్కడ అన్ని పాములు ఎలా వున్నాయి?" అధికారి ప్రశ్నించాడు.

"అదేమో నాకు తెలియదుసర్! రాతిచట్టుమధ్య ఒక చిన్న కొలను లాగ కన్పించింది. దాని నిండా నీరువుంది.

చుట్టూ పాచి పట్టి ఉంది. దానిమీద వందలు వేల సంఖ్యలో పాములున్నాయి.

పారిపోయి రావాలంటే వీలుకాదు. పాచిపట్టిన రాతి చట్టుమీద కాళ్ళు జారుతున్నాయి. గుండెలు బేజారవుతున్నాయి, నేనెలాగో కొంతదూరం పాకుతూ వచ్చి తప్పించుకు రాగలిగాను.

మిగిలినవారు పారిపోయేందుకయినా అవకాశం లేదు. కాలుతీసి కాలువేసినప్పుడల్లా క్రిందికి జారిపడుతున్నారు.

ఒక్కొక్కరిని కొన్ని వందల పాములు చుట్టుముట్టేశాయి. ఏ ఒక్కరయినా బ్రతికి బయటపడగలిగితే అది అదృష్టమే!

వీలయిన సాయం అందించాలి సర్!" అంటూ అతడు నురగలు క్రక్కడం ప్రారంభించాడు. ఎప్పుడయితే అతని మాటలు విని నురగలు క్రక్కుతున్న దృశ్యాన్ని చూశారో మిగిలినవారంతా హడలిపోయారు.

ఇంకా ఈ గుహనించి బయటపడడం అసాధ్యమనే విషయాన్ని తలుచుకుని భయంతో కంపించిపోయినారు.

కొందరయితే ప్రాణాలు దక్కించుకోవాలని అధికారి ఆజ్ఞ కోసమైనా ఎదురు చూడకుండా పరుగులు తీయటం ప్రారంభించారు.

గుహలో కొలను ఉన్న దిక్కునుంచి ఆర్తనాదాలు వినిపించటం క్రమంగా తగ్గిపోయింది. కొద్దిసేపటికి అసలు ఎలాంటి శబ్దమూ వినిపించలేదు.

ఆ చోటున మిగిలి ఉన్న వారందరిని పాములు కరిచేశాయని అదికారి అనుమానించాడు. ఒకరిద్దరు మాత్రమే అతనితో మిగిలున్నారు.

ఏమీ చేయాలో తోచక పూర్తిగా అయోమయంలో పడిపోయి నాడు.

అందరూ పారిపోయినా తాను మాత్రం ఎలాపోగలడు! కొద్దిసేపు అయ్యాక ఆ వైపునించి ఒకటి రెండు సర్పాలు వచ్చాయి. ఆ తరువాత అయిదారు.

వాటి వెనుక పది! ఆ వెనుక పెద్దదండులా వస్తున్నాయి. ఆ దృశ్యాన్ని చూచి హడలిపోయాడు. ఇంకా అతనికి ఏ విషయమూ గుర్తుకు రాలేదు. పరుగుతీయటం ప్రారంభించాడు. ముందు వెడుతున్న వారిని అందుకున్నాడు.

అందరూ కలిసి గుహవెలుపలకు పరుగుతీశారు. ప్రతి ఒక్కరి ముఖంలోనూ మృత్యువు తాలూకు నీడలు కదలాడుతున్నాయి.

వారి వెనుక పాములుదండుగా వచ్చినాయి. అవి కొన్ని వందలు వేల సంఖ్యలో ఉన్నాయి. లెక్కించటం ఎవరికీ సాధ్యమవుతుంది. అవన్నీ వచ్చి కోటలా పెరిగిపోయి వున్న పుట్టమీద పడిపోయాయి. ఒకదాని ముందుగా ఒకటి ప్రాకుతూ చుట్టలు తిరుగుతూ పుట్ట రంధ్రాలలోకి వెళ్ళాయి.

పోలీసులు వాత్యవంక చూస్తూ వణికిపోతున్నారు.

వారిదగ్గరున్న ఆయుధాలు కూడ జయించలేని సైన్యం అది.

అన్నీ వెళ్ళిపోయాక వారి భయం కొంత తీరిపోయింది.

గుహ లోపల మిగిలిపోయిన వారి గురించి ఆలోచించటం ప్రారంభించాడు అధికారి. వారిని అలాగే విడిచి వెళ్ళిపోవటం సాధ్యపడదు. తిరిగి లోపలకు వెళ్ళాలన్నది అతని ప్రతిపాదన పి.సి.లకు భయంకరంగా విన్పించింది.

అయితే ఏ ఒక్కరూ అతనికి ఎదురు చెప్పలేకపోయారు.

తిరిగి ఆ పుట్ట మీదికి ఎక్కాలంటే కాళ్ళు వొణుకుతున్నాయి.

ఆ గుహలో అన్ని పాములతో సహ జీవనం సాగించటం ఎవరికయినా అసాధ్యమని వారు నిర్ణయించారు. కనుక లోపల శత్రువుల కోసం అన్వేషణ సాగించటం ఇప్పుడు వారి లక్ష్యమ్కాదు.

మిగిలిపోయిన తమ వారిని తీసుకురావటమే! లక్ష్యం.

మరొక మారు అలాంటిదే మరొక మారు ఎదురు అవుతుందన్న భయం మనసుల్ని పట్టీ పీకుతున్నా అది తప్పనిసారీ కార్యక్రమం.

నెమ్మదిగా ముందుకుపోయారు. ఎవరి దైవాన్ని వారు ప్రార్ధించుకున్నారు.

తనా ఆ చోటుకి చేరాక వారికి కన్పించిన దృశ్యం హృదయ విదారకంగా ఉంది. పి.సి.లు వొంటిమీద తెలివిలేకుండా పడివున్నారు.

కొందరు మాత్రం అప్పుడే తెలివి తెచ్చుకుంటున్నారు.

పాముల్ని చూచి వారు భయపడి స్పృహకోల్పోయినారే కాని అవి వారికేమీ చేయలేదు. అంత సంఖ్యలో ఉన్న పాముల సైన్యం ఒకవేళ ముట్టుకోవటం ప్రారంభిస్తే వారిలో ఏ ఒక్కరూ మిగిలే అవకాశం లేదు.

పి.సి.లు వార్ని బయటకు తీసుకువచ్చారు.

ఉపచారాలు చేసి స్పృహతెప్పించారు.

తెలివి వచ్చిన తరువాత కూడ వారిలో కొందరు తాము బ్రతికి ఉన్నామనే వాస్తవాన్ని ఇముడ్చుకోలేక భయంగానే చూస్తున్నారు.

ఇంక తిరిగిపోవటం తప్ప మరోదారి లేదని నిర్ణయించాడు ఆఫీసర్.

శివరాజ్ ఆ గుహలోకి వెళ్ళి ఉంటాడని అనిమానించడం ఎలా?

ఒకవేళ తెలియక ఎవరయినా పొరపాటుగా వెళ్ళినా కొంతకాలం దాని లోపల నివాసం చేయగలరనే మాట అవాస్తవం.

వెంటనే పోలీసు అధికారి హెడ్ క్వార్టర్స్ కి వైర్ లెస్ ద్వారా సంప్రదిమ్పులు జరిపాడు. తిరిగి వెళ్ళేందుకు వారి అనుమతి సంపాదించాడు.

శివరాజ్ కోసం అన్వేషణ ఎక్కడ జరపాలనే విషయం మళ్ళీ చర్చలు జరిపి నిర్ణయించాలి. వారంతా తిరిగి వెళ్ళిపోయారు.

అహ్మద్ ని కంట్రోల్ రూంకి తీసుకుపోయారు.

కొంపలు మునిగాయని అతడు కుమిలి, కుమిలి ఏడుస్తున్నాడు.

"అదే చోటికి శివరాజ్ తో వెళ్ళింది నీవేనా?"

"అవునండీ! ఆ వివరాలన్నీ మీకు చెప్పింది కూడ నేనే!"

"ఇప్పుడు మరో ఇద్దరు నువ్వు చూస్తూ ఉండగా అదే చోటున గుహ లోపలికి వెళ్ళారంటున్నావు. అక్కడకు వెళ్ళేవారంతా నీకోసం ఎందుకు వస్తున్నారు? ఆ చోటుకి, నీకు ఏదో సంబంధం ఉంది."

"నాకేమి తెలియదు దొరగారూ! వాళ్ళే వచ్చారు"

"నీతో అక్కడకు వచ్చిన వాళ్ళు కన్పించకుండా పోతున్నారు"

"అది నిజమే కాని నాకేమి తెలియదండి. అంతా నా దురదృష్టం. అంతే!"

"వారందరూ దొరికే వరకు నువ్వు మా కష్టడీలో ఉండాలి."

అహ్మద్ కుప్పకూలిపోయాడు.

జరిగినా కథ అంతా చెప్పాడు. లింకుల కరణం కథవిని అతనిని పిలిపించారు. తులసి, ఉమతో పాటుగా వెళ్ళిన యువకులందరినీ పిలిపించారు. జరిగినా సంగతి అంతా అర్ధమయింది.

అహ్మద్ నిర్దోషి అని అర్ధమయింది.

కాని శివరాజ్ ఏమయిపోయాడు?

తులసి ఉమ ఏమయిపోయారు?

పత్రికల వాళ్ళు ఎన్నో ఊహాగానాలు రాయటం మొదలెట్టారు.

ప్రజలు రకరకాలుగా చెప్పుకుంటున్నారు.

ఇదో మిష్టరీగా అందరినీ హడలెత్తిస్తోంది.

నగరంలో మాత్రమే కాదు. మొత్తం రాష్ట్రమంతటా!

* * *

"మనిషిగా జీవించటంలో నీవు ఆశించినంత ఆనందం దొరుకుతుందనుకోకు తనని చూచి తాను విర్రవీగటమే కాని మనిషి చేయగలిగింది యేముంది?

మాకు ఎన్నో ఆశలుంటాయి. అవి చాల భ్రాంతుల్ని కలిగిస్తాయి.

వాటిలో పడికొట్టుకుపోతుంటారు. నిజమయిన ఆనందం ఎక్కడో ఉందని పరుగులు తీస్తారు. యే ప్రాణికి అయినా ఆనందమనేది ప్రేమలో ఏకాగ్రతలో దొరుకుతుంది. ఈ ఏకాంతాన్ని మౌనంగా ఎందుకు ఖర్చు చేస్తావు?

నీవు ఎక్కడున్నావో అక్కడే ఆనందాన్ని వెతుక్కో! మిగిలింది అంతా మర్చిపో! అంది నాగభామిని. రెప్పలు వేయకుండా ఆమెవంక చూస్తున్నాడు శివరాజ్.

"ఎందుకలా చూస్తావు. క్రొత్తగా కనిపిస్తున్నానా?"

"ఏ క్షణానికాక్షణం నువ్వు క్రొత్తగానే కన్పిస్తావు."

"క్రొత్తగా జన్మించావు. పాముగా చనిపోయి మనిషిగా పుట్టావు. అందుకే నీకు అంతా క్రొత్తగా కన్పిస్తోంది. కాని ఈ అందమంతా నీవు అనుభవించినది! ఈ మనసు నిన్ను ప్రేమించి అఖండమయిన ఏకాగ్రతలో తాదాత్మ్యాన్ని అనుభవించినదే! నీకు నాకూ ఆత్మ ఒక్కటే!

"మరింక మనమధ్య క్రొత్తదనం అంటూ ఏముంది?" అని ప్రశ్నించింది.

"నేను మనిషిగా జన్మించాను. అదే క్రొత్త!"

"నీ కోసం నేను మనిషిగాకూడ మారగలను. ఈ అవకాశం నాకు లేకపోతే మన ప్రేమకు పర్యవసానం నిర్వేదమే. కాని నేను మనిషిగా మారి నిన్ను ప్రేమిస్తాను. ఇంకా ప్రేమదాహం తీరకపోతే చనిపోయి మనిషిగా జన్మిస్తాను."

"అంతా మనచేతిలో ఉంటుందా?"

"సంకల్పమే అన్నింటికన్నా బలీయమయిన శక్తి! నీవు గుర్తించలేదు కాని నిన్ను ఒక మనిషి చంపేశాడు. ఆ క్షణంలో ఆ మనిషి మీద కసి తీర్చుకునేందుకు నువ్వు మనిషిగా పుట్టాలనుకున్నావు. అందుకే మనిషిగా పుట్టావు."

"ఎవరా మనిషి?" అని ప్రశ్నించాడు శివరాజు.

"ఇప్పుడా వివరాలెందుకు? అతన్ని కసితీరా కాటువేశాను. చంపేశాను."

"అయితే నీ చేతులకు బేడీలు వేయాలి" అన్నాడు శివరాజ్.

"మీ మనుషులు నిర్మించుకున్న చట్టాలు మాకు వర్తించవు ప్రియతమా! నన్ను బంధించాలనుకుంటే ప్రేమతో మాత్రమే బంధించగలవు. జైలుగోడలు మనుషుల కోసం తయారవుతాయి. కాని పాముల్ని బంధించలేవు.

ప్రేమతో నీవు చేతులు చాచినప్పుడు వాటిమధ్య బందీకావాలనే నేను కోరుకుంటాను. కాని నీవు దూరంగానే ఉండిపోతున్నావు?" అంటూ తమకంగా అతని చేతులు తన చుట్టూ త్రిప్పుకుంది నాగభామిని.

ఆ స్పర్శలో ఏదో క్రొత్తదనాన్ని అనుభవించాడు శివరాజ్! ఆమె అందం ఎంత చూచినా తనివి తీరనిదిగా ఉంది. కాని ఆ స్పర్శ మాత్రం తనకి కావాలనిపించేదిగా లేదు. జుగుప్సని కలిగిస్తోంది.

"దూరంగా ఏదో అలజడి అవుతోంది గమనించావా?"

"ఎప్పుడో గమనించాను. అది నా జాతిలక్షణం! నిశ్శబ్దాన్ని, ఏకాగ్రతనీ తప్ప మిగిలిన దాన్ని మేము భరించలేం. నీ కోసం వెదికేందుకు పోలీసు పటాలం వచ్చింది. వారికి చాల చిత్రమయిన అనుభవాలు ఎదురు అయాయి. పారిపోవాలనుకుంటున్నారు." అంటూ కిలకిల నవ్విందామె. డిపార్టుమెంటు తనకోసం వెదుకుతోంది కాబోలు! ఈ విషయం తలుచుకాగానే అతని మనసు నిర్వేదంగా అయింది. వారు ఏమయిపోయానను అనుకుంటున్నారో! తులసి ఎంతగా బాధపడి పోతూఉందో!?

"నీవు నన్ను తీసుకువచ్చి ఎన్నిరోజులు అయింది?" అని ప్రశ్నించాడు.

"ఎన్ని జన్మలయినా నీతోనే కలిసి ఉండాలనిపిస్తుంది నాకు?"

"నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్తావా?"

"నిన్ను తీసుకువచ్చి నాలుగు రోజులు అయింది"

"ఓ గాడ్?? తులసి ఎంతగా బాధపడుతూ ఉందో! ఏమై పోయాననుకుందో."

"ఆమె కన్నా మీ డిపార్టుమెంటు వాళ్ళే ఎక్కువ బాధపడుతున్నారు" నవ్వింది.

"నీకు ఎగతాళిగా ఉందా? మా డిపార్టుమెంటు అంటే ఏమిటను కున్నావు? విజయం సాధించేదాక విడిచిపెట్టరు."

"కాని వాళ్ళు తిరిగిపోతున్నారు. నీ తులసి మాత్రం ఇంకా విడిచి పెట్టకుండా వెతుకుతోంది. వాస్తవానికి పోలీసు

వారికి ఎదురయిన అనుభవాలకన్నా భయంకరమయిన అనుభవాలు ఆమెకు ఎదురు అవుతున్నాయి.

ఈ డిపార్టుమెంటు వారికి ఇది కర్తవ్యం! ఆమెకు కర్తవ్యం మాత్రమే కాదు.

ఇది జీవిత సమస్య! అందుకే ప్రాణాలకు తెగించి పోరాడుతోంది!!"

"తులసి కూడ వచ్చిందా? ఆమెనేం చేయాలనుకుంటున్నావు?"

"నా చెల్లిని భద్రంగా కాపాడుకుంటాను. నీ దగ్గరకు మాత్రం రానివ్వను"

శివరాజ్ మనసులో కలుగుతున్న అనుమానాలు తొందరించగా లేచి నిలబడాలని ప్రయత్నించాడు. కాని పొదరింటిలో అది అసాధ్య మయింది.

అతడు పెద్దగా అరిచి గోలచేయాలని ప్రయత్నించాడు. పోలీసులకి తన ఉనికిని తెలియచేస్తే వారు వచ్చి సాయం అందిస్తారని అతని ఊహ!

ఆమె పరాకున ఉన్నప్పుడు గొంతెత్తి కొండలు పగిలిపోయేలా అరిచాడు.

"ఇనస్పెక్టర్? ఇక్కడ! నేను ఇక్కడున్నాను. ఈ వైపు ఈ పొదరింటిలో ఉన్నాను.

ఇనస్పెక్టర్! ప్లీజ్ కం! అండ్ హెల్ప్ మీ!" అని కాని ఆ మాటలు ఎవరికీ విన్పించలేదు. వారు అతి చేరువలోనే ఉన్నారు. కాని విన్పించలేదు.

శివరాజ్ కి ఈ చిత్రమేమిటో మొదట అర్ధంకాలేదు.

మనిషి పూర్తిగా కంఠస్వరాన్ని పెంచి అరిస్తే కనీసం అరకిలో మీటరు దూరం అయినా విన్పించాలి! కాని కొద్దిమీటర్ల దూరం విన్పించక పోవటం ఏమిటి!

"ఏమిటి ఈమాయ? ఆమె విరగబడి నవ్వుతోంది.

ఈసారి కంఠస్వరాన్ని మరింతగా పెంచి అరిచాడు.

"ఇనస్పెక్టర్! నేను ఇక్కడున్నాను. ఈ పొదరింటిలో! ప్లీజ్ హెల్ప్ మీ!" అని ఈసారి కూడ అతనికి కొండలు

పగిలిపోయేలా అరిచినట్లే వుంది.

కాని ప్రక్కన పోతున్నవారు తలలు త్రిప్పి అయినా చూడలేదు.

ఈ జరుగుతున్నది అంతాకలా? యదార్ధమా? నాగభామిని అలా విరగబడి నవ్వటంలో అర్ధమేమిటి? ఏం జరుగుతోంది అసలు!

మరొక మారు జాగ్రత్తగా తననితాను గమనించుకుంటూ కేక పెట్టాడు.

ఈసారి అతనికి అర్ధమయింది. సంగతి ఏమిటో తెలిసింది.

అతడు మాట్లాడుతున్నప్పుడు అవి మాతలుగానే వెలువడుతున్నట్లు, తనకి అనిపిస్తున్నాయి. కాని బయటకు వెలువడుతోంది. పూత్కారం మాత్రమే!

తాను అరిచిన అరుపులు అన్నీ రెండు మీటర్ల దూరం కూడ వినిపించని హీస్సింగ్ గానే వెలువడ్డాయి. అందుకే వారు తలత్రిప్పి కూడా చూడలేదు.

ఈ మాయావిని వల్ల మాట్లాడే శక్తిపోయింది.

ఇప్పుడు తాను బుసపెట్టగలడు పాములాగా! మనిషిలాగా మాట్లాటం అసాధ్యం! ఇది నాగభామిని వల్ల తానుశాప గ్రస్తుడు అయ్యాడా? ఇంకా శాస్వతంగా ఇలా జీవించవలసిందేనా??

అతడు ఉద్విన్నమయిన ఆలోచనలతో విచలితుడు అయ్యాడు. అనుమానాలు మనసుని తొలిచెయ్యగా కృంగిపోయాడు ఖిన్నడయ్యాడు.

"నాగభామినీ! నన్నెందుకు ఇలా మార్చావు?" ఈసారి అతని మాటలు మాటలు కాకుండా బుసపెట్టినట్లుగానే వచ్చినాయి.

కాని ఆ శబ్ధాల అర్ధాన్ని సునాయాసంగా గ్రహించింది నాగభామిని

"ప్రియతమా! నిన్ను అన్నివిధాలా నా లోకంకి తీసుకుపోయేందుకు ప్రయత్నం చేస్తున్నాను. నా దగ్గిరనించి నా ఇష్టం లేకుండా వెళ్ళి పోగలనని నువ్వు భావించకు అలాంటి ప్రయత్నాలు చేయకు ఫలించవు. నా నుంచి నువ్వు దూరంగా వెళ్ళిపోవాలని ప్రయత్నించినప్పుడు జరిగిపోయిన జరుగనున్న జన్మల విషాదమంతా నన్ను ఆవరిస్తుంది.

నీ ప్రేమ నాకు కావాలి! అందుకే ఈ మాయకల్పించాను. నీవు మాట్లాడగలవు.

కాని ప్రక్కవారికి బుసబుసగానే విన్పిస్తుంది.

ఆ బుసబుసల భాష నాకుమాత్రమే అర్ధమవుతుంది. పోయిన జన్మలో నన్ను ప్రేమగా పెనవేసుకున్నప్పుడు విన్పించిన బుసబుసలు ఇవి! తిరిగి ఎంతో కాలానికి వినగలుగుతున్నాను. ఎందుకు అంత కంగారు?

ఇది నాకు వరం! నీకు శిక్షలా అనిపించవచ్చు.

వరమయినా, శిక్ష అయినా ఈ స్థితి నాదగ్గర ఉన్నంతవరకే! నా పరిధినించి వెళ్ళిపోయావంటే మామూలుగా అయిపోతావు" అంది నాగభామిని.

శివరాజ్ రవ్వంత స్థిమితపడిపోయాడు.

ఆమెను కాదని వెళ్ళిపోగలగటం అసాధ్యమే అనిపించింది. అలౌకిక శక్తుల ముందు మానవశక్తి అల్పమయినది దానిని ఎదిర్చి నిలవటం అసాధ్యమే!

నాగాభామిని నించి వేరుపడి యోగి గురించి తెలుసుకోవటం వీలుపడదు.

అందువల్ల ఆమెతో కలిసి ఆ పని సాధించటం మేలయిన దారి అని నిర్ణయించుకున్నాడు. ఈ ఆలోచన వచ్చిన తరువాత కొంత శాంతి లభించినట్లు అయింది.

కాని ఆమె ఆలోచనలన్నీ మరోవైపు నడుస్తున్నాయి.

"నా నించి నీవు ఆశించేదేమిటి? నా కన్నా శక్తివంతురాలవు నీకు నేనేమి ఇవ్వగలను?" అని ప్రశ్నించాడు శివరాజ్.

దూరంగా ఉండాలనే ఆలోచన క్షణం మరచిపోయి అతడలా ప్రశ్నించటం ఆమెకు ఆనందాన్ని కలిగించింది. అతని బిగియార కౌగలించుకుంది. చెంపలమీద పెదవులానించి తనివితీర ముద్దాడింది. భరించాడు.

"ఇలాగే! నాకు నీ సాన్నిధ్యం కావాలి. నా నించి నువ్వు దూరంగా వెళ్ళ కూడదు. మనం ఎప్పటిలాగే కలిసి పెనవేసుకుపోయి జీవించాలి" అన్నదామె.

"బ్రతికినంతకాలం ఒక మనిషి నీతో కలిసిఉండటం సాధ్యమేనా?" ఆమె ముఖంలో విషాదచ్ఛాయలు కన్పించాయి. ఎంతటి శక్తివంతురాలు అయినా విధి నిర్ణయించినదాన్ని ఎలా కాదని అనగలదు.

"వీలయినంతకాలం కనీసం కొంతకాలమయినా!" అందామె.

"ఆ తరువాత?" శివరాజ్ ప్రశ్నించాడు.

"నేను ప్రాణత్యాగం చేస్తాను. ప్రేమలేని జీవితం వృధా! నీకోసం మనిషిగా జన్మ ఎత్తుతాను ఎంతకాలానికయినా సరే!"

"మనుషులకు కొన్ని లక్షణాలుంటాయి. అప్పటికి నేను వృద్ధుని అయిపోతాను. నువ్వు బాలికగా ఉంటావు. మనమధ్య ప్రేమహాస్యాస్పదం అవుతుంది"

ఆమె కన్నులు నీటితో నిండాయి.

"ప్రియతమా! ఈ జీవితంలో నాకు మిగిలి ఉన్నది కొద్దికాలమే అనిపిస్తోంది మిగిలిఉన్న ఈ కొద్దికాలం అసాధ్యమయిన వాటిని తలుచుకుని దుఃఖించేందుకు కాదు. సాధ్యమయినంత జీవితానందాన్ని జుర్రు కోవాటానికి!"

"అందుకోసం నేను త్యాగం చేయాలంటావా? ఆ జన్మలో నేను నీకు ఆనందాన్ని యిచ్చాను. ఈ జన్మలో నీవు నాకు విషాదాన్ని పంచుతున్నావు"

"ఆనంద విషాదాలు అనుకోవడంలో ఉంటాయి. ఆనాడు ఆనందాన్నిచ్చిన ఈ కౌగలింతలు ఈనాడు విషాదాన్ని ఎందుకు ఇస్తున్నాయి ఒకవేళ ఇష్టం లేకపోయినా నేను నిన్ను విడిచి పెట్టను.

ఇది జంతు లక్షణం అని నీవు అనుకోవచ్చు!

ఇది మానవత్వం కాదు అని నీకు అనిపించవచ్చు! మానవత్వంతో ఆలోచించకపోవటం మనిషికి తలవొంపు కాని నాకుమాత్రం కాదు"

"నేను ఎలాగయినా బయట పడగలను"

"అది సాధ్యమనుకుంటున్నావా?"

"నాకు సాధ్యం కాదని అర్థమయింది ఎవరో ఒకరు రక్షిస్తారు" నాగభామిని అతని మాటలువిని నవ్వింది. తిరస్కరించేలా పెదవులు విరిచింది.

"నిన్ను నా చెరనించి బయటకు తీసుకుపోవాలని ప్రయత్నించిన వారంతా అతి నిరాశతో తిరిగి వెళ్ళిపోతున్నారు. ఆ పోయేవారు కాక మరో ఇద్దరున్నారు. వారు ఎలాంటి స్థితిలో ఉన్నారో చూస్తావా?"

"ఎవరా ఇద్దరు?" అని అడిగాడు శివరాజ్.

"నీ అర్ధాంగి తులసి నిన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఆమె వెంట మరో యువతి ఉమ! వీరిద్దరూ ప్రాణాలకు తెగించారు. మీ డిపార్టు మెంటు అధికారుల కన్నా గొప్ప సాహసంచేశారు. ప్రస్తుతం గుహలో తిరుగుతున్నారు. యోగి నించి, నానించి నిన్ను వేరుచేయాలనుకుంటున్నారు.

కాని ఎంత అసాధ్యమయ్యైన విషయమో వారికి అర్థంకాలేదు. ఒకసారి వారిస్థితి ఏమిటో చూస్తావా? ఆ తరువాత నా నించి నీవు బయటపడటం ఎందుకు ఎలా అసాధ్యమో నీవు గ్రహిస్తావు" అంది నాగభామిని.

వారిద్దరికి చేరువగా వెళ్ళే అవకాశం వస్తున్నందుకు చాల సంతోషించాడు శివరాజ్ "అలాగే!" అన్నాడు.

తులసి తనకోసం వచ్చి గుహలో అలాంటి ప్రమాదాలకు ఎదుర్కోవటం తలుచుకుంటే అతనికి గుండెలు జలదరించాయి.

ఆమె ముందుకు నడవటం ప్రారంభించింది. అతను అనుసరించాడు.

అలా కొండ చరియలమీద స్వేచ్ఛగా నడుస్తుంటే అతనికి ఆనందంగా అనిపించింది. ఆమెనించి బయటపడే అవకాశం ఉందనిపించింది.

వారిద్దరూ కొంతదూరం నడిచి మేడలా ఎదిగిపోయి గుహముఖాన్ని మూసేస్తున్న పుట్టమీదుగా నడిచారు మెలికలు తిరిగే నడకతో గుహలోపలకు ప్రవేశించిందామె. అడుగులో అడుగువేస్తున్నాడు.

చీకటిగా ఉన్నా తడుముకోకుండా వెడుతోందామె! కాలి అందెల చప్పుడు ఆధారంచేసుకొని అనుసరిస్తున్నాడు శివరాజ్.

వారు చాలాదూరం నడిచారు. పోనుపోను క్రమంగా దారి వెడల్పు అయింది. కొద్దిగా కాంతి ప్రసరిస్తున్నట్లు అనిపించింది.

మరికొంత ముందుకుపోయాక పైన కప్పు కన్పించలేదు. పూర్తిగా కాంతివంతంగా ఉన్నదాచోటు! ఒక పెద్ద తటాకము దాని గట్టుమీద పెద్ద మర్రిచెట్టు కన్పించాయి. మర్రిచెట్టు ఊడలు దిగిపోయి ఉంది.

దాని మొదలుకు ఆనుకుని పెద్ద శిలావేదిక! దానిమీద పద్మాసనం వేసుకుని కన్పించాడు జటాజూటదారి అయినయోగి. ఆయన కన్నులుముకుళించి ఉన్నాయి. ముఖం కాంతవంతంగా ఉంది. నిశ్చలమయిన తటాకం లోని నీటికిలాగ ఆయన చలనరహితంగా కన్పించాడు.

అతని ఎదుట తులసి, ఉమ స్పృహలేని స్థితిలో పడి ఉన్నారు. వారి చుట్టూ ఎన్నో సర్పాలు తిరుగుతున్నాయి. వారి చేతులమీదుగా కాళ్ళ మీదుగా పారాడుతున్నాయి. పడగలు విప్పి ఆడుతున్నాయి.

అచేతనమయిన శరీరాలను అక్కడున్న శిలలమధ్య శిలలుగా భావించి అవి తిరుగుతున్నాయి. శివరాజ్ నిశ్చేష్టుడు అయ్యాడు.

ముందు చూడగానే వారు సజీవంగా ఉన్నారని అనిపించలేదు.

అతని మెడచుట్టూ చేతులువేసింది నాగభామిని. చెంపమీద చెంపఆనించింది.

ఎదురుగా కన్పించే దృశ్యం శివరాజ్ కి భయాన్ని జుగుప్సని కలిగించింది.

"ప్రియతమా! చూడు! మానవప్రయత్నం ఎంత అల్పమయినదో! నా అనుమతి అయితే అక్కడున్న అనేక సర్పాలలో ఏ ఒక్కటి అయినాచాలు వారి ఇద్దరినీ చంపటానికి! యోగి తపస్సు చాలించినప్పుడు మొదటిసారి కన్నులు విప్పగానే ఎవరూ ఉండకూడదు.

అలా ఉంటే వారికి మరణం తప్పదు. ఆయన పాముల విషాన్ని మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. ఆ తరువాత యోగముద్ర పడతారు. ఆయన యోగంలో ఉండగా ఆ విషమంతా జీర్ణమయిపోవాలి.

జీర్ణమయిపోగానే మిగిలిన విషం ఆయన కనులు విప్పినప్పుడు వాయువుగా నాసికా రంధ్రాలనించి వెలుపలకు వస్తుంది. అది సోకినావారు తక్షణమే మరణిస్తారు. ఈ రహస్యం తెలియక కొందరు ఆయన వెంట పడతారు. అలా వచ్చిన కళ్యాణి ఆనాడు శ్మశానంలో అమాయికంగా కన్నులు మూసింది. వీరుకూడా అలాగే యోగి విషపూరితమయిన నిస్వాసానికి బలి అయి చనిపోయేవారు! కాని విధి వారిని రక్షించింది.

ఆయన ఎదురుగాలేకుండా వారు ముందుగానే పాములను చూచి భయపడి క్రిందపడి స్పృహకోల్పోయారు.

ఈ పరిస్థితులను మానవమాత్రులయినవారు ఎదుర్కోలేరని ఒప్పుకుంటావా? నిన్ను ఎవరో రక్షిస్తారాని ఆశలు పెట్టుకున్నావు.

ఆ భ్రాంతినించి నిన్ను బయటపడవెయ్యాలని ఇక్కడకు తీసుకువచ్చి ఈ దృశ్యాన్ని చూపించాను. ఇప్పటికయినా నీ భ్రాంతి తొలగిపోయిందా?" అని ప్రశ్నించింది నాగభామిని.

ముందు తులసిని, ఉమని రక్షించుకోవాలి! ఆ తరువాత తనని తాను రక్షించుకోవాలి! ఆమె చెప్పినదానికి తల ఊపడం తప్ప మరోదారి లేదని అతడు తీర్మానించుకున్నాడు.

## 15

చెంపను చేతులతో నిమిరి ఆమె మెడమీద పెదవులు ఆనించాడు.

ప్రేయసీ! మనిషి ఎంత సాహసవంతుదయినా కావచ్చు! కాని అతని శక్తికి పరిమితులున్నాయి. నీ అతీతమయిన శక్తుల ముందు గెలవటం మనుషులుగా జన్మించిన వారికి సాధ్యపడదు.

నీవు శక్తివంతురాలవే! కాని నిర్దోషులను శిక్షించడం తగదు.

నీమీద నాకు ప్రేమలేదని కాదు. మన ప్రేమ ప్రకృతి విరుద్ధమైనది.

ప్రేమ అనేది మన ఇద్దరికీ మాత్రమే సంబంధించినది. దీనిలో మరొకరి ప్రమేయం ఉండరాదని నా అభిప్రాయం" అన్నాడు.

అతని చూపులు కంఠస్వరం ఆమెకు అనుకూలంగా మారాయి.

"నేను వారిని విడిచిపెట్టేస్తాను" అంది నాగభామిని.

"వారినేకాదు. నన్నుకూడా వెళ్ళిపోనివ్వు"

"మనుషుల బుద్ధిలో ఏకాగ్రత ఉండదు. వారికి చపల బుద్దులుంటాయి"

యోగిలో నిమగ్నత తగ్గిపోయి చైతన్యం వచ్చే సూచనలు ముఖంలో కన్పిస్తున్నాయి. అతడు కన్నులు తెరిచాక

నీవింక వెళ్ళిపోయి అతని జటాజూటంలో ఉండాలి! తిరిగి యోగి కన్నులు ముకుళించి యోగి నిద్రలోకి జారినప్పుడే మనిషిరూపు మార్చుకోగలుగుతావు.

ఈ సమయమంతా నేను ఒంటరిని.

ఒంటరితనం నిన్ను ఎలా బాధిస్తుందో నన్నుకూడా అలానే బాధిస్తుంది. కనుక నేను వారితో వెళ్ళిపోతాను. యోగి తిరిగి కన్నులు మూసే సమయానికి ఇక్కడుంటాను" అన్నాడు.

ఆమె అతనివైపు ముచ్చట తీర్చుకుంటున్నట్లుగా చూచింది.

"నీవు చెప్పేదంతా యదార్ధమేనంటావా ప్రియతమా?" అంది.

"మోసం చేయాలనే ఆలోచన నాకు ఇప్పుడులేదు"

"ఇంటికి పోయాక కలగవచ్చు కదా?" అంటూ ఆమె కొంటెగా చూచింది.

అతడు చెప్పలేకపోయాడు. మౌనంగా ఉండిపోయాడు.

"నీవు నాతో నోరువిప్పి మనసారా మాట్లాడిన క్షణాలివ్వి! నిన్ను కాదనలేను. నీ కోరిక తీర్చుతాను. నిజంగానే యోగి కన్నులు విప్పే సమయం అయింది. వారిని తీసుకుని వెళ్ళిపోయేందుకు నీకు అవకాశం కల్పించుతున్నాను" అన్నదామె.

ఒకరు తులసిని, మరొకరు ఉమను తీసుకుని వెలుపలకు వచ్చారు. పుట్ట దాటించి వారి ముఖాలమీద నీరు చిలికించింది నాగభామిని.

వారికి తెలివి వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి.

ఆమెలోకూడా మార్పురావటం కన్పించింది" యోగి కన్నులు విప్పే సమయం ఆసన్నమైంది. నాకింకా సెలవు" మాట నిలబెట్టుకుంటావా?"

నీ కిచ్చినమాట నిలబెట్టుకుంటాను. మళ్ళీ నీ దగ్గరకు వస్తాను. అయితే మిత్రుడుగా రావాలో, శత్రువుగా రావాలో అది నేనే నిర్ణయించుకుంటాను. నీకిచ్చిన మాటప్రకారం రావటమే నా బాధ్యత" అన్నాడు.

ఆమె విషాద పూర్ణంగా నవ్వింది.

"నువ్వు ఎలా వచ్చినా నాకు సంతోషమే! నిన్ను ఎలా మలుచుకోవాలో నాకు తెలుసు! ఆనందమైనా, విషాదమైనా- స్నేహమైనా, శత్రుత్వ మైనా నీతో పంచుకోవాలని ఉంటుంది నాకు.

ప్రియతమా! ప్రేమపిపాసానాన్ని నీద్వారానే తీర్చుకుంటాను. రాకపోయావనుకో! మనిషివికదా!? అబద్దం ఆడకూడదని ఏముంది? నేనే వచ్చి నిను తీసుకువస్తాను. కాని నాకు అంతపని కల్పించకు.

నా జీవితంలో మిగిలి ఉన్న కాలాన్ని నీ మధుర స్పర్శలో నీ కౌగిలిలో గడిపే అవకాశాన్ని నాకు కల్పించు" అంటూ ఉండగానే యోగి కన్నులు విప్పిన సూచనలు కన్పించాయి ఆమె శివరాజ్ చూస్తూ ఉండగానే పాముగా మారిపోయింది. గుహవైపుగా బయలుదేరి వెళ్ళిపోయింది.

అతడు సానుభూతి నిండిన చూపులతో ఆవైపే చూచాడు. ప్రేమకు ఆమె నిర్వచనం! త్యాగానికి మరోపేరు! కాని ఆమె ఒక జంతుప్రాణిది!

జంతువుతో మానవ ప్రాణికి సహజీవనం సాధ్యమేనా?

ఆమె మనసులోంచి పొంగులు వారుతున్న ప్రేమకు పర్యవసానం ఏమిటి??

ముందుగా ఉమ కళ్ళు విప్పింది. తన ఎదుట కన్పించే దృశ్యాలను నమ్మలేక రెప్పలు అల్లార్చి మళ్ళీ చూచింది. శివరాజ్ అందంగా నవ్వాడు.

"నేనెక్కడున్నాను!" అంది హీనమయిన కంఠ స్వరంతో.

"చాల క్షేమకరమయిన చోటునే ఉన్నావు!" నవ్వుతూ బదులుచెప్పాడు.

ఆమె లేచి నిలబడేందుకు ప్రయత్నించింది. చేయి ఆసరా యిచ్చాడు.

వారిద్దరూ ఎంతో శ్రమపడి తులసిని హాస్పిటల్ కి చేర్పించారు.

ఆ సమయానికి నగరమంతా గగ్గోలుగా ఉంది.

పోలీసులు ఈ వార్తలు అందుకుని హుటాహుటిన వచ్చారు. తులసి తల్లిని తీసుకు వచ్చారు. ఆమె కన్నీరు మున్నీరుగా

విలపించింది. తులసికి తెలివి తెప్పించాలని డాక్టర్లు చేసిన ప్రయత్నం సఫలమయింది.

ఆమె మాట్లాడుతోంది! శివరాజ్ చేతిని తన చేతిలోకి తీసుకుంది.

ఎంతో మాట్లాడాలని ఉబలాట పడింది!

కాని డాక్టర్ లు విశ్రాంతి అవసరమని చెప్పి మాట్లాడనీయలేదు.

హాస్పిటల్ బయట వారిని చూచేందుకు జనం పెద్ద సంఖ్యలో గుమిగూడారు. పత్రికల వాళ్ళు విశేషాలు తెలుసుకునేందుకు లోపలకు రావాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు.

తులసికి తెలివి వచ్చాక అధికారులతో కలిసి వెళ్ళిపోయాడు శివరాజ్!

నాగభామిని సాహచర్యంలో గడిపాక అతనికి చాల విషయాలు తెలిసాయి. ఆమె నించి బయట పడటం ఎలాగో అతనికి అర్ధమయింది. కాని అందుకు చాల ప్రయత్నం కావాలి! ఆమె ప్రేమించటంలో తప్పులేదు.

చెబుతున్న కథ యదార్ధమే అనటానికి రుజువులు కూడా ఉన్నాయి.

కాని జంతువులకూ మనుషులకు, మధ్య ప్రేమ అసంబద్ధం! అసాధ్యం!!

ఈ విషయం ఆమె తెలుసుకుంటే ఆరాధ్యురాలు అవుతుంది!

ఒక వేళ వ్యతిరేక దిశలో ప్రయత్నించి ఆమెను నిలువరించాలని కాని చంపెయాలని కాని చూస్తే యోగి ఎలా ఎదుర్కొంటాడు అనే విషయం తనకింకా అర్ధం కాలేదు.. ఈ సమస్యలోంచి బయట పడటానికి ఎంత మూల్యం చెల్లించాల్సి వస్తుందో!? ఎంతయినా ముందుకు పోవటమే!!

అధికారు లందరి ముందు అతడు తన కృతనిశ్చయాన్ని వెల్లడించాడు.

కొందరు అతనికి అనుకూలంగా వాదించారు. మరికొందరు వ్యతిరేకంగా వాదించారు. ఆమె దగ్గర అనేక శక్తులు ఉన్నాయని నిరూపణ అయ్యాక ఇంకా ఎదుర్కోవాలని చూడడం ఏమిటని వారి సందేహం!

నగరంలో కొందరు పెద్దలు వారికి మద్దతు ప్రకటించారు.

ఆమె తనకు అలా వెంటబడటం ఒకవేళ తిరిగి రాకపోతే తానే వస్తానని హెచ్చరించటం వల్ల ఆమె దగ్గరకు వెళ్ళి తీరాలి! అయితే మిత్రుడుగా వెళ్ళాలా? శత్రువుగా వెళ్ళాలా అనే అంశం మీదే చర్చలు జరిగాయి. చాల ఆసక్తి కరమయిన తర్జన భర్జనలు కొనసాగాయి.

ఇంకా ఆమె గురించి పట్టించు కోకుండా వదిలేయటం శివరాజ్ కి బలమయిన రక్షణ ఏర్పాటు చేయటం మంచిదని వాదించారు.

కాని శివరాజ్ అందుకు అంగీకరించలేదు.

సమస్యని అలాగే ఉంచి తప్పుకు పోవాలని ప్రయత్నించి నందువల్ల ఒరిగేదేమీ ఉండదు. నాగభామిని వ్యవహారం ఒక్కటే కాక యోగి విషయం కూడ తేల్చి వేయాలని అతని ఉద్దేశ్యం!

"నేను ఒంటరిగా వెడతాను" అని ప్రకటించాడు.

అలా వెళ్ళటం వల్ల సమస్య తీరటానికి ఎంతకాలం పడుతుందో తెలియదు. అది ఆత్మహత్యా సదృశ్యమే! ఈ వాస్తవాలను అరిగించుకోలేని వారు ఒక ఫాంటసీగా భావించారు. ఒక ఆఫీసర్ అన్నాడు.

"ఇదంతా ఒక కట్టుకథలా ఫాంటసీలా అనిపిస్తోంది. ఒకవేళ అతనికి శక్తులు మానవ జీవితంలో ప్రమేయాన్ని కలిగి ఉంది అనుకుందాం.

అలాంటప్పుడు ఆ శక్తి ఏమిటో అందరి ముందు నిరూపణ కావాలి.

దానిని వ్యక్తిగత స్థాయిలో పరిష్కరించాలని చూడటం ఏమిటి? ఎలా పరిష్కరిస్తారు. ఒక పోలీసు అధికారి ప్రమదాలలోకి తిరిగి రావాలని కోరిందామె! రాకపోతే తానే వస్తానని బెదిరించింది.

దీనిని పోలీసు భాషలో బ్లాక్ మెయిల్ అంటారు!

అలాంటి దానిమీద చర్య తీసుకోవాలి కాని లొంగి పోవటం ఏమిటి?" అన్నాడు.

"ఇది వ్యక్తిగత సమస్య కాదు. మొత్తం డిపార్టుమెంట్ కి సంబంధించిన సమస్య! అసాధారణ మయిన ఎన్నడూ వినని కారణాలకోసం ఒక అధికారిని వదులుకోవటమా? అలా జరగటానికి వీలులేదు.

వ్యక్తిగత సమస్య అయినా కూడా పోలీసులే సమస్యని పరిష్కరించాలని తీర్మానించారు. అది ఏ శక్తి అయినా ప్రజాశక్తి ముందు తలొంచాల్సిందే! శివరాజ్ కి పెద్ద ఎత్తున రక్షణ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

అతనిని రక్షించటం తిరిగి క్షుద్రమయిన శక్తులేవి అతని జోలికి రాకుండా చూడటం అనేవి పోలీసులు ఛాలెంజ్ గా తీసుకున్నారు.

అప్పటికప్పుడు ఏర్పాట్లు ప్రారంభమయినాయి.

ఈ నిర్ణయాన్ని విమర్శించే వారికోసం మాంత్రికులు తాంత్రికులను భారీగా రప్పించి అవుసరమని భావించిన ప్రతిచోట నియమించారు. అధికారులు అత్యవసర సమావేశాలను ఏర్పాటు చేసి ఎదురు అయే సమస్యలన్నింటిని పరిశీలించి తగిన పరిష్కారాలు సూచించారు.

ఎన్నెన్నో తరహాల ప్రమాదాలను ఎదుర్కొనే పథకాలు సిద్ధం చేశారు.

యూనివర్సిటీ విద్యార్థిను లందరినీ ఇంటర్వ్యూలు చేసి లింకుల కారణం చెప్పిన కథని కూడ బయటకు లాగారు. శివరాజ్ వచ్చాక అహ్మద్ నిర్దోషి అని తేలిపోయింది అతడు ప్రథమం నించి డిపార్టు మెంట్ కి ఏదో ఒక కారణంతో సహకరిస్తూ వచ్చాడు. అతని మీద పోలీసులకన్న అనుమానాలను తొలగించాడు.

ఒక ఆఫీసర్ భవిష్యత్తుకు అనేకమంది ప్రాణాలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి మనసుకునూ భయ సందేహాలను రేకెత్తించుచున్న నాగభామిని, యోగి మిస్టరీని బయట పెట్టితీరాలని వారు తీర్మానించారు. శివరాజ్ బదులుగా ఈ వ్యవహార మంతటిని చూచేందుకు పరిశోధన జరిగి తీరాలని వాదించిన ఆఫీసర్ నే నియమించాడు.

అతనికి అలౌకిక శక్తులమీద విశ్వాసం లేదు.

ఈ జరుగుతున్నదంతా కొందరు వ్యక్తులు చేస్తున్న కుట్ర అయి వుండాలని అతని అభిప్రాయం. లేదా పాల్గొంటున్న వారి మానసిక బలహీనత అయినా అయి ఉండాలని అతడు భావించాడు.

పాము మనిషిగా మారుట అనే అంశాన్ని అతడు కొట్టిపారేశాడు.

పత్రికలవారిని అతడు మొదటిసారిగా సమావేశ పరిచాడు.

"ఎప్పుడో పురాతన కాలంలో సైన్సు అభివృద్ధి చెందని రోజుల్లో పాములు మనుషులు అవుతారనే విషయాన్ని

ప్రజలు నమ్మేవారు. ఇప్పుడలాంటి ఆలోచనలు చేయటం అర్థం రహితం! ఇదంతా మనుషులు కొందరు తెరచాటునించి నడుపుతున్న నాటకం అయి వుండాలి, లేదంటే ఈ సమస్యలో వున్న వ్యక్తుల మానసిక బలహీనత అయినా అయి వుండాలి! ఏది ఏమయినా ఈ ప్రాబ్లంని ఒక బ్లాక్ మెయిలింగ్ కేసుగా తీసుకుని మేం పని చేస్తాం!" అని ప్రకటించాడు.

"అయితే మరి మంత్ర వేత్తలకు ఎందుకు సహకరించారు?"

ఏ సమస్య అయినా జయాపజయాలు ఆ పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయి.

పెద్ద ఎత్తున యేం యంత్రాంగాన్ని సమీకరించినాము కృషి ఫలితం ఎంత అనే విషయం నిర్ణయించటానికి ముందుగానే వీలుకాదు.

ఒక వేళ పరాజయం ఎదురు అయితే మేము తప్పు చేశామని ఎవరయినా వ్రేలెత్తి చూపటానికి అవకాశ ముంటుంది. మనలోనే కొందరు ఇలాంటి వాటిని నమ్మేవారున్నారు. అటువంటి వారికి సంతృప్తి కలిగించటానికే మంత్రవేత్తలను సమీకరించటం జరిగింది!

ఇప్పుడు పోలీసులు పాముల మీద యజ్ఞం ప్రకటించారు. కాబట్టి సాంకేతికంగా వాటి గురించి తెలిసినవారు కొందరు కావాలి! వారి మంత్ర తంత్రాలు మాకు ఉపయోగ పడకపోయినా పాముల గురించి వారికి తెలిసిన విధానం మాకు ఏదో విధంగా ఉపయోగ పడవచ్చు!" అన్నాడు అధికారి.

"చాల పెద్ద ఎత్తున సమీకరించా మంటున్నారు మొత్తం ఎంతమంది ఈ ఆపరేషన్ లో పాల్గొంటున్నారు?" అని ప్రశ్నించాడు ఒక విలేకరి!

"ఆ వివరాలు నేను ముందుగా ఇవ్వము కదా. ఇదివరకు ఎన్నడూ లేనంత భారీ ఎత్తుగా మేము ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలను కుంటున్నాము."

"శివరాజ్ ఎందుకు పాల్గొనటల్లేదు"

శత్రువులకు టార్గెట్ అతడే! భద్రత రీత్యా అతన్ని కదలనివ్వం. బలీయమయిన రక్షణ వలయంలో వుంటాడు! ఒకవేళ తిరిగి రాకపోతే అతన్ని తను వచ్చి తీసుకు వెడతానని శత్రువు ప్రతిజ్ఞ చేసింది.

అందుకోసమయినా ఆమె ప్రయత్నించాలి!

మేము వెళ్ళే ప్రయత్నం విఫలమయినా ఆమె వచ్చినప్పుడు పట్టుకుంటారు.

"అలౌకిక శక్తులను పోలీసు బలగాలు ఎదుర్కోగలవంటారా?"

"మీరు ఉపయోగించిన అలౌకిక శక్తి అనే మాట నేను నమ్మను. అది ఉత్తట్రాష్"

"సహజంగా పోలీసులు మీ కార్యక్రమం పూర్తి అయిందాకా వివరాలు ఇవ్వరు"

"ఇప్పుడు కూడ నేను మీకు వివరాలు ఇవ్వలేదు"

"అయితే మరి ఈ సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారు?"

"మేము యీ విషయాన్ని పరిశీలించటానికి పరిష్కరించటానికి ప్రత్యేకమయిన చర్యలు తీసుకుంటూన్నాం అని తెలియ చెప్పటానికి! ప్రజలు ధైర్యాన్ని కోల్పోవలసిన అవసరం లేదని చెప్పేందుకే! ఎవరయినా ఆ సంబంధమయిన సమాచారం అందించేందుకు ముందుకు రావటానికి వీలుగా ఉంటుందని!"

"మీరు ఎంతకాలంలో ఈ సమస్యని పరిష్కరించగలమనుకుంటున్నారు"

"శత్రువులు సమీపంలోనే ఉన్నారు కాబట్టి ఎక్కువకాలం పట్టకపోవచ్చు"

అంటూ వారి సమావేశాన్ని ముగించాడు అధికారి.

క్రింది అధికారులని, శివరాజ్ ని సంప్రదించి అవుసరమయే ఎక్విప్ మెంట్ అంతా లిస్టు తయారుచేశారు. అప్పటికే బలగాలు బయలుదేరి స్పాట్ కి వెళ్ళాయి.

ఒకబలీయమైన సైనిక చర్య ఎలా ఉంటుందో అలాంటి ఏర్పాట్లు చేశాడు అధికారి! ఇది ప్రజల మనోధైర్యానికి, పోలీసుల శక్తికి సంబంధించిన విషయంగా పరిగణలోకి తీసుకున్నారు.

బయలు దేరేందుకు సరిఅయిన ముహూర్తం నిర్ణయించారు.

ప్రత్యేక ఆయుధాలు ఉపయోగించటంలో ప్రత్యేకమయిన శిక్షణ పొందిన కమాండోలను వెంటపెట్టుకుని స్పాట్ కి వచ్చాడు అధికారి! ఆపరేషన్ ఒక కొండగుహలో జరగాల్సి ఉంది కాబట్టి అసాధారణమైన చర్య అది.

శత్రువులకి అలౌకిక శక్తులున్నాయని భావించుతున్నారు కాబట్టి కొందరికి గుండెలు పీచు పీచు మంటున్నాయి. గుహలోనికి చొచ్చుకుపోవటంలో చాల సాంకేతిక పరమయిన సమస్యలున్నాయి.

వాటిని తన దగ్గర తెచ్చుకున్న సాధన సంపత్తితో అధిగమించాలని అధికారి అభిప్రాయం. ముందు ప్రమాదమయిన వస్తువులుకాని ప్రాణులుకాని ఉన్నప్పుడు రింగ్ యిచ్చే ఒక ఎలక్ట్రానిక్ పరికరాన్ని కూడ తెచ్చారు.

అధికారి కొండమీదికి చేరేముందుగా అందరిని సమావేశపరిచాడు.

"ఇది మనకు ప్రతిష్ఠాకరమయిన పరిశోధన! నేరస్తులను పట్టుకోవటం మనటార్గెట్! ఒకవేళ మనకు ఎన్నడూ ఎదురుకాని విచిత్ర పరిస్థితులు ఎదురు కావచ్చు. అవి అలౌకిక శక్తులు అని భ్రాంతిని కలిగించవచ్చు.

కాని ఏ ఒక్కరూ వెనకడుగు వేయకండి! అందరికన్నా ముందునేనుంటాను! ప్రమాదం అంటూ జరిగితే ముందు నాకే జరగాలి.

ఇది పాములకు పోలీసులకు, మధ్య పోరాటం.

పోలీసు చరిత్రలో ఒక అద్భుత ఘట్టం. ఈ పోరాటంలో మన విజయం సాధించి ఉజ్వలమయిన మన అధ్యాయాన్ని ప్రారంభించాలి. అది మానవుల దుష్ట తంత్రమయినా, దైవిక శక్తి అయినా, అలౌకిక శక్తి అయినా ఏదయినా కావచ్చు. అది సమాజానికి భయోత్పాతాన్ని కలిగించి ప్రజలకు చెరుపు చేస్తుంటే పోలీసులుగా ఎదుర్కోవటం మన బాధ్యత.

నైతికంగా ప్రజలకోసం మనం చేసేపోరాటంలో అధర్మంలేదు.

ధర్మం మనపక్షాన ఉంది కాబట్టి విజయం కూడ మన పక్షాన్నే ఉంటుంది.

ఈ విశ్వాసంతో ముందుకు కదలండి.

మీరంతా ఇప్పుడు పోలీసువారి ప్రజాసేవా కార్యక్రమంలో మహోజ్వలమయిన మరో చరిత్రను రచించబోతున్నారు. ఈ వినూత్న చరిత్రలో మీతో ప్రతిఒక్కరూ ప్రధాన పాత్రధారులే.

సమాజ వ్యతిరేక శక్తి అది ఏదయినాసరే దాన్ని ఎదుర్కోవటంలో పోలీసులు సఫలతను సాధిస్తారని ప్రజలు నమ్మాలి. అందుకోసం అడ్డునిలిచిన వాటినన్నింటిని కూల్చుకుంటూ ముందుకు పదండి!" అని తన బలగాలను ఉత్తేజపరిచాడు అధికారి. ప్రజాసేవ కోసం విధ్వంస శక్తుల్ని ఎదుర్కోవటంకోసం నైతికంగానే చేస్తున్న పోలీసుల త్యాగం మహోన్నతమయినది అన్న భావనవారిలో ప్రతి ఒక్కరికి కలిగించాడు.

వారంతా ముందు మానసికంగా త్యాగాలు చేసేందుకు సంసిద్ధులు అయిపోయారు. ఒక గొప్పపని చేస్తున్నామనే స్ఫూర్తి వారిలో కలిగింది.

"సార్ గుహలోకి వెళ్ళేందుకు పెద్ద పుట్ట అడ్డుగా ఉంది యింత మంది ఒకేసారి లోనికి వెళ్ళేందుకు వీలుకాదు. అది పెద్దమేడలాగ ఎదిగిపోయి వుంది. దాని మీదుగా వెళ్ళాలంటే చాల సమయం పట్టవచ్చు.

ముందు గుహముఖాన్ని ఓపెన్ చేయాలి. అప్పుడు లోపలకు గాలి వెలుతురు కూడ ధారాళంగా వస్తాయి" అన్నాడు ఒక జూనియర్.

"ఆ పుట్టను చిన్న భాగమయినా మిగలకుండా త్రవ్వి పోయండి. అవుసరమయితే రాళ్ళు అడ్డు వచ్చాయనుకుంటే డైనమేట్స్ పెట్టి పేల్చండి. అరగంటలో ఈ కార్యక్రమం పూర్తి కావాలి" అని ఆదేశించాడు అధికారి.

"సార్! లోపల వందలు వేల సంఖ్యలో పాములుంటాయంటున్నారు సార్."

"కాటన్ వేష్టువేసి పెట్రోలు పోసినాగులన్నింటిని తగలపెట్టండి కనిపించిన నాగు కనిపించినట్లు దహనమైపోవాలి! ఒక్కటి కూడ మిగలకూడదు" ఆజ్ఞాపించాడు.

"సార్! మాకు యింట్లో నాగులు కులదైవాలు! మేము చంపకూడదు సార్!"

"ఈ కార్యక్రమం అయిపోయిందాకా నువ్వు ఒక ప్రక్కన నిలబడు."

"సార్! మా ఆవిడ కడుపుతో ఉందిసార్! నాగదోషం సార్!"

"అలాంటి పిరికిపందలు, పిచ్చివాళ్ళు దూరంగా నిలబడండి."

కొంతమంది స్పేర్ అయిపోయారు. మిగిలినవారు విజృంభించి పుట్టని త్రవ్వి పోయటం మొదలెట్టారు. అది పెద్ద మేడలా ఎదిగిపోయిన పుట్ట. వారు మట్టిని పెకలించి అవుసరం ఉన్నా లేకపోయినా కాటన్ వేష్టువేసి పెట్రోలు పోసి నిప్పు అంటించటం మొదలుపెట్టారు. ఆ వేడికి కొన్ని పాములు ఉడికి గుజ్జు గుజ్జులాగా అయిపోయాయి. తప్పించుకు పోయేందుకు అవకాశం ఉన్నవన్నీ తప్పించుకున్నాయి.

ఎదురు తిరిగిన వాటికి పెట్రోలు కొట్టి నిప్పంటించారు. లాఠిల్తో చావ బాదారు. నానా రకాలుగా వాటిని లేకుండా చేయటం మొదలెట్టారు.

కొంతమంది మట్టని ఎత్తిపోయటం మిగిలినవారు వెతికి వెతికి పాముల్ని చంపటం.

"మహా నాగులనించి బాలనాగు పిల్లనాగు చివరకు పాము గ్రుడ్లు కన్పించినా విడిచి పెట్టవద్దు." ప్రారంభ విజయానికి అతనిలో స్పిరిట్ మరింత అయింది.

పోలీసుల స్పిరిట్ ముందు పాములు విధ్వంసమయినాయి!

పుట్ట అంతా నేలమట్టం అయిపోయింది.

పాములన్నీ శవాల గుట్టలు అయినాయి.

పోలీసులు విజయోత్సాహంతో ఉరకలు పెట్టారు.

గుహలో ప్రవేశించేందుకు చాల తెలివి అయిన ఒక ఆలోచన చేశాడు అధికారి. ప్రతి పది మందిలో ఒకరి దగ్గర చాల శక్తివంతమైన సెర్చిలైటు ఉండేలా ఏర్పాటు చేశాడు. బయట కొన్ని వందలమంది పోలీసులు.

లోపలికి రావలసిన వారందరిని మూడు వరుసలలో నిలబెట్టాడు. ముందు ఒకరు పెద్ద రోప్ ని ఒక అంచు పట్టుకుని లోపలకు పోవాలి.

మీటరు రోప్ లోపలకు పోగానే మరొకరు లోపలకుపోవాలి. ఆ విధంగా చేతులు చాచితే అందేంత దూరంలో మీటరుకు ఒకరు చొప్పున రోప్ ని పట్టుకుని లోపలకు పోతూ ఉండాలి. ప్రతి పదిమంది దాటగానే పదకొండో వ్యక్తి సెర్చిలైటు కూడ పట్టుకుపోవాలి.

యాభయిమందికి ఒకరు బాటరీ సిస్టం అమర్చిన లౌడ్ స్పీకరు తీసుకుపోవాలి. లోపల ఏమి జరుగుతున్నదో ముందు వ్యక్తి ఆ ప్రక్క వ్యక్తికి, ఆ ప్రక్క వ్యక్తి మరొకరితో అందించాలి. ప్రతిక్షణానికి వార్త బయటకు రావాలి.

వెలుపలనించి ఆదేశాలు స్పీకర్ ద్వారా లోపలకు అందించబడతాయి. ఆవిధంగా మూడు వరుసలు ఒకేసారి లోనికి ప్రవేసించాయి.

మధ్యలో వారు ముందుకు పోతుండాలి.

కుడి ఎడమవైపు అడ్డుత్రోవలు వస్తే ప్రక్కల నున్నవారు వెళ్ళి చూచిరావాలి. ఒకరు ప్రక్క త్రోవకు వెడితే వారు తిరిగి

వచ్చిందాకా మిగిలిన రెండు లైన్లు అలా నిలిచిపోవలసిందే! అడ్డుత్రోవలో వెళ్ళిన వారు తిరిగి వచ్చి లోపల విశేషాలు అందించితే అవి తక్షణం స్పీకర్ ద్వారా బయటకు పంపబడతాయి. వార్తలను చర్చించి అధికారులు మళ్ళీ ఆదేశాలకు స్పీకర్స్ ద్వారా అంచెలంచెల మీద లోనికి అందిస్తారు.

పోలీసు బలగం పోయినంత దూరం మూడు వరుసలు చాలవనుకుంటే ఒక క్యూని ఫాలో చేసి మధ్య క్యూలో కలిపేస్తాను. ఇంకా చాలవనుకుంటే రెండవ క్యూని కూడ మధ్యవారితో కలిపేస్తాను. ఇంకా చాలవనుకుంటే రెండవ క్యూని కూడ మధ్యవారితో మెరిట్ చేస్తారు.

అప్పటికి తక్కువ అవుతారనుకుంటే పోలీసుల మధ్య దూరాన్ని మీటరునించి పది మీటర్లవరకూ పెంచుతారు. చాల బలీయమైన పథకాన్ని రూపొందించాడు అధికారి! కొన్ని వందలమంది బలగం కొన్ని వేల మీటర్లు పోగలరు.

వార్తలు ప్రతిసెకనూ ముందు వెనుకలకు నడుస్తుంటాయి.

అవసరమైనప్పుడు కేవలం అరనిమిషంలో ఓపెన్ పాయింట్ దగ్గర అయినా కొన్ని వందలమంది పోలీసులు గ్రూప్ అఫ్ కావటానికి వీలుంది. అందువల్ల అన్నివిధాల ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి.

ఒక శక్తివంతమయిన బ్యాటరీ లైటూ, స్పీకరూ పుచ్చుకుని పోలీసు అధికారి తాను వాగ్దానం చేసినట్లు అందరికన్నా ముందు నిలిచాడు.

బయటివారు లోపలినించి వచ్చే వార్తలకు ఎలా ప్రతిస్పందించాలో రిప్లై ఎలా పంపాలో ఆఖరుసారిగా ఆదేశాలిచ్చి లోనికి అడుగు పెట్టాడు అధికారి.

అతని నాయకత్వంలో మూడు వరుసలలో పోలీసు దళం గుహలోపలకు ప్రవేశించింది.

కొంత దూరం మూడువరుసలు ముందుకు వెళ్ళాయి.

ఒక చోటున ఎడమవైపు మరో గుహాంతరం కన్పించింది. అక్కడ అందరిని సమీకరించాడు. ఆవైపు రోప్ తో ముందుకు వెడుతున్న వారిని లోనికి వెళ్ళవలసిందిగా అధికారి ఆదేశించాడు. రెండు వరుసలు అక్కడే నిలిచి ఒక వరుసలోని పోలీసుదళం దీపాలు ఆయుధాలు స్పీకర్ తో లోనికివెళ్ళారు.

కొంతదూరం పోయాక ముందు దారి మూసుకుపోయిందనే వార్త వచ్చింది లోపలినించి. అంచెలంచెలుగా వచ్చిన ఆ వార్తను అందుకున్నాడు అధికారి!

"అక్కడ ఒక పోలీసుగుర్తు ఉంచి వెనక్కి తిరిగిరండి" అని స్పీకర్స్ ద్వారా వర్తమానం పంపించాడు. ఈ సౌకర్యం అతనికి బాగా లభించింది.

సెకన్లమీద వార్తలు నడవడమేకాక ఏదయినా అవసరం ఏర్పడినప్పుడు కొద్ది నిముషాలలో వందలమంది తమకు సాయంగా రాగలరు అనే విశ్వాసం పి.సి.లలో బలీయంగా ఏర్పడి వారి ధైర్యం పెరిగింది.

పదింతలు ఉత్సాహంతో పనిచేయటం ప్రారంభించారు.

పథకాన్ని చర్చిస్తున్నప్పుడుకన్నా ప్రాక్టికల్ గా చూస్తున్నప్పుడు అది వారికి మరింత ఉత్సాహాన్ని కలిగించింది. అలా గుహాంతర్భాగంలో ప్రక్కలకు చీలికలు వచ్చినప్పుడల్లా మూడు వరుసలను నిలిపి వేయటం దానిలోనికి వెళ్ళినవారినించి అనుక్షణం వార్తలు అందుకోవడం తిరిగి ఆదేశాలు అందించటం చాలా సౌకర్యాన్ని కలిగించడంతో అతని పరిశోధన సులువుగా అయిపోయింది ఆత్మవిశ్వాసంలో ముందుకు సాగుతున్నారు.

చాలా దూరం లోపలకు పోయాక మొదటిసారి పోలీసు బలగాలు పాముల్ని ఎదుర్కొన్న స్థావరం కన్పించింది. వెళ్ళివచ్చినవారి ఇచ్చిన వివరాలనుబట్టి అదే ఆ స్థావరం కాని ఇప్పుడు అక్కడ ఒక్క పాము అయినా కన్పించలేదు.

పాము అనేది కన్పించితే తక్షణం దాన్ని చంపి తనకు రిపోర్టు అందించవలసిందిగా అందరికీ ఆర్డర్స్ ఇచ్చాడు. పాముని చంపడంలో వెనుకా ముందూ చూడవద్దని హెచ్చరించాడు. అలాంటి తనతో రాకుండా వెలుపల ఉండమన్నాడు. పాములమీద అతడు అగ్గిరాముడై విరుచుకుపడిపోయాడు.

అవాంతరాలన్నింటిని దాటుకుంటూ వచ్చిన తరువాత రానురాను దారి మరింత ఇరుకు అయిపోయింది. మూడు వరుసలు తగినంత దూరాన్ని మెయిన్ టెయిన్ చేస్తూ ముందుకు పోవటం అసాధ్యం అనిపించింది.

అధికారి పోలీసులకు రెండు వరుసలలో ఫాంచేశాడు. ప్రతి ఇద్దరి మధ్య మూడు వరుసలలోనివారిని నిలిపాడు. మరికొంతదూరం పోయాక రెండు వరుసలు వెళ్ళటంకూడా అసాధ్యమనిపించింది.

ఒకే వరుసలోకి ఫాం చేశాడు. అందరికన్నా ముందు తాను ఉన్నాడు.

కొద్ది దూరం నడిచారు. ఆ తరువాత నడుమువంచి పోవాల్సివచ్చింది. ఒక వరుస కావటంనించి పోలీసులు కొన్ని కిలోమీటర్ల మేరలింకు తెగకుండా వెళ్ళగలిగిన సంఖ్యలో ఉన్నారు. సంఖ్యాబలం తక్కువ అవుతోంది. అనుకున్నప్పుడు వారి మధ్య దూరాన్ని పెంచాడు.

మొదటి నూరుమంది ఒకరికొకరు అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్నారు. రెండవ నూరుమంది పదికిలోమీటర్ల

దూరంలో ఉన్నారు. ఆ తరువాత ఇంకా పలుచగా వస్తున్నారు. అయితే వారందరిని లింక్ చేస్తూ రోప్ ని పట్టుకున్నారు.

అందరి దగ్గరా ఆయుధాలున్నాయి.

అందరి దగ్గరా స్పీకర్స్ ఉన్నాయి! సెర్చిదీపాలున్నాయి.

అధికారి మరికొంతదూరం వెళ్ళాక మోకాళ్ళమీద నడవటం మొదలెట్టాడు.

ఆ తరువాత క్రింధపడుకుని క్రావెలింగ్ ప్రారంభించాడు.

ఇంకాదారి సన్నగా అయితే తిరిగిపోవడం తప్ప మరోదారి లేదు అని అతనికి అర్ధమైంది. చాలా నిరుత్సాహం కలిగించింది. ఇంత ప్రయత్నానికి ఫలితం శూన్యమేనా? దారి సన్నగా అయిపోతే డైనమైట్స్ అమర్చాలి. పగల కొట్టాలి. అదంతా వారాలపాటు చేయాల్సిన ప్రయత్నం.

అర్ధంతరంగా తమ అన్వేషణ ఆపుచేయాల్సి వస్తుందేమో అని అతడు భావించాడు. చాలా నిరుత్సాహం కలిగింది క్రుంగిపోయాడు.

పడుకుని ప్రాకుతూ అందరిని ముందుకు తీసుకుపోవటం ఎందుకు?

ఎక్కడివారక్కడ నిలిచిపోవలసిందిగా ఆదేశాలను అందించాడు. ఆ వార్త కేవలం అరనిముషంలో గుహ వెలుపలకు చేరుకుంది. అంతా స్తబ్ధ అయ్యారు. ఇంత అపురూపమైన ప్రతిష్టాకరమైన ప్రయత్నానికి నాయకత్వం వహించిన అధికారి ఉత్తచేతులతోనే బయటకు వస్తాడనుకోగానే వారికి బాధ అనిపించింది.

అధికారి రెండు నిముషాలు అనంతరం ప్రకటించాడు.

"ముందు సెర్చిలైట్స్ ఆఫ్ చేయండి! సౌండ్స్ రాకూడదు. మన మధ్య మిగిలివున్న లింకు రోప్ ఒక్కటే ని ఏ పరిస్థితిలోనూ దాన్ని మాత్రం ఎవరూ విడిచిపెట్టకండి"

ప్రతి ఒక్కరికీ ఈ కండీషన్ వచ్చాక గుండెలు పీచుపీచు మనటం ప్రారంభించినాయి.

లైట్స్ ఆఫ్ చేశారు. బాటరీ స్పీకర్స్ అన్నీ ఆన్ సౌండ్ చేశారు.

ఆయుధాలు రెడీగా పట్టుకున్నారు. అంతా చీకటి సముద్రంలో మునిగిపోయి నిశ్శబ్ది క్షణాలను లెక్కించుకోవటం మొదలు పెట్టారు. అధికారి తాను ఒంటరిగా ఏదో సాహసం చేయబోతున్నాడని వారందరికి అర్ధమయిపోయింది.

అతని విజయవార్త కోసం దైవాన్ని ప్రార్ధిస్తూ ఎదురు చూస్తున్నారు.

ఉద్విగ్నమైన క్షణాలు భారంగా దొర్లుతున్నాయి.

అధికారి లైట్స్ అన్నీ ఆఫ్ అయ్యాక కొద్దిసేపు కళ్ళుమూసుకుని బోర్లా పడుకున్నాడు క్రావెలింగ్  పొజిషన్ లో! ఆ తరువాత చీకటికి కళ్ళు అలవాటు పడ్డాయని భావించాక నెమ్మదిగా కళ్ళువిప్పిచూశాడు.

చీకటి ఎక్కడయినా ఎప్పుడయినా ఒకేలాగ ఉంటుందనుకోవడం భ్రాంతి అనిపించింది. చీకటిలో ఉండే చిక్కదనం ఏమిటో అతనికి అర్ధమైంది. అలా కొద్ది నిముషాలు గడిచాక అతడు పట్టుకున్న లింకుతాడు ఒదిలిపెట్టకుండా రవంత ముందుకు సాగాడు. నెమ్మదిగా ప్రాకుతూ కొద్ది అడుగులు ముందుకుపోయాడు. అదే చివరి ప్రయత్నం.

అధి విఫలమైతే వెనుదిరిగిపోవటం తప్ప మరోదారిలేదు. అధికారికి కంటి ఎదుట అల్లంత దూరంలో ఏదో వస్తువు ఉన్నట్లుగా అనిపించింది. ఆ తరువాత అధి ఒక వస్తువు కాదని ఎదురుగా ఒక బిలంనుంచి కాంతి కొద్దిగా ప్రసారం అవుతోందని అనుమానించాడు.

తన అనుమానం  నిజమయితే ఘనవిజయం సాధించినట్లే!

ఇరుకు దారిలో__దారికూడా కాదు ఒక బిలంలోకి వెళ్ళినట్లు క్రావెలింగ్ చేస్తూ ముందుకుపోయాడు. ఇంకా స్పష్టమైన రూపంలో కన్పిస్తోంది. అతడు అపరిమితమయిన ఉత్సాహంతో ముందుకు జరిగాడు.

బిలం వెడల్పు పెరిగింది అవతలినుంచి కాంతి కన్పిస్తోంది. ఆ బిలం వెనుక విశాలమైన మైదానం ఉందని అర్ధమైంది.

అధికారి ఆనందాతిరేకంతో కేకపెట్టాడు.

కాని ఆ శబ్దం ఎవరికీ వినిపించలేదు. ఆ సంగతి గ్రహించిన అతడు త్రాడు పట్టుకుని కదిలించాడు. సందేశం అందించాడు. దాన్ని అర్ధం చేసుకుని ఇమిడియట్ నెక్స్ట్ పొజిషన్ లో ఉన్న అనుచరుడు "ఏస్ సార్" అని చెవులు చిల్లులు పడేలా అరిచాడు. అధి అతనికి పిల్లికూతలా చాలా సన్నగా వినిపించింది. మరోసారి సందేశం అందించాడు.

తన చేతిలోవున్న సెర్చిలైట్ ని ఫోకస్ చేశాడు. సమాధానంగా అతడుకూడా సెర్చిలైట్ ఫోకస్ చేశాడు.

సమాధానంగా అతడుకూడ సెర్చిలైట్ వెలిగించి చూపించాడు. అధికారి నివ్వెర పోయాడు.

ఒంకరటింకర లేకుండా స్ట్రెయిట్ గా ఉన్న బిలంలో తన తరువాతి ఉద్యోగి యాభైకి మించిన మీటర్లదూరంలో కన్పించాడు!

పేరుకి క్రావెలింగ్ అయినా మెత్తటి దారిమీద జారుతూ రావడం వల్ల దూరం తెలియలేదు. అధికారి లౌడ్ స్పీకర్స్ లైట్స్ అన్నీ ఆన్ చేయవలసిందిగా ఆదేశాలు అందించాడు.

కొద్ది నిముషాలపాటు చీకటి సముద్రంలో అతి భయంకర నిశ్శబ్దంలో తీవ్రమయిన టెన్షన్ అనుభవించినవారంతా ఒక్కసారి గట్టిగా ఊపిరులు పీల్చుకున్నారు. ఎవరికీ వారే పునర్జన్మ ఎత్తినట్లు భావించారు.

కొందరయితే ఆనందాన్ని పట్టలేక అశ్రువులు కార్చారు. ఈ వార్త క్షణాలమీద గుహ వెలుపల వారికి అందింది. వారు ఊపిరి పీల్చుకున్నారు.

కొద్ది నిముషాలపాటు నరాలు తెగిపోయేలాగ అనిపించిన టెన్షన్ రిలాక్స్ అయింది. అందరూ మళ్ళీ సజీవులయినట్లు కన్పించారు!

రోప్ పట్టుకుని అనుసరిస్తూ వచ్చి టీము అంతా ముందుకు త్వరగా కదిలి రావాలని మెస్సేజ్ యిచ్చాడు అధికారి!

తిరిగి పటాలం క్యూలో కదిలింది. క్రావెలింగ్ చేస్తూ యాభైకి పైగా మీటర్ల దూరం ఉన్న బిలంలోంచి ఒక్కొక్కరే రెండవవైపుకి రావటం మొదలెట్టారు. అది దాటి వచ్చేందుకు రెండు మూడు నిముషాలు పడుతుంది. ఒకరి వెంట ఒకరుగా నిముషానికి పదిమంది చొప్పున వస్తున్నారు.

తన పటాలం త్వరగానే తనని చేరుకుంటారని అర్ధంచేసుకున్నాడు.

అతడు పూర్తిగా బిలాన్ని దాటి రెండవ వైపుకి చేరుకున్నాడు.

దారి విశాలమయింది. పదిఅడుగులు వేశాక పూర్తిగా గాలి వెలుతురు కన్పించాయి.

అందరిని బిలందాటి రావలసిందిగా ఆదేశాన్ని అందించి తాడుని విడిచిపెట్టి మైదానంలోకి వచ్చి నిలిచాడు.

క్రమంగా పది నిమిషాల్లోనే పటాలం పెద్దది అయింది. మిగిలిన వారు కూడ వేగంగానే వస్తున్నారు.

కొండనున్న రాతిపగుళ్ళలోంచి అక్కడకు గాలి, వెలుతురు వస్తున్నాయి.

మధ్యలో విశాలమయిన చెరువు ఉంది. దానిగట్టుమీద ఒక చెట్టు దాని క్రింద అరుగులాగ ఒక పెద్దరాయి ఉన్నాయి. దాని మీదినించి ఒక ఆకృతి కోనేరులోకి దిగి రావటాన్ని గమనించాడు అధికారి!

త్వరగా ఆ వైపుకి పరుగుతీశాడు. మిగిలిన వారంతా అతన్ని అనుసరిస్తున్నారు. బాగా దగ్గర అయ్యాక ఒక జటా జూటధారి వారికి కన్పించాడు.

"అతడేయోగీ!" అంటూ అరిచాడు అంతకు మునుపే చూచిన ఓ.పి.సి వారందరూ చెట్టు క్రిందికి చేరుకునేసరికి అతడు నడుములోతు నీటిలోకి వెళ్ళిపోయాడు. అంతమంది అతి రహస్యమయిన ఆ చోటుకి వచ్చారని కాని తన చుట్టూ మనుషులున్నారని కాని గమనించిన వాడిలా అతడు తనదారిన తాను పోతున్నాడు. నడుములోతు నీళ్ళలోంచి అతడు తటాకం మధ్యలోకి వెళ్ళి పోతున్నాడు. నీరు చాతివరకు వచ్చినాయి.

సరిగ్గా ఆ సమయంలో జటాజూటంలోంచి నాగభామిని లేచింది. కోనేరుని చుట్టుముడుతున్న పోలీసులవంక త్రిప్పిత్రిప్పి చూచింది.

ఆ జటాజూట ధారి అలా కోనేరులోకి వెళ్ళటం అతని జటాజూటంలోంచి ఒక పెద్ద నాగు పడగ విప్పి ఆడటం ఎన్ని జన్మలకయినా చూడలేని అరుదయిన దృశ్యంగా వారికి కన్పించింది.

అద్భుతమయిన ఆ చోటుని అద్భుతమయిన ఆ దృశ్యాన్ని పోలీసు పటాలం కళ్ళు అప్పగించి చూస్తున్నారు, కొందరు చేతులు ముకుళించి నమస్కారం పెట్టుకుంటున్నారు. అతిలోక అద్భుత దృశ్యం అది.

అధికారి పరిస్థితిని సరిగ్గా అర్థం చేసుకున్నాడు. తన చేతిలోని కెమెరాని క్లిక్ మనిపించాడు. అప్పటికే యోగి మెడలోతు నీటిలోకి వెళ్ళాడు.

"నీవు ఒడ్డుకు రావాలి! ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించకు. పోలీసులు నీ రహస్య స్థావరాన్ని చుట్టుముట్టారు! ఆగు!" అని అరిచాడు.

అతను కంఠం చించుకున్నా యోగి రవ్వంత కూడ లక్ష్య పెట్టలేదు.

అడుగుమీద అడుగు ముందుకే పోతున్నాడు.

గడ్డం మునిగింది. ముక్కులు మునుగుతున్నాయి. అయినా ముందుకే వెడుతున్నాడు. పాము పడగవిప్పి పూత్కారం చేస్తోంది.

అధికారి సమయం మించిపోతోందని భావించాడు!

"ఫైనల్ వార్నింగ్! నువ్వు వెంటనే ఒడ్డుకురా!" అన్నాడు. కాని యోగి అతనిని పట్టించుకోలేదు. అడుగులు ముందుకేశాడు!

"నీటిలోకి దుమకండి! అతడు ఆత్మహత్య చేసుకునేందుకు వీలులేదు. ఈతవచ్చిన వాళ్ళంతా వెళ్ళి పట్టుకోండి" అంటూ అందరికన్నా ముందుగానే దుమికేశాడు. వారు కొనేరు అంతా ప్రతి అంగుళం గాలించారు.

యోగి సజీవంగా కాని నిర్జీవంగా కాని వారికి పట్టుబడలేదు.

## 16

"ఆ విధంగా సరస్సులో ప్రతి అంగుళమూ గాలించాం.

కాని యోగి జాడ కన్పించలేదు. అతడు జటాజూటంలో ఒక పాముని ఉంచుకుని కన్పించకుండా పోయాడు! వెతికి వెతికి మాకు చివరకు మాకు నిరాశ మాత్రమే మిగిలింది. విసిగి పోయాం. అక్కడ కొనేరుచుట్టూ కొండలు మాత్రమే ఉన్నాయి. మేము వెళ్ళిన బిలమార్గం తప్ప ఎంత వెదికినా ఎక్కడా మరోదారి కన్పించలేదు. శ్రమ అంతా వృధా అయినట్లు అనిపించింది.

మెన్ కూడ ఉత్సాహంతో ప్రారంభించి అద్భుతాలతో కొనసాగించిన అన్వేషణ ఇలా నిరాశతో ముగించాల్సి వచ్చినందుకు బాధపడ్డారు.

మా యంత్రాగాన్ని ఉవ్వెత్తున కెరటంలా కదిలించి జరిపిన అన్వేషణ. ఆ విధంగా ముగిసింది అని వివరించాడు అధికారి.

వారందరూ చాల శ్రమించారు. క్షేమంగా నగరానికి తిరిగి వచ్చారు అని ప్రతి ఒక్కరికి ఆనందాన్ని కలిగించింది.

"అలౌకిక శక్తులు లేవు అని భావిస్తూ ప్రారంభించిన మీ అన్వేషణ అవి ఉన్నాయనుకుంటూ ముగించారు?" అని ఒక వి.ఐ.పి. ప్రశ్నించాడు.

"లేదు సర్! అక్కడ మేము ఒక వ్యక్తిని చూచాం. కనుక ఇది ప్రకృతిలోని వింతల్ని కొండలో బిలం లోపల సరస్సులాంటి వాటిని తమ కార్యక్రమాలకు అనుకూలంగా మలుచుకోవటం చేతనయిన వ్యక్తులు చేస్తున్న

కార్యక్రమం ఇది అని మాకు నిరూపణ అయింది.

మనుషులు ప్రమేయం ఉన్నచోతున అలౌకిక శక్తుల గురించి ఆలోచించటం అనవసరం సర్! వారు మనకన్న తెలివయినవారు కావచ్చు" అన్నాడు.

"మీ కళ్ళముందే ఒక యోగి కోనేరులోకి దిగాడంటున్నారు. మీరు ప్రతి అంగుళం గాలించినా నీటిలో కన్పించలేదంటున్నారు. అతని జటాజూటంలో పాము ఉందంటున్నారు. ఇదంతా కళ్ళారా చూచి ఆ తరువాత కూడ అది ఒక అలౌకిక శక్తి అని మీకు అన్పించలేదా?"

"లేదుసర్! కోనేరులో కూడ కొండగుహ బిలంలాంటి రహస్యమార్గం ఉండవచ్చు. జటాల్లో పాముని దాచుకోవటం అసాధారణంగా మనుషులు చేయగలిగిన పనే! అంతేకాని అది అలౌకికం అని మనం అనుకోవలసిన అవసరంలేదు" అన్నాడు అధికారి!

ఈ విషయమై నగర ప్రముఖులు అధికారుల మధ్య చాలాసేపు వాదోపవాదాలు జరిగినాయి. ఆపరేషన్ లో పాల్గొన్నది కొన్ని వందల మంది ఉద్యోగులు కాబట్టి జరిగినదంతా రహస్యం కాదు.

అందరిలోనూ మిగిలిపోయినది ఒకే ప్రశ్న!!

నీటిలోకి దిగిన యోగి ఏమయిపోయాడు.

అంతర్ధానమై పోయాడా? ఆత్మహత్య చేసుకున్నాడా?

చనిపోయాడనుకునే వారికి శవం ఏమయిందని ప్రశ్న ఎదురవుతోంది.

అంతర్ధానమై పోయాడనే వారికి ఒడ్డునే కావచ్చు కదా నీటిలోకి దిగి అందరూ వచ్చేదాక ఎదురుచూచి చావటం ఎందుకు అనే ప్రశ్న మిగిలింది.

మధ్య వర్తులు ఈ ప్రాబ్లంని అప్పుడే నిర్ణయించటానికి లేదు. ఊహల ద్వారా నిరూపించటానికి వీలుకాదు. మళ్ళీ దాని తదుపరి పరిణామాలు ఎలా జరుగుతాయో చూచి కదా నిర్ణయించాలని అంటున్నారు.

మిగిలిన వారి సంగతి ఎలా ఉన్నా, సాధించిన ఫలితం ఎలాంటిది అయినా డిపార్టు మెంటు మాత్రం అధికారి సాధించిన దానికి చాల సంతృప్తిని ప్రకటించింది. అది అతడు పోలీసు డిపార్టు మెంటుకి ప్రతిష్టాకరమయిన పేరు విజయం సాధించటంగా భావించింది. పై అధికారులు అందరూ ఈ విషయాన్ని ఏకగ్రీవంగా అంగీకరించారు.

బ్రతుకు సంశయా స్పదమయిన పరిస్థితులలోకి కాలుపెట్టటం ఒక సాహసంగా అందరూ గుర్తించారు. బలగానికి నాయకత్వం వహించి ఒక మేరకు ఫలితాలను సాధించి అందరిని క్షేమకరంగా తీసుకు రావటం ఒక సాహసంగా అతనిని అభినందించి సన్మానించారు.

వెంటనే అతనికి డబల్ ప్రమోషన్స్ యిచ్చారు.

ఆపరేషన్ లో పాల్గొన్న మెన్ అందరికి మూడు ఇంక్రిమెంట్లు అదనంగా యిచ్చారు.

నగరంలోని ప్రముఖులు కొందరు క్యాష్ బహుమతులు ప్రకటించారు.

తరువాత కార్యక్రమాన్ని రూపొందించేందుకు అతనికి వారం రోజులు గడువు యిచ్చారు. యువ అధికారికి అపరిమితమయిన ఉత్సాహం కలిగింది.

రెండు రోజులు శలవు తీసుకునే ముందుగా అతడు తులసి, శివరాజ్ లను చూచేందుకు వారి దగ్గరకు పోయాడు.

పోలీసులు జరిపిన తతంగమంతా అప్పటికే నగరంలో ప్రతి ఒక్కరికి తెలుసు.

"మీరు చేసిన పని సాహసం కావచ్చు! కాని యోగి తపస్స మాధికి భంగం కలిగించటం సత్ఫలితాలను ఇవ్వకపోవచ్చు! మిమ్మల్ని నిరుత్సాహపరచటం నా ఉద్దేశ్యంకాదు. మీరు చేసింది ప్రతిష్టాకరం అయినా యోగిని హెచ్చరించకుండా వదిలేయవలసింది" అన్నది తులసి!

అప్పటికి కొన్ని గంటలుగా ఇవే ఆర్గ్యుమెంట్స్ విని విని విసుగెత్తి పోయివున్నాడు యువ అధికారి! అతడు బదులు చెప్పలేదు. చిరునవ్వు నవ్వాడు.

"రెండు రోజులు శలవుమీద పోతున్నాను. మీ వల్లననేను ఈ ఆపరేషన్ లో పాల్గొనే అవకాశం వచ్చింది. ఈ క్రెడిట్ అంతామీదే!" అన్నాడు.

"యోగి ఏమయి ఉంటాడని మీ అభిప్రాయం?" అని అడిగాడు శివరాజ్.

"బహుశా! నీతి క్రింద కూడ ఒక బిల మార్గంలాంటిది ఉండాలి! దాని ద్వారా అతడు పారిపోయి ఉండవచ్చు!" అన్నాడు యువ అధికారి.

"అయితే ఇప్పుడు మీరు ఏం చేయాలనుకుంటున్నారు?"

"తప్పకుండా అతని కోసం వెతకాలి! అయితే వెంటనే ఆ కార్యక్రమాన్ని చేపట్టేందుకు వీలుకాదు. యోగి మునిగి పోయిన సరస్సు లోపలి స్థితిగతులేమిటో తెలుసుకోవాలంటే ఆ నీరంతా తోడి పోయాలి!

యంత్రాలు అక్కడకు చేరుకోవాలంటే బిలమార్గాన్ని వెడల్పు చేయించాలి! నీరు తోడి యంత్రం చేర్పించటానికి ట్రూప్స్ నిరాఘటంగా నిటారుగా నడిచి వెళ్ళటానికి వీలుగా మార్గం వెడల్పు చేయమని మైనింగ్ డిపార్టుమెంటు వారిని అడిగాం! వారు పనిలోకి దిగిపోయారు.

ఎంత త్వరగా పని పూర్తిచేసినా అయిదారు రోజులు పడుతుంది.

నేను రెండు రోజులు శలవు మీద విశ్రాంతి తీసుకుంటాను. ఆ తరువాత మనసంతా కూర్చుని తరువాత పథకాన్ని రూపొందించాలి!" అన్నాడు!"

"బాబూ! యోగి జటాజూటంలో ఉండే నాగభామిని శివరాజ్ ని తీసుకుపోతానని ప్రతిజ్ఞ చేసిందట కదా! నా బిడ్డ కేమవుతుంది?" అంటూ అల్లుడు గురించి ఆదుర్దాగా ప్రశ్నించింది తులసి తల్లి. అతడు నవ్వాడు.

"ఇంకెక్కడి యోగి? ఇంకెక్కడి నాగభామిని మామ్మగారూ! మేము ప్రవేశించిన మరుక్షణాన వారు తోకముడిచి పారిపోయారు.

తిరిగి వారు కన్పించరు మనం వెతికి పట్టుకోవలసిందే!" అన్నాడు యువ అధికారి అపరిమితమయిన ఆత్మ విశ్వాసంతో.

ఆడ వాళ్ళిద్దరూ ఆ మాటలను పూర్తిగా విశ్వశించలేక పోయారు.

"ఈసారి ఆపరేషన్ లో నేను కూడ పాల్గొనే అవకాశం కల్పించండి!"

"అలాగే తప్పకుండా!" చాలసంతోషంగా యువ అధికారి వెళ్ళి పోయాడు.

శివరాజ్ కు మనసు చాల ఆనందంగా ఉంది.

పరిణామాలు ఎలాంటివి అయినా డిపార్టుమెంటు యావత్తూ వెనుక అండగా నిలిచి ఉండటం అతనికి కొండంత ధైర్యాన్ని ఇస్తోంది.

భార్య, తల్లి చెరోవంక కూర్చుని వడ్డించి కొసరి తినిపించారు.

అలసట వల్ల అతనికి వెంటనే నిద్రముంచుకు వచ్చింది.

ఎంతో వీరుడని పేరు తెచ్చుకుని ఇంటికి తిరిగి వచ్చిన భర్త అలసటతో నిద్రపోతూ ఉంటే అతని ముఖంలోకి చూస్తూ కాళ్ళు వొత్తుతూ కూర్చుంది అర్ధాంగి! అలాగే ఆమె కూడ భర్త పాదాలమీద ఒరిగి పోయింది ఉద్యోగంలో హోదా పెరిగింది.

ఉదయమే ఒక ఉన్నతాధికారి కారులో వచ్చి భర్తను తీసుకుపోయాడు. స్నానము, పూజముగించి ఆమె హాలులోకి వచ్చింది. అత్తగారు తీరికగా కూర్చుని ఉంది.

"ఇంతకూ మనవాడు దొంగల్ని పట్టుకున్నాడా?" అని అదిగింది అమాయికంగా.

"అతడు దొంగకాదు అత్తగారూ! ఒకయోగి! పాములన్నీ అతనికి సేవలు చేస్తాయట! చాల మహత్యం కలవాడట!"

"అటువంటి మహానుభావుడి జోలికి ఎందుకు వెళ్ళాడే మనవాడు!?"

"వృత్తి ధర్మం కదండి! పై అధికారులు అప్పగించినపని చేయాలి కదా!"

"పెట్రోలు పోసి తగల బెట్టారని చెప్పుకుంటున్నారు అదేమిటే"

"పుట్ట త్రవ్వి పాములన్నింటిని తగుల పెట్టారట"

"హవ్వ తల్లి అదేవిడ్డూరమే! మనవాడు కూడ ఉన్నాడా?"

"ఈయనే ఆ బృందానికి నాయకత్వం వహించారట!"

"ఇలాంటి పనులు చేస్తే ఒరిగేదేమిటి?"

"ఏముంది? రెండు ప్రమోషన్ లు ఒకేసారి వచ్చాయి"

"నాగదోషం అంటుకుంటుందేమోనే! ప్రాణాలకంటే ప్రమోషన్లు గొప్పవా?"

"ఉద్యోగాన్ని పట్టి ఉంటాయి కదండి అవన్నీ!"

"ఏమో నమ్మా! ఏ ఉపద్రవాలు రానున్నాయో!" అని ఆమె అంటూ ఉండగానే వాకిలి దగ్గర అడుగుల చప్పుడు అయింది.

"ఎవరొచ్చారో చూడు?" అంది అత్తగారు కదలకుండా!

కోడలు లేచివెళ్ళి వరండాలోంచి దాసరాణి సింగమ్మను వెంట పెట్టుకుని లోపలకు వచ్చింది. కంగారుగా లేచి నిలబడింది పెద్దావిడ.

"ఎరుక చెప్తానమ్మా దొరసానీ! కనకదుర్గమ్మ కదిలించింది. ఆ తల్లి ఆనతిమీదే ఈ ఇల్లు వెతుక్కుంటూ వచ్చాను.
మీ ఇంటికి నాగదోషం అంటుకుంది.

ఆ నీడలు బహు జోరుగా కదులుతున్నాయి. ఇంటి నిండా నాగజీవాల ఉసురులే విన్పిస్తుంది. ముప్పురానుంది తల్లీ! అమ్మనడిగి తెలుసుకో! దండవెట్టుకుని చేయిచాచు" అంది దాసరాణి సింగమ్మ.

సొరకాయడొల్ల మీద అతి నిరాడంబరంగా బిగించిన ఒంటరీ తీగను మ్రోగించటం ప్రారంభించింది. దాసరాణి సింగమ్మ పిలవకుండా అప్పుడప్పుడు కొందరి యిళ్ళకు వచ్చి పోతూ ఉండటం ఏవో కొన్ని నిదర్శనాలు చెప్పటం ఓ కథగా నగరంలో ప్రచారమై ఉంది. ఆ విషయం వారికి తెలుసు.

రాగానే నాగదోషం అంటూ ప్రారంభించింది.

అందువల్ల ఆమెనించి పూర్తి విశేషాలు తెలుసుకోవాలను కుంది తల్లి!!

దాసరాణి సింగమ్మ ఒంటితీగ మీటుతూ ఈత ఆకులి చీలికలతో అల్లిన ఒక విచిత్రమయిన పాతకాలం నాటి చుట్ట ముందు పెట్టుకుంది.

దానిలో పసుపు కుంకుమలు చల్లి విశాలమయిన ఎర్రన్ని కళ్ళు కలిగిన కనకదుర్గమ్మ విగ్రహం ఉంది. అది మైనంతో మలిచిన బొమ్మ.

ఒక చదరు తీసి చుట్ట ఎదుట పరిచింది.

"కనక దుర్గమ్మ కన్ను తెరిచి వచ్చిందే! కరుణించి వచ్చిన అమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకో! భక్తిగా హారతులు యిచ్చుకో! అన్నది అదొక ఆవేశంలా తల్లి కొంచెం ముందుకు జరిగి చదరుమీద కూర్చుంది.

"నువ్వు కాదే ఎర్రితల్లీ! నీ కోడల్ని కూకోమను. కట్టెకు కట్టి తోడుగా నూరేళ్ళు సౌభాగ్యంతో బ్రతకాలని వచ్చింది ఎర్రితల్లి! ఆ తల్లికే చెప్పాలనా వాక్కు! సూదంటు రాయితో సుక్కల్ని ఏరుకోవాలని ఎర్రిపని చేశాడు దానిమొగుడు! హాయిగా సాగుతున్న బతుకులో అంశారం లేచింది! అగ్గినిప్పై ఆ చిట్టి తల్లి ఎంత తల్లడిల్లి పోవాలో!

కోడలు మొక్కుకుని చెయిచాస్తే కోరికలు తీర్తాయి! రాయంచ బతుకంతా ఇక రాళ్ళదారి! ముళ్ళదారి! రమ్మను. అమ్మవారు ఆదేశాలిస్తోంది. బేగి బేగి తెగి వెల్లిపోయి రమ్మనవే రాయంచని, అంటూ తొందరించింది దాసరాలు.

అత్తగారు భయంగా వెనుక తట్టుకు వెళ్ళిపోయింది.

అంతకన్నా భయంగా కోడలు వచ్చి సింగమ్మ ముందు కూర్చుంది. చేయిచాచింది దుర్గమ్మ విగ్రహం మీద పసుపు కుంకుమలు చల్లి ఆవేశం తెచ్చి కోవటం మొదలెట్టింది దాసరాలు సింగమ్మ.

మధుర మీనాక్షి పలుకూ, కంచికామాక్షి పలుకూ, తిరుపతి వెంకన్న పలుకు, బెజవాడ కనకదుర్గమ్మ పలుకు, పలుకుపలకవే నా తల్లి ఈ చిట్టితల్లి జలమ ఏ దారి పట్టిందో చెప్పవే నా తల్లి! ఓయమ్మ దండవెట్టుకో!!

హుంoooo మ్....అమ్మ నీ నాధుడు నారాయణుడే తల్లి! మనిషి మనిషికి మచ్చల్ని వెతికి పట్టుకుంటాడు! కర్మ బంధాన కట్టుకున్నాడే నిన్ను! జలమజలమలతోడు తప్పకుండా కట్టుకున్నాడు.

కాని ఈ జలమలోసాన అగచాట్లు పెడతాడు. చంద్రడల్లే ఉదయించి చెప్పకుండా పోతాడు! మబ్బుసాటుకి పోయి మరలిరాడమ్మా తల్లి! కనకదుర్గమ్మ కొలువులో దొరగారు దేముడై పోతాడు!

ఓయమ్మ! తప్పవే ఎతలు! ఒంటిగావచ్చావు. జంటకోరావు! కట్టుకున్నాడు తిరిగి నిన్నొంటిగా ఒదిలిపోతాడే నా తల్లి! కన్నీరు తప్ప దమ్మ నీకు! జంటనిన్నుడిచిపోతాది! ఒంటికట్టెకు మిగిలేది కన్నీరు ఒక్కటే!" అంటూ వివశమయిన ధోరణిలో చెప్పుకు పోతోంది. దాసరాణి!

ఆ మాటలు వారిమీద పిడుగుల్లాగ పడుతున్నాయి.

చెప్తున్న ఆ దీర్ఘాలతో మారిన మాటలకి అర్థమేమిటో కోడలుకి సరిగా అర్థం కాలేదు. అత్తగారు ఏదో ప్రమాదాన్ని సూచించే ఆ మాటలను తిరిగి సరిగ్గా చెప్పించుకోవాలని ప్రశ్నలడగటం ప్రారంభించింది.

"అమ్మా! కనకదుర్గమ్మతల్లీ! తోడు యిచ్చింది నువ్వేకదా!"

"అవునే! తగినోడు భర్త అని తోడు యిచ్చాను. యిచ్చింది నేనే! కట్టెకుకట్టె తోడుగా కలకాలం బ్రతకమని

ఆశీర్వదించాను."

"మరి మధ్యలో ఏమవుతుందంటావు?"

"దారినే పొమ్మన్నమాట మరిచాడు. దారి నేరమ్మన్నదారి మరిచాడు. దారితప్పి తిరిగినా నా బిడ్డ అని కాపాడుకుంటాను. నీ నాధుడు నాగావీధిలో కాలుపెట్టాడే తల్లి! ఆకాశంలో నక్షత్రాల మధ్య నాగవీధులుంటాయి.

భూమిలోపల నాగదారులుంటాయి. నేలమీదనే ఉంటాయి నాగవీధులు! వాటిలో కాలు పెడితే కన్నెర్రచేస్తాయి. ఫస్ స్ మని పూత్కారాలు చేస్తాయి. కన్నుపడ్డాక మరచిపోవు. మరలిపోవు వెన్నంటి తిరుగుతుంటాయి. నీనాధుడి మీద నాగనీడ పడిందే తల్లి!!"

ఈ మాటలు విని ఆడవాళ్ళిద్దరూ గుండె పగిలి ఏడ్చారు.

"మా మీద అంతగా ఎందుకు దయతప్పావు తల్లీ! మేము చేసుకున్న పాపం ఏమిటి?"

అని కంపించుతున్న కంఠస్వరంతో అడిగింది అత్తగారు.

చేయిచాపిన కోడల్ని ఉద్దేశించి చెప్పటం ప్రారంభించింది దాసరాణి సింగమ్మ!

"దయ తప్ప లేదే నా బిడ్డ! దయగలిగి ఉన్నాను. అందుకే బ్రతికి బట్టకట్టాడు నీ జోడు! బ్రతికి బయటపడ్డాడు.

నాగదేవతలకు తీరని అపచారం చేశాడు. జీవుల్ని బ్రతికుండగానే మంటపెట్టి కాల్చాడు. నల్లబొగ్గేయిపోతున్న నాగదేవతలు శపించాయి తల్లీ! నాలుగుదిక్కుల నుంచి ముట్టడించుతున్నాయి. ఇంకా నీ పసుపు కుంకాలు నేలరాలే సమయం ఆసన్నమయిందే బిడ్డ! అమ్మ తల్లిని నమ్ముకో! అపచారం చేసినందుకు అనుభవించాలి శిక్ష! నరుడి దృష్టి నాగుమీద పడినా, నాగులదృష్టి నరుడిమీద పడినా ప్రాణులబయట పడటం కల్ల.

అమ్మ నీకు ముందుగా వాక్కు యిచ్చింది నమ్ముకున్నావు కనుక దోషాన్ని వివరించి చెప్పింది. ఇంకా ఎంతోసేపు బ్రతకడు నీ మొగుడు" అంటూ సోది చెప్పటం పూర్తిచేసింది దాసరాణి.

ఆమెకు క్రమంగా అమ్మవారి పూనకం తగ్గిపోయింది.

కొద్దిసేపటికి మామూలు మనిషి అయింది.

"తల్లీ పొద్దుపొడిచి లేచింది మొదలు ఎక్కడికోఎక్కడికో వెళ్ళాలని మనసు ఆరాటపడింది. ఊరంతా తిరిగినాను నా తపన చల్లారలేదు. మీ గుమ్మంలో అడుగు పెట్టగానే ఆరాటం అణిగిపోయింది తల్లీ!

అమ్మ నన్ను మీ యింటికే నడిపించింది.

ఇక్కడకు రాగానే అర్థమయింది. నీ భర్తకు నాగదోషం పట్టుకుంది. ముక్కు పచ్చలారని తల్లివి. ఈ వయసులో భర్తని కోల్పోయి ఎలా బ్రతుకుతావో!" అని జాలిపడింది దాసరాలు.

అత్తాకోడళ్ళు ఇద్దరూ కన్నీరు మున్నీరు అవుతోంది. ఆమె మాటలలో ఒక్క అక్షరం అయినా అబద్ధమని వారికి అనిపించలేదు.

"ఈ దోషానికి నివారణ లేదా?" అని అడిగింది అధికారి భార్య!

"నాగదోషానికి నివారణ ఒక్కటే ఉంది తల్లి! గారుడనఖం తెచ్చి భస్మంచేసి ఒళ్ళంతా పులుముకుంటే నాగదేవతలు నీ భర్తను అంటుకోవు ఆ భస్మం యోగి దగ్గర తప్ప మరెక్కడా దొరకదు. ఎలా సంపాదిస్తావో!"

అంది దాసరాలు బుట్ట తెచ్చుకుంటూ.

"గారుడనఖం అంటే ఏమిటి? అదెలా భస్మంచేయాలి."

"నాకు మాత్రం ఏం తెలుసు పిచ్చితల్లి! అమ్మ ఆ వాక్కు పలికించింది పలికాను.

"ఆమె చెప్పింది నీకేమయినా అర్థమయిందా అత్తగారూ!"

"అబ్బాయి ప్రమాదంలో ఉన్నాడు. యోగి దయవుంటే కాపాడుకోవచ్చు."

"ఆయన మనకెలా కన్పిస్తాడు? అంతమంది పోలీసు బలగం వెళ్ళి పట్టుకోలేకపోయారు. మనవల్ల ఏమవుతుంది?" అంది కోడలు!

"రాజువల్ల పని కాని అదృష్టం ఉండాలే కాని బంటువల్ల అవుతుంది. అధైర్య పడకమ్మా! అబ్బాయిని కాపాడుకోవాలి కదా! బయల్దేరు" అంది అత్త.

"అత్తయ్యా! నన్నిప్పుడు ఎక్కడకు వెళ్ళమంటారు?"

"ఎలాగయినా యోగిని కలుసుకుని అసభ్యం సంపాదించి తిరిగిరా?"

నిన్కురాలయిపోయింది కోడలు. మొత్తం పోలీసు డిపార్టుమెంటు కదిలిపోయి కొండల్ని పిండికొట్టగా దొరకని యోగి ఎన్నడూ యిల్లు విడిచి బయటకయినా రాని తనకు ఎలా దొరుకుతాడు.

దాసరాణి సింగమ్మ రక్షించుకోవచ్చు అని ఒక్క మాట చెప్పింది. ఆ మాట ఆధారంగా గ్రుడ్డిగా బయలుదేరింది యువ అధికారి భార్య.

ఆమె నగరమంతా కాలినడకన తిరిగింది.

సాయంత్రానికి ఒక పాడుపడిన సత్రం చేరుకుంది అది నగర పొలిమేరల మీద ఉంది క్రమంగా చీకటిపడుతున్న వేళకు గంజాయిదమ్ములాగించే సన్యాసులు అందరూ సత్రం అరుగులమీదికి చేరటం మొదలెట్టారు. ఆమె నిండుగా పైట కప్పుకుని ఒక స్తంభం చాటున ముణగదీసుకుని పడుకుంది. ఇంకా జీవించటం వృథా అనిపిస్తోంది.

భర్త చనిపోతాడమే విషయం ముందుగా తెలుసుకున్న దురదృష్ట వంతురాలయిన ఆడది ఆ యిల్లాలు! ఎలా భరించగలదు? ఎలా జీవించగలదు?

ఎవరో ఒకదారినపోయే దాసరాలు మాటలు నమ్మటం! యోగిని తీసుకురమ్మని అత్తగారు తనని పంపటం ఒక కలగా అనిపించిందామెకు. భర్త పోలీసు అధికారి.

మరో అధికారి ప్రాణాలు రక్షించేందుకని వెళ్ళి అతడు నాగదోషానికి గురి అయ్యాడు. అతని ప్రాణాలు రక్షించేందుకు తాను బయలుదేరింది.

భర్త చేసింది వృత్తిధర్మం. తాను చేస్తోంది ప్రవృత్తి ధర్మం. స్త్రీ ప్రవృత్తి!!

ఇదంతా విధి ఆడించుతున్న నాటకంలాగ అనిపించింది.

ఆ యోగి కన్పిస్తాడా! విభూతి అందిస్తాడా? భర్త బ్రతుకుతాడా?

దిక్కుమాలిన దానిలా అనారోగ్యపు కంపుకొడుతున్న సత్రం తాలూకు వీధి అరుగుమీద పడుకుని రోదిస్తోంది. ఆ నిశ్శబ్దవాదన ఎవరు వింటారు?

ఒక స్త్రీ ఆర్తి నిండిన మనసుతో రహస్యంగా చీకటిలో కన్నీరు పట్టుకుని ఎన్నిమారులు పై కొంగుతో అద్దుకున్నా ఎవరు పట్టించుకుంటారు.

ఆమెకు చేరువలో కొంతమంది చింకిపాతలు కట్టుకున్న సన్యాసులు చేరి గంజాయిదమ్ము కొట్టటం ప్రారంభించారు.

వారిలో వారికి తగువులు పడుతున్నారు. వాగ్వివాదాలు జరుగుతున్నాయి పందెం పెట్టుకుని పొగ పీల్చుకున్నప్పుడు గంజాయి చిలుముతాలూకు వెడుగు గోడమీద పడేలా గట్టిగా లాగుతున్నారు.

వారి చర్చలు కూడ నగరంలో జరుగుతున్న పరిణామాలు గురించే! అడుక్కునే వారు సన్యాసులు కేవలం పొట్టతిప్పలకే పాటుపడుతుంటారని వారికి లోకం సంగతి ఏమీ తెలియదని అనుకోవటం పొరపాటు!

సాధారణ కుటుంబికుల లాగే వారికీ అనేక చర్చనీయాంశాలుంటాయి. నలుగురికి అనుబంధమయిన విషయాలలో ఆసక్తి ఉంటుంది. తిరుగుతూ ఉంటారు తీరిక ఎక్కువకాబట్టి నాలుగు మూలల నించి సమాచారం ఒక చోటుకి చేరుతూ ఉంటుంది. కడుపు నింపుకోవటానికి అడుక్కోవటం ఒక్కటే దారి అయినా ఆ తరువాత గంజాయి త్రాగటం మాట్లాడుకోవటం మాత్రమే వారికి ఉండే కార్యక్రమాలు!!

"నగరం గగ్గోలుగా ఉందిభాయ్!" అన్నాడు ఒక యువసన్యాసి!

"మళ్ళీ మతకలహాలొచ్చాయా?" అని ప్రశ్నించాడు మరోడు చిలుము అందిస్తూ.

"మత కలహాలు కాదు! ఈసారి మరోరకం!"

"ఏమిటా రకం బాంబులు పడుతున్నాయా?"

"అవేమీకాదు. పోలీసులకి, పాములకి పోరాటం! పోలీసులు గుహమీద దాడిచేసి వందల సంఖ్యలో పాముల్ని తగులబెట్టారట. అవి పగపట్టి నగరం మీద దాడి చేయబోతున్నాయట!"

"పోలీసులమీద ప్రతీకారమా? నగరంమీద నాగులు దాడిచేస్తాయా?"

"అవును. మనుషుల్లాగే అవి కూడ జంతువులుగాదా! మనిషి ద్విపాద పశువు. పాములు పాదాలులేని పశువులు" అన్నాడు దమ్ముతల కెక్కగా!

"అసలీ వైరం ఎలావచ్చిందంటావు?"

"ఈ బడుద్దాయిలు యోగిని పట్టుకుంటారట!"

"ఓయమ్మో! ఎంత సాహసం?" అన్నాడు ఎక్కింది దిగిపోగా!

"భాయ్! అసలు యోగి అనేవాడు ఉన్నాడంటావా?" ఆసక్తిగా అడిగాడు అప్పుడప్పుడే గంజాయి దమ్ముకి అలవాటు పడుతున్న కుర్రసన్యాసి!!

"నేను చూచాను. రాత్రిపూట ఏదో ఒక సమయంలో స్మశానం లోకి వస్తాడు."

"అతన్ని చూడాలని వచ్చిన ఒక కాలేజీ అమ్మాయి కళ్యాణి అనిపేరు. ఆమె చచ్చిపోయాక అతడు రావట్లేదని చెప్పుకుంటున్నారు కదా!"

"పొరపాటు! అంతకు పూర్వం యోగి రాత్రి సమయంలో ఎక్కువగా స్మశానంలో ఉండేవాడు. ఆ సంఘటన జరిగినా తరువాత అక్కడకు అప్పుడప్పుడు వచ్చిపోవటం మాత్రమే జరుగుతోంది!"

"ఇవన్నీ పుకార్లేనా? ఎవరయినా చూశారా?"

"నేను చాలాసార్లు యోగిని దూరం నించి చూచి వచ్చాను"

"భాయ్! మాకు కూడా చూడాలని వుంది తీసుకుపోతావా?"

"నిరభ్యంతరంగా! అయితే దూరంనించే చూడాలి. చప్పుడు చేయకుండా అతని ధ్యానానికి భంగం లేకుండా తిరిగిరావాలి. ఒకసారి కళ్ళు మూశాడంటే మళ్ళీ ఎప్పుడు తెరుస్తాడో! కళ్ళు తెరవగానే మొదటిసారి అతని దృష్టిలో పడినవారు మలమల మాడిపోతారట!

శివుడు మూడో కన్ను తెరిచినట్లే!" అని వివరించాడు అనుభవం కల సన్యాసి.

మిగిలినవారు అతని మాటల్ని ఎంతో ఆసక్తిగా విన్నారు.

"అయితే మనం ఏ సమయంలో బయలుదేరాలంటావు?"

"రాత్రి సమయంలో మూడవ ఝాము ప్రారంభంకాగానే వెళ్ళాలి"

"అంతసేపు నువ్వు మేలుకుంటావా?"

"చూడాలనుకుంటే మేలుకో! లేకపోతే నీ ఖర్మ" అంతటితో వారి సంభాషణ ఆగిపోయింది. మళ్ళీ చిలుములోకి గంజాయిని నులిమి దట్టించటంలో మునిగిపోయారు. కొందరు తిక్క తలకెక్కగా నిద్రకు వాలిపోయారు.

వారిమాటలను శ్రద్ధగా ఆలకించింది యువ అధికారి భార్య!

అయితే యోగి స్మశానంలో ఉంటాడన్నమాట!

అందరికన్నా ముందుగా తానే వెళ్ళాలని తీర్మానించుకుంది.

నెమ్మదిగా అడుగులు వేయటం ప్రారంభించింది.

"అక్కడ నీడలా కదులుతోందేమిటిభాయ్?" అందరూ తలలు ఎత్తి చూచారు.

"ఆ అడుగులు వేయటం చూస్తే ఆడదిలా ఉందిభాయ్!" అన్నాడు మరొకడు.

"అవునవును!" మరోడు ముందుకి దూకాడు.

దేశాలవెంట తిరగటం అడుక్కు తినటమే కార్యక్రమాలుగా జీవించే సన్యాసులు కొందరు సంపన్నులుకూడా ఉంటారు. వారి ఆస్తులు విచిత్రంగా వుంటాయి. మిగిలిన సన్యాసులకన్నా సంపన్నులమనే బడాయి కొందరికుంటుంది.

ఒక వూరు అనే నిలకడలేని స్త్రీలు కూడా కొందరుంటారు.

వారికి కలిసి జీవించడం అనేది కేవలం ఏ సత్రంలోనో తటస్థపడి పరిచయాలయిన తరువాత అయిదు నిమిషాలు మాట్లాడుకుని స్థిరపరచుకుంటారు. వారి మధ్య ఒప్పందంలో మూడు ప్రధాన విషయాలుంటాయి. కూడు, గూడు, బిడ్డలు!

ఈ మూడు ఎవరికెలా ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నాక కలిసి జీవిస్తారు దంపతుల్లాగే ఇద్దరూ చెరో వైపుకెళ్ళి యాచించి తెచ్చుకున్నదాన్ని పంచుకుంటారు. మిగిల్చుకుంటారు.

కొంత జాయింట్ గా కొంత వ్యక్తిగతంగా కూడ దాచుకుంటారు.

జరిగిపోతున్న కాలంతోపాటు ఒరిగిపోవటానికి వీలయితే అలాగే ఎంత కాలమయినా ఉంటారు.

వృద్ధాప్యంలో ఒకరికి ఒకరు తోడుంటారు.

వారికి సెంటిమెంట్స్ అనేవి చాల బలహీనంగా వుంటాయి. ప్రేమలు అనుబంధాల్లాంటివి ఉన్నావాటిని ఆకలి అవసరాలు డామినేట్ చేస్తాయి.

విడిపోవాలనుకున్నప్పుడు ఉదయమే లేచి వెళ్ళిపోతారు. అంతే!

చెరోదారి వెళ్ళిపోయి మళ్ళీ చెరొకర్ని చూచుకుంటారు.

ఒకవేళ ఎక్కడయినా ఎప్పుడయినా ఎదురుపడితే ఒకరినొకరు తెలియనివాళ్ళలా మసలుకొంటారు.

వారిది అదో విచిత్రలోకం! స్త్రీ పురుషుల కలయిక, ఆకలి, అవుసరాలు, ఇల్లు, పిల్లలు తాత్కాలికం

గడచినా కాలమంతా శూన్యం! జరగవలసిన కలం తీర్చుకోవలసిన అవుసరాలు ప్రాధాన్యత వహిస్తాయి. జబ్బు చేసినప్పుడు చాలమంది ఎక్కడయినా విడిచి వెళ్ళిపోతారు. మందు ఇప్పించగలిగితే అతడు సంపన్నుడయిన సన్యాసిగా పరిగణించుతారు.

భంగు సారాయి, గంజాయి వాటి తరువాత వైద్యానికి గుర్తింపు

అందువల్ల రాత్రి సమయాల్లో సత్రం చావళ్ళలో, గుడి మెట్లదగ్గర ఓవర్ బ్రిడ్జిల క్రింద, రైలు, బస్ స్టేషన్స్ లో తమలాంటి వారిని పలకరించటం నిముషాల్లో ఒప్పందాలు అయిపోవటం అతి సాధారణం.

మరో స్త్రీతో కలిసి జీవించటంవల్ల తంటాలొస్తాయి ఖర్చులు పెరుగుతాయి కాబట్టి యాచించుకున్నది తిని తొంగోవటం వాళ్ళ స్థితి వాళ్ళకి గుర్తువచ్చినప్పుడు మత్తుపదార్థాలు సేవించటంలాంటి పనులుచేసే సోమరులే అధికశాతంలో ఉంటారు.

కొంతకాలం ఒక మనిషితో కలిసి జీవించి మళ్ళీ స్వేచ్ఛ సోమరితనం నిండిన ఒంటరితనంలోకి పోవటం వారికి హాబీ!!

బయట ఉద్యోగుల సంగతి ఎలా ఉన్నా సన్యాసుల ప్రపంచంలో భార్య పోష్టులు భర్త పోష్టులు ధారాళంగా దొరుకుతాయి! అన్నీ ఖాళీలే! సోమరితనమే వారికి ప్రధాన మిత్రుడు!

ఆ విధంగా వారు సమాజానికి శత్రువులు!

అలాంటి సాంప్రదాయంలో ఒక భాగమే అతడు ఆమె వెంట పడటం.

కొద్ది దూరంవెళ్ళి ఆమె భయం దాచుకుంటూ నిలిచిపోయింది.

"ఆగు దగ్గరకు మాత్రం రాకు" అన్నదామె.

"మీదపడటానికి మేం మొహం వాచి ఉన్నామనుకోకు. సుఖంగా కొన్నాళ్ళు ఉండాలంటే మాలో ఒకర్ని ఎన్నుకో! పోషిస్తాం! రోగంవస్తే మందులు కూడ ఇప్పిస్తాం. కడుపునిండా భోజనం, గంజాయి కొరవలేకుండా దొరుకుతాయి. ఓపిక ఉంటే ఇద్దరు ముగ్గురిని చూచుకో! ఇంకా బాగా జరుగుద్ది" అన్నాడు నేరుగా!

అవి సభ్యతా సమాజానికి తప్పుమాటలయినా సోమరి సన్యాసులకు సాంప్రదాయబద్ధమయిన మాటలే! ఆమెకు అర్థమయింది వేరొకటి?

"అలా తొందరపడకు. నేనొక పోలీసు అధికారి భార్యని!"

"మా దగ్గరకు వచ్చాక నీ పూర్వ చరిత్ర మాకు అనవసరం."

"మీ దగ్గరకు వచ్చాననుకోకు. నేనొక పనిమీద తిరుగుతున్నాను."

అతడు ఆగిపోయాడు. అనుచరులవంక చూచాడు.

"మన తాలూకు కాదు భాయ్! పెద్దింటి యిల్లాలంట!" అన్నాడు.

"అయితే మన దగ్గరకెందుకొచ్చిందంట?" అన్నాడు మరోడు మత్తుగా!

ఆమె వారి మూమెంట్స్ అర్థంచేసుకుంది. వాళ్ళ జాతికానివాళ్ళ విషయంలో నిర్లిప్తంగానే ఉంటారుకాని వెంటపడి వేధించే టైపుకాదని అర్థం చేసుకుంది. మంచివాళ్ళే అనిపించింది.

"నేనొక పని మీద తిరుగుతున్నాను. అర్జంటుగా యోగిని చూడాలి" అంది.

"ఓయమ్మో! ఆ తాలూకా! పోలీసులే కాక వాళ్ళ భార్యలు కూడ ఆ మహానుభావుడి కోసం తిరుగుతున్నారా?" అన్నాడొకడు వ్యసనంగా.

యోగికి వ్యతిరేకంగా ఆలోచించేవారంతా శత్రువులే అని వారు అనుకుంటున్నారు. ఈ తరహా సన్యాసుల నించి పూర్తిగా భిన్నమయిన వాడు అయినా యోగి తమవాడే అని వారు అనుకుంటున్నారు!

"ఆయనతో నీకేంపని తల్లీ! పోలీసులకి పట్టిస్తావా?"

"కాదు పతిభిక్ష అడుగుతాను" అన్నదామె! ఆ కంఠంలోని విషాదాన్ని వారు గమనించారు. నిజాయితీని అర్ధం చేసుకున్నారు.

"అసలేం జరిగిందమ్మా!" అని ప్రశ్నించాడో సన్యాసి!

ఆమె తన కథ అంతా వివరించింది. వారు విని జాలిపడ్డారు.

భర్తలు తప్పుచేయటం భార్యలు రక్షించుకోవటం చాల వింటుంటాం. ఆయన దయ గలిగితే తప్పకుండా నీ భర్త బ్రతుకుతాడు! మరికొద్దిసేపు అయ్యాక ఆ స్వామిని చూచేందుకు మేమంతా బయలుదేరి వెడుతున్నాం. నువ్వు కూడ మాతో రావచ్చు!" అన్నారు వారు.

చాలాసేపు ఆమె కూర్చుంది. వారు బయలుదేరుతూ ఆమెకు విన్పించేలాగా మాట్లాడుకున్నారు. ముందు సన్యాసులు నడుస్తున్నారు.

వెనుక ఆమె నడుస్తోంది. వారు చాల దూరం నడిచారు.

సన్యాసుల రాత్రి సంచారం విడ్డూరమేమీకాదు.

పోలీసు బలగాల నిఘా నగరమంతా తీవ్రంగానే ఉంది. కాని వారిని ఎవరూ అడ్డుకోలేరు. ఎన్నో మలుపులు తిరిగి వారు స్మశానం చేరుకున్నారు. బయట వారికి కన్పించకుండా కాంపౌండ్ దాటి లోపలకు పోయారు బొగ్గులు, ఎముకల ముక్కలు కన్పిస్తున్నాయి.

చలువరాళ్ళు పరిచిత సమాధులు కూడ ఉన్నాయి.

అర్ధరాత్రి దాటిన తరువాత రాత్రి మూడవ ఝాము గడుస్తూ ఉండగా యోగి పొదలచాటునించి వచ్చి చిన సమాధిమీద పద్మాసనం వేశాడు!

## 17

అలలన్నీ నిలిచిపోయిన తటాకంలాగ కొద్దిసేపు నిశ్చల సమాధిలో ఉండిపోయినాడు యోగి! కోడి కూశాక నెమ్మదిగా కళ్ళు విప్పాడు.

అది రాత్రిసమయం! చోటు స్మశానం యోగి కన్నులు విప్పే సమయానికి ఒక గబ్బిలాయి ఎగురుతూ కన్పించింది. అతని దృష్టిసోకిన మరుక్షణం అది విలవిల తన్నుకుంటూ క్రిందపడి చచ్చిపోయింది.

పద్మాసనం సడలించి కమండలంలోంచి పుడిసెడునీళ్ళు తీసి కంఠాన్ని తడుపుకున్నాడు. వేదికలా ఉన్నరాయి మీదినించి క్రిందికి దిగాడు. తిరిగి తన దారిన వెళ్ళిపోయేందుకు పొదల మధ్య నడవటం ప్రారంభించాడు.

కొద్దిదూరం నడిచాక తనదారిలో ప్రాణాచారం పడిపోయిన మనుషులు కన్పించారు. వారు ఎంతో భక్తిభావంతో అతని పాదాలు తాకిన చోటున సాష్టాంగ పడిపోయి వున్నారు. ఆయన పట్ల శ్రద్ధా గౌరవాలను ప్రదర్శించారు.

అది చూచి యోగి రవంత సంతోషపడినట్లు కన్పించాడు.

పూర్తిగా పెదవులు విచ్చుకోలేదు కాని ఒక చిరునవ్వు మొలకలాంటి దరహాసాంకురం అతని పెదవుల మీద కాంతివంతమై కన్పించింది.

"నరులంతా నాకోసం వచ్చిన కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"మీ దర్శన భాగ్యమే చాలు! మీ పవిత్ర పాదాలు తాకిన భూమి మాకు పుణ్య క్షేత్రం ఆ ధూళి మాకు శిరసున పడితే చాలు! మాకు కోరికలు లేవు" అన్నారు సన్యాసులు. తృప్తినిండిన చూపులతో అతడు అడుగులు ముందుకు కదిలించాడు.

అందరికన్న చివరిపడిఉన్న యువఅధికారి భార్య చివ్వునలేచి ఆయన ముందు కొంగుచాచి నిలబడింది! యోగి గమనం ఆగిపోయింది.

ఆమె ముఖం వంక చాచిన కొంగువంక మార్చిమార్చి చూచాడు.

"చిన్నదానా! నీ కోరిక ఏమిటో నాకు తెలుసు" అన్నాడు ప్రసన్న మయిన కంఠస్వరంతో! మిగిలిన సన్యాసులు లేచి నిలబడ్డారు. వింతగా చూస్తున్నారు.

"స్వామీ! మీరు అన్నీ తెలిసినవారు. నా కోరిక తీర్చరా? పతిభిక్షపెట్టారా!? నిస్సహాయురాలినై మీ ముందుకువచ్చి కొంగుచాచి యాచించాను."

"నీ భర్త అపరాధం చేశాడు. అతడు శిక్షార్హుడు! ఈ ప్రకృతి అందరిది. ఎక్కడో కొండ గుహలో ప్రశాంత జీవిలా గడిపే నాగులు అతన్ని ఏమి చేశాయి. వాటిని అంతనిర్దాక్షిణ్యంగా కాల్చిచంపాడు! ప్రతీకారం వాటి హక్కు!

స్వేచ్ఛాజీవితం వాటికి భగవంతుడిచ్చిన వరం! కాదనేందుకు ఎవరికీ అధికారం లేదమ్మా? ఈ ప్రకృతి ధర్మాన్ని నీ భర్త ఉల్లంఘించి అపరాధం చేశాడు.

నాగ వీధిలో కాలుపెట్టటమేకాక విధ్వంసం చేశాడు.

ప్రతీకారం తీర్చుకోవాలని అవి బయలుదేరాయి. వాటిని ఆపగల శక్తి ఎవరికీలేదు. నాగులు నగరం మీద విరుచుకుపడ్డాయి ఈ రాత్రి!

ఎన్ని వందల నాగులు ఎంత దారుణంగా చనిపోయినాయో అంతమంది మనుషులు అంతకన్నా దారుణంగా చనిపోయినప్పుడే వాటి గుండె మంట చల్లారుతుంది.

విధ్వంసం అనివార్యమే తల్లీ!

కాని దాన్ని ప్రారంభించినవారు నరులే! ముఖ్యంగా నీ భర్త! ఎలా తప్పుకోగలడు?"

అని ప్రశ్నించాడు యోగి! ఆయన మాటలలో కాదు అనేందుకు ఏమీ కన్పించలేదు. కాని పతిభిక్ష అర్థించే అవసరం తనది!

"యోగీ! నా భర్త నాగులకు అపచారం చేయలేదని నేను అనలేను. కాని అతడు ప్రాణాపాయంలో ఉన్నాడు. అర్థాంగిగా అతని ప్రాణాలను రక్షించుకునేందుకు నాకు మరొక్కదారి లేదు కదా! మీరు తప్ప మరెవరు రక్షించగలరు?

"నా దగ్గరకు వెళ్ళమని దాసరాణి సింగమ్మ పురికొల్పింది!"

"ఏది ఏమైనా పతిభిక్ష పెట్టకుండా మీపాదాలు విడిచిపెట్టను"

"అమ్మా విధి నిర్ణయాలను ఎవరూ తప్పించలేరు"

"నేను మీ పాదాల ముందు ప్రాణత్యాగం చేస్తాను. ఇది నా విధి!" తలబాదుకుంది.

"లే తల్లీ! నీ సాహసం నన్ను ఆకట్టు కుంది. భర్త తప్పుచేసినా అతన్ని రక్షించుకోవాలనే తాపత్రయం స్త్రీలకు సహజం. కాని దోషిని శిక్షించకుండా వదలిపెట్టటం ఎలా?"

"యోగీ నేను వైధవ్యాన్ని భరించలేను. ముందు నా ప్రాణాలు తీయండి!"

"నన్నేంచేయమంటావో చెప్పు తల్లీ!"

"ఎలా గయినా నా భర్త ప్రాణాలు కాపాడండి. లేదా నా ప్రాణాలు తీయండి!"

"నీకు ఆయుర్దాయముంది. అతనికి లేదు. విధిని నేనెలా మార్చగలను."

"మీరు విభూతిని ప్రసాదించకండి" అన్నదామె లేచి నిలబడి కొంగు చాచి.

"తదాస్తు దైవకృప ఉంటే నీ భర్త బ్రతకాలి" విభూతి పిడికెడు కొంగున రాల్చాడు.

యోగి అనుగ్రహాన్ని సంపాదించిన తరువాత ఆమెకు చాల తృప్తి కలిగింది.

సన్యాసులు కూడ ఆమెకు ఎంతో గౌరవాన్ని యిచ్చారు.

నగరం పొలిమేరల మీద వారు నిలిచిపోయారు సత్రంలో!

"అమ్మా! నగరంమీద నాగులు దాడి చేయటానికి వెళ్ళాయని యోగి చెప్పాడు. వాటి మీద జరిగినా దహన కాండలో పాల్గొన్న వారందరి మీద అది ప్రతీకారం తీర్చుకుంటాయి కాబోలు! నీ భర్తవారికి నాయకత్వం వహించాడు కదా!? వారి పరిస్థితి ఎలాగ వుందో వెళ్ళి కాపాడుకో!" అని తొందరించి ఆమెను పంపేశారు.

యువ అధికారి భార్య నగరం వైపుగా పరుగు తీసింది.

నగరంలోకి వెళ్ళేందుకు సిటీ బస్సులు యింకా బయలుదేరలేదు.

ఒక ఆటో వ్యక్తిని పిలిచి అడిగింది.

కాని అతడు నగరంలోకి వచ్చేందుకు విముఖత ప్రదర్శించాడు.

"ఆ వైపు నించి వచ్చేవారు చాల భయం కలిగేలా చెబుతున్నారు తల్లీ! నేనే కాదు, అందరూ ఆ వైపుకి రావటానికి భయపడి ఊరుకుంటున్నారు. నీ విలా ప్రయత్నించటం అనవసరం దారి తెలిస్తే కాలి నడకన పోవడం మంచిది.!"

"అంత భయం కలిగించే సంఘటనలు ఏం జరుగుతున్నాయి నగరంలో?"

చిత్ర విచిత్రమైన వార్తలు వస్తున్నాయి.

కొందరు దొంగలంటున్నారు. కొందరు విప్లవకారులంటున్నారు మరి కొందరు ఎక్కడ చూచినా పాములు కనబడుతున్నా యంటున్నారు. వివరంగా చెప్పేవారు లేరు. తెలుసుకుందామంటే టెలిఫోన్ లు లేవు.

పూర్తి వివరాలు తెల్లవారితే కాని తెలియవు" అన్నాడు.

ఇంకా మాటలతో కాలయాపన చేయటానికి మనస్కరించక నగరం వైపుగా నడవటం ప్రారంభించింది. ముందుకు పోయినకొద్దీ అదే వార్తలు వస్తున్నాయి.

నగరంలో కొన్ని ప్రాంతాలలో ఏదో అలజడి జరుగుతోంది.

అదేమిటన్న వివరాలు మాత్రం పూర్తిగా ఎవరికీ తెలియవు.

కొందరు వ్యక్తులు పరుగుతీస్తూ ఆమెకు ఎదురు రావటం కన్పించింది.

"ఎందుకలా పరుగెడుతున్నారు?" ప్రశ్నించిందామె.

"పోలీసు కాలనీ మీద పాములు దాడి చేశాయి."

ఇంక ప్రమాదం ముంచుకు వచ్చిందని పరుగుతీయటం ప్రారంభించింది.

ఎక్కడికక్కడే జనం గగ్గోలు పెడుతున్నారు. ఎక్కడేం జరుగుతున్నదో ఎవరికీ సరిగా తెలియదు. పరుగులెత్తేవారు తలకొక రకంగా చెప్తున్నారు.

ఆమె ఇంటికి చేరుకునే సరికి పెద్ద సంఖ్యలో జనం గుమికూడి ఉన్నారు.

భర్త శవం నేలమీద పడి ఉంది. పాము కాటుకి గురయి అతడు చాల భయంకరంగా చనిపోయాడు. కళ్ళు విపరీతంగా తెరుచుకున్నాయి.

అలాంటివే అన్ని వంకలనించి వార్తలు వస్తున్నాయి.

ఆపరేషన్ లో పాల్గొని పాముల్ని తగులపెట్టే కార్యక్రమంలో పాలొన్న వారంతా ప్రమాదంలోని ఉన్నారని అందరికి వెల్లడి అయింది.

"ఆ దేవతలు కన్ను విప్పితే మన శక్తి ఏ పాటిది?" ఎవరో వ్యాఖ్యానించారు.

"ఆమె భర్త శవంమీద కుప్పలా కూలిపోయింది.

కొంగున కట్టి తెచ్చిన విభూతి అంతా నేలపాలు అయింది.

ప్రాణాలకు తెగించి ఆమె చేసిన సాహసం ఫలించలేదు.

వెంటనే అధికారులు వచ్చి విచారాన్ని వెలిబుచ్చారు. ఉజ్వలమయిన భవిష్యత్తులోకి అడుగు పెట్టిన కొద్ది సేపటికే అతడు అలాంటి దుర్మరణం పాలు కావటం అందరికీ బాధ కలిగించింది. కాని ఎవరేం చేయగలరు?

అధికారులు తమ ప్రప్రథమ కర్తవ్యంగా శవాన్ని పోస్ట్ మార్టం చేయించేందుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అక్కడ మరికొందరి శవాలున్నాయి. వారంతా పాములపై దాడి చేసినవారే!

ఈ వార్తలు అప్పటికప్పుడే నగరమంతా వ్యాపించాయి.

పాములు దాడి ముగించి విజయవంతంగా తిరిగి అదృశ్యమయినాయి! ఆ తరువాత విద్యుత్ సరఫరా అయింది టెలిఫోన్ లు వైర్ లెస్ లు పనిచేయడం ప్రారంభించినాయి. అవి దాడి చేస్తూ ఉండిన అంతసేపు నగరం

అంధకారంలో మునిగి పోయింది. వార్తలు అందించుకునేందుకు అవకాశం చాలక అల్లల్లాడి పోయింది అంత శక్తివంతమయిన రక్షణ వ్యవస్థలు మొత్తం కుప్పకూలి పోయినట్లు అనిపించాయి! వాటి దాడి ముగిసింది.

పరిస్థితి అంతా యధాతధం అయింది.

పోలీసు జీపులు అంబులెన్సులు వ్యాన్ లు నిర్విరామంగా పరుగులు తీశాయి. మొత్తం నగరమంతా అర్ధంతరంగా నిద్ర చాలించి జాగృతం అయింది.

మైకులు పెట్టుకుని పోలీసులు ప్రచారం చేస్తున్నారు.

"నగరంలో ఎక్కడా ఒక్క పాముకూడ కన్పించటల్లేదు. ప్రజలు భయపడవద్దు."

కాని ప్రజలలో కలిగిన భయోత్పాతం అంత తేలికగా సమసిపోయేది కాదు. వారు భయంతో బిగుసుకుపోయి బితుకుబితుకు మంటున్నారు.

అందరిని ఇళ్ళలో వుండవలసినదిగా హెచ్చరించి రేడియోలు, టి.విల ద్వారా వాస్తవ పరిస్థితిని ప్రచారం చేయటం ప్రారంభించారు.

పుకార్లు నమ్మవద్దని రూమర్లు ప్రచారం చేయవద్దని హెచ్చరిస్తున్నారు.

చాల బలీయమయిన రక్షణ వ్యవస్థలో క్షేమంగా ఉన్నాడు శివరాజ్!

అతని దగ్గరకు ఒక పోలీసు అధికారిణి వచ్చింది.

"మీరు త్వరగా కంట్రోల్ రూంకి రావాలని" అధికార పత్రాలు చూపించింది.

బయట జరుగుతున్నదేమిటో తెలుసుకోవాలని తహతహగా ఉంది.

వెళ్ళి జీపులో కూర్చున్నాడు. ఆమె డ్రయివ్ చేస్తోంది. వేగంగా! అమిత వేగంగా!! వారు వీధులన్నీ దాటి వస్తున్నారు నగరం దాటుతున్నారు.

"నీవు ఏ వైపుకు వెడుతున్నావు? కంట్రోల్ రూంకి కాదా?" శివరాజ్ ప్రశ్నించాడు.

ఆమె తలత్రిప్పి అతనివంక చూచింది. కళ్ళలలో కళ్ళుంచి చూచింది.

కళ్ళు నీలంగా వున్నాయి. చూపులు గ్రుచ్చుకుంటున్నాయి. అందంగా నవ్వింది.

"ప్రియతమా! నీవు నాకు కావాలి! అందుకే తీసుకుపోతున్నాను" అంది!

అతడు ఆమె ఎవరో గుర్తించాడు. పళ్ళు పటపట నూరాడు!

"నాగభామిని నీవు నన్ను తీసుకుపోలేవు" అన్నాడు.

"మా శక్తి ఎలాంటిదో నగరంలో అందరికి అర్ధమయింది!"

"నేను తక్షణమే వెళ్ళిపోతాను" క్రిందికి దుమకాలని ప్రయత్నించాడు.

ఆమె అతని కనురెప్పల మీద వ్రేళ్ళుంచింది.

"ప్రియతమా! ఈ బంధాన్ని నీవు తెగత్రెంచుకోలేవు" అంది.

"షటప్! నేను వెళ్ళిపోవాలి! వెళ్ళిపో....వా....లి" కంఠస్వరం బలహీనమయింది.

ఆమె అంతంగా నవ్వుతోంది. అతని శరీరాన్ని ఏదో శక్తి ఆవహించినట్లుంది.

కాలు చేయి కదపాలని ప్రయత్నించాడు. సాధ్యపడలేదు.

"ప్రియతమా! నీవు మరెక్కడికి వెళ్ళలేవు! నా వాడివి! నా తోనేఉండాలి అంది.

అతడు నిజంగానే శక్తిహీనుడై తలను వాల్చేశాడు.

* * *

"ప్రేమించినా ద్వేషించినా మాకు మేమే సాటి!

అనుగ్రహించినా ఆగ్రహించినా మాకు ఎదురు చెప్పగలవారు ఎవరూ లేరు.

నరుడిగా జన్మించిన నీవూ, నాగుగానే బ్రతికి ఉన్న నేనూ కలిసి మధురానుభావాలను పంచుకోవటం అసాధ్యమే కావచ్చు. కాని మనం కలిసి జీవించాలి.

నీవు నా కనుల ఎదురుగానే ఉండాలి!" అంది నాగభామిని!

కనులు విప్పి పరిసరాలను పరిశీలించాడు శివరాజ్.

అది ఒకప్పుడు తాను బందీ అయినా పుట్టలోపలి భాగం కాదు. గుహ వెనుక కోనేరు కూడ కాదు. అదొక అందమయిన స్వర్గంలా ఉంది.

అందానికి, ఆనందానికి అర్రులు చూచి ప్రలోభాల వెంట పరుగెత్తేవారు అయితే విడిచిపెట్టేందుకు ఇష్టపడని ఒక రమ్య ప్రపంచం అది!

అందమయిన శయ్య మీద అతడు పడిఉన్నాడు.

ఆమె చనువుగా వచ్చి అతని చుట్టూ చేతులు పెనవేసింది.

"ప్రియతమా! ప్రకృతి శాపనాలు వేరుగా ఉండవచ్చు! నువ్వు కావాలని నేను కోరుకుంటాను. నా ఊపిరి ఉన్నంతవరకూ నిను నా వెంటే ఉంచుకుంటాను. ఇక మృత్యువు తప్ప నిన్నూ నన్నూ వేరుచేయగలిగిన శక్తులు ప్రపంచంలో ఎక్కడా లేవు! నా మీద అనురాగవర్షాన్ని కురిపించు.

విరహంతో బీటలు వారిన ఈ గుండెల్ని నీ ప్రేమవర్షంతో ముంచెత్తు. బ్రతికి ఉండే క్షణాలు బహుస్వల్పం! ఇంకా వాటిని వృధాగా పోనివ్వకు" ఆర్తి నిండిన స్వరంతో అంటూ అతన్ని మరింతగా పెనవేసుకుంది.

"నేను నిన్ను ఒకసారి మోసగించాను. అయినా నన్ను ప్రేమించగలవా?"

"ఒకసారి కాదు. రెండు దశాబ్దాలకు పూర్వం నా తోడు విడిచి వెళ్ళావు. రెండు రోజులకు ముందు శత్రువుగా వెళ్ళావు నీవు ఎలా ఎంత దూరం వెళ్ళాలని ప్రయత్నించినా చివరకు నా కౌగిలిలోకి రాకతప్పదు" ఇలాంటి మాటల ద్వారా తన ప్రేమను అభివ్యక్తీకరించాలని ఆమె ప్రయత్నించినా ఆ మాటలు ఈసారి అతని అహంకారం మీద దెబ్బ కొట్టాయి. లోలోపల రగులుతున్నాడు.

తన మిత్రులు చాలామంది పాములవల్ల ప్రాణాలను కోల్పోయాక అతడు ఏ విధంగానూ ఆమె ప్రవర్తనను

సహృదయంతో స్వీకరించలేక పోయాడు.

"నీ అహంకారానికి తగిన గుణపాఠం చెప్తాను" అనుకున్నాడు మనసులో!

ఆమె బాహువులనించి బయటపడి చుట్టూ కలయచూచాడు. రెప్పవేయకుండా అతని కదలికలను పరిశీలిస్తోంది నాగభామిని. చిరునవ్వు నవ్వింది.

"ఇంక ఈసారి నీ ప్రయత్నాలు ఫలించవు. మరొకసారి నువ్వు నన్ను మోసగించలేవు" అందామె! అతడు సమాధానం ఇవ్వలేదు.

యువమిత్రుడు ప్రాణాలు అర్పించి వృత్తి ధర్మాన్ని నెరవేర్చిన సంఘటన అతని మనో లోకలంలో తీవ్రమయిన సంచలనం కలిగిస్తోంది.

అధికారిగా అందుకు ప్రతీకారం చెయ్యాలి! వ్యక్తిగా ఆమె ప్రేమ చెరసాలనించి శాశ్వతంగా తాను బయటపడాలి. అలౌకిక శక్తితో మనిషి పోరాటం.

లోలోపల ఆలోచించి పథకాలను తయారుచేయటం మొదలెట్టాడు.

ఈ చోటు సరికొత్తది కావటం ఇంతకు పూర్వం తాను చూచినది కాకపోవటంతో అతని ఆలోచనలు ముందుకు సాగటానికి అభ్యంతరాలేర్పడ్డాయి. ఈసారి ఆమె జంతు ప్రకృతిలోకాన మానవప్రకృతిలో అతనికి సౌకర్యాలను సమకూర్చింది.

మంచి గాలి, వెలుతురు మెత్తని శయ్య, మంచి పరిమళాలు! దోరమాగిన ఫలాలు! త్రాగేందుకు మంచినీరు. కాని ఆ చోటు బయటివారెవారూ తెలుసుకోదగినదిగా అనిపించలేదు. ముందు ఆమెతోపాటు కొంతకాలం ఉండటం అనివార్యమయినదిగా తాను గుర్తించాలి. అప్పుడు కాని ఆమెకు మనశ్శాంతి కలుగదు.

ఎదుటివారి ఇగోని సంతృప్తిపరచటం ద్వారా వారిని జయించటం ఓ టెక్నిక్. అది మనిషికి అయినా, జంతువులకయినా ఉండే ఎలిమెంట్ ఇగో!!

"అంతమంది ప్రాణాలు హరించటానికి మీకు మనసెలా అంగీకరించింది?" అన్నాడు.

ఆమె విజయగర్వంతో నవ్వింది. ముఖం వికసించింది.

మీకు అన్ని సర్పాలను చంపటానికి మనసెలా ఒప్పింది? కాటన్ వేస్టు పెట్రోలు మంటల మధ్య మా నోరులేని మూగజీవులు మలమల మాడి మసిగా మసిగా మారాయి.

అందుకు ప్రతీకారం తీర్చుకోవటంలో తప్పేముంది? ఒక నగరం కాదు!

ఈ ప్రపంచంలోని నగరాలన్నీ కలసి పోరాడినా భూమి మీద నాగులన్నీ ఎదురు తిరిగితే పోరాడి జయించలేవు. మీకన్నా మాకు గొప్ప సంస్కృతి ఉంది.

అది మరొకరి గురించి పట్టించుకోకపోవటం.

ప్రకృతి అందరికి సమానంగా చిన్మయిచ్చింది. భూమి మీద బ్రతకటానికి ప్రాణులన్నింటికి సమానమయిన అధికారముంది. కాని మనుషులు వాళ్ళ మనుగడకోసం మిగిలిన ప్రాణులను బలిపెడతారు.

యీ దురంతాన్ని ఎదుర్కో గలిగిన శక్తి మాకుంది. ఎదుర్కొంటాం!" అన్నదామె ఆ మాటలు అన్న తరువాత తనవారందరిని కోల్పోయిన గుండె మంట కొంత చల్లారింది.

"అతడు సమాధానం చెప్పలేని వాడిలా మౌనం వహించాడు.

"ఏవు మాత్రం వారితో పాల్గొనలేదు. అందుకే ప్రియతముడుగా మిగిలిపోయావు"

"ఒకవేళ నేను కూడ పాల్గొని ఉంటే ఏమయేది?" అతడు ప్రశ్నించాడు.

"ప్రేమించినా ద్వేషించినా, మాకు మేమేసాటి.

అనుగ్రహించినా, ఆగ్రహించినా మమ్మల్ని ఎదుర్కోగల వారు ఎవరూ లేరు"

"అంతటి శక్తి మీకు ఎలా వచ్చింది?" అన్నాడు.

"ఏకాగ్రతవల్ల! నిశ్శబ్దంలో జీవించటంవల్ల! ఆహారం సంపాదన తప్ప మరో అవుసరం లేకుండా నిర్లిప్తంగా జీవించటంవల్ల ప్రాణులు శక్తివంతాలవుతాయి"

"నన్నిలా బంధించటంవల్ల నీలాంటి మరో స్త్రీ దుఃఖించదా?"

"ఆమె మరొక స్త్రీ అని ఒప్పుకుంటాను. కాని నీ స్త్రీగా నేను ఒప్పుకోను."

"తులసిని నేను పెళ్ళి చేసుకున్నాను. నా స్త్రీ కాక మరెవరు?"

"పెళ్ళి అనేది మనుషులు కల్పించుకున్న మాయ! నాగులకు సాంప్రదాయం కాదు"

"ఆమె వివాహం ద్వారా నాకు భార్య అయింది కదా!"

"మా జాతిలో భార్యా భర్తలు అనే అబద్ధం ఒకటిలేదు. ప్రేయసీ ప్రియులు మాత్రమే ఉంటారు. వారిని విడదీయడం పాపం! కలిపితే పుణ్యం."

"ప్రేమను ఎలా నిర్ణయిస్తారు మీరు?"

"శరీరాల కలయికతో! తులసికి, నీకు అలాంటి సంబంధం లేదు. కాబట్టి నిన్ను తీసుకురావటం ద్వారా ఆమెకు అన్యాయం చేస్తున్నానని నేను భావించలేదు."

"మేము శారీరకంగా కలియలేదు. అందుకు తులసి చదువు కారణం! కాని ఇది మా ఇద్దరికే తెలిసిన రహస్యం. నీకు కూడ తెలుసా?" అని ప్రశ్నించాడు.

నాగభామిని నవ్వింది. అతని చెంపలకు పెదవులు ఆనించి ముద్దు పెట్టుకుంది ప్రియతమా! మీరిద్దరులో కొన్ని నమ్మించవచ్చు. ఆ యింటిలోనే అనుక్షణం కూతురు సుఖాన్ని కోరుతూ అన్ని తెలుసుకోవాలని వెంపరలాడుతున్న తులసి తల్లిని మోసగించవచ్చు! కాని నన్ను మాత్రం మోసగించలేరు.

నీవు ఎలా పుట్టావో అలాగే పవిత్రంగా ఉన్నావు. పూర్వజన్మలో పాముగా నాతో పెనవేసుకున్నావు. ఆ తరువాత మళ్ళీ మనిషిగా నా కౌగిలిలోకే వచ్చావు. యి మధ్యలో నీకు స్త్రీ స్పర్శ తెలియవు.

"అందుకే నా ప్రియతముడుగా మిగిలి ఉన్నావు" అన్నదామె.

"ఒకవేళ తులసికి నాకు మధ్య యీ తెర తొలగిపోయివుంటే నువ్వేమి చేస్తావు?" అని ప్రశ్నించాడు శివరాజ్.

నాగభామిని ముఖం వివర్ణమయింది.

"అప్పుడు నీవు నాకు పరాయి మగవాడివి! జన్మబంధాన్ని కూడ వొదులుకుని నేను ఒంటరిని అయిపోతాను"

అన్నదామె విషాదం నిండిన కంఠస్వరంతో. అతనికి అప్పుడు అర్థమయింది జరిగినా పొరపాటు ఏమిటో!?

ఆమె ఇగోని రెచ్చ గొట్టడం ద్వారా తనకి లాభించింది ఇదే!

తన పాచిక పారినందుకు అతడు లోలోపల సంతోషించాడు!

శివరాజ్ కళ్ళు తెరుచుకున్నాయి పూర్తిగా! అతని ఆలోచనలు పురి విప్పినాయి.

ఆమె తనని మర్చిపోవాలంటే చేయవలసింది ఏమిటో అప్పుడు బోధపడింది.

మనసులో రూపొందుతున్న పథకాలను అనుసరించి వెంటనే నాగభామినిని నగరానికి తీసుకుపోవటం మంచిదని భావించాడు. ఆ స్పర్శలో అతనికి సుఖంలేదు. ఎంతో ప్రేమగా కౌగలించుకుంటే పెద్ద పాము శరీరానికి చుట్టుకున్న అనుభవం కలుగుతోంది.

చెంపలమీద పెదవులానించి ముద్దు పెట్టుకుంటే పాము పాడగ తాకినట్లునిపిస్తోంది. ముఖం వికారంగా అవుతోంది. ఆ భావాలన్నింటిని అతడు దాచిపెట్టుకున్నాడు.

ఆమె స్పర్శలో ఏదో పరవశం కలిగినట్లు తృప్తిగా చూచాడు.

క్రమంగా అతడు తాను మనిషిని అనే సంగతి మరచిపోయి ఈ వాతావరణానికి అలవాటు పడుతున్నాడని భావించిందామె! అందమయిన కౌగిలిని ఏ యువకుడయినా ఎంతకాలం కాదనగలడు. ఒక సౌందర్యరాశి శరీరాన్ని పెనవేసి పెనుగులాడుతుంటే ఏ యువకుడయినా ఎంతకాలం దూరంగా త్రోసివేయగలడు.

శివరాజ్ లో తనకు అనుకూలమయిన ధోరణి పెరగటం ఆమెకు తృప్తినిచ్చింది.

అతడు కూడ చేతులు ఆమె చుట్టూ పెనవేసి చెంపలుతాకాడు.

ప్రేమ పూర్వకమయిన ఆ స్పర్శకు మంత్రముగ్ధలా అయిపోయింది.

జన్మ జన్మలుగా సాగివచ్చె విరాహతాపం ఉపశమించినట్లు అయింది. ఈ ప్రేమ పులకాంకురాలకోసం ఎన్ని సంవత్సరాలుగా తపస్సుచేస్తోంది. యీ క్షణాన సఫలమయింది.

అతడు ఉక్కిరి బిక్కిరి అయిపోఎలా మరింత గాఢంగా కౌగలించుకుంది.

ఆమెప్రేమ వివశగా అయినా తరువాత హఠాత్తుగా దూరంగా తోసేశాడు. చివాలున తన కౌగిలి విడిచిపెట్టాడు. ఆమె కౌగిలినించి బయటపడి లేచినిలబడ్డాడు.

ఒళ్ళు విదిలించుకుని దూరంగా నిలిచిపోయినాడు.

యీ హఠాత్పరిణామానికి విభ్రాంతి అయింది నాగభామిని.

"ప్రియతమా! అలా అయిపోయావేమిటి? ఏమయింది నీకు?"

ఇంక తన ఆలోచనలు కార్యరూపానికి తెచ్చుకునే సమయం ఆసన్నమయింది.

"నాకు ఎందుకో అంతా అసౌకర్యంగా అసుఖంగా అనిపిస్తోంది!"

"ప్రియతమా! నీ కోసం అందమయిన ఈ లోకాన్ని సృష్టించాను మెత్తని శయ్య నీకోసమే సవరించాను. మధుర ఫలాలున్నాయి. మధుర జలాలున్నాయి. మధురాతిమధురమయిన సంగీత స్వరాలను వినిపిస్తోంది పిల్లగాలి!

అన్నింటికి మించినీ కౌగిలిలో నేను ఇమిడిపోయి వున్నాను.

నాగలోక సుఖాలను మరపించే ఈ చోటున నీకు అసౌకర్యమేమిటి? నీకు ఇబ్బంది కలిగించేది ఏదయినా దాన్ని తొలగిస్తాను. నాతో చెప్పు" అన్నదామె!

"నీవు ఆనందంగా ఉండటమే నాకు కావాలి!" అంది.

"నాకు అంతా అసౌకర్యంగానే ఉంది!" అతడు మరింత దూరం జరిగాడు.

"కారణమేమిటో సరిగా వివరించాలి నువ్వు! నా కౌగిలిలో సుఖించలేవా?"

"నువ్వు నాకు కావాలి! కాని....కాని....!" తనకి కావలసిన సమాధానమే అతనినించి రావటంతో అపరామిత ఆనందంతో తలమునకవేసిందామె.

"మరి నీకు ఇంకా ఏమికావాలి! కోరుకో! అది స్వర్గంలో ఉండే వస్తువు లయినా సరే! తెచ్చి నీ పాదాల ముందు అర్పించుకుంటాను" అంది.

"నేను మనిషిని అనే సంగతి నీవు అనుక్షణం మర్చిపోతే ఎలా?" అన్నాడు.

"అవును గుర్తుపెట్టుకుంటాను. కాని నులివెచ్చని నీ కౌగిలిమాత్రం విడిచిపెట్టకు. రా ప్రియతమా! నన్నాదరించు! ఆనందాన్ని అందించు."

"నాకు కావలసింది స్వర్గసుఖాలు కావు.

"అవేమిటో కోరుకో తెచ్చి నీ ముందుంచుతాను!"

"ఒక స్త్రీతో సుఖాన్ని పంచుకోవాలంటే మనిషికి కావలసిన చోటు ఇది కాదు"

"ఈ పొదరిళ్ళు పూల పాన్పులు నీకు నచ్చలేదా?"

"నాకు కావలసింది అందమయిన పూలపాన్పులు కాదు. అందమయిన బెడ్ రూం! వినిపించవలసింది ఈ గాలిపాడే మధురస్వరాలుకాదు! పాప్ మ్యాజిక్ కావాలి. అది ఎంతో ఎక్సయిటింగ్ ఉండాలి! అలాంటివి అన్నీ ఇక్కడ దొరకవుకదా!"

"నీకు కావలసిన వన్నీ మరుక్షణంలో ఏర్పాటు చేయగలను" అంది నాగభామిని.

అక్కరలేదని అతడు తలను అడ్డంగా ఊగించాడు.

"మనమధ్య ప్రేమలో నువ్వు స్వార్థాన్ని చూపించావు. పాములు మాత్రం ఇష్టపడే వాతావరణం ఇది! నేను మనిషిని! నాకు ఇష్టమయిన చోటుకి పోదాం!"

"అలాంటి చోటు ఎక్కడ ఉందంటావు?"

"ఫైవ్స్టార్ హోటల్స్ నగరంలో చాలా ఉన్నాయి. అక్కడకు పోదాం!"

"అలాగే వెడదాం. నాకేమి అభ్యంతరంలేదు. ఒకవేళ నీవు నన్ను మోసగించాలని నగరమంతా ఎత్తి వచ్చినా నాకేమీ భయంలేదు. వెడదాంపద!" అంది.

అతడు లోలోపల చాలా సంతసించాడు "ఇప్పుడు మనం నగరానికి పోవాలి" అన్నాడు.

అందుకామె మనఃపూర్వకంగా అంగీకరించింది.

ప్రేయసీ ప్రియులకు కావలసిన ఏకాన్థమూ, ప్రశాంతతా కలిగి సౌందర్యం రాసిపోసినట్లున్న ఆ చోటునించి వారు బయలుదేరారు తిరిగి వచ్చేటప్పుడు దారి గుర్తుపెట్టుకోవాలని అతడు ప్రయత్నించాడు.

అవన్నీ క్రొత్తదారులుగానే ఉన్నాయి. కొంతదూరం వచ్చాక దిగుడుబావి మెట్లు లాంటి మట్టితో నిర్మించిన మెట్లు మీదుగా వారు పైకి ఎక్కివచ్చారు.

కార్లు బళ్ళు తదితర వాహనాలు రద్దీగా ఉంది రోడ్డు!

అతడు బాగా ఆలోచించి ఖాళీగా వెడుతున్న ఓ టాక్సీని ఆపాడు.

"ఎక్కడికి పోవాలి సార్!"

"హోటల్ బంజారా!"

అంత ఖరీదయిన హోటల్ కి వెళ్ళేవారు ఈ ప్రాంతంలో కాలినడకన పోతూ కన్పించడం అతనికి రవంత ఆశ్చర్యాన్ని కలిగించింది. విచిత్రంగా చూశాడు.

కారులోకి ఎక్కి కూర్చున్న తరువాత ఆమె అతని భుజంమీద తల వాల్చుకుంది. అతడు అనుకూలంగా ఆమెను మరింత హత్తుకుని కూర్చున్నాడు.

"ఇంకెప్పుడూ నన్ను మోసగించాలని ప్రయత్నించవు కదూ!!" అంది.

"మోసగించడం అంటే నీ పరిభాషలో అర్థం ఏమిటంటావు?"

"నాకు దూరంగా వెళ్ళిపోవాలని ప్రయత్నించరు కదూ?"

"మనం ఒకజన్మ దూరంలో ఉన్నామని నువ్వే చెప్తున్నావు. దగ్గర కావాలని ప్రయత్నిస్తున్నాం. ఈ ప్రయత్నానికి నేను అభ్యంతరం చెప్పను"

"మునుపటిలా మా మీదికి శత్రువుల్ని పురికొల్పవద్దు!"

"ఎందుకు ఈ సారి అందర్నీ చంపేస్తారని భయంగా ఉందా?"

"అప్పుడామె చూపులలో విపరీతమయిన తిరస్కారంకన్పించింది.

మీరు ప్రపంచమంతా ఎకమయినా మమ్మల్ని ఏమీచేయలేరు. ఇప్పటి ఈ తరంలో మీరంతా అల్పులు! ఒకప్పుడు మీకన్నా చాలా శక్తి వంతురాలయిన మానవజాతి ఉంది. అది భారతకాలం. మహాశక్తులు సాధించిన ఋషులున్నారు. వారంతాకలిసి సర్పయాగం చేయించారు. జనమేజయుడు చేశాడు.

కాని అంతటి విఘాతాన్ని అమోఘమయిన వారి తపోశక్తుల్ని కూడ అధిగమించి భావితరాలకు సాగివచ్చింది మా జాతి!

ఎప్పుడయినా ఈ కాలంలో అయినా మీకు మేమంటే భయం! ఆ సమయం వచ్చిందాకా మేము మీనించి తప్పుకుపోవాలని దూరంగా ఉండాలని చూస్తాం. ఎందుకంటే మనుషులు చెడ్డవాళ్ళు!

మాకు విషం కోరల్లోనే ఉంటుంది. మనుషులకు నిలువెల్లా విషమే! దుష్టులకు దూరంగా ఉండాలని ప్రయత్నిస్తాం. కాని ఆ సమయం వచ్చి ఒక్క పామును ముట్టడిస్తే అది పడగవిప్పి నిలబడుతుంది. ఎదురుతిరిగి ప్రాణాలున్నంతవరకూ, శక్తి చాలినంత వరకూ పోరాడుతుంది.

పారిపోవాలని ప్రయత్నించదు.

అదే ఒక్క పాము కన్పిస్తే పదిమంది పారిపోతారు.

మొన్న ఏమయింది! కొన్ని వందల పాములు నగరంమీదికి వస్తే అన్ని ఆయుధాలు, అన్ని రక్షణవలయాలు ఉన్న లక్షలాదిమంది గగ్గోలు పడిపోయారు.

అందువల్ల మీకు భయపడి నేనిలా అడుగుతున్నానని అనుకోకు డియర్! నన్ను దూరంచేసుకోవాలని ప్రయత్నిస్తే ఆ విషయం నా గుండెను గాయపర్చుతుంది అదే నా బాధ!" అంది నాగభామిని!

"ఈసారి నేను ఎవరిని నీమీదికి పురికొల్పను" ప్రామిస్!

"వాగ్దానాలు నేను నమ్మను. మీకు నోట్లో రెండు నాల్కలుంటాయి. మీకు మనసులో రెండు రకాల ఆలోచనలుంటాయి. మా కన్నా మీరే ప్రమాదకరం!"

"ఒకవేళ నీవు పాముగామారి యోగి దగ్గరకు పోతే తిరిగి నీవు మనిషిగా నా దగ్గరకు వచ్చేంతవరకూ ఎదురు చూస్తుంటాను. నమ్ముతావా?"

"నీవు మాటనిలబెట్టుకోకుండా కొన్ని వందల మందినో? వేల మందినో సాయుధాలుగా నా చుట్టూ నిలబెట్టనా నన్ను నేను కాపాడుకోగలను కనుక నమ్ముతాను. నిన్ను అర్ధించుతోంది శక్తి లేక కాదు.

నా ప్రియుడు నన్ను మోసగించాడనేభావన భరించలేను.

ఆ తరువాత జీవించలేను. అందుకే ఈ అభ్యర్ధన!" అన్నదామె.

ఆమె ఏకాగ్రత అతని మనసుని చలింపచేసింది.

"సార్! హోటల్ బంజారా!" అని హెచ్చరించాడు డ్రైవర్. పోర్టికోలో దిగారు. రిసెప్షన్ లో సంతకాలుచేసి బుక్ చేసిన సూట్ వైపు దారి తీశారు.

లిఫ్ట్ లో ఏడవ ఫ్లోర్ లోకి వెడుతున్నప్పుడు "క్రొత్త వాసన వస్తోందేమిటిసార్?" అని ప్రశ్నించాడు లిఫ్ట్ బాయ్! శివరాజ్ ఏదో చెప్పి నవ్వించాడు. సమర్ధించాడు. ఆ గండంనించి వారు బయటపడి సూట్ లోకి వచ్చారు.

వారు లోపలకు వెళ్ళిందాకా లిఫ్ట్ భాయ్ చూస్తూనే ఉన్నాడు.

ఒక సర్పాల జంట ఉన్నదంటే రోజులో ఇరవైమూడున్నర గంటలు పెనవేసుకుని పడుకుంటాయి. మిగిలిన సమయం అరగంట మాత్రం ఆహారంకోసం వీలయితే ఒకదారిన లేకపోతే చెరోదారిన తిరిగి వస్తాయి. మళ్ళా ఆహారంకోసం బయలు దేరటానికి ఒకరోజుకావచ్చు.

రెండు రోజులు కావచ్చు! పెనవేసుకునే పుట్టలో పడుకుంటాయి.

ఆహార సంపాదన తప్ప, ధన సంపాదనతో పనిలేని ప్రాణులు అవి.

ధన సంపాదన కోసం ఆహారాన్ని, విశ్రాంతిని మర్చిపోతున్న ఈ నాటి నాగరికులయిన మనుషులు అరగంట మాత్రమే విశ్రాంతి తీసుకుని ఇరవైమూడున్నర గంటలు పనిచేయవలసిన దుస్థితిలో పడిపోయారు.

మొదటి తరహా ప్రవృత్తి నాగభామినిది!

వెయిటర్ వస్తే ఉడికించకుండా గ్రుడ్లు, పాలు యిమ్మని అడిగింది.

అతడు చిత్రంగాచూచి వెళ్ళిపోయాడు. లోపలిగదిలోకి అతన్నిలాగేసి మెలికలు చుట్టుకున్నట్టు కావిలించుకుని పడుకుంది.

వెయిటర్ గెస్ట్ రూంలోనే అన్ని అమర్చి తొంగిచూచి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

క్షణాలు గంటలుగా మారాయి. ఆమె కలలు అనుభవాలుగా మారాయి. అనుభవాలు కాలాన్ని కరిగించాయి. ఆ క్షణాలే కాలాన్ని కలల్నీ పండించాయి.

నాగభామిని మనసుమీద తీయని ముద్రలు పడ్డాయి.

"ప్రియతమా! యోగి కన్నులుతెరిచే సమయం అయింది. నేనింక వెళ్ళిపోవాలి!"

"ఈ అభ్యంతరాన్ని అధిగమించే దారిలేదా?"

"ప్రకృతి ధర్మాన్ని ఎవరు జయించగలరు?"

"మళ్ళీ ఎప్పుడొస్తావు?"

"నువ్వు చాలా మారిపోయావు. ఈసారి నువ్వే నాకోసం ఎదురు చూస్తావు కదూ!?"

"అవును క్షణాలు లెక్కిస్తూ కూర్చుంటాను"

"సరిగ్గా అర్ధరాత్రి సమయం దాటిన తరువాత యోగి గరళాన్ని ఆహారంగా తీసుకొని సమాధిలోకి వెడతాడు ఆ సమయంలో వస్తాను"

"యోగిని అంతం చేస్తే మనకి వియోగబాధ తప్పుతుంది కదా?"

"అతడు కాలంతోపాటు ముందుకుసాగే అమృతమయుడు. విషాన్ని ఆహారంగా స్వీకరించే ఆదిదేవుడు. ఆయనపట్ల ఇలాంటి ఆలోచనలు చేయడం అపచారమే! మీ మనుషులు ఎలాంటి పని అయినా చేయాలనుకుంటారు.

ఆయన చనిపోడు. చనిపోతే నేనిలా మనిషిగా మారలేను.

మనుషులు అమృతంలాంటి ఆహారాన్ని తిని విష పూరితంగా ఆలోచిస్తారు.

ఆయన విషాన్ని తిని అమృతాన్ని పంచుతాడు! ఆయనకు ఇచ్ఛామరణం ఒక వరం! కావాలనుకున్నప్పుడు ప్రాణాలు విడుస్తాడు.

ఈ లోగా ఏ శక్తులూ అయనని చంపలేవు"

"నేను తమాషాగా అన్నాను. నీవు వెళ్ళిపోయి త్వరగా రావాలి!"

"అర్ధరాత్రి దాటే సమయానికి వస్తాను"

"క్షణాలు లెక్కిస్తూ ఎదురుచూస్తుంటాను"

"నేను క్షణాలు యుగాలుగా గడుపుతాను"

ప్రేయసీ ప్రియులు విడిపోలేక విడిపోయినట్లుగా ఉన్నదా దృశ్యం! ఆమె తన ప్రియతముని తన దారికి తెచ్చుకున్నందుకు ఎంతో సంబరపడింది.

అర్ధరాత్రి సమయంకోసం అప్పటినుంచే ఎదురుచూస్తూ వెళ్ళిపోయింది.

కొంతసేపు అలాగే ఆలోచనా ముద్రితుడు అయి ఉండి పోయాడు శివరాజ్! ఆ తరువాత ఒక నిర్ణయానికి వచ్చాడు. చివాలునలేచి టెలిఫోన్ రిసీవర్ అందుకున్నాడు. ఇంటి నంబరు డయిల్ చేశాడు.

"హలో ఎవరు?" ఆమె కంఠస్వరాన్ని గుర్తించాడు. తులసి!!

"నీవు అర్జంటుగా హోటల్ బంజారాకి రావాలి" ఆమెకూడ భర్త కంఠస్వరాన్ని గుర్తించింది.

"మీరు అక్కడున్నారా? అధికారులు మీకోసం తిరుగుతున్నారు. నగరమంతా కల్లోలంగా ఉంది. ఇప్పటికే చాలామంది చనిపోయారు. వెంటనే అధికారులకు తెలియచేస్తాను"

"అలాంటి పిచ్చిపనులు చేయకు. ఎవరికీ చెప్పకుండా బయలుదేరి రావాలి!

"అమ్మకు కూడానా?"

"అవును. ఉమకుకూడా చెప్పకు. ఒంటరిగా రావాలి?"

"ఏమయింది మీకు? ఏమిటంత కంగారు?"

"నీ ప్రశ్నలన్నిటికి సమాధానం వచ్చాక చెప్తాను" రిసీవర్ పెట్టేశాడు.

ఈయన ఎందుకు ఇలా మాట్లాడుతున్నారు?" ఎటూ తేల్చుకోలేక అంది తులసి!

ఉమకు విషయమంతా వివరించింది.

అధికారులకు చెప్పకూడదు. ఒంటరిగా వెళ్ళాలి! అర్జంటుగా వెళ్ళాలి. ఇదంతా వింటూ ఉంటే నాకెందుకో అనుమానంగా ఉంది తులసీ. అధికారులకు చెప్పి వారిని తీసుకుపోతే మంచిది అనుకుంటాను"

"అలా చేస్తే ఆయన బాధపడతారేమో! కంఠస్వరం వారిదే!"

"కంఠస్వరం వారిదే అయినా ఇది శత్రువుల కుట్ర ఎందుకు కాకూడదు? నగరంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి కదా?" అంది ఉమ.

"పిలిచింది వారే! ఆ కంఠస్వరం వారిదే! సందేహమేమీ లేదు"

"అయితే వెడదాం పద!" అంటూ లేచింది ఉమ. తులసి రవంత సందేహించింది. స్నేహితురాలికి ఆ విషయం చెప్పాలంటే బాధగా అనిపించింది. ముగ్గురూ ఒకరికొకరు ప్రాణం. కళ్యాణి చనిపోయింది. మిగిలింది ఇద్దరు.

మళ్ళీ ఇద్దరిమధ్యా అభ్యంతరాలా? మనసు కలతగా అనిపించింది.

"నిన్నుకూడ తీసుకురావద్దని ప్రత్యేకంగా చెప్పారే!" అంది తప్పనిసరి కనుక.

"మరొక పరిస్థితిలో అయితే భర్త ఇలా రమ్మన్నాడనే వార్త నువ్వు చెప్తే నేను చాల సంతోషించేదాన్ని! కాని ఇప్పుడు పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఈ స్థితిలో నిన్ను ఒంటరిగామాత్రం పోనివ్వను" అంటూ ఉమకూడ ఆమె వెంట

బయలుదేరింది.

ఇది శత్రువుల కుట్ర అయినా భర్త అక్కడే ఉన్నారు కాబట్టి వెళ్ళితీరాలని వారు తీర్మానించుకున్నారు. తల్లి నెత్తి నోరు బాదుకొని గొడవపెడుతున్నా ఆమెకు ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయారు.

బంజారా రిసెప్షన్ లో తెలుసుకున్నారు. సూట్ నంబర్ సెవెన్ జీర్ సెవెన్ శివరాజ్ పేరుమీద బుక్ అయివుంది.

రిజిష్టర్ లో సంతకాన్ని అతిజాగ్రత్తగా పరిశీలించింది. అతనిదే!

వారు లిఫ్ట్ లో సెవెన్త్ ఫ్లోర్ లో దిగిపోయారు. "అవసరమైతే గట్టిగా కేకపెట్టు" అంటూ కారిడార్ లో నిలిచిపోయింది ఉమ తులసి లోనికివెళ్ళింది.

అంతకుమునుపు ఎన్నడూ చూడని ఒక చిరునవ్వు అతని ముఖంమీద కన్పించింది. ఆశ్చర్య పడిపోయింది. భయంగాకూడ అన్పించింది.

"ఏమిటంత హఠాత్తుగా ఇక్కడెందుకున్నారు? ఇంటికి రాకూడదు."

"ప్రస్తుతం రాకూడదోయ్! ఇక్కడే ఉండాలి! అంతా ఇక్కడే జరగాలి!"

"ఏమి జరగాలి?" అనుమానంగా చూచింది.

"అతి సహజంగా భార్యాభర్తల మధ్య జరిగేదే! ఇది!" అంటూ ఆమెను బాహువులలోకి తీసుకుని గట్టిగా బంధించాడు.

"ఎన్నడూలేనిది ఈ అలవాటేమిటి? మీరు మీరేనా?" అంది అయోమయంగా.

అతడు నవ్వడు. ఆమె మాటల్ని ఖాతరు చేయలేదు.

గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

"మోసం ఇది మోసం మీరు మీరుకాదు" కెవ్వుమని అరిచింది. కేకపెట్టి దూరంగా జరిగింది. దగ్గరకు రాబోతే విసిరికొట్టింది.

ప్రమాదం జరిగితే కేకపెట్టమని చెప్పి అలాంటి కేక విన్పించే సమయంకోసం ఎదురుచూస్తూ రడీగా నిలబడి ఉంది ఉమ.

ఎప్పుడయితే తులసి కంఠస్వరం విన్పించిందో డోర్ లాక్ తీసుకుని విసురుగా సూట్ లోపలకు వచ్చిందామె.

## 18

ఇద్దరూ చాల ఎమోషనల్ గా కన్పించారు.

శివరాజ్ ముఖంలో క్రొత్త భావాలు కన్పిస్తున్నాయి.

తులసి భయపడుతున్నట్లు దూరంగా జరిగి కూర్చుంది.

ఉమ చాల చనువుగా ఆ యింటికి రాకపోకలు సాగిస్తూ ఉన్నా ఎన్నడూ శివరాజ్ తో చనువుగా మాట్లాడలేదు.

"సర్! ఏమయింది? ఎందుకలా ఉన్నారు?" అంది.

ఒంటరిగా రమ్మని కోరితే తులసి స్నేహితురాలిని వెంటపెట్టుకుని వచ్చింది. అందుకు అతనికి కోపం వచ్చింది.

కాని వెంటనే మూడ్ మారిపోయింది.

పెద్దపెట్టున నవ్వాడు.

"మీరు ఎంతకాలం స్నేహం చేస్తున్నా ఆమెలో భయాన్నిపోగొట్టలేకపోయారు" అన్నాడు.

"నగరంలో పరిస్థితులు బాగాలేవు!" అంది ఉమ.

"అలాగని ఎవరి పనులు ఎవరు వాయిదా వేసుకుంటున్నారు?"

అనుమానంగా చూచింది ఉమ.

"స్నేహితురాలు తోడు రావలసిన సమయాలు వేరు. భర్తదగ్గరకు భార్య వెళ్ళేప్పుడు స్నేహితులు తోడురావాలా?" అని ప్రశ్నించాడు మళ్ళీ.

అతని ఎమోషన్ ఏమిటో ఉమ గ్రహించింది.

"థాంక్ గాడ్! చాలా రోజులుగా పట్టిన మబ్బు విడిపోతుంది. చాల అసహజమయిన షరతులు విధించి భర్తను బాహాకు గురిచేసింది తులసి. తానుకూడ బాధపడింది.

ఆ సమస్యలన్నింటి మీద తెర వాలిపోతుంది కాబోలు!"

ఆమె నవ్వుతూ తులసి వంక చూచింది.

"సర్! తులసి మిమ్మల్ని సరిగా అర్ధం చేసుకోలేదు. ఆమె వెంట నేను రావటం తప్పే అని ఒప్పుకుంటున్నాను. శలవ్" అంటూ వెనుతిరిగింది.

మళ్ళీ తిరిగివచ్చి తులసి చేయిపుచ్చుకుని ఊపేసింది.

"కంగ్రాచ్యులేషన్స్! ఎందుకంత కంగారు? పిరికిదానా? నా స్నేహితురాలు అని చెప్పుకుంటే గర్వం కలిగేలా ప్రవర్తించు. మబ్బులు విడిపోతున్నాయి" అంది.

తులసి మరింత అయోమయంగా చూచింది.

"నాకెందుకో భయంగా ఉంది. ఏమి జరుగుతుంది" అంది.

"మబ్బులు పట్టాయి. వర్షించకమానవు. మీవారి మూడ్ మారిపోయింది. కాలం చాల అమూల్యమయింది. ఇంకదాన్ని వృధాచేయకు" అంటూ స్నేహితురాలి నుదురుమీద ముద్దాడి త్వరగా వెళ్ళిపోయింది ఉమ.

శివరాజ్ సూట్ లోపల బోల్టు బిగించేశాడు.

"మీరేం చేయబోతున్నారు?" అందామె కంగారుగా.

"మన పెళ్ళి ఇంతకాలం అర్ధరహితం! ఇప్పుడే దాన్ని అర్ధవంతంచేయాలనుకుంటున్నాను."

"అంటే ఏం చేయాలనుకుంటున్నారు"

"చెప్తాను పద" అంటూ ఆమెను బాహువుల మధ్య బంధించి బెడ్ వైపుగా నడిపించాడు.

అర్ధరాత్రి పదకొండు ముప్పావు అయింది.

నాగభామిని వచ్చే సమయం అది!

తలుపులన్నీ తెరిచి ఉంచాడు.

వారిద్దరూ ఒకరి కౌగిలిలో ఒకరు కరిగిపోతూ ఉన్న సమయాన సూట్ లోకి వచ్చింది నాగభామిని!

భార్యాభర్తలు ఏకమయిపోయి కన్పించారు.

ఆమె కనుకొలకులనించి ఒక నీటిబిందువురాలి నేలమీద పడింది.

జన్మజన్మల బంధాన్ని త్రెంచుకున్నాడు.

ఈ మనుషులు ఇంతే!

రహస్యాన్ని అతనితో చెప్పినదాని ఫలితమే అది.

ఆమె అంతర్లోకాలు తగులబడ్డాయి.

కాలిపోయి బూడిదగా మారిన పూలతోటలా అయిపోయింది నాగభామిని అంతరంగం.

ఆమె చివాలున వెనుదిరిగింది!!

ఆ అర్ధరాత్రి సమయం దాటిన తరువాత తన ప్రియుడు తిరిగి రాడనే నిర్వికారాన్ని మనసంతా నింపుకుని యోగి కనుల ఎదుటనిలిచింది నాగభామిని!

అతడు కనులు విప్పాడు!

ముక్కంటి మూడవకంటి ఎర్రమంట అది!!

అతని కంటి చూపులు సోకగానే ఆమె శరీరం కంపించింది! కన్నులు తేలిపోయి దబ్బున నేలమీద పడింది.

ఆఖరు శ్వాస విడుస్తున్న క్షణాన అనుకుంది.

"జన్మ దూరం! జాతి వైరం! ఈ ఆడమనసు ఎంత ప్రేమించగలదో ఆ మనుషులకేమి తెలుసు!

భగవంతుడా! నాకు మరణమే సరిఅయిన తీర్పు! ప్రేమకు ప్రేమించే హృదయానికి ఫలితం కన్నీళ్ళే.

ఆమె అశ్రువులతోపాటు అశువులుకూడ రాలిపోయాయి!

తన కన్నెచెర వదిలించిన భర్తవంక ఇంకా విస్మయంగానే చూస్తోంది తులసి! అతడు హఠాత్తుగా ఇలాంటి నిర్ణయానికి ఎందుకువచ్చాడు?

శివరాజ్ నవ్వుతున్నాడు!!

**[అయిపోయింది]**

---